శ్రీకృష్ణాయ పరబ్రహ్మణే నమః.

అఖిలకలికల్మషాపహంబగు

# శ్రీమద్భాగవతము

శ్రీదేవరాజసుధీమణిప్రణీతము.

వి. శ్రీరామమూర్తి అండ్ కో,

బుక్ సెల్లర్సు

కర్నూలు.

ఆనందముద్రాయంత్రాలయ ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర అన్డ్ కంపెనివారిచే

ప్రకటితము.

1916.

COPYRIGHT REGISTERED.

2091

... 2094

T
294.5924
P84S

**All Rights Reserve**

Copyright 1917—By **R. Venkates**
**Madras.** This book is fully protected
Foreign Copyright. No one will be permitted
book in whole or in part or translate it into ar
and offer it for sale. A substantial copy of
or illustrations contained herein constitutes an
a copyright, and notice is hereby given that su
every case of infringement.

University of Hyderabad
LIBRARY
Acc. No. 29263
Dated 10.9.87

కాపిరైట్ 1917 సం|| - ఆర్. వేంకటేశ్వ
రైట్ దార్లు. ఈ పుస్తకము ఇండియా - ... చేతను
రైటు చేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపుస్తకము
గాని లేక యిం దొకభాగమునుగాని తాము వేఱుగా ప్రక
యొకభాషయందు తర్జుమాచేసి క్రయమునకు నిచ్చుటకును
బడదు. ఇందుఁ గలపదములనుగాని భావములనుగాని పటం
మైనను కాపీచేసినయెడల అది కాపిరైటును నుల్లంఘించిన
దావాకు లోనగుదురని దీనిచే తెలియనగును.

# విషయసూచిక.


జరాసంధుఁడు మథురపై దండెత్తుట ... ... ... 2025

కాలయవనుఁడు దండెత్తివచ్చుట; ముచుకుందుని కథ ... 2042

జరాసంధుఁడు పదునెనిమిదవసారి మథురపై దండెత్తుట. రామకృష్ణుల పలాయనము, ప్రవర్షణగిరిని దహించుట ... ... 2054

రుక్మిణీవివాహము ... ... ... 2056

రుక్మిణీకల్యాణము (అనుబంధము) ... ... ... 2061

రుక్మిణీకల్యాణము (అనుబంధము) ... ... ... 2069

ప్రద్యుమ్నజననము; శంబరవధము మొదలయినవి ... ... 2078

నారదుఁడు ప్రద్యుమ్నవృత్తాంతమును దెలుపఁగా రుక్మిణీదేవి మొదలగువారానందము నొందుట ... ... ... 2083

స్యమంతకోపాఖ్యానము; సత్రాజిత్తునకు స్యమంతకము దొరకిన విధము, దాని ప్రభావము మొదలగు వృత్తాంతమును ... ... 2084

జాంబవంతునకు స్యమంతకమణి దొరకుట. మణికొఱకుఁ బురజనులతోఁ గృష్ణుఁడు వనమునకుఁ బోవుట ... ... ... 2086

భగవంతుఁడు స్యమంతకముకొఱకు జాంబవంతునితో యుద్ధము సేయుట 2087

జాంబవంతుఁడు కృష్ణుని స్తుతించుట. కృష్ణుఁడు మణితోడ జాంబవతిని బడయుట ... ... ... ... 2088

సత్రాజిత్తునకు మణిని మరలనిచ్చుట. సత్యభామావివాహము ... 2090

సత్రాజిత్తును జంపి స్యమంతకమును నపహరించిన శతధన్వునిఁ గృష్ణుండు వధించుట ... ... ... ... 2091

అక్రూరుఁడు మణిని మరలఁ గృష్ణునకిచ్చుట ... ... 2094

శ్రీకృష్ణుఁడు కాళిందిని బెండ్లాడుట ... ...

మిత్రవిందావివాహము; సత్యా (నాగ్నజిత్తి) వివాహము

నరకాసురవధారంభము ... ... ...

భూదేవి శ్రీ కృష్ణునిస్తుతించుట ... ...

కృష్ణుఁడు నరకాసురుని యంతఃపురమం దున్న రాజకన్యకా
నెల్లఁ గొనిపోవుట ... ... ...

శ్రీ కృష్ణుండు పారిజాతమును గొనివచ్చుట ...

నరకాంతఃపురమునుండి తెచ్చిన రాజకన్యలను కృష్ణుఁడు
యాడుట ... ... ... ...

శ్రీరుక్మిణీకృష్ణులకుఁ బరస్పరము సరసవిరసోక్తులు ...

భగవంతుఁడు పదియాఱువేల స్త్రీలను సమ్మోహింపఁజేయు
వర్ణించుట ... ... ... ...

కృష్ణునికి నష్టభార్యలందుఁబుట్టిన పుత్రుల సంఖ్యయును
ములును ... ... ... ...

ప్రద్యుమ్న కృతవర్మా నిరుద్ధులకును రుక్మవతీ చారుమతి రో
కును వివాహము ... ... ...

అనిరుద్ధుని వివాహమందుఁ బలరాముఁడు రుక్మిని వధించుట

ఉషాపరిణయము ... ... ... ...

బాణాసుర యుద్ధకథారంభము ... ...

నృగోపాఖ్యానము... ... ... ...

బలరాముఁడు మరల వ్రేపల్లెకుఁ బోవుట ... ...

శ్రీకృష్ణుఁడు పౌండ్రకునిఁ గాశీరాజును వధించుట ...

బలరాముఁడు ద్వివిదుఁడను వానరుని సంహరించుట ...

బలరాముఁడు నాఁగటిచే హస్తినాపురము నెత్తి గంగలోఁ ద్రో
బూనుట ... ... ... ...

శ్రీకృష్ణునికడకు నారదుండు వచ్చుట ... ...

శ్రీకృష్ణాయ నమః

# శ్రీమదాంధ్రభాగవతము

## దశమస్కంధము-ఉత్తరార్ధము.

### జరాసంధుఁడు మథురపై దండెత్తుట.

కంసునికి నస్తి ప్రాప్తి యని భార్య లిరువురు గలరు. ఆ యిద్దఱు, కృష్ణునిచేఁ దమపతిహతుఁడు కాఁగా దుఃఖార్తలై తండ్రి యింటికిఁ బోయిరి. అట్లుపోయి వారు దుఃఖము వెల్లిగొన మగధ రాజగు జరాసంధునకుఁ దమకు వైధవ్యము కలిగిన కారణము నంతయుఁ దెలిపిరి. వారు చెప్పినదెల్ల విని జరాసంధుఁడు శోక రోషములు ముప్పిరిగొన భూమియందు యాదవుఁ డను పేరు లేకుండఁ జేయుదునని పెద్దపూనికి పట్టినవాఁడయ్యె. అతఁ డిరువది మూఁ డక్షౌహిణులు బలసివచ్చుచుండ, యదురాజధాని యగు మథురపయి దండెత్తి వచ్చి దాని నన్నిదిక్కులను ముట్టడించెను. అట్లా సైన్యము చెలియలికట్ట పొరలివచ్చినసముద్రమువలె వచ్చుటయును నది తనపురమును జుట్టు ముట్టడించుటయుఁ దనజనము భయముచేఁ గలంగుటయుఁ గృష్ణుఁడు చూచెను. అతఁడు సర్వ కారణుఁడు; కావున దానివలన నతనికి నేకీడును రాదు; దానిని దూలుచుటయుఁ గష్టముగాదు. అయిన నతఁడు కారణమునుబట్టి మనుష్యుండై పుట్టి తదనుగుణములయిన చేష్టితాదులను జేయు

చుండుటంబట్టి యప్పటిదేశకాలములకుఁ దగురీతిని,
నందుల కయిన ప్రయోజనమును విచారించి, యిట్లు
యించెను- 'మాగధుఁడు జరాసంధుఁడు సద్వంశ్యు
రాజుల సైన్యమును దీనిని, భూమికి భారముగాఁ గ
నాఁడు. ఇది రథతురగ పదాతులు నెరసి ఇ
దక్షౌహిణుల కొలఁదియై వచ్చియున్నది. దీనిఁ
దను. కాని, జరాసంధుని మాత్ర మిపుడు
దగదు. భూభారమును హరించుటకును, సాధుజను
చుటకును, దుష్టులగు తక్కినవారిని వధించుట
నే నీ యవతారమును బూనితిని. నే నిట్లవతా
ములను దాల్చుటకు నివియే కాక మఱి వేఱు ప్రయో
గూడఁ గలవు. అది ధర్మమును రక్షించుటయు; ఒకాన
దేని పెచ్చు పెరుఁగుచున్న యధర్మమును నుడుపుట
ఇందులకై యిట్టి విగ్రహములే కాక మత్స్యాదుల
హములను దాల్చుటయుఁ గలదు' అని మనంబునఁ ద
గోవిందుఁ డిట్లు మనమునఁ దలంచుకొనుచుండఁగా
మునుండి సూర్యునివలె ధగధగ మెఱయుచున్న రథ
దు సారథులతోడను దక్కిన ధ్వజకవచాదిపరి
తోడను గూడి యట వచ్చినవి. అంత హృషీకేశుఁ ద
లను మఱియుఁ బురాతనములును దివ్యములు నయిన
యాయుధములను జూచి బలరామునితోడ * 'అన్నా

---

* ఇట మునిభావ ప్రకాశాదులందుఁ గానిపించు నధికపాఠము
డిట్లు మనంబునఁ జింతించుచుండఁగా బలవంతుఁడగు మగధరాజు
డు పెక్కుసైన్యములతోడఁగూడి మధురను నందలిజనములను న

సాత్వతులగు యదువృలకువ్యసనము సంభవించియున్నది. చూడుము. ఇదిగో నీరథము. నీకుఁ బ్రియములగు నాయుధములును నివిగోఁ జూడుము. ఈ రథము నధిరోహించి యీ శత్రుబలము నుఱుమాడుము. ఈవ్యసనమునుండి నీవారి నుద్ధరింపుము. ఈ ప్రతిపక్షులను నిరసించుటకే మన యిరువురి మిందుఁ బుట్టుట; మఱియు సాధుజనులకు సుఖముగలిగించుటకును గదా యిది! ఇరు

---

నును నరికట్టి ముట్టడించెను. కళింగుఁడును, చేకితానుఁడును, దంతవక్త్రుఁడును, విదూరథుఁడును, ఉల్లుకుఁడును, వేణుధారియు, సాల్వుఁడును దుర్మతియగు శిశుపాలుఁడును జరాసంధుని యాజ్ఞచే మథుర తూర్పుద్వారమును జేరి ముట్టడించిరి. అవంతి దేశపురాజులగు విందానువిందులును, విరాటుఁడును, దరదుఁడును, ఏకలవ్యుఁడును, బాహ్లికుఁడును (బంచనదాధిపతియును) మహాబలుండగు పౌండ్రకుఁడును, దక్షిణద్వారమును ముట్టడించిరి. యుధామన్యుఁడును, బృహత్క్షత్రుడును, సాల్వుఁడును, భూరిశ్రవుఁడును, ఉత్తమౌజుఁడును, రుక్మియు, ద్రుముఁడును, సుదక్షిణుఁడును, జరాసంధుని పంపున మథుర పడమటి ద్వారమును ముట్టడించిరి. ద్రుపదుఁడును శిశుపాలుఁడును, త్రిగర్తుఁడును, జయద్రథుఁడును, శకునియు, సోమదత్తియు, కుణిందుఁడును నంచఱును మద బల సమన్వితులై జరాసంధునిఁగూడి యుత్తరద్వారము నరికట్టిరి. వారలెల్ల పొంగి పొరలి వచ్చిన సముద్రములుం బోలెఁ బురము నాలుగు ద్వారములను నిరోధించి, సింహనాదములు సేయుచు శంఖములను బెక్కింటిని బూరించిరి. మఱియు వారు పెడబొబ్బ లార్చుచుఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచు వేల కొలఁదిని భేరులు మ్రోయించిరి. అట్లు కరడు లాండొంటి బిట్టు తాఁకులచే దట్టముగాఁ రేఁగిన నురువుతెట్టువలతోడి సముద్రపు మహాఘోషములంబోలె వీరులగువారాజులు క్రొవ్వి కెరలి గావించు నట్టహాసముల కలకలము గృష్ణుండువిని, సృగాలంపుఁ గూఁతను విన్న మృగరాజువలె మనమున నించుకయుఁ జలింపక యుద్ధతుఁడైయుండెను. ఆకాలమందే యాకాశము

వదిమూఁడక్షౌహిణులపేర నున్నయీ భూభారమును
ర్పుము' అనెను. ఇట్లాయాదవు లిరువురును నాలోచిం
ములు దాల్చి రథము లారోహించి తమతమ యాఁ
లను గయికొని సైన్యమును మాత్ర మల్పముగా వెం
పురమునుండి వెలువడిరి. హరి, యంత దారుకుఁడు రథ
చుండఁగాఁ బురమునుండి వెడలి శంఖమును బూరించె
దులకు శత్రుసైన్యములు మనంబుల దిగులొంది వడ
దెను. కృష్ణుఁడు తన మందిరమునుండి వెలువడి వృష్ణ
అను బిలిచి నాలుగు ద్వారములనుగాచుటకు వేవేగపోఁ
పించెను. ఎట్లన—నను దేవునిని,నిశఠునిఁ, కృతవర్మను, స
కృష్ణుఁడు తూర్పుద్వారమున వెడలఁబంపెను. ఉగ్ర
సుదామునిఁ, బృథునిని, విపృథునిని దక్షిణద్వారమున వె
బంచెను. దుర్మదులగు సాత్యకిని, గదునిని, బ్రసేనుని,
రునిఁ, బడమటి ద్వారమున వెలువడఁబంచెను. మహ
డగు జగదీశ్వరుఁడు కృష్ణుఁడో బలరామసహాయుండై ద

---

నుండి సూర్యునివలెఁ బొడకట్టుచు రెండు రథములపుడే సారథి పరిచ
తోఁగూడి యటవచ్చెను. మఱియు వేయంచులుగలిగి భయంకరమును
రంబునగు చక్రము సుదర్శనమును, మిక్కిలియుఁ బెద్దదియు మేలయి
నగు నిసుపగద కౌమోదకి యనునదియు, మూఁడువంకలుగలిగి నారిఁ
డిన శార్ఙ్గమనెడి మేటివిల్లును, వాఁడి వాదరయు మొనయుఁగలిగి
మను పేరుగల ఖడ్గమును, బాణములచేత నొప్పుచు రమణీయమును
యునై యక్షయసాయకంబులగు నమ్ముల పొదులును, శైబ్యను, సు
మేఘపుష్పమును, వలాహకము ననెడి యశ్వములును, మిక్కిలి దృఢమై
యగు బలభద్రుని హాలమును ముసలమును ననెడి యీ యాయుధవ
మాకాశమునుండి వచ్చెను. దానిని జూచి కృష్ణుడు బలరామునితో నిట్ల

డు రథముతోలుచుండ నభీష్టములయిన నిజాయుధములనెల్లఁ
గయికొని యుత్తరద్వారమున వినిర్గమించి మహా బలపటిష్ఠం
బును దైత్యదానవభయంకరంబు నగు శంఖమును బూరిం
చిన వాఁడయ్యె. అంత మాధవుఁడు నిజరథాగ్రమునం దా
సీనుఁడయి యున్న దారుకునిఁ జూచి 'ధర్మజ్ఞా! శిశుపాలుఁడును
జరాసంధుఁడు నున్నవలనికి రథమును దోలుము. యుద్ధ
మున మత్తిలి కేరుచున్న రాజుల నందఱను నా బాణములచేఁ
నా యుద్ధ కౌశలమును జూపి తృప్తిఁ బొందించెదను జుమీ!'
యనెను. అట్లతఁడు చెప్పఁగా దారుకుఁడు హయములను
వేగమ యాదిక్కునకుఁ దోలెను. పరవీరులను జక్కాడు నా
కృష్ణుఁడు బిట్టుగా సింహనాదము చేసెను. రాముఁడును శంఖ
మును బూరించి సింహనాదము చేసెను. అందులకు శత్రుసైన్య
ములమనంబులందు భయకంపము పుట్టెను. తూర్పుద్వారమందు
నెనమండ్రు యదువులకు నలువురు రాజులతోఁ బెనుయుద్ధము
గలిగెను. అది మిక్కిలి యద్భుతముగానుండెను. దక్షిణద్వార
మందును గోవిందుని పరాక్రమము నూఁది మనంబులు దిట
పఱుచుకొని యదువులు శత్రురాజసైన్యముతో దెప్పరముగాఁ
బోరాడిరి. పడమటిద్వారమందును దిట్టవిలుకాండ్రగు యదువు
లకును రాజసైన్యములకును గగురుఁబుట్టించునట్టి యుద్ధము జరి
గెను. ఇంద్రపరాక్రము లయినయా రాజులాయదువులను నుఱు
మాడుచున్నను, వారు రెండులోకములను జయింప నువ్విళ్లూ
రుచు నించుకయినను జలించినవారుగారు. అపుడు యాదవ
శార్దూలుఁడును త్రైలోక్యవల్లభుండు నగు కృష్ణుఁడు మహాభ
యంకరులయిన శిశుపాలజరాసంధులున్నవలనికి వచ్చెను. ఆరామ

కృష్ణుల నిరువురను జరాసంధుఁడుచూచి కృష్ణునితో
కృష్ణా! పురుషాధమా! దాఁచుకొన్న పిఱికివిరా! నీతో
ము సేయను. మూఢా! నీవు బంధువును మేనమామను
వాఁడవుగదరా! మఱి బాలకునితోడంబోలె నీతోడఁ
డుటకు నాకు లజ్జ పుట్టుచున్నది. కనుక నీతోఁ బోరుట
గింపనైన నిచ్చగింపనుజుమీ. రామా! నీకు యుద్ధము
గలదేని పోరాడుము. పోరునపుడు దిటగలిగియుండుము
గత్తరాదు. అప్పుడు నా బాణములచే వ్రీలిన దేహము
విడిచి స్వర్గమునకేని పొమ్ము. లేదా నన్నేని చంపుము ర
ను. అందులకుఁ గృష్ణుఁడు 'శూరులగువారు వట్టిబింకము
చుమీ! పౌరుషమునే ప్రకటింతురు. 'రాజా! నీవ్రా
డవు గావు. మఱి చావఁదివురుచున్న వాఁడవు కాన, నీవ
మాకుఁ బాటిగావు' అనెను. జరాసంధుఁడును జట్టు
తోను వాహనధ్వజతురగసారథులతోడను గూడి య
కృష్ణుల నెదుర్కొని బలవంతమయిన తన మహాసైన్య
హముచే వారిని, వాయువు మబ్బుచేతను ధూళిచేతను
గ్నులను గ్రమ్మునట్లు, చుట్టు గ్రమ్మెను. అపుడు మథురా
స్త్రీ లాండలియట్టళ్లను, హర్మ్యములను, గోపురములన
యుద్ధమును జూచుచుండిరి. వారపుడు గరుడధ్వజ తాలధ్వ
చేతఁ జిహ్నితము లయిన కృష్ణరాముల రథములను
గానక శోకముపయికొనగా నెంతయు మనస్సు కుదురుత
పిల్లుచుండిరి. హరియు శత్రుసైన్యము లనెడి మేఘములు
మాటికి బాణవర్షములను గడువేంద్రముగాఁ గురియిం
సైన్యమును బీడించుటను జూచి, సురాసురులచేత నర్చితఁ

తన మేటిశరాసనమును శార్ఙ్గమును మొరయించెను. అంత మ్ములపొదినుండి బాణములనుగొని యాధనువునఁ దొడిగి యా ర్ణాంతముగాఁ దిగిచి వాఁడిబాణపరంపరలను నిగిడించుచు థములను గజములను నశ్వములనును, బదాతులనును, దును మాడుచుఁ, గొఱవిగుండ్రముగాఁ ద్రిప్పినట్లు ధనువు బాణముల వెడలఁ గ్రక్కుచు గుడుసుపడి వెలుంగుచుండఁగా, నెడ తెగక బాణ ములు దొరిఁగించుచు నిలుచుండెను.అంత నతఁడు చంద్రునివలెఁ దెల్లనై దైత్యసమూహమున కెప్పుడును నెగ్గుగావించుచు మహా ధ్వనితోఁగూడియుండు పాంచజన్యమును నోర నుంచుకొని రా జుల కపటయుద్ధముల రారాపువడిన యాదవులకు నూఱట గలుగునట్లుగాఁ బట్టి పూరించెను. చెవులకు బెట్టిదమయిన యా ధ్వనిని రాజులువిని యంత గుండియలు వ్రీలినవారయిరి. యదు వీరులును నాయుధముల నెత్తుకొని యుద్ధంబున సైన్యయుక్త లయియున్న రాజులను బ్రహరింపసాగిరి. అంత యదుప్రవరులు వారియెడ తెగక యెక్కువెట్టుగా మొరయించుచున్న శార్ఙ్గధ్వని చే ధైర్యంబునొంది నాలుగుద్వారములం దున్న శత్రురాజులను బాణసమూహముచే నొక్కువెట్టునఁ గ్రిందుపఱిచి నలుగడల వారిని బలాయితులం గావించిరి. అంత శిశుపాలుఁడు తనవిల్లు మండలాకారమై తనర 'కృష్ణా! కృష్ణా! నిలునిలు' మనియదల్చుచుఁ బలికెను. కృష్ణుండును దనకోదండము మండలాకారమై వెలుంగఁ, జమురుపూసి తోమి ఱాతిచే వాఁడిగా సానఁబట్టంబడిన బాణ ములను బెక్కింటిని నిగిడించుచు వారిపయి నడరెను. అంత శిశు పాలుఁ డయిదుబాణములను బెట్టిదములయిన వానిని, గయి కొని, యందునాలుగింట గుఱ్ఱములను, నొక్కబాణమున సారథి

నిని, వేగ గాఁడ నేసెను. మరలఁ బదిబాణములనుదొడిగి కృష్ణునిఁ గాఁడ నేసి యంత సింహనాదముఁ గావించెను. అది యద్భుతముగానుండెను. అంత గోవిందుఁడు బాగుబాగని యగ్గించుచు వానితో 'ఓరోరి చైద్యా! మేటివిలుకాఁడవుగదరా! మఱి వీరుండవగుదువు. బలవంతుఁడవు నగుదువుగా! కనుక దుర్బుద్ధీ! నావిలుకానితనమును రణమునందుఁ జక్కఁజూడుము' అని పలుకుచుండఁగా నారాజు లందఱును వాఁడిబాణములచే మాధవునినొక్కపెట్టఁ గాఁడ నేసిరి. కృష్ణుఁడు వారినందఱ నొక్కొక్కరిని నైదుబాణములఁ గాఁడ నేసి, సారథిని నాలుగు గుఱ్ఱములనును యమునింటికిఁ బంపినవాఁడయ్యె. అంతటఁ బోక యతఁడొక్కొక్కరాజును మూఁడేసిబాణములచే వక్షమునను మొగమునను, లలాటమునను గాఁడ నేసెను. పిదప ముప్పండ్రు రాజుల విండ్ల ముప్పదింటిని మూఁడేసి మూఁడేసిబాణములేసి యుద్ధంబునఁ ద్రుంచినవాఁడయ్యె. మఱి శిశుపాలుని ధనువును సయితము మూఁడుబాణములచేఁ ద్రుంచి యతని ధ్వజమును గిరీటమును ఛత్రమును సవ్వచును బఱియలు గావించెను. పిదప హరి శార్ఙ్గమందుఁ బది భల్లములనుదొడిగి యాకర్ణాంతముగాఁ దిగిచి శిశుపాలుని నొవ్వనేసెను. అంత నారాజసైన్యము భ్రమించి బాణములచేఁ గలంగి నలంగి ప్రళయకాలవాయువుచేఁ జిమ్ముంబడిన పర్వతములయు మ్రాఁకులయుఁ దీఁగలయునుం బోలెఁ జూపట్టెను. అట్లా సేన తనయందలి యశ్వములును రథములును సారథులును ద్రెళ్ళఁగాఁ గాచు దిక్కుగానదయ్యె. కృష్ణుండును బాణములనువైచుచును, శంఖమునుబూరించుచును, వేండ్రంబగు పరాక్రమము మెఱయుచును, వింటిని సారించి మొరయుఁ

చుచును, నెడతెగక బాణములునిగిడించుచు, గుడుసువడియుండు టచేఁ గొఱవిద్రిప్పిన వలయముంబోలె నది కనుపట్టుచుండఁగా, యుద్ధంబున జరాసంధుని సైన్యమును గలగుండువఱిచినవాఁ డయ్యె. ఆయుద్ధంబున గజములు కుంభములు వీడి వెక్కలు నేలం ద్రెళ్లెను. అశ్వములును బాణములచేఁ గుత్తుకలు దెగి కూలెను. అశ్వములును ధ్వజములును సారథులును రథికు లును హతులుకాఁగా, రథములును దుమురయ్యెను. పదాతులు భుజములును దొడలును మెడలును దునిఁగి నేలఁ ద్రుంగిరి. అట్లుబాణపరంపరలచేఁ దునిఁగిపడుచున్న మనుష్యులయు, నేనుం గులయు, గుఱ్ఱములయు, దేహములనుండి వందలకొలఁదిని నెత్తురుటేఱులు ప్రవహింపసాగెను. ఆనదులయందు, బుజములు సర్పములుగాను, పురుషులతలలు తాఁబేళ్లుగాను, కూలిన యేనుఁగులు దీవులుగాను, గుఱ్ఱములు మొసళ్లుగాను, జేతులు వెనుచేఁపలుగాను, మనుజుల తలవెండ్రుకలు ప్రాఁచి తీఁగలుగాను, విండ్లు కరడులుగాను, ఆయుధములు పొదరులు గాను నెరసిబెరసియుండెను. మఱియు నందుఁజక్రములు సుడుల వలె భయముగొలుపుచుండెను. మేలయిన మహామణులును నాభరణములును నందుఱాలుగాను, మొరముగాను నుండెను. ఇట్లాయుద్ధమం దానెత్తురుటేఱులు పిఱికివారలకు భయంకర ములుగాను, మనసుదిటగల ధీరులకుఁ బరస్పరము హర్ష కరములు గాను బ్రవర్తించినవి. ఇంతింతని కొలఁది యిడరాని తేజంబున రాజిల్లు బలరాముఁడు మసలముగొని శత్రువులను బడఁగొట్టి కూల్చుచుండి, యపుడు సముద్రమువలెఁ జొరరాక భయం కరమై జరాసంధునిచేఁ బాలితమైయున్నయాసైన్యమునుజొచ్చి

మిగిలిన వానిని ముసలముగొని జడియుచు నాశము నొందిం
చెను. ఇరువురచే నిరువదిమూఁడక్షౌహిణులు నాశమొందుట
యద్భుతమా ? యన్న, వసుదేవునిపుత్త్రు లాయిరువురు జగదీ
శ్వరులుగాన యది వారి కెంతయు నొక క్రీడామాత్త్రమే కాని
పరాక్రమముగాదు. అనంతకల్యాణగుణగణుం డయిన యేభగ
వంతుఁడు మూఁడులోకములకును నుత్పత్తిస్థితిలయములను దన
లీలామాత్త్రముచేతఁ జేయుచుండునో, యట్టి వానికి శత్త్రుపక్ష
మును నడంచివుచ్చుట యొకచిత్త్రముగాదు. అయినను మనుష్యు
నివలె ననుకరించుచుండి, యట్టి యమానుషమును జేయుటంబట్టి
యది చిత్త్రముగా వర్ణింపఁబడుచున్నదిగాని మఱేమిగాదు.
ఇట్లు తన సకలసైన్యములును హతములగుటయు, నందుఁ జావక
మిగిలియున్నవారుగూడ నలుగడలుఁ బలాయితులగుచుండు
టను, జూచి మహాబలుం డగు జరాసంధుఁడు తా నొక్క
రథముతోడనె కూడి బలరాముని మార్కొన్నవాఁ డయ్యె.
పర్వతములుం బోని యాయిరువురు బలశాలులును, ఒండొ
రుల మగంటిమికి నించుకయు సైరింపక కోపంబులు మల్లడిగొన
మార్కొని మహాగజములుంబోలె నొండొరులతో యుద్ధము
గావించిరి. జరాసంధుఁడు కోపము పట్టఁజాలక పెద్దగద నొక
టినిగొని నూరుమార్లు గిరగిరం ద్రిప్పి బలరాముని వక్షమునఁ
బడ విసరివైచెను. పర్వతశిఖరమువలెఁ దనపయిని వేగంబున
నురవడించి వచ్చుచున్న యా గదను బలరాముఁడు తనపైఁబడ
కుండ నట్లాదిఁగి తప్పించుకొని నవ్వుచును దానిని వమ్ముగావిం
చెను. అంత నతం డాగదను దనముసలమునఁగొట్టి వ్యర్థముగా
వించి రథమును దానిచేతనే తుత్తుమురుగావించెను. అట్లు రథము

నును సారథినిని జంపి విరథుండయిన మహాబలుని జరాసంధుని, సైన్యమంతయు హతమై యునుఋమాత్రము మిగిలియుండఁగా, సింహ మొక యల్పమృగమునుంబోలె రాముండు పట్టుకొన్నవాఁడయ్యె. పగవారినెల్లఁ జంపి పెంపారుచున్న యా జరాసంధుని వారుణపాశముల చేతను మానుషము లగుత్రాళ్ల చేతను బట్టి రాముఁడు * గట్టుచుండఁగా గోవిందుఁడు వానివలనఁ దన కార్యమును నెరవేర్చుకొనఁగోరి యట్లు గట్టనీక వారించెను. లోకనాథు లాయిరువురును విడిచిపుచ్చఁగా వీరోత్తముం డా జరాసంధుఁడు మిక్కిలియు లజ్జితుండై తపము సేయుటకు వనమును జొరఁగోరఁగా మార్గమందు శిశుపాలుఁడు మొదలగురాజులు వలదని వారించి విచిత్రములగు శబ్దార్థములతోఁ గూడిన వాక్యముల చేతను, నల్పులగు యదువుల చేత నింతటి గొప్పవానికి నీ కిట్లు తక్కువపాటు గలుగుట నిజకర్మబంధము చేతనే కాని బలహీనతవలనఁ గలుగునాయని యప్పటికిఁ దగినన్యాయములెత్తి చూపియు వారించిరి.

అట్లు తన సైన్యము లన్నియు హతములుగాఁగా నపుడు జరాసంధుఁడు కృష్ణుఁ డుపేక్షించి విడిచిపుచ్చుటవలనఁ దప్పించుకొని మనంబునఁ దూలుచు, మగధదేశమునకుఁ బోయెను. కృష్ణుండును దనసైన్యము గొట్టువడక యే యుండఁగా, శత్రు మహాసై

* జరాసంధుఁడు వచ్చినతేఁపలొక్కొక్కటియందును వానిబలమునుసంహరించి వానిని విడిచిపుచ్చఁగా వాఁడు మత్సరమున మరల మరల బలములను గూర్చుకొనివచ్చును. అట్లువచ్చు బలములనెల్లఁ జంపుచువచ్చి కడపట వానిని జంపినయెడఁ, దా నవతరించినకార్యమగు భూభారనివృత్తి గలుగునని కృష్ణుని భావము.

న్యసముద్రమును గడచి దేవతలు బాగుబాగని కొనియాడుచుఁ బువ్వు లవ్వారిగాఁ గురియుచుండ, శత్రుపీడవలని తుందుడుకు మనంబులందు వీడి యానందము నొందియున్న మథురాపుర జనులను గలసి, సూతమాగధవందిజనులు తన విజయమును గీర్తించుచుండఁగాఁ బోయెను. జనులు సంతసములు దొంతరలుగొన నా పురమందలి మార్గములనెల్ల నూడ్చి కలయంపిచల్లి పతాకలచే నలంకరించిరి. మఱియు నది వేదఘోషముచే బోరుకొనుచు, నుత్సవమునుబట్టి నలుగడలఁ దోరణములు గట్టంబడి యుండెను. ప్రభుండు కృష్ణుఁ డాపురమును బ్రవేశించునపుడు శంఖములును దుందుభులును భేరులును దూర్యములును పెక్కులు చెలంగెను. వీణెలయు వేణులయు మృదంగములయు ధ్వనులును వీతెంచినవి. పడంతులు, మాల్యములను పెరుఁగును నక్షతలను నంకురములను గృష్ణుని పయిఁ జల్లుచు, నెయ్యము దళుకొత్త సంతోషమునఁ గన్నుఁగవలు వికసిల్లఁ జూడ్కులు నిగుడ్చుచుండిరి. రణభూమియందు నలుప్రక్కల నుండి తెచ్చిన వీరుల భూషణములును యదురాజయిన యుగ్రసేనునకుఁ బ్రభుఁడు కృష్ణుండు సమర్పించినవాఁడయ్యె. బలవంతుం డగునా జరాసంధుఁడు బలములను గూర్చుకొనుటకు రెండు నెలలు గడపి మూఁడవమాసమునఁ గృష్ణుఁడు తొల్లి గావించిన యవమానమును దలంచుకొని రేయుంబవలు నెరియుచు సమస్తరాజులను బిలిపించి యుద్ధమునకు వలయుప్రయత్నములను గావించెను. వాఁడు మత్స్య మాలవ చేది దేశములరాజులును, కురు, పాంచాల, కేరళ, కుళింద, కుంత, లావంతి, కాశీ, గాంధార, సృంజయ, కళింగ, కేకయదేశములవారిని, ఆంధ్ర, దశార్ణ,

వంగ, సింధు, మద్ర, త్రిగర్త, సౌవీర దేశములవారినిని, పార్వతేయులగు పుళిందులు మొదలగువారినిని బిలిపించి యిరువది మూఁడక్షౌహిణులతోఁ గూడి మగధదేశమును గడచి పడమటిదిక్కుగాఁ బయనమై పోయెను. అట్లు గజాశ్వరథములచే నొప్పుచున్న రాజులను వరవడిగాఁ దోడ్కొని వచ్చి మధురను ముట్టడించుటకై యమునాతటములందుఁ జొచ్చి విడిసియుండెను. మిక్కిలియుఁ బెనుసైన్యమును బెక్కండ్రురాజులును దన్నుబలసి యుండ, సూతులును మాగధులును వందిజనులును నలుగడల దన్నుఁగూర్చి వర్ణనములు పాడుచుండ, వాఁడటవిడిసి వేడుకతో నుండెను. అట్లు బలవంతుఁడగుజరాసంధుఁడు యుద్ధసన్నాహము చేసియుండుటను విని, కృష్ణుఁడు రాత్రియందు బలరామాదులతోను వసుదేవుఁడు, సాత్యకి, ఉద్ధవుఁడు, అనూగ్రుఁడు, అహుకుఁడు, సారణుఁడు నను వారలతోను గూడి కార్యాలోచనము చేసెను. ఇట్లు రాత్రియం దాలోచించి కర్తవ్యమును జక్కఁగా నిశ్చయించుకొని, వేకువను బ్రొద్దుపొడువకమును పే భటసత్తములను బిలిపించి యమేయాత్ముఁడు కృష్ణుఁడు చతురంగయుక్తమగు తన సైన్యమును మూఁడుదెగలుగా విభజించి వానిని జరాసంధుని సైన్యముపయిని నియోగించెను. మధుసూదనుం డంత బలరామునిని కృతవర్మను గదునిని సారణునిని, నెడమమార్గమునఁ బోవఁబంచెను. సాత్యకిని, విపృథునిఁ, బృథునిని, ఉద్ధవునిని, సైన్యముతోడ దక్షిణమార్గమునఁ బోవఁ బంచెను. కమలలోచనుఁ డాహరి తాను గొందఱు రథికులతోఁగూడి, జరాసంధుని ముంగలనున్న మహాసైన్యమును బ్రవేశించినవాఁడయ్యె. పెక్కులు రథగజతురగపదాతులు

నెరసి బెరసియున్న యాసేనయు యమునాతీరమున నందందు విడిసియున్నదై తమిత్రగులు చెనకఁజాలరను నమ్మికచేత సుఖముగాఁ గ్రీడించుచుండెను. సూర్యుఁ డుదయాచలము నధిరోహింపఁగాఁ, జీఁకట్లువిడియఁ బోవుచుండెను. అందందుఁబులుఁగులు గూండ్లయందేయుండి కోలకోలకూయుచుండెను. తామరపువ్వులు వికసించుచుండఁ దుమ్మెదకదుపులు జుంజుమ్మని పాటలు పాడుచుండెను. అట్టిసమయమున హరి,దుర్జయంబగు జరాసంధుని భయంకర సైన్యమును బ్రవేశించెను. అపుడాసేనయందు గుఱ్ఱములు పల్లములు గట్టక వరుసలుగా నలుగడలఁగట్టంబడి యుండెను. అపుడేనుంగులపయిని *బంజరము లెక్కింపకుండిరి. భటులు నాయుధములను గయికొనకయు వెండ్రుకలను ముడిఁచికొనకయుఁ గవచములను మేనఁ దొడుగకయు వాహనముల నెక్కకయు నుండిరి. రథములకు గుఱ్ఱములు గట్టుటగాని ధ్వజము లెత్తుటగాని లేకుండెను. కృష్ణుఁడు జరాసంధుని సైన్యమునఁ బ్రవేశించునపు డది యాచందమున నుండెను. ఆరాజసమూహము మూఁడుదిక్కులను దలపడివచ్చిన యదుసైన్యములను జూచి చేయునదిది యని తోఁపక విభ్రాంతి నొందినదయ్యె. వారిలోఁగొందఱు భయమునొంది భూమిపయినిబడిరి. కొందఱు భయమునఁ బరుగులిడిరి. కొంద ఱాయుధములను గయికొని క్రోధమునఁ బగతుర యుద్ధమున మార్కొనిరి. కొందఱు కవచములు చినిఁగియు,

---

* పంజరములనఁగా ఏనుఁగుల పయినున్న దంచెనలను యంత్రములను గప్పిపుచ్చుటకై చుట్టును గొయ్యలతో రచించి చిత్రవస్త్రములచే నలంకరించి పతాకలు గట్టియుండు యంత్రవిశేషములని మునిభావప్రకాశిక. ఈపాఠము మునిభావప్రకాశికయందుఁ దప్ప వీరరాఘవీయమందుఁ గానిపింపదు.

గాళ్లను, చేతులును, దొడలును దెగియుఁ గ్రోధమునఁ గన్ను లెఱ్ఱనై గిఱ్ఱునఁదిరుగ శత్రువులనే శారసించిరి. కొందఱు గుఱ్ఱములకుఁ బల్లములు లేకయె వానిపయి నెక్కి పరాక్రమము పయిఁబయిని బెరుఁగ యుద్ధమున శత్రువులను మర్దించుచు నిరర్గలంబగు యశమును బొందిరి. కొందఱు రాజులు, తోడనే మేలుకని యుద్ధము సేయుటకు సాధనము లేవియుఁ గయికొనుటకుఁ దెలిపి లేకున్నందున, యమునదరియందుఁ గల యిసుకప్రోవును జూచి దీనినిజల్లినచోఁ బగతురు చూపుచెడి పోరాడ నేరకుందు రని కీలెఱింగి దానినిజిమ్ముచు యుద్ధము సేసిరి. కొందఱు శిబిరమును దిగవిడిచి చొరరానివనమును బ్రవేశించిరి. కొందఱు జరాసంధునిఁ జేరి 'గెలువు'మని చెప్పిరి. గోవిందుఁ డేకరథముతోఁ శత్రుసైన్యమునుజొచ్చి, యాయుధములుగొని యుద్ధసన్నద్ధులయియున్నవీరులను బెక్కండ్ర నుఱుమాడెను. బలవంతుఁడు బలరాముఁడును బెద్దసైన్యము బరివేష్టించి రా, నెడమప్రక్కను బలమును బ్రవేశించి జరాసంధునిసేనను దునుమాడెను. మహాబాహుండగు సాత్యకియుఁ గుడివైపుగాఁ బోయి మిక్కిలియుఁ బెద్దది యగు చతురంగసైన్యముతోఁ జొచ్చి పగతురఁ గలంచివుచ్చెను. ఇట్లు జరాసంధునిచే రక్షితమయిన యాసైన్యము మిక్కిలి పీడితమై, పరుగిడఁదొడఁగి, శత్రువులు వెంటంబడి తఱుముచుండఁగా క్షణమాత్రమున దశదిశలకుఁ బాఱిపోయెను. అంత సాత్యకి యైదుయోజనములు వెన్నాడి తఱుముచు జరాసంధుని సైన్యములనుగ్గునూఁచ గావించి గెలుపొంది యుద్ధమునుండి మరలెను. కృష్ణుఁ డంతఁ గొండలంతేసి యేనుంగులను బెక్కంటిని వానిపల్లెములను గవచములను దోమరములను

నంకుశములను బెక్కులు రథములను వానియందలి శస్త్రము లను ధ్వజములను నశ్వములనును మనోహరంబగు మథురకుఁ గొంపోయెను. మఱియుఁ గృష్ణుండు ఛత్రములను బంగారు జరీవస్త్రములను, రత్నములను, బెక్కులు వింజామరములను, గిరీటములను, బట్టువస్త్రములను. నూలి జిలుఁగువస్త్రములను, బాహుపురులను, గుండలములను, లెక్కిడరానన్ని యుద్ధమునఁ బడసినవాఁడయ్యె. కంసారియగు కృష్ణునిపంపున హలాయుధుం డగు బలరాముఁడును జరాసంధుని బొక్కసమును వాహన సమూహములును, నంతఃపురస్త్రీలును నాయుధములును భూ షణములును మొదలగుధనమును యదుప్రవీరుఁడగు నుగ్రసేను నకు సమర్పించినవాఁ డయ్యె.

జరాసంధుఁ డిట్లు పదియేడుమార్లు నన్ని యక్షౌహిణులనే కూర్చుకొని కృష్ణపరిపాలితు లగుయదువులతో యుద్ధము సేసెను. వృష్ణులును గృష్ణుని తేజము ప్రాపున నాబలము నంతయు నాశముసేయుచుందురు. జరాసంధుఁడును దనసైన్యము లన్నియు హతములుకాఁగా, శత్రువులు విడిచి పుచ్చుటయు మరలిపోవుచుండును. అంతఁ బదునెనిమిదవమాఱు యుద్ధము కలుగనున్నపుడు, అనడుమ నారదుఁడు పురికొలుపఁగా వీరుఁడు కాలయవనుఁ డనువాఁ డెత్తివచ్చుట కనుపట్టెను. వాఁడు మనుష్య లోకమందు యాదవు లసమానులనియుఁ దనకీడుం జోడయిన వారనియు విని మూఁడుకోట్ల మ్లేచ్ఛులతోడ మథురకు వచ్చి ముట్టడించెను. వానినిఁజూచి కృష్ణుఁడు బలరామునింగూడి యిట్లని చింతించెను. 'అక్కటా ! యదువులకు రెండువంకలను భయం కరమగు మహాదుఃఖము దాపరించినది. మహాసైన్యసమేతుఁడై

యవనుఁడు మనల నిదె ముట్టడించు చున్నాఁడు. జరాసంధుఁ
డును నేఁడో, రేపో లేక యెల్లుండియో రాఁగలఁడు. మనమిరు
వురు నీయవనునితో యుద్ధము సేయుచుండఁగా జరాసంధుఁడు
వచ్చెనేని, వాఁడు బలవంతుఁడుగాన మనబంధువులను జంప
నైనఁ జంపును; లేదా తనపురమునకైనఁ గొంపోవును. కాఁబట్టి
యిపుడు మనుష్యుల కెంతమాత్రమును జొరనలవికాని యొక
జలదుర్గమును గావింతము. అచ్చట మనజ్ఞాతులను నుంచి
యంత యవనునిఁ బొరిపుత్తము' అనెను. ఇట్లాలోచనము చేసి
భగవంతుఁడు సముద్రములోపలఁ బండ్రెండు యోజనములకు
నొక నగరదుర్గమును మిక్కిలియు నద్భుతమయినదానిని నిర్మిం
చెను. అందు విశ్వకర్మ శిల్ప నైపుణ్యంపుఁ బాండిత్యమంతయు
వెలయుచుండెను. అందు రథ్యలును జత్వరములును వీథులును
వాస్తువిధిచొప్పున నిర్మితములై యొప్పులు గులుకుచుండెను.
మఱియు నందు దేవతావృక్షములును బూఁదీఁగలును గల
యుద్యానములును విచిత్రము లయిన యుపవనములును వన్నె
గులుకుచుండెను. ఇంతియకాక యాకసము నొరయుచున్న
బంగారు శృంగములతోఁ గూడినవై పటికంపుటాల యట్టళ్ల
తోను గోపురములతోను నేపారుచుండెను. మఱియు నందు
నశ్వశాలలు నన్నశాలలు మొదలగునవి వెండితోడను నిత్తడి
తోను రచితములై మిక్కిలి యలంకృతములగు బంగారు
కుంభములతోను బద్మరాగాది శిఖరములతోను బంగారుమయ
ములై మరకతములు దాపిన నెలకట్టులతోను నీటుగులుకు
చున్న గృహములు కలిగి వెలుఁగుచుండెను. మఱియు నందుఁ
జంద్రశాలలును నిర్మితములై యుండెను. మఱియు యదు

వుల దేవగృహములచే నుల్లసిల్లుచుఁ జతుర్వర్ణములును నెరసిబెరసి యుండెను. మహేంద్రుఁ డందులహారికి సుధర్మ యనుసభయును బారిజాతవృక్షమును బంపెను. అందున్న మనుష్యుఁడు మనుష్యధర్మము లగు క్షుత్పిపాసాశోక మోహజరామరణాదులు వీడియుండును. వరుణుఁ డొక్కొక్కచెవి శ్యామల వర్ణమై తక్కినయొడలెల్లఁ దెల్లగా నున్నవియు మనోవేగము లగు గుఱ్ఱములను బంపెను. నిధిపతియగు కుబేరుఁడు తన యెనిమిదికోశములను నొసంగెను. తక్కిన దిక్పాలురు తమ తమ విభూతులను బంపిరి. తక్కినవా రగు సిద్ధులు మొదలగువారు తమతమ యధికారముల సిద్ధికొఱకు భగవంతుఁ డేయేయాధిపత్యము నొసంగెనో వాని నంతయు నాభగవంతుఁడు భూమియం దవతరించియున్నపుడు నతనికి నురల నర్పించిరి. కృష్ణుండు తన యోగప్రభావముచేత నాపట్టనమునకుఁ దన జనమునంతయుఁ గొంపోయి చేర్చి యంత మరలివచ్చి బలరామునితోడ నాలోచించి యాచొప్పునఁ బద్మమాలిక దాలిచి నిరాయుధుండై పురద్వారమునుండి నిర్గమించినవాఁడయ్యె. ఇది యేఁబదియవ యధ్యాయము.

---

## కాలయవనుఁడు దండెత్తివచ్చుట; ముచుకుందుని కథ.

కాలయవనుఁ డాకాశమున వెడలిపోవుచున్న చుక్కలరాయునివలెఁ బురమునుండి వెడలివచ్చుచున్న కృష్ణునిఁగాంచెను. ఆకృష్ణుండు చూచుటకుఁ బండువై గండరించుచుఁ జామని చాయగలిగి, బంగారు జరీ పట్టువలువగట్టి, శ్రీవత్సంబను మచ్చ ఱొమ్మునందు మెచ్చులుగులుక, తలతలమని కౌస్తుభము కుత్తుకయందు దత్తమిల్ల, నుల్లసిలుచుండెను. మఱియు నిడుదలయి బలుపు

గల నాలుగుబుజములును, క్రొత్త దామరలవలె విఱివిగల మొఱ్ఱని కన్నుంగవయు, నతనికిఁ జెన్నారుచుండెను. అతని ముఖారవింద మెప్పుడు నుబ్బుపెంపున సొంపారుచుఁ జక్కందనమునకు నిక్కమై నిద్దములగు నునుఁజెక్కిళ్లుగలిగి తెలిచిఱునవ్వు మొలకొత్తుచు మకరకుండలముల కాంతులు గంతులిడ వెలయుచుండెను. యవనుం డట్టికృష్ణునిఁ జూచి 'పురుషుఁడు వీఁడు శ్రీవత్సమను గుఱుతుగలిగి, చతుర్భుజములును, దామరలవంటి కన్నుంగవయుఁ జెన్నుమీఱ,వనమాలఁదాల్చి,మిక్కిలి సుందరుఁడుగా నున్నాఁడు. కావున వీఁడు వాసుదేవుఁడే యగును. నారదుఁడుచెప్పిన యీలక్షణములను బట్టి యతఁడే వీఁడగునుగాని మఱియొకఁడు గానేరఁడు. వీఁడు నిరాయుధుఁడై కాలినడకను బోవుచున్నాఁడు. కాన నేనును నిరాయుధుఁడనై వీనితో యుద్ధము సేసెదను'అనెను.యవనుఁ డిట్లు నిశ్చయించికొని పరాఙ్ముఖుఁడై పరుగువాఱుచున్న యాకృష్ణుని, యోగులకు నయితము పట్ట నలవిగానివానిని, దాను బట్టుకొనవలె నని తలంచి యతనివెంటఁ బరుగెత్తెను. హరియు నడుగడుగునకును దాను జేతికిఁ జిక్కువానివలెఁ దోఁపించుచునే యవనాధిపతిని దూరముగాఁ దీసికొనిపోయి కడపట నొక పర్వతగుహను జేర్చెను. ఆ యవనుఁడును ' ఓకృష్ణా ! యదుకులమునఁబుట్టిన నీ కిట్లు పరుగెత్తుటతగునా ? తగదుచుమీ' యని యాక్షేపించుచునే యతనివెంటఁబడి తఱిమెను; కాని,వానిపాపములు క్షీణింపకుండినందున వాఁ డతనిని బొంద లేఁడయ్యెను.వాఁ డట్లాక్షేపించుచున్నను భగవంతుఁడు పాటింపక యొకపర్వతకందరమును బ్రవేశించెను. వాఁడును నందుఁ బ్రవేశించెను. అట్లుచొచ్చి

వాఁడందుఁ బరుండియున్న మనుష్యుని వేఱొకనిని గాంచెను. వాఁడాపురుషుని 'వీఁడు వాసుదేవుఁడు నన్నిట్లు దూరముదీసికొని వచ్చి సాధువువలె మిన్నకపరుండి నిదురించుచున్నాఁడు. నిజముగా వీఁడు కృష్ణుఁడే' యని మూఢుఁడై యాపురుషు నచ్యుతునిఁగాఁదలఁచి కాలితో బిట్టుగాఁ దన్నెను. అట్లు కొట్టువడిన యా పురుషుఁడు లేచి చాలఁగాలముగా నిదురించుచుండినవాఁడు గాన కన్నులను మెల్లమెల్లఁగా విచ్చి దిక్కులను గలయఁజూచుచుఁ బార్శ్వమం దున్నయా యవనునిఁ గాంచెను. ఆపురుషుఁడు క్రుద్ధుఁడై వానిపయిని జూడ్కి నిగిడింపఁగానే వాని దేహమునం దగ్గిపుట్టి దరికొనుటయు వాఁడపుడు దగ్ధుఁడై యొక క్షణములో నీఱయ్యెను.

రాజు—బ్రాహ్మణోత్తమా! అట్లు పరుండియుండి యవనునిఁ జంపివచ్చిన యాపురుషుని పేరేమి? ఎవనికులమునఁ బుట్టినవాఁడు? వాని వీర్యమెట్టిది? ఏమికారణమున నాగుహానుజొచ్చి పరుండి యుండె'నని యడిగెను. శుకుఁడు—అతఁ డిక్ష్వాకుకులమందుఁబుట్టినవాఁడు. మాంధాతకుఁ బుత్త్రుఁడు. మిక్కిలిగొప్పవాఁడు. అతనిపేరు ముచుకుందుఁడు. అతఁడు బ్రహ్మణ్యుఁడును సత్యసంధుఁడు నగును. ఇంద్రాదులయిన దేవతాగణము లసురులకుభయపడి తమ్ము రక్షించునట్లు వేఁడికొనఁగా నతఁడు వారిని జిరకాలము రక్షణసేయుచుండెను. దేవతలు కుమారస్వామిని స్వర్గమునకుఁ బాలకుఁడుగాఁ బడసి యంత ముచుకుందునితో 'రాజా! మమ్ము సంకటపడి పరిపాలించుచు వచ్చితివి. ఇఁక నీసంకటమునుండి విరమింపుము. వీరా! మనుష్యలోకమును విడిచి యకంటకమైన రాజ్యమునుదిగనాడి మమ్ముఁ బరిపాలించు

చుండినందున నీవు సమస్తములయిన కామములను విడిచి యుంటివి. నీదుపుత్త్రులును బట్టపుభార్యలును జ్ఞాతులును అమాత్యులును మంత్త్రులును బ్రజలును నీసమకాలపు వారగు వీరందఱును గాలమునకులోనై యిప్పుడొక్కరును లేకున్నారు. ఆ కాలమేదియో కాదు. భగవంతుఁడే కాలశరీరకుండును, (కాలకృతనాశాది వికారరహితుండుగాన) యవ్యయుండును (సర్వనియంతగాన) యీశ్వరుండును నగును. భగవంతుఁడు బలవంతులందెల్ల మిక్కిలి బలవంతుఁ డయినవాఁడు. అతఁడు క్రీడించువాఁడై, పసులకాపరి పశువులనుంబోలెఁ బ్రజలను వశీకరించుచున్నాఁడు. కాఁబట్టి నీవిపుడు మావలనఁ గైవల్యముదక్కనొండు వరమడుగుము. నీకుశుభంబగుఁగాత. అవ్యయుండును భగవంతుఁడు నగు విష్ణు వొక్కరుండే దాని నొసంగసమర్థుండు. తక్కినవారు గారు'అనిరి. దేవత లిట్లు చెప్పఁగా నమ్మహాయశుఁడు వారలకు నభివాదనముచేసి 'బహుకాలము నిద్రలేకున్న నాకుఁ బరుండుటకు నిర్జనం బగుప్రదేశము చూపుఁ'డనియడిగి దేవతలొసంగిననిదురచేత వారు చూపినగుహయందుఁ జొచ్చి పరుండెను. వారు 'నీవు నిదురపోవుచుండఁగా, నెవ్వఁడు తెలియక నిన్నుమేలుకొలుపునో వాఁడు నీచూపు పయి నిగిడినమాత్రమున నాక్షణమే భస్మముకాఁగలఁడు'అనియుఁ జెప్పిరి. యదుతిలకుం డగుకృష్ణుఁడు యవనుని నీఱుగావించిన పిదపఁ దన్నుఁ బుద్ధిమంతుఁ డగుముచుకుందునకుఁ గాన్పించికొన్నవాఁడయ్యె. మబ్బువలె నల్లనై, పచ్చని పట్టు వలువనుగట్టి, శ్రీవత్సమను మచ్చ ఱొమ్మున వెలయఁ, గౌస్తుభ మొరెయుఁ దళుకునింప, చతుర్భుజములతోను వైజయంతీవనమాలికతోను గూడి, సొగసయి ప్రసన్నంబగు ముఖము

విలసిల్ల, మకరకుండలములు చెవుల నల్లలాడ, నెంతయు విల సిల్లుచుండెను. ఇట్లు ముల్లోకములకును గన్నులపండువై, యను రాగంబును నగవును బిరిగొన్న చూడ్కులఁ జల్లుచు, నెలప్రా యము మురువుగాఁ దలసూపుచుండ, మదించిన సింగమువలె నెన్నడ గరువంపుఠీవి గులుకుచున్న యాకృష్ణునిం గాంచి మహా బుద్ధియగు నాముచుకుందుఁ డమ్మహాత్ముని తేఱిచూడరాకున్న తేజంబునకు నోటువడి నలుగడలఁ బర్వుచున్న నిజప్రభంజేసి యెవ్వరికిని జెనకరానివానివలె నున్న యతనికి భయముఁ జెంది విరవిరపాటున నెలుంగు డగ్గుత్తికవడ మెల్లమెల్లఁగా నిట్లనియె. 'అయ్యా! మీ రెవ్వరు? ఇట కేలవచ్చితిరి? ఈయడవి లోఁ జొరరాని పర్వతగహ్వరమున, పెనుముండ్లును గండ్లును గలచోట, తామర రేకులవలె మృదువులయిన యడుగులతోఁ దిరుగుచున్నావే? నీవు తేజస్వులగువారి తేజంబు మూర్తివా? లేక యగ్నివా? సూర్యుఁడవా? సోముఁడవా? మహేంద్రుఁ డవా? లేక వేఱొకలోకపాలుఁడవా? నీ వీగుహాయందుఁ దొ లంచిపుచ్చరాని చీఁకటినిని, హృదయ గుహాయందలి యజ్ఞానంపుఁ జీఁకటిని, దీపము తనప్రభ చేతంబోలెఁ దూలించుచున్నావుగదే. కాన దేవదేవు లగుబ్రహ్మవిష్ణు రుద్రుల ముువ్వురయందును బురు షోత్తముం డగుభగవంతునిఁగా నిన్నుఁ దలంచుచున్నాను. పురుషపుంగవా? నీవుకపటమువాని, నీదుజన్మమును గర్మమును గోత్రమును, విన నువ్విళు లూరుచున్న మాకు, నీ కిష్టమగునేని చెప్పుము. మిమ్ము నిర్బంధింప నెవ్వరము. పురుషవ్యాఘ్రమా? మేము క్షత్రియులము. ఇక్ష్వాకు వంశపువారము, నాపేరు ముచుకుందుఁడందురు. ప్రభూ! నేను మాంధాతృ పుత్త్రుఁడను,

నేను చిరకాలము మేలుకొని యుండినందున బడలికనొందినవాఁ డనై నిదురంగూడి దానిచే నింద్రియములు వ్యాపారములు దూలఁగా నిర్జనంబయిన యిచ్చోట నిచ్చలుఁ బరుండియుంటిని. ఇప్పు డెవఁడో యొకఁడు నన్ను లేపినాఁడు. వాఁడును, తనదు పాపముచేతనే నీఱయినాఁడు. ఇది నిజము. నాచూపు వట్టినిమిత్తమే. అనంతరము, శత్రువులనెల్ల నుఱుమాడు శ్రీమంతుఁడవు నీవు చూపట్టితివి. నీతేజస్సు మిక్కిలియు దుస్సహముగా నున్నందున మాకన్నులు మిఱుమిట్లుగొని నిన్నుఁ దేఱిచూడ నలవిగాకున్నది. మహాభాగా! కర్మవశమున జ్ఞానతేజంబు దూలియున్న మాబోఁటి దేహులయందు నీవెంతయు మాననీయుండవుగదే' యనెను. రాజిట్లు చెప్పఁగా భూతభావనుం డగునా భగవంతుఁడు నవ్వుచు మేఘరవ గంభీరంబగు వచనమున నతనితో 'ఓయీ! నాకు జన్మములును గర్మములును నామములును వేనవేలుగలవు. అవి యనంతములగుటచే వానిని లెక్కించుటకు నెవ్వరికిని, మఱి నాకుసయితము, శక్యముగాదుచుమీ! ఎప్పుడేని, సూక్ష్మబుద్ధిగలవాఁ డెవఁడేని యొకఁడు పెక్కు జన్మములచేత భూమిదుమ్ములను లెక్కింపనయిన లెక్కింపనేర్చునుగాని నాగుణకర్మ నామములనో లెక్కింప నెంతమాత్రమును నేరఁడు. రాజా! పరాశర శౌనకాదులయిన పరమర్షులు సయితము కాలత్రయమందును గోచరములగు నాజన్మకర్మములను నెంతవర్ణించుచున్నను వానితుదిని బొందినవారేకారు. ముచుకుందా! అయినను నేను నాయిప్పటి జన్మములను జెప్పెదను వినుము. తొల్లి బ్రహ్మ ధర్మసంరక్షణముసేయుటకును భూమికి భారభూతులయిన యాసుర ప్రకృతులను నాశముసేయుటకును నన్నుఁ

ప్రార్థింపఁగా, నేను యదుకులమున వసుదేవుని భార్యయం దవత రించితిని. వసుదేవుని సుతుండనగుటచే నన్ను వాసుదేవుండని చెప్పుదురు. కాలనేమియగు కంసుఁడు హతుఁడయ్యెను. ప్రలంబుఁడు మొదలగువారును హతులయిరి. రాజా! ఈయవనుఁడును నీవేండ్రపుఁగంటి నిమిత్తమున నాచేత దగ్ధుఁడయ్యెను. ఇట్టినేను నిన్ననుగ్రహించుకొఱకై యీగుహకు వచ్చితిని. నీవు తొంటిజన్మమున నన్ను మిక్కిలియు నారాధించితివి. నేను భక్తవత్సలుఁడనుగదే. రాజర్షీ! వలయువరములను వేఁడుము. నీవు కోరుకామములనెల్ల నీకొసంగెదను. నన్నుశరణుఁజొచ్చిన జనుఁడు మరల సంసారమునఁ జిక్కి దుఃఖింపఁదగఁడుసుమీ' యనెను.

హరి యిట్లు చెప్పఁగా ముచుకుందుఁడు తొల్లి తనకు గర్గుఁడు చెప్పినమాటను దలంచుకొని యతనినిదేవుండు నారాయణుండని యెఱింగి ముదమునొంది యతనికిఁ బ్రణమిల్లి యిట్లనియె.

'ఈశా! వరముల నడుగుమంటివి. నీమాయచేత మోహితులై మాబోఁటు లగు నీజనులు స్త్రీలును బురుషులును నిరతిశయ పురుషార్థభూతుఁడ వగునిన్ను భజింపరు; మఱి తమయనర్థముల యందే బుద్ధిగలిగి నిక్కమునకు ననర్థహేతువులగువానినే యర్థములుగాఁ దలఁతురు. దుఃఖమునకుఁ బుట్టుచోట్లయి సుఖలేశమును దోఁపించుచుండు గృహములందు సుఖమునుగోరి దగులు వడుచున్నారు. * అట్టిజనుఁడు పూర్వమే నీచేత వంచితుఁడయి నాఁడు. 'ఇట్లు వంచించుటకు నేను నిర్దయుఁడా విషముఁడా'

---

* నిరతిశయపురుషార్థభూతుఁడ వయిన నీవుండఁగా నిన్నుఁగోరు మనక విషయాదులగు కామములను గోరుమని యడుగుట నీమాయచేత మాబోఁటులను వంచించుటయె కాని మఱియొకటి కాదని ముచుకుందుని యభిప్రాయము.

యన వలదు. అనఘా! జనుఁడు వీఁడు తనప్రత్నమేమియు లేక
యనుగ్రహశీలుండ వగునీదుసంకల్పముచేతనే యీకర్మక్షేత్ర
మందు దుర్లభమును నిన్నారాధించుట కుపయుక్తము నగుమా
నుష దేహమును బడసియు నిరతిశయపురుషార్థరూప మగునీ
పదారవిందమును భజింపఁడు. మఱి ప్రకృతిపరిణామం బయిన
దేహమే యాత్మయనెడి చెడ్డయభిమానము గలిగి గృహంబనెడి
చీఁకటి గోతియందు, పశువు గడ్డికప్పిన నూతియందుంబోలెఁ
బడుచున్నాఁడు. అజితా! నేను మరణశీలం బయినయీదేహమే
యాత్మయనెడుబుద్ధిగలిగి, పుత్రకళత్రాదులయందును బొక్క
సములందును భూములందును మిక్కిలియుఁ దగులువడి వానిని
రక్షించుటకును బోషించుటకును దుదిలేనిచింతయందు మునిఁగి
యుంటిని. ఇట్లహంకార మమకారగ్రస్తుఁడ నైకావున రాజ్యసం
పత్తిచేత మదము మిక్కిలియుఁ జెలరేఁగఁగా, విషయాభిలాష
ముచే బుద్ధిచెడి యుంటిని. కనుకఁ గడచినకాలమంతయు నేను
వ్యర్థముగానే పుచ్చితినిగాని యందువలనఁ బసగాన నయితిని.
కుండయుగోడయుంబోలె జడమైన యీకలేబరమం దాత్మయనెడి
యభిమానము గట్టిగాఁగుదురుకొనఁగా, నేను రాజనని యెన్ను
కొనుచు రథగజతురగపదాతిపరిపాలకు లగు పెక్కుయూథపతులు
బలసికొలువ భూమియం దందంద గ్రుమ్మరుచుంటిని. నిన్ను సరకు
సేయక మదమెత్తి కన్నుఁగానకుంటిని. ఇట్టిట్లు చేయవలయునని
యెన్నో మనోరథపరంపరలు సాగుకొలఁదిని, బేరాస మీఁదు మి
క్కిలి హెచ్చు పెరిఁగి, శబ్దాదివిషయములందు మనసు దగులువడి, నా
దుహితము నెఱుంగక నే నేమఱియుండఁగా, నన్ను నీవు మాత్ర
మేమఱక యంతకరూపుఁడవై, యాఁకటిచే సెలవులు నాకుచున్న

సర్పము మూషికమునుంబోలె,తటాలున నన్నుఁబట్టికొని గ్రహింతువు. కాన, నిన్ను సరకుసేయకుండుటకు నీవుగావించు ఫలమిది గదా. 'మిక్కిలి మేలయిన రాజశరీరమును బడసియు దానినిట్లు నిందింపఁదగునా' యనవలదు. నేను దొల్లి సువర్ణాలంకారములచే సింగారింపఁబడిన రథములతోను గజములతోను సంచరించుచు నరదేవుఁడను పేరొందియుండిన యీదేహమే,తో(?)సిపుచ్చరానికాలము పయికొనెనేని, నక్కలు మొదలగునవి తినుటవలన విష్ఠయనియు, అవి తినక ముఱిగినయెడలఁ గ్రిములనియు, దహింపఁబడినయెడల భస్మమనియుఁ బేరొందుచున్నది. దిక్కులనమూహాములను గెలిచి విరోధి గలఁడనుటయు లేక సార్వభౌమపీఠమందాసీనుఁడై పూర్వము సములై యుండిన రాజులును దనకువందనములు సేయుచుండునట్టి పురుషునిఁగూడ,మైథునమె సుఖముగాఁగల గృహములందుఁ బూవుంబోండ్లు కోఁతులు మొదలగు తమ పెంపుడు మెకములవలెఁ దమ యిచ్చచొప్పునఁ బరతంత్రునిఁగా మెలపుచున్నారు. దిక్కులు గెలిచినసార్వభౌముఁడు స్త్రీల కనుసన్నలమెలఁగుట యేమనవచ్చును! భోగ్యభోగోపకరణములు నిండియున్న రాజగృహములను దుఃఖమూలములుగా నిందించెద వేమి' యనవలదు.జనుఁడు మరల జన్మాంతరమందయినను సార్వభౌముఁడు గావలయునని తృష్ణ పెచ్చు పెరుఁగఁగా నందులకై తపస్సులయందు నిష్ఠంబూని,భోగము లెల్ల దిగనాడి,రాఁగల జన్మమందలి భోగము నపేక్షించి,యాతపములనుదాల్చి యప్పటిదేహంపు భోగముల కయినభోజనాదికర్మములను గావించు చున్నాఁడు. ఇట్లు కష్టపరంపరలకుఁబాలై సార్వభౌముఁడు గాఁజూచువాఁడు సుఖమునకుఁ బాలుగానేరఁడు. కాన రాజగృహములు నింద్య

ము లేచుమీా ! ఇట్లు సంసారమందు భ్రమించుచున్న పురుషు
నకు సంసార నివృత్తి (ముక్తి) యెపుడు సమీాపించినదగునో
యపుడే సుఖమునకు వాఁడు పాలుపడును జుమీా. ఆసంసార
నివృత్తియో, అచ్యుతా ! ఈసంసారిజనునకు నే పుట్టుకయందు
సత్పురుషు లగు భాగవతులతోడి సహవాసము గలుగునో
యపుడే కలుగును. సత్సంగమమును నపవర్గమునకుఁ దనంతట
సాధకముగాదు. కాని, యది యెపుడు గలుగునో యపుడు
పరావరులగు చతుర్ముఖాదులకును నియంతయు, సత్పురుషులకు
సద్గతిప్రాప్తికుపాయభూతుండు నగునీయందు భక్తిమయం బగు
బుద్ధి పొడముచున్నది. ఆభక్తిమూాలమున ముక్తి దొరఁకొను
చున్నది.నిన్ననుగ్రహించుకొఱకే యీాగుహకు వచ్చితినంటివి.
ఈశా ! దేవతలకు సాహాయ్యముచేయు నెపమున దైవికముగా
రాజ్యపాశము నాకుఁ దొలఁగునట్లు గావింపఁబడినది. ఇది నీవు
నాయందుఁ జూపిన గొప్ప యనుగ్రహ మని తలంచుచున్నాను.
వివేకులై తపస్సుకొఱకు వనమును బ్రవేశింపఁ గోరుసార్వభౌము, లే
కాకిత్వమున సంచరించుకొఱకు రాజ్యపాశమును వదలుట
నెంతయు వేఁడుచుందురు. అట్టిది నాకు నలవ్రోకగాఁ గలుగుట
నీయనుగ్రహమేకదా ! కాన, యిపు డిటకువచ్చి కాదు; ఇంతకు
మునుపే యీారాజ్యపాశమును బాచి యనుగ్రహించియున్నావు.
విభూా ! అనన్య ప్రయోజనులగు నేకాంతులకు మిక్కిలియుఁ
బ్రార్థింపఁ దగియున్ననీదు పాదసేవనమునకంటె వరము మఱి
యొకటి నే నొల్లను. వివేకియగునేని, పురుషుఁ డెవఁడు సాక్షా
న్ముక్తిప్రదుండ వగు నిన్నారాధనముచేఁబ్రసన్నునిఁ గావించికొని
పిదప నాత్మకు బంధకమయిన శబ్దాదివిషయజాలమును వరిం

చును? మూర్ఖుఁడే వానిని వరించును. కాఁబట్టి, ఈశా! సత్త్వరజస్తమోగుణ కార్యములగు కామక్రోధాదులు వెంటనంటి వచ్చునట్టి కామముల నన్నింటిని దిగవిడిచి పుణ్యపాప సంబంధరహితుండుగాన నిరంజనుండును గుణత్రయ సంబంధరహితుండుగాన నిర్గుణుండును సమాభ్యధికరహితుండుగాన యద్వయుండును బరుండును బురుషరూపంబున యదువులందు వర్తించువాఁడును జ్ఞానైక స్వరూపుండును నగు నిన్ను ముక్తి కుపాయభూతునిఁగా నధ్యవసించుచున్నాను. ఈసంసారమందు విపులమయిన యధ్యాత్మికాది తాపములచేతఁ దపించుచు, దానివలనఁ జిరకాలముగా దుఃఖముచేఁ బీడితుఁడనై, మనస్సు మొదలయిన యాఱింద్రియము లనెడుశత్రువులను గెలువనేరక, మనస్సు తెలివియు దానిచేఁ బొందనేరక యుంటిని. శరణప్రదా! ఇట్లుండి నీసంకల్పాదులచేత సంసార భయదూరంబును సత్యంబును శోకరహితంబునునగు నీపాదాబ్జమును శరణుఁజొచ్చితిని. పరాత్మా! ఇట్లాపన్నుండయిన నన్ను, నిన్నిపుడు శరణొందినవానిని, సంసారభయమునుండి రక్షింపుమీ' యనెను.

కృష్ణుఁడు—'సార్వభౌమా! మహారాజా! నీమతి రాగాదులులేక నిర్మలమై నివృత్తిధర్మమందు దృఢముగా నెలకొనియున్నది. ఏలన నేను వరములుచెప్పి యెంత నిన్నాసకొలిపినను నది కామములచేఁ గొట్టువడక చెడకున్నదిగదే. నిన్ను వరములచే నాసకొలుపుటయెల్ల నీబుద్ధికిఁ బ్రమాదము గలుగకుండుటకనియె తెలియుము. అట్లాసకొలుపుటచే బుద్ధిప్రమాద మెప్పుడేని కలుగదా యనవలదు. నాయందే యనన్య ప్రయోజనం బగు భక్తిగలవారలకు మతి యొకప్పుడుగాని, కామములచేతఁ గొట్టు

వడి చెడదునుమీ! ప్రాణాయామాదు లయిన యుపాయములచే మనోనియమనము గావించువారయినను నాకుభక్తులు గారేని, వారిమనసు,వాసనక్షీణింపకుండుటవలననో కానొకప్పుడు చెలఁరేఁగి విషయములందుఁ దగులువడుట చూపట్టుచున్నది. నీవు నాయందుమనస్సును జొనిపి భూమిని నిచ్చలు సంచరింపుము. నాయందు నీకెల్లప్పుడును నెడఁబాయని భక్తియో తప్పక కలుగును. అట్లు నిన్ననుగ్రహించుచున్నాను. నీవు భక్తికే కనఁబడువాఁడవయ్యు నిపుడది లేకయె ప్రత్యక్షమయితివి గాన ముక్తి నేల జాగుచే నెడ వందువా? నీవు నీదు క్షత్రవర్ణధర్మమందు నెలకొని లోకరక్షకు నుపయుక్తములు గాని వగు వేఁటమొదలగు వ్యాపారములచే జంతువులను వధము చేసితివి. కాన నన్నే యాశ్రయించి నాభక్తి యందు నిష్ఠుఁడవై మత్ప్రాప్తికిఁ గలయడ్డులనుదూల్చు తపము చేత జంతువులను వధించినపాపమును * బోకార్చుకొనుము. రాజా! నీవు మఱునటిజన్మమున బ్రాహ్మణశ్రేష్ఠుఁడవై సర్వభూతములయందును మిక్కిలియు సౌహార్దముగలిగి జగమునంతయు బ్రహ్మాత్మకముగాఁ గనుఁగొనుచుఁ బ్రకృతి మండలమున కవ్వల నున్న నన్నుఁదప్పక పొందుదువుచుమీ' అనెను. ఇది యేఁబది యొకండవయధ్యాయము.

---

* పరమాత్మ ప్రత్యక్షమయినవారికి నయితము ప్రారబ్ధమగు పాపము. తపస్సుచేతఁగాని యనుభవించికాని నాశము నొందిననే పరమాత్మప్రాప్తి కలుగునని భావము.

జరాసంధుఁడు పదునెనిమిదవసారి మథురపై దండెత్తుట. రామకృష్ణుల పలాయనము. ప్రవర్షణగిరిని దహించుట.

ఇట్లాయిక్ష్వాకుకులనందనుం డగుముచికుందుఁడు కృష్ణుని యనుగ్రహమునొంది యతనికిఁ బ్రదక్షిణముగావించి ప్రణమిల్లి యాగుహాముఖమునుండి బయలువెడలెను. అతఁడు మనుష్యులును, పశువులును, తీఁగలును, వృక్షములును, నల్పపరిమాణములై యుండుటనుగాంచి కలియుగము ప్రాప్తించినదని తలఁచి యుత్తరదిశను గూర్చిపోయెను. అతం డింద్రియములను గెలిచి దేహమునందును దదనుబంధులయందును నాసక్తివదలి సిద్ధి గలుగునో లేదో యనుసంశయమును వీడి కర్తవ్యమునందుఁ ద్వర గలిగి భగవంతుఁ డగుకృష్ణునియందుఁ దనమనంబును లెస్స గుదురుపఱిచి గంధమాదనపర్వతమును బ్రవేశించెను. అంత నచటనుండి నరనారాయణుల కునికిపట్టయిన బదరికాశ్రమమును జేరి శీతోష్ణాదు లగుద్వంద్వములనెల్ల సహించి శాంతుఁడై భగవంతునిఁ దపంబున నారాధించెను. భగవంతుఁడు యవనుఁడు ముట్టడించియున్న మథురకు మరలవచ్చి మ్లేచ్ఛబలములనెల్ల సంహరించి వారలధనమును ద్వారకకుఁ గొంపోయెను. అచ్యుతుఁ డేర్పరించిన మనుష్యులును గోవులును నాధనమునుగొంపోవుచుం డఁగా, నపుడు జరాసంధుఁ డిరువదిమూఁ డక్షౌహిణులంగూడి యటవచ్చెను. రాజా! రామకృష్ణు లిరువురు శత్రుసైన్యమునకుఁ దమవేగము నురవడిని జూపి మనుష్యులవలెఁ జేష్టింపఁగోరి త్వరితముగాఁ బలాయితులయిరి. వారు మిక్కుటముగా యవనులనుండి గడించిన ధనమును దిగవిడిచి భయములేని వారయ్యు

భీతులయందును మిక్కిలి భీతులవలెఁ జూపట్టుచుఁ. దామర రేకులంబోని యడుగులఁ బెక్కుయోజనముల దూరము పరుగిడి పోయిరి. జరాసంధుఁడును నాయిరువురను బరుగు వాఱుచుండుటను జూచి తనబలములును దాను నీశు లగు నారామకృష్ణుల కొలఁది నెఱుంగక కేరినవ్వుచు రథసైన్యములతోడ వారి వెంటఁ బరుగెత్తెను. ఆరామకృష్ణు లట్లు దూరము పరుగిడి బడలికనొంది పొడవయిన ప్రవర్షణ మనెడిపర్వతము నారోహించిరి. భగవంతుఁడు పర్జన్యుఁ డందు* నిత్యమును వర్షించుచుండును. జరాసంధుఁ డాపర్వతమున నందందు రామకృష్ణుల యడుగుల జాడలున్న నేలపట్టులను జూచెను. వాఁడు దానినిబట్టి వారిరువు రాకొండయందుమఱఁగి దాఁగియున్నారనియూహించి యాపర్వతముచుట్టు పదియోజనముల వఱకును గట్టియలుపేర్చి యందగ్గి దరికొలిపి దహింపఁజేసిన వాఁడయ్యె. అపు డాపర్వత తటము తెల్లఁ గాలుచుండఁగా రామకృష్ణులిరువురును బదునొకండువేలయోజనముల పొడవుగల దానినుండి కుప్పించి జరాసంధుని బలములను గడచి యవ్వల నున్న క్రిందిభూమికి దుమికిరి. ఆయదుసత్తములిరువురును శత్రువులకును వారి యనుచరులకును గంటఁ బడకయే సముద్ర మగడ్తగాఁ జుట్టి యున్నతమపురమునకు ద్వారకకు మరలివచ్చిరి. జరాసంధుఁడును నారామకృష్ణు లిరువురును దగ్ధులయిరని తప్పఁదలంచుచు మిక్కిలియుఁ బెద్దవియగు సైన్యములను మరల్చుకొని మగధదేశమునకుఁ బోయెను. ఆనర్తదేశపురాజును శ్రీమంతుఁడునగు రైవతుఁడనువాఁడు, బ్రహ్మయాన

* ప్రకృష్టముగా వర్షించుచుండుటవలన ఆపర్వతము ప్రవర్షణమనం బడెనని తెలియునది. ఇది యందులకు వ్యుత్పత్తి.

తిచ్చినచొప్పున రేవతియనెడు తన కొమారితను బలరామున కిచ్చె నని మున్ను చెప్పఁబడెను. భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడును లక్ష్మి యంశభూతురా లగు భీష్మకమహారాజు కుమారిని రుక్మిణిని స్వయంవరమందు సకలజనులును జూచుచుండఁగా, శిశుపాలుని పక్షపువా రగుసాల్వుఁడు మొదలగు రాజులను, బలంబునఁ గలంచి నలంచి గరుడుం డమృతమునుంబోలెఁ గొనితెచ్చి పెండ్లియా డెను' అనెను.

రాజు 'భగవంతుఁడు కృష్ణుఁడు చక్కని నెమ్మొగముగల భీష్మకరాజకుమారిని రుక్మిణిని రాక్షసవివాహమునఁ దెచ్చి పెండ్లియాడెనని నీవలన నిపుడు వింటిని. మహాత్మా! అమితతేజుం డాకృష్ణుఁ డేవిధమున జరాసంధాదులను దా నొక్కఁడే గెలిచి రుక్మిణిని గయికొని మరలివచ్చెనో వినఁగోరుచున్నాను. బ్రాహ్మణోత్తమా! శ్రీకృష్ణునికథలు విన్నను జదివినను బుణ్యావహములు; మఱి ఫూఁదేనియలవలె వీనుల విందులు; మఱియు వినువారలయుఁ జెప్పువారలయుఁ బాపములెల్లఁ దూలించునవి. శ్రవణేంద్రియంపు సొంపుపెంపును దెలిసినట్టి వివేకియగు పురుషుఁ డెవఁ డాకథలను విను నేని, యెప్పుడునుఁ గ్రొత్తక్రొత్తలుగఁ జవులొలుకుచుండు వానినే మరల మరల సేవింపకుండును'? అని యడిగెను.

## రుక్మిణీవివాహము.

శుకుఁడు —భీష్మకుండను గొప్ప రా జొకఁడుండెను. అతఁడు విదర్భదేశము నేలుచుండెను. అతని కేవురుపుత్రులును, నొక పుత్రికయుఁ బుట్టిరి. ఆకన్నియ నెమ్మొగము చెన్నుగులుకు

చుండును. ఆపుత్రులయందు రుక్మి పెద్దవాఁడు. రుక్మరథుఁడు, రుక్మబాహుఁడు, రుక్మకేశుఁడు, రుక్మమాలి యని తక్కిన నలువురుందురు. వీరందఱకును రుక్మిణి కడగొట్టు చెల్లెలు. ఆ చెలువయుఁ దనగృహమునకు వచ్చుజనులవలనఁ గృష్ణునిరూపమును వీర్యమును గుణములనును సంపత్తినిని విని, యాతఁడే తనకుఁ దగినపతియని తలంచెను. అట్లే కృష్ణుండును గృహాగతులవలన రుక్మిణిదేవి బుద్ధియు, శుభలక్షణములును నుదారతయు జక్కందనమును శీలమును గుణములను విని యాముద్దియను తనకుఁ దగినభార్య యని పెండ్లియాడుటకు మనంబున నిశ్చయించెను. రుక్మి దన చెలియలిని రుక్మిణినిఁ బంధువులందఱును గృష్ణునకిచ్చెదమని కోరుచుండఁగాఁ, దాను గృష్ణునికిఁ బగతుండుగాన యందుల కొల్లక వారలను వారించి శిశుపాలునే రుక్మిణికిఁ బతిగాఁ దలంచెను. తెలికన్నుంగవఁ జెన్నారు చిన్నారి యా రుక్మిణి యది యెఱింగి మనసున మిక్కిలియుఁ జింతిల్లుచు నెంతయు నాలోచించి యంతఁ దనకాప్తుండయిన యొక్కబ్రాహ్మణుని వేవేగ కృష్ణునికడకుఁ బంపెను. అతఁడును ద్వారకాపురమునకుఁ బోయి కృష్ణుని మందిరముసేరి ప్రతీహారులు లోనికిఁ గొంపోవఁగా నందు బంగారుసింహాసనమున నాసీనుండై యున్న యాద్యునిఁ బరమపురుషునిఁ గృష్ణునిఁ గాంచెను. బ్రహ్మణ్యదేవుండా కృష్ణుఁడును నతనిఁ గాంచినంతనే దిగ్గన సింహాసనము డిగ్గి మేలిగద్దియపయి నాసీనుంగావించి తన్ను దేవతలు పూజించున ట్లాతనికిఁ బూజలుగావించెను. ఆబ్రాహ్మణుఁడు భోజనము చేసి బడలిక తీఱియుండఁగా సజ్జనులకుఁ బ్రాపయినయాకృష్ణుండు మెల్లన డగ్గఱి యతని యడుగుల నల్లల్లఁ దనచేతులఁ బుడుకు

చు నిట్లనియడిగెను.—'బ్రాహ్మణోత్తమా! వలయునని మిక్కిలి పాటుపడక తనంతట దొరకినదానితో మనంబున సంతసిల్లుచు నెప్పుడు నుండువు. ఇట్టిసంతోషవృత్తియే నీదుధర్మము. మఱి యార్యసమ్మతము నయినది.*ఇట్టినీధర్మము సుఖముగా వర్తిల్లుచు న్నదేకదా! బ్రాహ్మణుఁడు తనదేహధారణమాత్రమున కెప్పుడేది తనంత దొరకునో దానితోఁ దుష్టినొంది తనవర్ణాశ్రమ ధర్మములనుండి వీడకయుండునేని, నిత్యసంతోషరూపమైన యా ధర్మమట్టి పురుషునకు సమస్తములయినపురుషార్థములను బిదుకు చుండును జుమీ. సంతుష్టినొందఁడేని, దేవేంద్రుఁడయినను నైహికాముష్మికము లగు నానందముల నొక్కటియుఁ బడయఁడు. సంతుష్టినొందెనేని, దరిద్రుఁడయినను నేయంగమునను దుందుడుకులేక హాయిగా నిదురించును. † దొరకినదానితోఁ దృప్తి నొంది, పరోపకారులగు సాధువులై సర్వభూతములకును మిక్కిలియు సుహృదులై దేహాత్మాభిమాన రూపమగు నహంకారము లేక శాంతులైయుండు విప్రులకు నేను శిరసుచేత మాటిమాటికి నమస్కరించుచున్నాను. బ్రాహ్మణోత్తమా! రాజువలన మీకుఁ గుశలమేకదా! ఎవ్వని దేశమందలి ప్రజలు చక్కని పరిపాలనము

---

* సంతోషమే బ్రాహ్మణునకుఁ బరమధర్మమనియు, ఆర్యసమ్మతమైనదనియు, భగవంతునకు శిష్టమైనదనియు భావము.

† 'స్వలాభసన్తుష్టాన్' అనిమూలము. స్వలాభమనఁగా స్వసత్తాలాభము. అనఁగా 'స్వాజ్జీవ నేచ్ఛాయదితే స్వసత్తాయాం స్పృహా యది। ఆత్మదాస్యం హరేఃస్వామ్యం స్వభావంచ సదాస్మర' అన్నట్లు హరిదాస్యాదుల ననుసంధించుటవలనఁ గలుగునట్టి యాత్మలాభమని యర్థము. అనఁగా అట్టి యనుసంధానముచేతనే తమకుసత్త అనఁగా వస్తుత్వముకలిగెననుట. వీరరాఘవీయము.

వలన సుఖముగా నుందురో యట్టిరాజు నాకుఁ బ్రియుఁడు. ఏ దేశమునుండి రాక ? ఏమిగోరి యీసముద్రదుర్గమును దాఁటి యిటవచ్చితిరి?. ఇది యంతయు దాఁపక చెప్పఁదగునేని మాకుఁ జెప్పుము. మేము కింకరులము సుమీ' యనెను. ఇట్లు లీలార్థము మానుషవిగ్రహమును బరిగ్రహించియున్న పరమేష్ఠి యాభగవంతుఁడు ప్రశ్నముసేయఁగా, బ్రాహ్మణుఁ డతనికి నడిగిన దంతయు నిట్లువర్ణించెను. 'పురుషోత్తమా ! రుక్మిణీదేవి నన్ను నీసమ్ముఖమునకుఁ బంపెను. ఆబిడ చెప్పిపుచ్చిన సందేశమునాలించి యనంతర మేది యుచితమో చేయు నవధరింపుము' అని యా చెలువ వ్రాసియిచ్చినకమ్మను నతనియడుగులయం దునిచి యతనికిఁదాను బ్రణమిల్లెను. ఆజగన్నాథుండును, జిఱునవ్వు కన్నుంగవ కొకవింత చెన్నుగలిగింప దానిని గయికొని ధర్మాత్ముండుగాన తనమక్కువ కలిమి తెలియునట్లుంబోలె నాదరంబు గడలుకొన దానిని జదువున ట్లానతిచ్చెను.

ఆరుక్మిణి.—భువనసుందరా ! నీగుణముల నాకర్ణించువారి కర్ణరంధ్రముల మూలమున వారిలోపలఁజొచ్చి యాధ్యాత్మిక తాపమును బరిహరించునట్టి నీదుగుణములనును, చూచువారల కన్నులకు సమస్తార్థములను గలిగించు మందు నీచక్కందనమును విని, అచ్యుతా ! నాచిత్తము 'నీమహిమయెక్కడ ? కొఱమాలిన నేనెక్కడ'నని యించుకయు లజ్జలేక, నీయందే యావేశించుచున్నదిసుమీ. ఔరా ! కులకన్యల కిట్టి దిట్టతనమా ? యనకుము. ముకుందా ! పురుష సింహమా ! గుణరూపశీలములచేతను విద్యచేతను వయస్సుచేతను ధనసమృద్ధిచేతను దేజముచేతను నీకు నీవే సాటియగుదువుగాని మఱియొకరుగారు. ఇట్టి

చు నిట్లనియడిగెను.—'బ్రాహ్మణోత్తమా! వలయునని మిక్కిలి పాటుపడక తనంతట దొరకినదానితో మనంబున సంతసిల్లుచు నెప్పుడు నుందువు. ఇట్టిసంతోషవృత్తియే నీదుధర్మము. మఱి యార్యసమ్మతము నయినది.*ఇట్టినీధర్మము సుఖముగా వర్తిల్లుచున్నదే కదా! బ్రాహ్మణుఁడు తనదేహధారణమాత్రమున కెప్పుడేది తనంత దొరకునో దానితోఁ దుష్టినొంది తనవర్ణాశ్రమ ధర్మములనుండి వీడకయుండునేని, నిత్యసంతోషరూపమైన యాధర్మమట్టి పురుషునకు సమస్తములయినపురుషార్థములను బిదుకుచుండును జుమీ. సంతుష్టినొందఁడేని, దేవేంద్రుఁడయినను నైహికాముష్మికము లగు నానందముల నొక్కటియుఁ బడయఁడు. సంతుష్టినొందెనేని, దరిద్రుఁడయినను నేయంగమునను దుందుడుకులేక హాయిగా నిదురించును. †దొరకినదానితోఁ దృప్తినొంది, పరోపకారులగు సాధువులై సర్వభూతములకును మిక్కిలియు సుహృదులై దేహాత్మాభిమానరూపమగు నహంకారము లేక శాంతులై యుండు విప్రులకు నేను శిరసుచేత మాటిమాటికి నమస్కరించుచున్నాను. బ్రాహ్మణోత్తమా! రాజువలన మీకుఁ గుశలమేకదా! ఎవ్వనిదేశమందలి ప్రజలు చక్కని పరిపాలనము

---

* సంతోషమే బ్రాహ్మణునకుఁ బరమధర్మమనియు, ఆర్యసమ్మతమైనదనియు, భగవంతున కిష్టమైనదనియు భావము.

† 'స్వలాభసన్తుష్టాన్' అనిమూలము. స్వలాభమనఁగా స్వసత్తాలాభము. అనఁగా 'స్వాజ్ఞీవ నేచ్ఛాయదితే స్వసత్తాయాం స్పృహా యది। ఆత్మదాస్యం హరేః స్వామ్యం స్వభావంచ సదాస్మర' అన్నట్లు హరిదాస్యాదుల ననుసంధిఁచుటవలనఁ గలుగునట్టి యాత్మలాభమని యర్థము. అనఁగా అట్టి యనుసంధానముచేతనే తమకుసత్త అనఁగా వస్తుత్వముకలిగెననుట. వీరరాఘవీయము.

వలన సుఖముగా నుందురో యట్టిరాజు నాకుఁ బ్రియుఁడు. ఏ దేశమునుండి రాక ? ఏమిగోరి యీసముద్రదుర్గమును దాఁటి యిటవచ్చితిరి?. ఇది యంతయు దాఁపక చెప్పఁదగు నేని మాకుఁ జెప్పుము. మేము కింకరులము సుమీ' యనెను. ఇట్లు లీలార్థము మానుషవిగ్రహమును బరిగ్రహించియున్న పరమేష్ఠి యాభగవంతుఁడు ప్రశ్నము సేయఁగా, బ్రాహ్మణుఁడతనికి నడిగిన దంతయు నిట్లువర్ణించెను. 'పురుషోత్తమా ! రుక్మిణీదేవి నన్ను నీసమ్ముఖమునకుఁ బంపెను. ఆబిడ చెప్పిపుచ్చిన సందేశము నాలించి యనంతర మేది యుచితమో చేయు నవధరింపుము' అని యా చెలువ వ్రాసియిచ్చినకమ్మను నతనియడుగులయందునిచి యతనికిఁదాను బ్రణమిల్లెను. ఆజగన్నాథుండును, జిఱునవ్వు కన్నుంగవ కొకవింత చెన్నుగలిగింప దానిని గయికొని ధర్మాత్ముండుగాన తనమక్కువ కలిమి తెలియునట్లుంబోలె నాదరంబు గడలుకొన దానిని జదువున ట్లానతిచ్చెను.

ఆరుక్మిణి.—భువనసుందరా ! నీగుణముల నాకర్ణించువారి కర్ణరంధ్రముల మూలమున వారిలోపలఁజొచ్చి యాధ్యాత్మిక తాపమును బరిహరించునట్టి నీదుగుణములనును, చూచు వారల కన్నులకు సమస్తార్థములను గలిగించుచుండు నీచక్కఁదనమును విని, అచ్యుతా ! నాచిత్తము 'నీమహిమయెక్కడ ? కొఱమాలిన నేనెక్కడ'నని యించుకయు లజ్జలేక, నీయందే యావేశించుచున్నదిసుమీ. ఔరా ! కులకన్యల కిట్టి దిట్టతనమా ? యనకుము. ముకుందా ! పురుష సింహమా ! గుణరూపశీలములచేతను విద్యచేతను వయస్సుచేతను ధనసమృద్ధిచేతను దేజముచేతను నీకు నీవే సాటియగుదువుగాని మఱియొకరుగారు. ఇట్టి

నిన్ను, మనుష్యలోకమునందెల్ల మనోభిరాముండగు వానిని, గన్య యెవ్వతి, కులవతియు గొప్పగుణములుగలదియు స్థిరచిత్తయు నగునేని పతిగావరింపదు? కాన నాయందే తప్పిదమేమి? విభూ! కావుననే నిన్ను నేను బతిగావరించితిని జుమీ. మఱినా యాత్మను నీకు నర్పించితిని. కృష్ణా! నీవు వచ్చి నన్నుఁ జెట్ట పట్టుము. అంబుజాక్షా! అట్లు సేయవేని సింహముపాలి వస్తువును నక్కవలె, వీరుండవగు నీపాలిదాసనగు నన్ను శిశుపాలుఁడు వేగవచ్చి ముట్టునుగదే! అట్లు ముట్టనీకుమీ! నేను దొల్లి వాపీ కూపాదులను ద్రవ్వించితి నేనియు, యాగాదికర్మను లాచరించితి నేనియు, సత్పాత్రములకు దానము సేసితి నేనియు, తీర్థస్నానాది నియమము లనుష్ఠించితి నేనియు, కృచ్ఛ్రాది వ్రతములు సలిపితి నేనియు, దేవతలను విప్రులను గురువులను నర్చించితి నేనియు, మఱియు భూతహితాదులు గావించితి నేనియు, వీనిచేత భగవంతుని నారాధించినది నిక్కమేనియు, నిపుడు శ్రీకృష్ణుఁ డిట వచ్చి నన్నుఁ జెట్టపట్టుఁగాత. తక్కినవారు శిశుపాలాదులు నన్నుఁ జేకొనకుందురుఁగాక. 'బంధువులు నిన్నిపుడే శిశుపాలునకిచ్చిరే; ఇప్పుడేమి చేయవచ్చు' ననకు. అజితా! పెండ్లి రేపుగాన నీవపు డెవ్వరికిని దెలియకుండున ట్లిట వచ్చి యంత సేనాపతిపరివృతుండవై శిశుపాలాదులసైన్యములు కలంచి చీకాకుపఱిచి నీపరాక్రమమే యుంకువుగానిచ్చి బలాత్కారమున రాక్షసవివాహ విధిని నన్నుఁ గొనిపోయి పెండ్లియాడుము. 'శిశుపాలాదులను నలంచుట యటుండ నంతఃపురమందున్న నిన్నుఁ గొనిపోవునపుడు నీబంధువులను జంపక యెట్లుగొనిపోయి పెండ్లియాడఁగల' నందువా! అందులకుపాయము చెప్పెద. పెండ్లికి మునుపటినాఁడు మావార

గొప్పకులదేవయాత్ర చేయుట గలదు. ఆ యాత్రయందుఁ గ్రొత్త పెండ్లికూఁతుర నగు నేను పట్టనము వెలువడి యంబికాదేవిని దర్శనముసేయఁబోవుదును. ఆదేవి యాలయమునుండి నన్నుఁ గొనిపోవుట సుకరము సుమీ. 'ఇంతనిర్బంధము లేల? శిశుపాలుఁడును వాసికెక్కినవాఁడు కనుకఁ దగినవరుఁ డేకదా' యందువా? అంబుజాక్షా! ఎవ్వనిపాదారవింద రజములందుఁ, దమయజ్ఞాన నివృత్తికొఱకుఁ దొప్పఁదోఁగుటకు నుమాపతియగు శివునివలె నితరులగు మహనీయులును నువ్విళ్లూరుచుందురో, యట్టి నీదు ప్రసాదమును బడయ నోఁచకపోయితి నేని, యుపవాసాదివ్రతములచేఁ జిక్కి స్రుక్కి ప్రాణములను దిగవిడుతును; కాని నూఱుజన్మముల కయిన నిన్నే పెండ్లియాడుదును జుమీ'!

బ్రాహ్మణుఁడు 'యదుదేవా? ఇవియే రుక్మిణి నీకురహస్యముగాఁ జెప్పుమన్నమాటలు నీకుఁదెచ్చి చెప్పితిని. ఇం దేమి కర్తవ్యమో దానిని విమర్శించిచేయుదురుగాక; అదియును దోడనే చేయఁదగును' అనెను. ఇది యేఁబది రెండవయధ్యాయము.

---

## రుక్మిణీకల్యాణము.

(అనుబంధము)

యదునందనుండు కృష్ణుఁడు భీష్మకరాజకుమారియగు రుక్మిణీదేవి చెప్పి పంపినసందేశమునువిని బ్రాహ్మణునిహస్తమును దన హస్తంబునఁ బట్టుకొని నవ్వుచు నతనితో 'ఆసుందరీమణి,ఆరుక్మిణి,యెట్లు నిత్యమునునాయందే మనసునెలకొల్పియున్నదో యట్లే నేను నాచెలువయందే మనసు నిలిపియున్నాను. కావున నే నాకు

రేయి నిదురలేకున్నది. రుక్మి నాయెడద్వేషం బూని నావివాహ
మును నడ్డగించుట నే నెఱుంగుదును. అయిననేమి! ఆ రాజాధ
ములనెల్ల యుద్ధమునఁ గలగుండుపఱచి నాయందే యాసక్తయై
యేకందును లేని యవయవములు పొందుగలిగి వెలుఁగుచున్న
యాసుందరిని, దారువును ద్రచ్చి యగ్నిశిఖను దెచ్చు విధమునఁ
దోడ్కొనివచ్చెదను' అనెను. అంతనామధుసూదనుఁడు రుక్మిణి
పెండ్లినక్షత్రమును దెలిసికొని సారథితో 'దారుకా! రథమున
వేగపూన్పు'మని యానతిచ్చెను. వాఁడును సైన్యసుగ్రీవ
మేఘ పుష్పవలాహకములనెడి యశ్వములను బూన్చి రథమా
యత్తము చేసితెచ్చి చేతులుమోడ్చి మ్రోల నిలుచుండెను
కృష్ణుం డారథమును దానెక్కి యాబ్రాహ్మణుని నెక్కించి
కొని యా యశ్వములు వేగమునఁ బోవునవి గాన యానర్తదేశ
మునుండి యొక్కరాత్రిలో విదర్భకుఁబోయెను. కుండినపతి
యగు నారాజు భీష్మకుండును బుత్రస్నేహమునకు లోనై తన
కన్యను రుక్మిణిని శిశుపాలున కీయఁదలఁచి యందులకువలయు
కృత్యములనెల్లఁ గావించెను. పట్టనమందలి మార్గములను
రథ్యలను జత్వరములను జక్కఁగానూడ్చి కలయంపులుచల్లిరి
వింతవింతలగు ధ్వజములను బతాకలను దోరణములను నెల్ల
యెడ లలంకరించిరి. మఱియు నాపురమం దంతటను స్త్రీలును
బురుషులును బూదండలుచెరివి కలపము లలంది యాభరణ
ములు దొడిగి కందులేని మడుంగువలువలుగట్టి యలంకరించు
కొని యుండిరి. గృహములందెల్ల నగరుధూపవాసనలు గుబా
ళించుచుండెను. భీష్మకుండును బితరులను దేవతలను బ్రాహ్మణ
లను విధ్యుక్తప్రకారమున నర్చించి భోజనంబులిడి కన్యకు రు

ణికి స్వస్తివాచనికముఁ జేయించెను. అంత నాకన్యకు రుక్మిణికి జలకమార్చి మంగళ మగుతోరముగట్టి క్రొత్త పట్టుపుట్టంబులు రెంటినిదొడిగి మేలిభూషణములచే నలంకరించిరి. బ్రాహ్మణోత్తములో ఋగ్యజుస్సామమంత్రంబుల నాపెండ్లికూఁతునకు రక్షగావించిరి. అథర్వమంత్రవిదుఁ డగు పురోహితుండును, దుష్టగ్రహశాంతికొఱకు హోమముగావించెను. రాజా ! భీష్మకుఁడు విధివిదులందు మిన్నగావున బ్రాహ్మణులకు బంగారమును వెండిని వస్త్రములను గుడమును దిలలను ధేనువులను నొసంగెను. అట్లె చేదిరాజగు దమఘోషుఁడును దనపుత్రుం డగు శిశుపాలునకు మంత్రజ్ఞులచేత నభ్యుదయమునకు వలయు కర్మములన్నియుఁ గావించెను. అంత నతఁడు మదజలములు దొరుఁగుచున్న గజసమూహములును బంగారు మాలికలచే రంగారుచున్న రథములును నశ్వములును బదాతులును నెరసియున్న సైన్యములు బలసికొలువఁ గుండినపురమునకుఁ బోయెను. విదర్భాధిపతి యగు భీష్మకుఁ డతని నెదుర్కొని చని యెంతయుఁ బూజించి క్రొత్తగా నిర్మించినమఱియొక మందిరమున నతనికి ముదంబున విడిపట్టు గావించెను. ఆకుండినపురమున సాల్వుఁడు, జరాసంధుఁడు, దంతవక్త్రుఁడు, విదూరథుఁడు, పౌండ్రకుఁడుమొదలగు శిశుపాలుని పక్షపువారు వేలకొలఁదిని గూడి కృష్ణరాములకుఁ బగతురు గావున నెచ్చరికతోడ శిశుపాలునకుఁ గన్యను సాధింపనెంచి "కృష్ణుఁడు రామాదులయిన యదువులంగూడివచ్చి కన్నియను హరింపఁబూనునేని, యందఱము గూడి వానితోఁబోరాడుద'మని మనంబుల నిశ్చయించి యచ్చటికి వచ్చిరి.మఱియు నితరులగు రాజులు పెక్కండ్రు తమసమగ్ర

సైన్యములతోను వాహనములతోను నయ్యెడకు వచ్చిరి. రాముండు శత్రుపక్షపురాజు లంద ఱట్టిపూన్కి పూనియున్నారనియు, కృష్ణుండు కన్యను హరించుటకుఁ దానొక్కండే పోయియున్నాఁడనియు విని కలహము కలుగునని శంకించి బలవంతుఁడుగానఁ దమ్ముని యందలి నెయ్యమునఁ దానేఁగుచు రథగజతురగపదాతి సహితం బయిన మహాసైన్యంబుతోడఁ ద్వరితముగాఁ గుండిన పురమునకుఁ బోయెను. భీష్మకరాజకుమారి యారుక్మిణియు హరి రాక నెదురుచూచుచుఁ దనపంపిన బ్రాహ్మణుఁడేని వచ్చుటను గానక యపుడు తనలోనిట్లు చింతించెను. 'కట్టా! ఈమంద భాగ్యురాలికిఁ బెండ్లి రేపు. ఒకరాత్రియే నడుమ నున్నది. అరవిందాక్షుఁ డింతకును రాఁడాయెను. అందులకుఁ గారణమేమియో తెలియదు. నాసందేశమును గొనిపోయిన యా బ్రాహ్మణుఁ డయినను నింతవఱకును రాకున్నాఁడే! ఏమిసేయుదును? అనవద్యచిత్తుం డా కృష్ణుండు నాయందే దేనివెగటయినదానిఁ గనుంగొని నన్నుఁ జెట్టపట్టుటకై పూనిరాకున్నాఁడో కదే దౌర్భాగ్యురాల నగునాకు ధాతయగు మహేశ్వరుఁ డనుకూలుఁడు గాఁడో! ఆదేవి రుద్రాణియును, ఆగిరిజాసతియు నాయెడ విముఖురాలయి యున్నదో!' యని యిట్లు చింతించుచు డెందంబు గోవిందునియందుఁ దగులువడ 'నింతకును గృష్ణుఁడువచ్చుతఱి గాదయ్యెఁగా' యని యశ్రుబిందువులుగ్రమ్మ గన్నుంగవ మొగిచెను. ఇట్లావధూటి గోవిందునిరాక యెదుర చూచుచుండఁగా, నాబిడ యెడమతొడయు బుజమును గన్నును బ్రియంబుసూచించుచు నదిరెను. అంత మున్న దానుబంపిన యాబ్రాహ్మణోత్తముఁడే, కృష్ణుని యాదేశముచొప్పున మరల

నాబాలిక ంతఃపురమున దేవిని నారాజకుమారిని గాంచెను. అతం
మంగళకర ంబున నుబ్బు లాగుబ్బతిల్ల మేనిగతులయుం దేతోత్రు
లకును, క యుండుటనుగాంచి యాసతి దూతాదిలక్షణము
వంతుఁడు సినదిగావునఁ దెలినవ్వు మొలకొత్త నతని నంతయు
దేవుని శివబ్రాహ్మణుఁడంత యదునందనుఁడు కృష్ణుఁడు రాము
బ్రాహ్మణ వచ్చియున్నాఁడని తెలిపి యతఁడు తన్నుఁ గొనిపోవుదు
వించెను. వనికర్ణంపుమాటలను జెప్పెను. రుక్మిణియు నాకృ
జలముల వచ్చియుండుటను దెలిసి యుల్లం బెంతయుఁ బల్లవింప
ము లోన నకుఁ దగిన ప్రియము వేఱెద్దియుఁ గాన నేరక యూరక
యుపహార చెను. భీష్మకుండును దనకుమారి వివాహమును జూచు
వేఱువేళ న రామకృష్ణులు వచ్చియున్నారని విని వాద్యఘోష
ములతో నెదుర్కొని వలయుపూజలు గావించి మధుపర్కమును
మూల్యములయిన వస్త్రములను మఱియు నభీష్టములయిన యుపా
యనములనుదెచ్చి యొసఁగి యెంతయు విధ్యుక్తముగాఁ బూ
జించెను. భీష్మకుండు మహాబుద్ధిసంపన్నుఁడుగావున నారామ
కృష్ణులకును వారిసైన్యములకును వారి యనుచరులకును సకల
వస్తు సమృద్ధములయిన విడుదులుగల్పించి విధ్యుక్తముగా నా
తిథ్యమును గావించెను. ఇట్లు కూడినరాజులకు వారివారి పరా
క్రమములకును వయసులకును బలములకును వృత్తములకును
దగురీతిని సమస్తము లయినయభీష్టపదార్థముల నొసంగి పూజిం
చెను. కృష్ణునిరాకవిని విదర్భపురవాసులగు జనులువచ్చి యతని
ముఖారవిందమకరందమును నేత్రాంజలులచేఁ ద్రావిరి. వారొం,
డొరులతో 'మన రుక్మిణి యీ కృష్ణునికే భార్య కాఁదగును
గాని, మఱి యొక్కనికిఁ దగదు. అనవద్యాత్ముం డగు నీకృష్ణుఁ

డును మన రుక్మిణికే తగినమగఁడుచుఁడీ. మనమే దేనినాముందు
పూంచి చేసియున్నారమేని, యందులకుఁ ద్రిలోకకర్త,కృష్ణుం
బ్రహ్మ సంతుష్టుఁడగునేని, రుక్మిణిని గృష్ణుఁడు చెట్టపట్టఁడనియు
ననుగ్రహించుఁ గాక' యని ప్రేమాశ్రువులచే దమ్ముని
డగ్గుత్తికపడఁ జెప్పికొనిరి. ఇది యట్లుండఁ బెలి సహితం
రారుక్మిణియు భటులు నలుగడలఁ గాపై వచ్చుచు పురము
నంతఃపురమునుండి యంబికాగృహమునకు భవానియు హరి
పాదపంకజములను దర్శించుటకుఁ గాలినడకనే బయలుచ్చుటను
పోయెను. ఆసుందరి ముకుందవదనారవిందమును ఈమంద
మనంబున ధ్యానించుచు, మౌనముద్ర దాల్చి తెల్లుల్కది.అరవిం
లును జుట్టును గొలిచి వచ్చుచుండ, శూరులగున సమియో
లాయుధములు కేలనిలువుగాఁ బట్టుకొని సన్నద్ధులై రక్షించు
చుండ వెడలిపోయెను. అపుడు మృదంగములును శంఖముఁ అగ
పణవములును దూర్యములును భేరులును వాయింపఁబడెను.గ
నానావిధములగు నైవేద్యములను బూజాసాధనములన
గొని బోగమువారును, గంధమాల్య వస్త్రాభరణములను గొ
బ్రాహ్మణపత్నులును, మిక్కిలియుఁ జక్కఁగా నలంకరించుకొ
పోయిరి. గాయకులు గానముసేయుచును, సూతవందిమా
ధులు స్తుతించుచును, వాద్యగాండ్రు వాయించుచును,నా పెండ్లి
కూఁతును బరివేష్టించి పోయిరి. రుక్మిణియు దేవాలయమును జే
కరచరణాబ్జములను గడిగికొని యాచమనముచేసి శుచియై
సమాహిత చిత్తమున నంబికాదేవిసన్నిధికిఁ బోయెను. అపుడ
వృద్ధురాండ్రగు బ్రాహ్మణజాతిముత్తయిదువలు, పూజావిధి
తెలిసినవారు, భవునితోఁగూడ నున్న భవపత్నియగు భవాని

నాబాలికను మ్రొక్కించిరి. ఆ రుక్మిణియు 'అంబికాదేవీ ! మంగళరూపమైయున్న నీకును వినాయకాదులగు నీసంతానములకును, మాటిమాటికి నమస్కరించుచున్నాను. నాకు భగవంతుఁడు కృష్ణుఁడు పతియగునట్లుగా ననుమోదింపుమా' యని దేవుని శివునిని దేవిని బార్వతినిని మిక్కిలియుఁ బ్రార్థించుచు బ్రాహ్మణపత్నులను మున్నిడికొని విధ్యుక్తముగాఁ బూజగావించెను. మఱియు నారుక్మిణి భవసహితయగు నా భవానికి జలముల నభిషేకముగావించి,గంధము లలంది,యక్షతలనిడి,ధూపము లొసంగి, వస్త్రమాల్యాభరణముల నలంకరించి, పలు దెగల యుపహారములను బలులను నివేదించి, హారతులు వరుసగా వేఱువేఱ యెత్తి, యట్లె పతిపత్నులగు బ్రాహ్మణస్త్రీలను జలాదులొసంగి లవణాపూపంబులను, దాంబూలములను,గంఠసూత్రములను, ఫలములను, నిక్షుదండములను మిక్కిలియుఁ బూజించినదయ్యె. బ్రాహ్మణస్త్రీలును దేవతోపభుక్తశేషమగు మాల్యమును నొసంగి రుక్మిణికి దీవెనలుగావించిరి. రుక్మిణి యాస్త్రీలకును నంబికాదేవికిని నమస్కరించి యా మాల్యమును గయికొని మౌనవ్రతమునుమాని రతనాలయుంగరములు రంగారుచున్న కెంగేల నొక పనికత్తియ కైదండగొని యంబికాగృహమునుండిబయలువెడలెను. అట్లాశ్యామ సన్నని నెన్నడుము నకనకలు గుడువఁ, గుండలములు నెమ్మొగంబునకు మఱింత యొప్పుగూర్ప, బటువయిన పిఱుందున రతనాలు దాపినమొలనూలు తలతల మెఱయు, యౌవనంపుఁ బెంపును సూచించుచు గుబ్బచన్నులు పయఁటసందులఁ జిందులుద్రొక్క, నల్లనివాలారుఁ జూడ్కులు నెరికురులో యనుశంక గలిగించుచుండఁ, దెలి చిఱు

నవ్వు దళుకొత్తుచుండ, దొండపండువంటి కెమ్మోవి మెఱుంగుల
మల్లెమొగ్గలవంటి పలువరుస యెఱ్ఱవాఱ, గల్లుగల్లుమను మెఱు
గు టందియలకాంతులు గంతులుగొన నడుగు లిడుచుఁ, గలహం
మువలె నెన్నడలునురివెంపుసొంపారనల్లల్ల వచ్చుచుండెను. అట్ల
వచ్చుచుమూర్తీభవించిన దేవమాయయుంబోలె వెలుఁగుచున్న
యావీరమోహినిని జూడఁగానే గుమిగూడివచ్చి కీర్తిమంత
లగు వీరు లెల్లవారును మరుని యురవడికి నిలువనోపక కలం
నలంగి మోహమునొందినవా రయిరి. ఆసుందరీమణి కులదే
యాత్ర నెపముగాఁ గృష్ణునకుఁ దనలావణ్యము నర్పించుచ
హారాయలు సెలంగ నరుగునపు డాబిడయుదారంపుఁ దెలినవ్వును
నునుసిగ్గు నూల్కొను వాఁడిచూడ్కులును, దమయుల్లములన
గొల్లఁగొనఁగా, నారాజులు మిక్కిలియు మతిదూలి కేలనున్న
యాయుధములు దిగవైచి, యెక్కియుండిన గజరథాశ్వాది వ
హనములనుండి నేలపయిని వ్రాలిరి. ఇట్లు తామర మొగ్గలంబోలె
యడుగుల నల్లల్లనిడుచు భగవంతుఁ డగు హరి రాక కెదురుచూ
చుచు వామకర నఖంబులం నలకలఁ ద్రోసికొనుచుఁ గడకంటి
పిసాళిచూడ్కుల వచ్చియున్న రాజులను సిగ్గునఁజూచెను; అపుడ
కృష్ణునిని గాంచెను. అట్లు రథము నారోహింప నువ్విళులూరు
చున్న యారాజకుమారిని గాంచి కృష్ణుండు రాజన్య సమూహ
మును దృణీకరించి శత్రువులెల్లను జూచుచుండఁగా నెక్కించు
కొని నక్కమూఁకలనడుమనుండితనభాగమునుగొని చను మృగ
రాజుంబోలె నాకన్నియను గొని గరుడధ్వజాలంకృతం బగు
నిజరథంబు నెక్కించికొని రాముండు మున్నునడవ నరిగినవాఁ
డయ్యె. దురహంకారులయిన జరాసంధాదు లగు శత్రువు లట్లు



2069. శ్రీకృష్ణుండు రుక్మిణీదేవిని రథమునం దెత్తికొనిపోవుట.

కృష్ణుండు రుక్మిణిని గొనిపోవుటయు దమయశంబులు గుందుట యుఁగాంచెమేని సయింపనేరక - 'ఔరా ! ఏమివింత ! మేటి విలుకాండ్రనగు మనయశంబును, సింగంబుల కీర్తిని, వృకములుం బోలె, గొల్ల లపహరించిరిగా ! ఇస్సీ ! మన బ్రతుకేల'? యని యించుకయు సహింప నేరరయిరి. ఇది యేఁబదిమూఁడవ యధ్యాయము.

---

## రుక్మిణీకల్యాణము.

(అనుబంధము)

ఇట్లు వారందఱును మిక్కిలియుఁ గ్రుద్ధులై యురవడించి కవచములు దొడిగి వాహనము లారోహించి తమతమ బలములు పరివేష్టించి కొలువ విండ్లుగయికొని కృష్ణుని వెంట నఱిమి చనిరి. అంత యదుసైన్యమునందలి యూథపతు లా శత్రువులు పయినిదలపడి వచ్చుచుండుటను జూచి తమతమధనువుల మొరయించి వారినెదుర్కొని నిలిచిరి. శత్రువులును గుఱ్ఱము మూఁపునను, ఏనుఁగు కందమునను, తేరి యుపస్థమునను నుండి యుద్ధము సేయు నిపుణులుగాన మేఘములు పర్వతములపయిని వర్షధారలు గురియునట్లు బాణవర్షములను యాదవులపయిని గురిసిరి. సుమధ్యమ యగు రుక్మిణి తన పతిసైన్యము బాణములజడివానలచేఁ గప్పఁబడుటను జూచి భయమున మనసు విరవిరఁబోవఁ బ్రాణనాథుని మొగమును సిగ్గుమీఱఁ దిలకించెను. భగవంతుఁడును దోడనే నవ్వి 'వామనేత్రా ! భయపడవలదు. ఈపగవారిసైన్య మిదిగో నిపుడే నీవారలు తునిమి తూఁటాడెదరు చూడుము' అని యూఱడించెను. గదుఁడు

బలరాముఁడు మొదలగు వీరు లావగవారి పరాక్రమమున కెం తయు సయింపక వారి హయములను గజములను రథములను బాణములచేఁ జిందరవందర గావించిరి. అంత రథికులయు నాశ్వికులయు గజారూఢులయు శిరసులు, మేలికుండలములును గిరీటములును దలచీరలను గలిగి వెలుఁగొందుచుండునవి, వేల కొలఁదిని భూమిపయిఁ ద్రెళ్లెను. కత్తులును గుదియలును విండ్లును గూడియున్న చేతులును, ముంజేతులును, దొడలును, గాళ్లును ద్రెస్సి కూలుచుండెను. మఱి గుఱ్ఱములయుఁ గంచర గాడిదలయు గజములయు లొట్టియలయు గాడిదలయు మను ష్యులయు శిరములు దొర్లి పడుచుండెను. ఇట్లు వృష్ణులు గెలుపున కువ్విళ్లూరుచుఁ దమ సైన్యసమూహములను ద్రుంచి నలంచుచుండఁగా జరాసంధుఁడు మొదలగు రాజులు విముఖులై వెనుదీసిరి. అంత వారు, ఆలి గోల్పడినవానింబోలె దుఃఖిల్లుచు, తేజంబు దూలి, యుత్సాహంబు డించునట్టి మొగమొందుచు నున్న శిశుపాలునిఁగాంచి 'ఓయీ! పురుషశార్దూలా! మనసు నందలి యీవిషాదమును విడువుము. రాజా! దేహులకుఁ బ్రియములుగాని యప్రియములుగాని యస్థిరమై వచ్చుచును బోవుచు నుండునవే కాని సతములు కావని చూపట్టుచున్నది. జంత్రికాఁడు మ్రానితోఁ జేసిన యాఁడుబొమ్మను దనయిచ్చ చొప్పున నాడించునట్లు, ఈజగమంతయు నీశ్వరునికి లోనై సుఖదుఃఖములను బట్టి యాయాకర్మములు గావించుచున్నవి. ఇంతేకాని మఱే మియు లేదు చుమీ'! యనిరి. జరాసంధుఁడు—'శిశుపాలా! నేను గృష్ణునితోఁ బదియేడుమాఱు లిరువదిమూఁడేసి యక్షౌహిణులతోఁ గూడి వచ్చి యుద్ధములు సేసి పరాజితుండ నయితిని.

పదునెనిమిదవతూరి యొకయుద్ధంబున నేను మీఁదు మిక్కిలియు జయమునొందితిని. అయినను పదియేడుమాఱు లోడినపుడేని యొకప్పుడును శోకించినది లేదు. ఒకతూరి జయించినపుడేని హర్షించినది లేదు. ఏలన దైవ (అదృష్ట)ముతోఁ గూడినకాలమే (కాల శరీరుఁడైన యీశ్వరుఁడు) జగమునకు బలుదెఱఁగుల నుపద్రవములు చేయుచుండునని తెలిసి యట్లుంటిని జమీ! కావుననే నేఁడు సయితము మనమందఱమును వీరులయిన యూథపతులకు యూథపతుల మయినను దుదఁబోయి యల్పబలులయ్యుఁ గృష్ణునిచేఁ బాలితులయ్యు నున్న యదువులకు నోడిపోయితిమి. మనశత్రువులు తమకుఁ గాల మనుకూలమయి యుండి నందున మనలను జయించిరి. మనకును గాల మనుకూలమయి వచ్చినపుడు మనమును జయింతము. ఇందులకు వగవనేల?' యనెను. ఇట్లు తనమిత్రులు తెలివిపడ బోధించుటయు శిశుపాలుఁడును దెప్పిఱి తనబలంగముతోడఁ బురమునకుఁ బోయెను. హతశేషులయిన రాజులు సయితము తమతమ పురములకుఁ బోయిరి. రుక్మి కృష్ణునికిఁ బగతుండుగానయతఁడు తన చెలియలిని రాక్షసవివాహమునఁ గొనిపోవుట యెంతమాత్రము సయింపక యొకయక్షౌహిణిబలము బలసి కొలువఁ గృష్ణుని వెన్నాడి పోయెను. అమ్మహాబాహుఁడు కవచము దొడిగి విలుగయికొని కృష్ణుని యాచేఁతకు నించుకయిన నోర్వక మీఁదు మిక్కిలి మండిపడుచు నందుఁగల రాజులందఱును వినుచుండఁగా, 'యుద్ధమునఁ గృష్ణునిఁజంపకయు రుక్మిణిని మరలఁ దేకయుఁ గుండినపురమును జొరను. మీకిది సత్యముగాఁ జెప్పుచున్నా'నని ప్రతిజ్ఞ చేసెను. ఇట్లుచెప్పి యంత రథము నారోహించి సారథితో

బలరాముఁడు మొదలగు వీరు లాపగవారి పరాక్రమమున కెంతయు సయింపక వారి హయములను గజములను రథములను బాణములచేఁ జిందరవందర గావించిరి. అంత రథికులయు నాశ్వికులయు గజారూఢులయు శిరసులు, మేలికుండలములును గిరీటములును దలచీరలను గలిగి వెలుఁగొందుచుండునవి, వేల కొలఁదిని భూమిపయిఁ ద్రెళ్లెను. కత్తులును గుదియలును విండ్లును గూడియున్న చేతులును, ముంజేతులును, దొడలును, గాళ్లును ద్రెస్సి కూలుచుండెను. మఱి గుఱ్ఱములయుఁ గంచర గాడిదలయు గజములయు లొట్టియలయు గాడిదలయు మనుష్యులయు శిరములు దొర్లి పడుచుండెను. ఇట్లు వృష్ణులు గెలుపున కువ్విళ్లూరుచుఁ దమ సైన్యసమూహములను ద్రుంచి నలంచుచుండఁగా జరాసంధుఁడు మొదలగు రాజులు విముఖులై వెనుదీసిరి. అంతవారు, ఆలి గోల్పడినవానింబోలె దుఃఖిల్లుచు, తేజంబు దూలి, యుత్సాహంబు డింమునసి మొగమెండుచునున్న శిశుపాలునిఁ గాంచి 'ఓయీ! పురుషశార్దూలా! మనసు నందలి యీవిషాదమును విడువుము. రాజా! దేహులకుఁ బ్రియములుగాని యప్రియములుగాని యస్థిరమై వచ్చుచును బోవుచు నుండునవే కాని సతములు కావని చూపట్టుచున్నది. జంత్రకాఁడు మ్రానితోఁ జేసిన యాఁడుబొమ్మను దనయిచ్చచొప్పున నాడించునట్లు, ఈజగమంతయు నీశ్వరునికి లోనై సుఖదుఃఖములను బట్టి యాయాకర్మములు గావించుచున్నవి. ఇంతేకాని మఱేమియు లేదు సుమీ'! యనిరి. జరాసంధుఁడు—'శిశుపాలా! నేను గృష్ణునితోఁ బదియేడుమాఱు లిరువదిమూఁడేసి యక్షౌహిణులతోఁ గూడి వచ్చి యుద్ధములు సేసి పరాజితుండ నయితిని.

పదునెనిమిదవతూరి యొుక్క యుద్ధంబున నేను మీఁదు మిక్కిలియు జయమునొందితిని. అయినను పదియేడుమాఱు లోడినపుడేని యొకప్పుడును శోకించినది లేదు. ఒకతూరి జయించినపుడేని హర్షించినది లేదు. ఏలన దైవ (అదృష్ట)ముతోఁ గూడినకాలమే (కాల శరీరుఁడైన యీశ్వరుఁడు) జగమునకు బలుదెఱఁగుల నుపద్రవములు చేయుచుండునని తెలిసి యట్లుంటిని జమీా! కావున నేనేఁడు సయితము మనమందఱమును వీరులయిన యూథపతులకు యూథపతుల మయినను దుదిఁబోయి యల్పబలులయ్యుఁ గృష్ణునిచేఁ బాలితులయ్యు నున్న యదువులకు నోడిపోయితిమి. మనశత్రువులు తమకుఁ గాల మనుకూలమయి యుండినందున మనలను జయించిరి. మనకును గాల మనుకూలమయి వచ్చినపుడు మనమును జయింతము. ఇందులకు వగవనేల?' యనెను. ఇట్లు తనమిత్రులు తెలివిపడ బోధించుటయు శిశుపాలుఁడును దెప్పిటె తనబలంగముతోడఁ బురమునకుఁ బోయెను. హతశేషులయిన రాజులు సయితము తమతమ పురములకుఁ బోయిరి. రుక్మి కృష్ణునికిఁ బగతుండుగానయతఁడు తన చెలియలిని రాక్షసవివాహమునఁ గొనిపోవుట యెంతమాత్రము సయింపక యొక యక్షౌహిణిబలము బలసి కొలువఁ గృష్ణుని వెన్నాడి పోయెను. అమ్మహాబాహుఁడు కవచము దొడిగి విలుగయికొని కృష్ణుని యాచేఁతకు నించుకయిన నోర్వక మీఁదు మిక్కిలి మండిపడుచు నందుఁగల రాజులందఱును వినుచుండఁగా, 'యుద్ధమునఁ గృష్ణునిఁజంపకయు రుక్మిణిని మరలఁ దేకయుఁ గుండినపురమును జొరను. మీాకిది సత్యముగాఁ జెప్పుచున్నా'నని ప్రతిజ్ఞ చేసెను. ఇట్లుచెప్పి యంత రథము నారోహించి సారథితో

'అశ్వములను గృష్ణుఁడున్న యెడకు వేవేగతోలుము. వానితో నాకు యుద్ధము సేయవలసియున్నది! మిక్కిలియు దుర్మతియగు నాగొల్లవాఁడు తాను వీరుండ నను కండక్రొవ్వున విఱ్ఱవీఁగుచు న్నాఁడు. మఱి నా చెల్లెలిని బలాత్కారమునఁ దీసికొని యుఱికి నాఁడు గా! ఆకారవమునంతయు నేఁ డిదిగో నా వాఁడిబాణములఁ దీసి వైచెదను జూడుము' అని యాకుమతి యిట్లు బింకములా డుచు నీశ్వరుండయిన యాకృష్ణుని కొలఁది నెఱుంగక రథ మొకం డెక్కి యాగోవిందుని నిలునిలుమని యదల్చుచుఁ గూడఁబడెను. వాఁడు మిక్కిలియుదృఢమయిన ధనువును మోపెట్టి మూఁడు బా ణములు గృష్ణునిఁ గాఁడ నేసి 'ఓరీ! దొంగా! క్షణము నిలువురా! యదుకుల పాంసనా! ఓరీ! కాకి హవిస్సునుం బోలె నా చెలియ లిని ముచ్చిలించి యెచ్చటికిఁ బోయెదవురా? మందా! నీపొగర మంతయు నిదె తీసివైచుచున్నాను. నీవు మాయకాఁడవు. కపట యుద్ధము లే నీకుఁ బని. నా బాణములచేఁ ద్రెళ్లి నేలఁగూలి పడక మును నే బాలికను విడువుము. విడిచి యుసుఱు నిలుపుకొనుము' అని యదల్చెను. కృష్ణుండును నవ్వుచు నారుక్మి ధనువును ద్రుంచి వాని మేన నాఱుతూపులు గాఁడ నేసి, నెనిమిది తూఁపుల వాని నాలుగు గుఱ్ఱములను రెండుతూపుల వాని సారథిని మూఁట ధ్వజమును ద్రుంచెను. వాఁడును మఱియొక విల్లెత్తికొని యేను బాణములఁ గృష్ణుని నొప్పించెను. కృష్ణుం డా తూపుకొనలు గాఁడఁగా, వానివిలు మరలఁ ద్రుంచెను. వాఁడు మఱియొక విల్లందుకొనఁగా దానిని సయితము కృష్ణుఁడు దునిమెను. వాఁడు పరిఘమును, పట్టిసమును, శూలమును, చర్మమును, ఖడ్గమును, శక్తిని, తోమరమును, మఱి యేయే యాయుధము నెత్తినను

దానినంతయుఁ గృష్ణుండు ద్రుంచుచువచ్చెను. అంత వాఁడు
క్రుద్ధుఁడై రథమునుండి దిగ్గనుఱికి వాలునుఁబలుకయుఁ గయి
కొని యగ్గి నుఱుకుమిడుతవలెఁ గృష్ణునిపయిఁ బాఱుతెంచెను.
కృష్ణుండట్లు పయి నురవడించి వచ్చుచున్నవాని ఖడ్గమును బలుక
నును దిలలంతేసిగాఁ దూపులచేఁ దునిమి తూఁటాడి యంత
నారుక్మిని జంప నుంకించి వాఁడియగు ఖడ్గమును గయికొనెను.
రుక్మిణీదేవి తనయన్నను జంపఁ బూనియుండుట నెఱింగి
భయమున విరవిరఁబోవుచు భర్తపాదములపయిఁ బడి జాలి
పుట్ట నతనితో 'యోగేశ్వరా! అప్రమేయాత్మా! దేవదేవా!
జగత్పతే! కల్యాణా! మహాభుజా! నాయన్నను జంపుట నీకుఁ
దగదుగదే' యనెను. ఇట్లు మిక్కిలియు భయమున నంగము
లెల్ల వడవడ వడంక, దుఃఖమున ముఖారవింద మెండుచుండఁ,
గన్నీటిచే డగ్గుత్తికవడ, దిగులున బంగరుదండ జాఱఁ, గృష్ణుని
యడుగుఁదమ్ములు పట్టుకొనఁగా నతఁడు చంపకమరలెను. అంతఁ
గృష్ణుఁడా చెడుగుచేఁతలవానిని బట్టికొని వస్త్రమున బంధించి
చంపనెత్తిన యాకత్తితోనె గడ్డమునను మీసములను వెండ్రుక
లందందుఁ గొంతకొంత మిగిలియుండునట్లుగా రేవులు వాఱం
గొఱిగి విరూపునిఁ గావించెను. అంతకు యాదవవీరులును గజము
తామరకొలంకునుంబోలె నురవడించిన శత్రుసైన్యమును గలంచి
వారించి కృష్ణుని చెంతకు వచ్చి యట రుక్మిని గాంచిరి. అట్లు
విరూపుండై, యించుమించుగా హతునివలె నున్నవానిని
జూచి విభుఁడు బలరాముఁడు దయ దయివాఱ బంధము
విడిచిపుచ్చి యంత భగవంతుఁడయినయా కృష్ణునితో నిట్లనియె.
'కృష్ణా! నీవుచేసిన యీపని యెంతయు లెస్సగాదు. ఇది మనకు

మైత్రియు, సేవగింపఁదగినది. సుహృదులను (బంధువులను) వధించుటయనఁగా గడ్డమును దలయు గొఱిగి విరూపము గావించుటయె కాక మఱేమి '? అని మెలపున దూఱినాడి రుక్మిణితో 'సాధ్వి! నీతోఁబుట్టువునకు విరూప మయినందులకుఁ జింతించి మాయెడ ననూయపడకుమా! పురుషుఁడు తనచేసిన కర్మములవలననే సుఖదుఃఖములు గనుచున్నాఁడు. వానికి సుఖదుఃఖములు వేఱొకఁడు గలిగించుచున్నాఁడనుట గలుగదు. కాన మీయన్న దుఃఖమునకు వానికర్మమే కాని మేము కారణము గా నేరము' అనెను. అంతఁ దమ్మునిఁ జూచి 'కృష్ణా! బంధువు, చంపదగినంతదోషము సేసినను వానిని జంపఁదగదుగదే! వానిని విడిచియే పుచ్చవలయును. ఏలందువా? వాఁడా దోషముచేతనే చచ్చినవాఁడు సుమీ. మరల వానిని జంపనేల ?' యని మరల రుక్మిణితో 'బ్రహ్మ, క్షత్రియుల కీ ధర్మమును విధించినాఁడు. అదేది గాదు తోఁబుట్టువయినను దోఁబుట్టువునుజంపుచుండును.' అనెను. అతఁడు శ్రీకృష్ణునితో 'ఐశ్వర్యమదంబునఁ గన్నుఁగానని దురహంకారులు రాజ్యముకొఱకును, భూమికొఱకును, ధనముకొఱకును, ఐశ్వర్యముకొఱకును, తామే పేరుల మనెడి యభిమానమువలనను, తేజమువలనను, మఱి యితర కారణములవలనను, బంధువులను దిరస్కరింతురు. మన కిది తగునా' యని యంత రుక్మిణితో 'దేహాత్మాభిమాని యగు నజ్ఞునివలె సదా సుహృదులకు భద్రమును నహితులకు నభద్రమును దలంచుచుందువేని, నీ యీబుద్ధి సమస్తభూతములందు నొక్కరీతిని సమనుగాకుండుటయే యగుచున్నది. అపుడు నీవు లోకమువారితోఁ బాటిదానవే యగుదువు. ఏలందువా ? దేహాత్మాభిమాను లగు మనుష్యులకు

10.9.82

'వీఁడుసుహృదుఁడు' 'వీఁడహితుఁడు' 'వీఁ డుదాసీనుఁడనెడి బుద్ధి

కన్నుతోను రూపుతోను సంబంధము లేకుండునట్లు, పరమాత్మునకు ను దాను లోపలనున్న దేహముతోడఁ దద్దోషాదిసంబంధము దూరస్థునికింబోలెఁ గలుగదు సుమీ. చంద్రుని కళలకే వృద్ధిక్షయములుగాని చంద్రునికిఁ గానట్లు, ద్రవ్యాదిసంఘాతాత్మకమైన దేహమునకే జన్మబాల్యయౌవనాది వికారములుగాని యాదేహమునందున్న జీవునకు నొకప్పుడును గలుగవు. జీవునికి మృతి, జంద్రునకుఁ *గుహువు (అమావాస్య) వంటిది సుమీ. స్వప్నమందలి పదార్థము లస్థిరములయినను, నిదురించుపురుషుఁ డాస్వప్నవిషయములను వానిభోగమును స్థిరములనుబుద్ధితో ననుభవించునట్లు పురుషుఁ డీవిషయభోగములను సతము లని తలఁచి యెంతవఱకనుభవించుచుండునో యంతవఱకును వీఁ డజ్ఞుఁడయి సంసారము నొందుచుండునుగాని, దానినుండి విడివడఁడు; ప్రబుద్ధుఁడే విడివడుచున్నాఁడు. కాఁబట్టి శుచిస్మితా! అజ్ఞానమువలనఁ బుట్టినదై మానసమును శోషింపఁజేయుచును మిక్కిలియు మోహపెట్టునట్టి యీశోకమును, శత్రుఁడు మిత్రుఁ డుదాసీనుఁడను మోహమును, (జగమంతయుఁ బరమాత్మశరీరమనెడి) తత్త్వజ్ఞానముచేతఁ బరిహరించి శోకంబు దక్కియుండుము' అనెను.

ఇట్లు భగవంతుఁడు రాముండు ప్రతిబోధింపఁగా నారుక్మిణీదేవి దుఃఖమువాసి, తత్త్వనిర్ణయాత్మకం బయినట్టి బుద్ధిచేత మనసు కుదురుపఱుచుకొన్నదయ్యెను. అట రుక్మియు శత్రువులచేతఁ దనబలమును దేజమును హతములు గాఁగా, నుసుఱు

* చంద్రునికిఁ గళానాశమువలననే అమావాస్యయనియుఁ చంద్రక్షయ మనియుఁ జెప్పుదురు. అట్లె ఆత్మకును దేహనాశమువలననే మృతియందురు గాని స్వరూపనాశమును బట్టి కాదనిభావము.

మాత్రము దక్కియుండ, వారు విడిచిపుచ్చఁగాఁ దనమనోరథ మంతయు వ్యర్థమై కృష్ణుండు తనకుఁ గావించినవిరూపమును స్మరించుచు భోజకట మను విశాలంబగు పురమును దనకు నివాసముగాఁ గావించుకొనెను. ఆదుర్మతి యంతంబోక 'కృష్ణునిఁ జంపకయు నాచెలియలిని మరలఁ గొనిరాకయుఁ గుండినపురమును జొర'నని ప్రతిన వట్టి రోషంబు మల్లడిగొన నందే కాఁపుండెను. భగవంతుఁడు కృష్ణుఁడు నిట్లు రాజులను గెలిచి భీష్మకరాజకుమారిని రుక్మిణిని దనపురంబునకుఁ దోడితెచ్చి విధ్యుక్తముగా నాపూర్వుంబోఁడిని బెండ్లియాడెను. అంత యదుపురమున జనులు యదుపతియగు కృష్ణునియందే మనసులు పట్టుకొలిపియున్నవారు గాన నందలిప్రతిగృహమును బెద్దయుత్సవమున నుల్లసిలుచుండెను. స్త్రీలును బురుషులును మిక్కిలియు ముదములు పొదల, మెఱుఁగిడిన మణికుండలములు దాల్చి, యావధూవరులకు రుక్మిణీకృష్ణులకు విచిత్రములైన యంబరములును మఱియుఁ దక్కినసారిబర్హమును దెచ్చియిచ్చిరి. ఆవృష్ణులపట్టనమున ద్వారకయందుఁ బ్రతిగృహమున నింద్రధ్వజము లెత్తికట్టి విచిత్రము లగు మాల్యములచేతను వస్త్రములచేతను రత్నతోరణములను నలవరించి యొక్కొక్కవాకిటను లాజలు, అంకురములు, పుష్పములు మొదలగు మంగళవస్తువులను బొందుపఱిచి, పూర్ణకుంభములనుంచి, యగరుధూపములు గుబులుకొన దీపముల వెలిఁగించిరి. దానిచే నాపట్టణ మెంతయుఁ బ్రకాశించినదయ్యెను. మఱియుఁ బెండ్లికిఁ బిలువఁగా వచ్చిన ప్రియతములయిన రాజులమదపుటేనుఁగులనుండి మదజలములు గురియుట వలన నాపురముపీథు లెల్లఁ దడుపంబడియుండెను. మఱియు

నందలి గృహద్వారములందలి చెట్లును బోఁకబోదియలనుగట్టి నిలుపఁగా నది యెంతయుఁ బొలుపు గులుకుచుండెను. పెండ్లి సంబరమువలన నాపురము వీథులందు నలుగడల నిటునటుఁ దిరుగుడులాడుచున్న బంధువులలోన,కురువులును సృంజయులును కైకేయులును విదర్భులును యదువులును గుంతి దేశీయులును నొండొరులం గలసి సంతోషమున నోలలాడుచుండిరి. భగవంతుఁడు బలిమిని రుక్మిణీదేవిని గొనిపోయినాఁడని యందందు బ్రాహ్మణులు వందులు మొదలగువారు పాడుచుండఁగా విని రాజు 'లాహా! ఇట్టి సాహసము మనకెన్నఁడేని చేయఁదరమా' యనియు రాజకన్య 'ఔరా! కోటిమన్మథసుందరుఁడు శ్రీదేవీవల్లభుఁడు కృష్ణుఁడు తాన్వ పోయి రుక్మిణిని వరించినాఁడే! దానిభాగ్యమేమి!' యనియు నెంతయు నాశ్చర్యపడినవారయిరి. లక్ష్మియవతారమగునారుక్మిణినిం గూడియున్న యాశ్రియఃపతిని, ఆ కృష్ణునిఁ, గాంచుటచే ద్వారకాపురమందలి జనుల కందఱకును మిక్కిలియు నానందము కందళించినదయ్యెను. ఇది యేఁబది నాలుగవయధ్యాయము.

---

## ప్రద్యుమ్న జననము శంబరవధము మొదలయినవి.

తొల్లి రుద్రునికోపమున దగ్ధుఁడయిన కాముఁడు, వాసుదేవాంశమగువాఁడు, దేహమును బడయుటకు మరల నావాసుదేవునే శరణుఁజొచ్చెను. ఆకాముఁడే కృష్ణుని సంకల్పరూపంబగు వీర్యమున రుక్మిణీదేవియందుఁ బుట్టి ప్రద్యుమ్నుఁడను పేరుగాంచి యన్నివిధములఁ దండ్రికిఁ దా నీడు జోడయి వెలయుచుండెను ఆకామునకు శత్రుఁడు శంబరుఁడు.శంబరుఁడు నారదునివలన నా

కాముని దనకు శత్రుఁడని తెలిసి పుట్టి పదినాళ్లు గడవకమునుపే యాబుడుతని గామరూపియైవచ్చి ముచ్చిలికొనిపోయి సముద్రమునఁ బాఱవైచి తనగృహమునకుఁ బోయెను. ఆబిడ్డను మిక్కిలి బలముగల యొకపెనుచేఁప మ్రింగెను. అంత నొకప్పుడు జాలరివాండ్రామీనును దక్కినమీనములను వలవైచి పట్టిరి. జాలరు లాపెద్దమీనును శంబరునికిఁ గానుకగా నర్పించిరి. అంత నతనివంటలవాండ్రు దానిని వంటయింటికిఁ గొంపోయి గండ్రగొడ్డలిచేతఁ దునియలుగాఁ ఖండించిరి. వారప్పుడాచేఁపకడుపులోన నద్భుతంబగు నొకబాలునిఁజూచి వానిని * మాయావతికి నప్పగించిరి. ఆపడఁతియు నబ్బాలునిఁ జూచి ఎవఁడీకుఱ్ఱ. నాభర్తవలె నున్నాఁడు.? అతఁడే వీఁడగునా? యని మనంబున శంకించుచుండఁగా నారదుఁడు వచ్చి యాబిడ్డఁడు కాముఁడే యని వానికలరూపును జేఁపకడుపునఁజొచ్చిన తెఱఁగును మొదలుగా జరిగినదంతయుఁ జెప్పెను. ఆపడఁతి కామునిపత్నియగు రతిదేవి. ఆకీర్తిమతి తన్ను శంబరుఁడు తన మహానసమునవంటలవాండ్రకుఁ బనికత్తియగా నియమించియుండెను. అట్లుండి యాబిడ దగ్ధదేహుం డయినతనపతి మరల దేహముతోఁ బుట్టుట నెదురుచూచుచు నారదునివలన నా శిశువును గామదేవుండని తెలిసి యాకుఱ్ఱనియం దెడతెగనినెయ్యము నెఱపసాగెను. ఆకృష్ణునికుమారుఁ డచిరకాలముననే పెరిఁగి

* మాయావతియనునది మన్మథునిపత్నియగు రతీదేవి. శంబరుఁ డాపడఁతిని బలాత్కారముగాఁ జెఱపట్టి వంటయింటఁ బాచకులకు పరిచారికగా నేర్పఱిచెను. ఆబిడయుఁ దనపతి మరల దేహముతోఁ బుట్టుట నెదురుచూచుచు నందు వసించియుండె ననుకథ యిట ననుసంధించునది.

యౌవనమునొంది తన్నుఁజూచు జవరాండ్రకు నెంతయు మరులు మొలపింపసాగెను. ఇట్లు తనపతి తామరఱేకులంబోలి వెడందలై కన్నుంగవ చెన్నుఁగులుక, జానువులవఱకు నిడుదలయి బెడఁగారు బాహువులతో, మనుష్యులం దెల్ల మిక్కిలియుఁ జక్కఁదనమునఁ గండళించుచుండఁగాఁ గాంచి, నునుసిగ్గు నూలుకొన్న చిఱునవ్వు నివ్వటిల్ల, బొమలు గిఱపుచు, మక్కువ పిక్కటిల్ల సురతసూచకంబులగు భావంబుల నతనిని గొలువ సాగెను. కృష్ణవీర్య సంభవుఁడగు నమ్మహాత్ముండు ప్రద్యుమ్నుండును నాపడఁతితో 'తల్లీ ! నీబుద్ధి విపరీతముగా నున్నది. నీవు తల్లిభావమును మీఱి పుంశ్చలివలె నడచుచున్నావే' యనెను. రతి 'నీవు నారాయణుని పుత్రుఁడవు. శంబరుఁడు గృహము నుండి నిన్నపహరించుకొనిపోయెను. ప్రభూ ! నేను నీగారాబు పత్నిని, రతిదేవిని, నీవు కాముండవు. ఈ శంబరాసురుఁడు నీవు పుట్టి పదిదినములును గడవకున్నపుడు సముద్రమునఁ గొనిపోయి వైచినాఁడు. ప్రభూ ! అందు నిన్నొకమత్స్యము మ్రింగెను. దాని యుదరముననుండి నీ విట వచ్చితివి. దుర్జయుండై యెవ్వరికిని జెనకరాకున్న యీ నీదుశత్రువు మాయలు వందలకొలఁదిని దెలిసినవాఁడు. నీవు మోహనాదులయినమాయలను నాచేతఁబడసి వీనినిఁ జంపుము. నీకన్నతల్లి, రుక్మిణిదేవి, బిడ్డను బోఁగొట్టుకొన్న యాఁడులేడివలెను, క్రేఁపును బాసిన యావువలెను, మిక్కిలియు నాఱటపడుచుఁ బుత్రస్నేహమునఁ గలంగి నలంగి, దీనయై దుఃఖించుచున్నది చుమీ' అనెను. ఇట్లు మాటలాడి యంత నమ్మాయావతి మహాత్ముండగు ప్రద్యుమ్నునకు సర్వమాయలను వినాశముసేయునట్టి మహామాయ యనెడి

విద్యనుపదేశించెను. ఆప్రద్యుమ్నుఁడును శంబరునికడకుఁబోయి యించుకయు సైఁపరాని యాక్షేపవచనము లాడుచుఁ గలహమును బుట్టించుచును వానిని యుద్ధమునకుఁ బిలిచెను. వాఁడు నాధిక్కారంపుఁబలుకులచేఁ గొట్టువడి కాలం ద్రొక్కఁబడిన సర్పమువలెఁ జెలంగి, కన్నులెఱ్ఱనై సుడివడఁ, గోపంబు మల్లడిగొన, గద కేలందాల్చి వెడలివచ్చెను. అట్లువచ్చి గదను గిరగిరం ద్రిప్పి మహాత్ముం డగుప్రద్యుమ్నునిపయి విసరివైచి పిడుగుపడినట్టుమ్రోలె బిట్టుగానార్చి యట్టహాసము చేసెను. అట్లా గద యాకాశమునందుఁ దనపయిని వచ్చుచుండఁగాఁ బ్రద్యుమ్నుండు మఱియొక గదచే దానిని బడఁగూల్చి తనగదను నాశత్రువుపై విసరివైచి బిట్టుగానార్చెను. ఆయసురయు మయుం డుపదేశించిన దైత్యమాయ నాశ్రయించి యాకాశమునందుండి కృష్ణకుమారునిపై శిలావర్షమును గురియించెను. మహాబలుం డారుక్మిణీసుతుఁడు ఱాలవానచే బాధితుండగుచు సత్త్వమయంబై సర్వమాయలను దూలించునట్టి మహావిద్యను బ్రయోగించెను. అంత నాదైత్యుఁడు గుహ్యకమాయలను, గాంధర్వ పైశాచమాయలను, ఉరగరాక్షసుల మాయలను నతనిపయిని వందలకొలఁదిని బ్రయోగించెను. ప్రద్యుమ్నుఁడు వానినెల్లఁ దూలించి, వాఁడియగు ఖడ్గము నెత్తికొని, యెఱ్ఱని పల్లమీసలు వెలయుచున్న యాశంబరుని శిరసును గిరీటకుండలయుక్తముగా వాని కాయమునుండి బాసిపడఁ ద్రుంచి కూల్చెను. దేవతలు పుష్పసమూహ మతనిపయిని జల్లుచుఁ బొగడుచుండిరి. అపు డాప్రద్యుమ్నుఁ డాకాశచారిణియగు తనభార్య యాకాశమునఁ దన్నుఁ గొంపోవఁగా ద్వారకాపురమును జేరినవాఁడయ్యె. అతఁడు

తనపత్నిని గూడి మెఱపుతోఁ గూడిన మేఘమువలె నాకాశమునం బోయి నారీరత్నములు నెరసి బెరసి యున్న మేటియంతఃపురమును జొచ్చెను. అట్లు నల్లనిమబ్బువలెఁ జామని చాయగలిగి, బంగారువలువ దళుకొత్త, నిడుదలయిన బాహువులును నెట్టని కడగన్నుంగవయు సోగ సయిన చిఱునవ్వును నెమ్మొలుగులుకు నెమ్మొగమును గలిగి, నెరులుగల నల్లనిముంగురులు వరుసలుగొని మొగముదామరఁ గొకవింత కొమరు సింగారించుచుండ, నరుగుదెంచిన యా ప్రద్యుమ్నునిఁ గాంచి యందుఁగల సుందరులెల్లఁ గృష్ణుండని తలంచి సిగ్గులగ్గలింప నందందఁ మఱుఁగియుండిరి. కాని, కొంతవడికి నాపడఁతులు వానియందుఁ గృష్ణుని కన్న నించుక వేఱులక్షణములను శ్రీవత్సాదులు లేమిని గనుఁగొని, యంత ముదంబులు మిక్కిలియుఁ బొదలఁ, దెలి నవ్వులు దళుకొత్త, నారీరత్నములతోఁ గూడనున్న యావన్నెకానిని బలసి వచ్చిరి. అంతఁ దెల్లని కడఁగన్నుల వన్నెచూపుచుఁ దీపారు పలుకులువలుకు నారుక్మిణీదేవి యయ్యెడ వానిని జూచి యగపడకున్న తనచిన్నికొమరునిఁ దలఁచుకొని నెయ్యమునఁ జన్నుంగవ చేఁపుచుండఁగాఁ దనలో 'ఎవఁడీపురుషరత్నము ! వీని కన్నుంగవ తామరఱేకులను బురుడించుచున్నవిగదే ! ఎవ్వనికొడుకు? ఏపుణ్యురాలు వీనిని గడుపునమోచి కన్నదియో ? వీని కీసుందరి యెందు దొరకినదో ! నాపురిటింటనుండి పాపులెవరో కొంపోఁగాఁ నాముద్దులకొడుకు గాన రాఁడయ్యెఁగదే. వాఁడే వీఁడగునా? వాఁ డిప్పు డుండిన వీని యీవయసు నీరూపమునే యుండునుగదే! నాకొడు కింతకు నెక్కడనేనియు బ్రతికియుండునా? అది యట్లుండనీ. వీనికి శార్ఙ్గధన్వుం డగు కృష్ణునియాకారమును నవయవ

ములతీరును నడయు నెలుంగును నవ్వును జూపులును వెలయు చున్నవి. కృష్ణునిపోల్కి వీని కెట్లు గలిగెను ? నాగర్భమందుం బుట్టిన మహాత్ముం డాబిడ్డండే వీండుగావలయును. నాకు వీనియందు మక్కువ మిక్కిలియు దళముకొనుచున్నది. నాయెడమబుజ మదరుచున్నది' అనెను. ఇట్లు రుక్మిణీదేవి తనలో దాను వితర్కించు కొనుచుండంగాం దేవకీవసుదేవులతోడం నుత్తమశ్లోకుం డగు కృష్ణుం డయ్యెడకు వచ్చెను. భగవంతుండు కృష్ణుండా వృత్తాంత మంతయుం దెలిసియున్నను నెఱుంగనివాండుంబోలె నేమియుం బలుకక యూరకుండెను. నారదుండు నంతవచ్చి శంబరుండు ముగ్ధచ్చిలికొనిపోవుట మొదలుగాంగల వృత్తాంతమునంతయుం జెప్పెను. మిక్కిలి యాశ్చర్యం బయినయావృత్తాంతమును విని కృష్ణునియంతఃపురకాంతలు మృతుండయిన పుత్త్రుండు మరలి వచ్చినట్లు, పెక్కుసంవత్సరములు గానరాకుండిన వానిని గన్నులారంగాంచి యెంతయు నభినందించిరి. దేవకియు వసుదేవుండును గృష్ణుండును బలరాముండును నట్లే తక్కినస్త్రీలును రుక్మిణీదేవియు నాదంపతులను గౌంగిలించికొని యెంతయు ముదమునొందిరి. ద్వారకాపురవాసులు గానంబడకపోయిన ప్రద్యుమ్నుండు మరలవచ్చినాండని విని 'ఔరా ! మృతుండయిన బాలుండు మరల భాగ్యవశమున నింటికి వచ్చినాండుగదే'యని మాటలాడికొనిరి. ఆప్రద్యుమ్నుండు తనతండ్రిరూపుంబోలి యుండుటవలన నతనితల్లులు

(నారదుండు ప్రద్యుమ్నవృత్తాంతమును దెలుపంగా రుక్మిణీదేవి మొదలగువా రానందము నొందుట.)

తమపతి యగుకృష్ణుం డనుబుద్ధి వానియందుఁగలిగి మంత
నంబున శృంగారభావములు కందళింపఁగా, వానిని భజింతు
రనుట యొకచిత్రముగాదు. ఏలన మనస్సునఁ దలంచుకొన్న
మాత్రనే కలంచిపుచ్చు కాముఁడు కన్నులకే కనుపట్టువాఁడై,
లచ్చికాటపట్టయిన శ్రీకృష్ణమూర్తికిఁ బ్రతిబింబమైన ముద్దుల
పుత్రుఁడై చూపట్టఁగా నది యొకవిచిత్రమా? కాదు. ఇఁకఁ
దక్కినపడఁతులును వానినట్లు భజించుటను జెప్పవలయునా?
ఇది యేఁబదియేనవయధ్యాయము.

## స్యమంతకోపాఖ్యానము.

{ సత్రాజిత్తునకు స్యమంతము దొరకిన విధమును, దానిప్రభావము మొదలగు వృత్తాంతమును. }

శుకుఁడు 'సత్రాజిత్తు కృష్ణునికి నెగ్గుగావించి దానిని బరిహరిం
చుటకై స్యమంతకమనెడు రత్నమును దనపుత్రికయగు సత్య
భామను దానై యతని కొసంగినవాఁడయ్యె' ననెను. రాజు
"బ్రాహ్మణోత్తమా? సత్రాజిత్తు కృష్ణునకు నెగ్గేమి గావించెను?
స్యమంతకమణి యతనికెక్కడిది? కూఁతు నతఁ డేలహరికిచ్చెను'?
అనియడిగెను. శుకుఁడు—సత్రాజిత్తు దానెప్పుడును సూర్యునకుఁ
బరమభక్తుఁడై యుండెను. అందులకు సూర్యుఁడు సంతుష్టుఁడై
ప్రేమగడలుకొన నాస్యమంతకమణి నొసంగెను. అతం డామణిని
గంఠమునందుఁ దాల్చి సూర్యునివలె ధగధగమని ప్రకాశిం
చుచు ద్వారకాపురమును బ్రవేశించెను. కాని యామిక్కుట

మయిన మణి తేజస్సువలన నాతం డిట్టివాఁ డని కనుఁగొన రాకుండెను. జను లతనిని దవ్వులం జూచి యా తేజంబుచేతఁ గన్నులుమిఱుమిట్లుగొని చూపుచెడఁగా, సూర్యుండని శంకించి కృష్ణుఁడు పాచికలాడుచుండఁగా నతనికిఁ దెలియఁబఱచువారై 'నారాయణా! శంఖచక్రగదాధరా! దామోదరా! అరవిందాక్షా! గోవిందా! యదునందనా! నీకు నమస్కారము. జగత్పతీ! విభుఁడు సూర్యుఁడు వేంద్రములయిన తనకిరణముల మండలముచేత మనుజులు కన్నులను మిఱుమిట్లుగొలిపి రూపించుచు నిన్నుఁ జూడఁగోరి యిదిగోవచ్చుచున్నాఁడు. 'నేనెక్కడ! సూర్యుఁడు నన్నుఁజూడవచ్చుట యెక్కడ'! ననకు. దేవశ్రేష్ఠులు త్రైలోక్యమందు నీదుమార్గమును—నీగుణరూపకర్మము లెట్టివని—కనుఁగొనుటకు నరయుచున్నవారుగదే! కాఁబట్టియిప్పుడు యదువులందు మనుష్యవేషము దాల్చి గూఢుండవై యున్న నిన్నెఱింగి ప్రభూ! సూర్యుఁడు నీకడకువచ్చుచున్నాఁడు, వచ్చుట యబ్బురముగాదు' అనిరి. ఆతామరసాక్షుఁడు వారు బాలురవలెఁ దెలివిమాలి పలికిన పలుకులవిని పకపకనవ్వి, 'వీఁడు దేవుండగు సూర్యుఁడు గాఁడు; సత్రాజిత్తు.మణిచేజ్వలించుచున్నవాఁడు చుఁడీ' అనెను. శ్రీమంతుఁ డాసత్రాజిత్తును దనగృహమునందు నుత్సవంబున మంగళములు గావించి యందుఁ బ్రవేశించి దేవగృహమునందు బ్రాహ్మణులచేత నారత్నము నివేశింపఁజేసెను. ఆమణియుఁ బ్రతిదినమును నెనిమిది బారువుల బంగారము నీనుచుండెను.ఆమణి యెయ్యెడ నర్చితం బగుచుండునో నందు దుర్భిక్షయు మారియు నరిష్టములును సమస్తములయిన యాధివ్యాధులును నశుభములును దొంగలు మొదలగువంచకులును

గలుగ నేరరు. కృష్ణుం డొకప్పు డామణిని యదురాజగు నుగ్రసే నున కిమ్మని సత్రాజిత్తునడుగఁగా నతం డర్థకాముకుం డగుటవలనఁ గృష్ణుని యాచించుట వ్యర్థమగుచున్నదియు నూహింపక దాని నియ్యకయె పోయెను.

**( జాంబవంతునకు స్యమంతకమణి దొరకుట. మణికొఱకుఁ బురజనులతోఁ గృష్ణుఁడు వనమునకుఁ బోవుట. )**

ఒకనాఁడు సత్రాజిత్తు తమ్ముఁడు ప్రసేనుఁడనువాఁడు మిక్కిలియుఁ బ్రభచేఁ దేజరిల్లుచున్న యామణిని కంఠంబునఁ దొడిగికొని యశ్వము నారోహించి వనమునందు వేఁటాడుచుండెను. అంత నొకసింగము ప్రసేనుని వానియశ్వమునును జంపి రత్నమును గొని కొండలోఁ జొచ్చుచుండఁగా జాంబవంతుఁ డదిచూచి యామణిని గయికొనఁగోరి దానిని జంపిపుచ్చెను. అతఁడును దన కొండబిలమందుఁ దనకుమారునకు దానినొకయాటముట్టు గావించెను. సత్రాజిత్తు తనదమ్ముని పోకడ దెలియక యెంతయుఁ బరితపించి 'బహుతరముగా నాతమ్ముఁడు మణిని మెడయందుఁ దాల్చి వనమునకుఁ బోయినపుడు కృష్ణుఁడు వానిని జంపియుండును' అని చెప్పుకొనెను. అది కర్ణాకర్ణిగా జనులు విని రహస్యముగా నొండొరులతో గజగుజలు వ్రావసాగిరి. కృష్ణుండును దానిని విని తనకు నంటినదుష్కీర్తిని గడుగుకొన నెంచి పురజనులతోఁగూడి ప్రసేనుఁడు పోయినమార్గము ననుసరించిపోయెను. అట్లుపోయి వనమున సింహముచేతఁ బ్రసేనుండును వానియశ్వమును హతములై యుండుటయు నాసింహము పర్వతపృష్ఠమున నెలుఁగుబంటిచేత (జాంబవతునిచేత) హతంబై యుండుటయు

### భగవంతుఁడు స్యమంతకమణికొఱకు జాంబవంతునితో యుద్ధము సేయుట.

జనులుచూచిరి. అంత భగవంతుఁడు కృష్ణుఁ డంధకారము గ్రమ్మియున్న యాజాంబవంతుని బిలమును, బెడిదంబగు దానిని, దానొక్కండును దక్కంగలజనుల బయటనిలిపి ప్రవేశించెను. అట్లుచొచ్చి యం దామణిశ్రేష్ఠము బాలునకు నాటబొమ్మగాఁ జేసియుండుటను గాంచి దాని నపహరింప మనసున నిశ్చయించి యాబుడుతనిపొంత నుండెను. అట్లు వింతయగుమనుష్యుఁ డొకఁడు వచ్చుటనుజూచి దాదిభయమున బిగ్గఱఁ గూవెట్టెను. అదివిని బలవంతులయందు మిన్నయగు జాంబవంతుఁడు క్రుద్ధుఁడై వేగ పాఱుతెంచెను. అతండును దనస్వామియగు నాభగవంతుని సామాన్యుండగు నొకపురుషునిఁగాఁ దలఁచి యతని ప్రభావము నెఱుంగక కోపంబుదీపింప నతనితోడ యుద్ధము గావించెను. మాంసమునకై రెండుడేగలకుంబోలె నాయిరువురకును నాయుధములచేతను ఱాలచేతను వృక్షములచేతను నవియు ముగియఁగా, బాహువులచేతను మిక్కిలియుఁ దుముల ముగా ద్వంద్వయుద్ధము ప్రవర్తిల్లెను. వారొకరినొకరు గెలువ నుంకించుచుండిరి. అంత నాయిరువురకుఁ బిడుగుపాటులవలె నతి నిష్ఠురంబులగు పిడికిళ్లతో నెంతయు నలయక రేయుంబవలు నిరువదియెనిమిది దినములు యుద్ధము జరిగెను. అంత జాంబవంతుఁడు శ్రీకృష్ణుని పిడికిటి పోట్లంజేసి యంగముల పెనుసంధి బంధము లెల్లఁ బిండలివండుగా నలఁగి కలంగఁగా సత్త్వ డిందుపడి మేనెల్లఁ జెమర్చుచు మిక్కిలియు విస్మయమున

నతనింజూచి 'నీవు సర్వభూతములకును బ్రాణంబును*నోజస్సును

{జాంబవంతుఁడు కృష్ణునిస్తుతించుట. కృష్ణుఁడు మణితోడ జాంబవతిని బడయుట.}

సహంబును బలంబునని యెఱుంగుదును. మఱియు జగత్కారణంబగు పురాణపురుషుండును జగద్రూపంబునఁ బ్రభవించువాఁడును సర్వాంతరాత్మయగునధీశ్వరుండు నగు విష్ణుండ వనియు నెఱుఁగుదును. నీవు మహత్తు మొదలుగాఁ బృథివివఱకుఁగలతత్త్వములకెల్ల స్రష్టవు. మఱి నీకుస్సృజ్యములయిన యామహదాదులకు నుపాదానంబగు సత్తును నీవే. సర్వమును స్వవశముగావించుకొనువారికి నీవు ప్రభుండవగు కాలంబవు. కాలశరీరకుండవు. మఱి జీవాత్మలకెల్ల లోనఁజొచ్చి శాసించుచుండుటంబట్టి పరమాత్ముండవు. ఎవ్వఁడించుక కినుక చెలరేఁగఁ గడకంటిచూడ్కులనిగిడింపఁగానే మొసళ్లును దిమింగలములును గలంగ సముద్రము భయంపడి మార్గమునిచ్చెనో, ఎవ్వఁడు తనకీర్తి పెంపుకొఱకు సేతువును బంధించెనో, ఎవ్వఁడు లంకను దగ్ధముగావించెనో, ఎవ్వని వాఁడిబాణములచే రాక్షసుండగు రావణునితలలు నేలం గూలెనో, యానాస్వామి యారఘునాథుండు నీవే యని యెఱుంగుదును' అని స్తుతించెను. ఇట్లు విజ్ఞేయంబగు నాపరతత్త్వమును నెఱింగిన యాభుక్షరాజును జాంబవంతునిఁ జూచి భగవంతుఁడును దేవకీసుతుఁడు నరవిందాక్షుండు నగు నాకృష్ణుండు

---

* ఓజస్సనఁగా ప్రవృత్తి సామర్థ్యము. సహమనఁగా వేగము. బలమనఁగా ధారణ సామర్థ్యము. ప్రాణాదులకు నిర్వాహకుఁడని యర్థము.

కరుణ మిక్కిలియుఁ గడలుకొన, మంగళకరంబగు తనకరంబుచేత నల్లఁదడవి యాభక్తుని మేఘగంభీరంబులగు వచనంబుల 'భల్లూక పతీ! నాకు నీమణివలన లేని పట్టియపవాదము వచ్చినందున దానిని గడిగికొనుటకై దీనిని దీసికొనిపోవ మే మిట వచ్చితిమి చుమీ' యనెను. అంత జాంబవంతుఁ డుపాయనము కొఱకుఁ దనకూఁతురయిన జాంబవతియనుకన్యను నామణితోఁ గూడఁ గృష్ణునకు నర్పించెను. అంత నాభగవంతుఁడు తన్ను నితరములగు మణిరత్నములచేతను బూజింపఁగా సంతుష్టుండై భక్తవత్సలుండుగావునఁ బునరావృత్తిరహితంబయి పరమంబగు ముక్తి నతని కొసంగినవాఁడయ్యె. అంత బిలము వెలుపలనున్న జనులు బిలముచొచ్చిన కృష్ణుఁడు వెడలిరాకుండుటను జూచి పండ్రెండు దినము లతనిరాక నెదురుచూచి, దుఃఖితులై తమ పురమునకుఁ బోయిరి. దేవకీదేవియు, రుక్మిణియు, వసుదేవుండును, సుహృదులును, జ్ఞాతులును, బిలమునుండి కృష్ణుండు వెడలిరానందులకు మిక్కిలియు శోకించిరి. అంత ద్వారకాపురవాసులగు జనులు దుఃఖితులై సత్రాజిత్తును దిట్టుచుఁ గృష్ణుని మరలఁ బడయుటకు మహామాయయగు దుర్గనుపాసించిరి. ఆదేవియుఁ దన్ను భజించుటవలన వారికిఁ గృష్ణదర్శనము గలుగున ట్లాశీర్వదించుచుండఁగా, హరియును బోయినపని తీర్చుకొని భార్యను గూడి వారి కెంతయు నుబ్బు గలిగించుచుఁ బొడసూపెను. వారు మృతుండయిన వానిని మరలఁ బడసినట్లు, మణిని గుత్తుకయందుఁ దాల్చి పత్నితోఁ గూడ వచ్చిన హృషీకేశునిఁ జూచిరి. అందఱకు నెంతయు నుత్సవమయ్యెను.

### సత్రాజిత్తునకు మణిని మరలనిచ్చుట. సత్యభామ వివాహము.

అంత భగవంతుఁడు కృష్ణుఁడు సత్రాజిత్తును బిలిపించి సభయందు రాజు సమక్షమున మణిని దాను గనుఁగొన్న ప్రకారము నెఱింగించి దాని నతనికి నిచ్చెను. అతఁడును మిక్కిలియు లజ్జితుండై యారత్నమును బుచ్చుకొని మొగము వాంచి దాను జేసినపాపమున కెంతయు ననుతాపపడుచు నిజగృహమునకుఁ బోయెను. అతఁ డా విషయమునే మనంబునఁ దలపోయుచు బలవంతునితోడి విగ్రహమునకు వ్యాకులుండై 'ఈనెఱను నెట్లుదుడిచి కొందును? అచ్యుతుఁడు కలంక దేఱుట యెట్లు? ఏమిచేసిన నాకు మేలగును; మఱి జనులును నన్ను దిట్టకుందురు? ఇస్సీ! ధనమునందలి పేరాసచే దప్పులం జూడని మూఢుని నన్నుఁ గాల్పనే! నాదిబ్రతుకా! నారీరత్నమగు నాపుత్రికను నారత్నమునుగూడ నాతని కొసంగెదను. ఇదియె మంచియుపాయము. మఱియొకవిధమున నతనికిఁ గోపశాంతి గలుగదు' అనెను. ఇట్లు సత్రాజిత్తు బుద్ధిచేత గట్టిగానిశ్చయించుకొని యొప్పులకుప్పయగు తనకూఁతును నామణిని దానై యెత్తుకొని కృష్ణునకుఁ గానుకగా నొసంగెను. భగవంతుఁ డంత శీలరూపౌదార్య గుణసమన్వితయై పెక్కండ్రురాజులు వేఁడిన యాసత్యభామను విధ్యుక్తముగాఁ బెండ్లియాడెను. కృష్ణుండు సత్రాజిత్తుతో 'రాజా! నీమణిని మేము పుచ్చుకొనము. సూర్యదేవభక్తుండ వగునీకే యామణి యుండుఁగాక. మేము (దాని

వలని దుర్భిక్షశాంతి మొదలగు) * ఫలములను బొందువారమే కావలయును' అనెను. ఇది యేబదియాఱవయధ్యాయము.

---

### {సత్రాజిత్తునుజంపి స్యమంతకమును నపహరించిన శతధన్వునిఁ గృష్ణుండు వధించుట.}

భగవంతుఁడు పాండవులును గుంతియు లక్కయింట దగ్ధులయిరని విని వారు దగ్ధులుగారని యెఱింగినవాఁడయ్యును గులోచితసంవ్యవహారముకొఱకు బలరామునిఁగూడి కురుదేశమునకుఁ బోయెను. ఆయిద్దఱు దమవలెనే దుఃఖించుచున్న భీష్ముని ధృతరాష్ట్రుని గాంధారిని, ద్రోణుని జేరి 'అయ్యో ఏమికష్ట' మని పలికిరి. కృష్ణుఁడులేని తెఱపిని జూచి యక్రూరుండును గృతవర్మయు శతధన్వుని కడకుఁబోయి 'మణి నేల దీసికొనకున్నావు? ఆసత్రాజిత్తు కన్యారత్నమును మనకిచ్చునట్లు ప్రతిజ్ఞచేసి మనల నెంతయు సరకుగొనక కృష్ణున కిచ్చినాఁడే. కాన మణిని దీసికొనవలయును. వాఁడు సుఖముతోనుండఁగా మణి నెట్లును దీసికొనఁగూడ దందువా? వాఁడు తన తమ్ముఁడు† పోయినదారినే యేల పోరాదు' అని పురికొలిపెను. ఇట్లు వారిరువురును దనబుద్ధిని వేఱుగా మార్పఁగా దుష్టుఁడా శతధన్వుఁడు మణియందలి పేరాసవలనను దన కాయువు క్షీణించియుండుటంబట్టియు నా సత్రాజిత్తు పరుండి నిదురించుచుండఁగాఁ బట్టివధించెను. అంత వాఁడంతఃపురమందలి స్త్రీలందఱును 'హా'యని యఱచుచు దిక్కుమాలి బిగ్గఱ

---

* 'ఫలభాగినః' అని మూలము. సత్రాజిత్తునకుఁ బుత్రుఁడులేనందున నతనిధనమును దుదిని మనకే చెందఁగలదనియు నర్థము సేయవచ్చును.

† అనఁగా వానిని జంపి తీఱవలయుననుట.

వాపోవుచుండఁగాఁ బశుహింసకుఁడు పశువునుంబోలె వానిని జంపి మణిని గయికొని వెడలిపోయెను. సత్యభామయుఁ దనతండ్రి హతుఁడగుటనుజూచి యెంతయు శోకమున మునింగి 'తండ్రీ! తండ్రీ! అయ్యో! చచ్చితినే' యని మొఱయిడి పలవించిన దయ్యె. అంత నక్కాంత దనతండ్రిని నూనెకొప్పెరయం దుంచి హస్తినాపురమునకు, నిది తెలిసియున్నను దెలియనివానివలె నున్న కృష్ణునకుఁ దెలుపంబోయి, యతనికిఁ బితృవధమంతయుఁ జెప్పెను. ఆవృత్తాంతము నంతయు విని రామకృష్ణు లీశ్వరు లయ్యును మనుష్యచేష్టల ననుకరించుచుఁ గన్నులయందు నీరు గ్రమ్మ 'అక్కటా! మనకుఁ దుదిలేని దుఃఖముగలిగెనుగదా' యని విలపించినవారయిరి. అంతఁ గృష్ణుఁడు సత్యభామనును బలరామునినిగూడి యాహస్తినాపురమునుండి తనపట్టణ మగు ద్వారకకు వచ్చి శతధన్వునిఁజంపి వానియొద్దనుండి మణిని దీసి కొనవలయునని యుద్యుక్తుఁడయ్యెను. వాఁడును గృష్ణునిపూని క నెఱింగి భీతుఁడై ప్రాణములను గాచుకొనఁగోరి కృతవర్మను సహాయుపడ వేఁడెను. ఆకృతవర్మయు, వానితో 'రామకృష్ణు లీశ్వరులు. వారికి నేను బ్రతికూలముచేయను. వారికి నెగ్గుగావించి యెవఁడు సేమమునొందనేర్చును? అతనిని ద్వేషించుటంబట్టి కదా కంసుఁడు తన యనుచరులతోడ సిరికిని నుసుఱునకును దొలఁగినవాడయ్యెను. జరాసంధుఁడు పదియేడు యుద్ధములందు విరథుండై దేహముమాత్రముదక్క పలాయితుఁడయ్యెను' అనెను. ఇట్లు కృతవర్మ నిరాకరించిపుచ్చఁగా వాఁడక్రూరునిఁ దనకుఁ దోడుగా నుండవేఁడికొనెను. అక్రూరుఁడు వానితో 'రామకృష్ణు లీశ్వరులు. వారిబలమును నెఱిఁగినవాఁ

డెవఁడు వారితో విరోధము పెట్టుకొనును? ఎవ్వఁడు జన్మాది వికారములనొందక యీ విశ్వమునంతయు లీలచేత సృజించుచును రక్షించుచును సంహరించుచు నుండునో, విశ్వస్రష్టయగు నెవ్వని జగత్సృష్టి మొదలయిన వ్యాపారములు మాయచేత మోహితులయినవా రెఱుంగనేరరో, ఎవ్వఁ డేడేండ్లబాలుఁడై యున్నప్పుడు నొక్కచేతనే పెనుఁగొండను బెకల్చి, శిశువుపుట్ట గొడుగునుంబోలె, వేడుకగా దానిని దాల్చియుండెనో, యద్భుతకర్మ్ముండయిన యాయనంతునకును, నాదిభూతునకును, గూటస్థునకును, బరమాత్మునకు భగవంతుఁడగు కృష్ణునకు నమస్కారము' అనెను. ఇట్లక్రూరుఁడును నిరాకరింపఁగా శతధన్వుఁడా మహామణిని నాయక్రూరునియొద్దనే వైచి యశ్వము నెక్కి నూఱు యోజనముల మేర పోయెను. రాముఁడును గృష్ణుఁడును గరుడధ్వజాలంకృతం బగురథము నారోహించి మహావేగము లగు గుఱ్ఱములం బూన్చి తమమామకు ద్రోహియగు నాశతధన్వుని వెన్నాడిచనిరి. శతధన్వుఁడు శతయోజనములరిగి యంతగుఱ్ఱము డస్సి క్రిందఁబడఁగా దానిని మిథిలానగరమునుపవనమందు దిగవిడిచి మిక్కిలియు దిగులుగొని కాలినడకనే పరుగిడసాగెను. కృష్ణుండును రోషమున వెంటఁ దటిమికొని పోయెను. అట్లు కాలినడకతోఁ బరుగిడుచున్నవానిని, గృష్ణుఁడును గాలినడకనే వెంబడించి వాఁడియంచు గలతన చక్రముచేత వానితలఁ ద్రుంచి వాఁడుగట్టిన పుట్టములు రెంటియందును నామణిని వెదకెను. అయినను మణి దొరకకఁ యతఁ డన్నకడకు వచ్చి 'శతధన్వుని వ్యర్థముగాఁ జంపితిని. మణి వానియందు లేదు' అనెను. అంత బలరాముఁడు 'శతధన్వుఁ డా మణి నెవ్వఁడో యొకపురుషుని

యాయక్రూరునిఁ బిలిపించి యతనినిబూజించి మాటలాడి ప్రియ ములయినకథలనుజెప్పి తా నెల్లవారలచిత్తములను నెఱింగిన వాఁడుగాన నల్లన నవ్వుచు నతనితో 'దానపతీ! శతధన్వుఁడు శ్రీమంత మయినయాస్యమంతకమణిని నిల్లడ యుంపఁగా నీ యందు నెలకొనియున్నదిగదా. ఇది నాకు మును పే తెలియును. సత్రాజిత్తునకో పుత్త్రులు లేరు. కనుక నతనిదౌహిత్త్రులు తిలోదక ములొసంగి పిండములనిడి ఋణమునుదీర్చి మిగిలియున్న యా తని సొత్తునంతయుఁ *గయికొందురుగదా. అయినను నామణి యితరులకు ధరింప నెంతయుఁ గష్టముగాన వారలకు వలదు. సు వ్రతుండ వగునీయందే యామణి యుండుఁగాక. అయిన నొకటి గలదు. ఆమణిని గుఱించి మాయన్న నన్నుఁజక్కఁగా నమ్మకు న్నాఁడు. కాన మహాభాగా! నీ వారత్నమును నూరకచూపుము. అంతేచాలును, దానివల్ల నాచుట్టములకు నిమ్మళముగలిగింపుము. నీ కిపుడు బంగారు వేదికలతో యజ్ఞములెడ తెగక జరుగుచున్న విగదే' అనెను. ఇట్లుకృష్ణుఁడు సామవచనముల మనసు దగులు నట్లు చెప్పఁగా నక్రూరుఁడును వస్త్రముసఁ గప్పియున్న మణిని దెచ్చి సూర్యప్రభంబగుదానిని కృష్ణున కొసంగెను. కృష్ణుఁడు నాస్యమంతకమణిని జ్ఞాతులకెల్లఁ జూపి తనయందలి నెఱసును దుడుచుకొని మరలఁ దనచేతులార నే దాని నాయక్రూరున కొసంగెను. భగవంతుఁడు నీశ్వరుండయిన కృష్ణుని యాచర్యను, †సంపూర్ణమును సకలపాపహరమును నత్యంతమంగళావహంబు

* అపుత్త్రుఁడగువాని ధనమును ఋణమునకుఁ జెల్లినదిపోఁగా మిగిలినదానిని దౌహిత్త్రులు పొందుదురను శాస్త్రార్థమునిట సూచించుట తెలియునది.

† ఇట ఫలశ్రుతిఁ జెప్పుట దెలియునది.

నయిన యీయాఖ్యానమును నెవఁడు పఠించునో, వినునో, స్మరించునో వాఁడు దుష్కీర్తినిని దురితములనును బోఁగొట్టుకొని శాంతిని బొందువాఁడగును. ఇది యేఁబదియేడవయధ్యాయము.

―•―

## శ్రీకృష్ణుఁడు కాళిందిని బెండ్లాడుట.

ఒకప్పుడు పురోషత్తముఁడు, తొల్లి కనఁబడకుండి మరలద్రుపదుని గృహమున నెల్లవారికిని గనుపట్టుచుఁ బాండవు లున్నారని విని వారినిజూచుటకై సాత్యకి మొదలగుయదువులు పరివేష్టించి కొలువ నింద్రప్రస్థమునకుం బోయెను. అట్లు సర్వేశ్వరుండయిన యీముకుందుఁడు వచ్చుటనుగాంచి పాండవులు ముఖ్యం బనెడి పంచవృత్తిప్రాణము రాఁగా నింద్రియములవలె నొక్కపెట్ట దిగ్గన లేచి యెదుర్కొనిరి. అంత నావీరు లాయచ్యుతుని బిగియఁ గౌఁగిలించికొని యతని యంగముల సంగమునఁ బాపములన్నియుఁ దూలఁగా, ననురాగముతోడి చిఱునవ్వు దొలంకుచున్న యాతని నెమ్మొగమును గాంచి యెంతయు ముదము నొందిరి. కృష్ణుండును దనకుఁ బెద్దలయిన యుధిష్ఠిరునకును భీమునకును బాదాభివందనముగావించి యర్జునుని కౌఁగిలించుకొని నకులసహదేవుల యభివాదనములు గయికొనెను. అంతఁ గృష్ణుండు పరమాసనంబునఁ గూర్చుండి యుండఁగా, ననిందితయగు ద్రౌపది క్రొత్తపెండ్లికూఁతురు గావున నించుకసిగ్గుతోడ నల్లనవచ్చి యభివందనము గావించెను. సాత్యకియు నట్లె పాండవులచేత నెంతయుఁ బూజితుఁడై వారభివందనముగావింప నాసనంబునఁ గూర్చుండెను. తక్కినవారు నట్లె పూజితులై యాసనములం గూర్చుండిరి. అంతఁ గృష్ణుండు

కుంతికడకుఁ బోయి యభివందనము గావించెను. ఆయమయు నెయ్యము పొంగారి కన్నులఁగవల నీరు గ్రమ్ముచుండ నతనిని బిగియఁ గౌఁగిలించికొని వసుదేవాదు లయినబంధువుల సేమ మడిగెను. కృష్ణుండును మేనత్తతో 'అత్తా! నీవును గోడలును గుశలముగా నున్నారే కదా'? యని యడిగెను. కుంతియుఁ గృష్ణునిఁజూచి నెయ్యము పెంపున విరవిరఁబోయి, డగ్గుత్తికవడఁ, గన్నులనీరు జొబ్బిల్లఁ, దాను మున్నుపడిన యాకష్టములను ఒక్కొంటిని దలంచుకొని కష్టము నెల్లఁ బాచునట్టి దర్శనముగల యాకృష్ణునితో 'కృష్ణా! ఎప్పుడు నీవు బంధులమగు మమ్ముఁ దలంచుకొని నాతోఁబుట్టువును నక్రూరు నిట పంపితివో యపుడే మాకుఁ గుశలమయ్యెను. నీవలన మేము సనాథులమయితిమి. నీవువిశ్వమునకు సుహృదుండవు,పరమాత్ముండవు. కాన నీకు సొంతగాఁడు పెఱవాఁ డను భ్రాంతిగలుగదు. అట్లయ్యును నిన్ను నెప్పుడును స్మరించువారలహృదయమందు నెలకొని వారి క్లేశములను దూలించుచుందువు గదే' యనెను. యుధిష్ఠిరుఁడు కృష్ణునిం జూచి 'అధీశ్వరా! యోగీశ్వరులకు నయితము గనుటకుఁ దరముగాని నిన్ను నల్పమేధసుల మగుమేము గన నోఁచుతిమే! మేముతొల్లి యెట్టిపుణ్య మాచరించితిమో మాకుఁ దెలియకున్నది' యనెను. అంతరాజు యుధిష్ఠిరుఁడు వాననెల లందు నిలిచియుండవలయునని వేఁడుకొనఁగాఁ బ్రభుండు కృష్ణుఁ డింద్రప్రస్థమున వారలకుఁ గన్నులపండువు గావించుచు సుఖముగా వసించియుండెను. అంత నొకనాఁ డర్జునుఁడు కవచముదొడిగి గాండీవముగయికొని యక్షయబాణంబు లగు తూణంబులను దాల్చి వానరధ్వజాలంకృతం బగురథము నారోహించి కృష్ణుని

తోడంగూడి పరవీరులం దునుమాడు దిట్టగాన పెక్కులు దుష్ట మృగములు నెరసి నిర్జనంబై యున్న యొకవనమునందు విహరిం పంబోయెను. అట పోయి యతఁడు వాఁడిబాణములచే బులు లను, బందులనును, నెనుములనును, రురువులనును,శరభములను, గవయములనును, ఖడ్గములనును,హరిణములనును,శశములనును, శల్యకములను గాఁడ నేసెను. అప్పుడు పర్వదినము రాఁగా నా మృగములందు మేధ్యములయినవానిని గింకరులు ధర్మరాజునకుఁ గొంపోయిరి. అంత నర్జునుఁ డాఁకలిదప్పులచే బడలి యమునా నదికిఁ బోయెను. అట్లు మహారథు లయ్యిరువురు నానదియందుఁ దేటగులుకుచున్న నీటిని నాచమనముచేసి యందు మిక్కిలిసుంద రముగాఁ జూపట్టుచున్నయొకకన్నియ సంచరించుచుండఁగాఁ గాంచిరి. బలితములయిన పిఱుందులును, చెలువయిన పలువరు సయు, చక్కనిముద్దు నెమ్మొగమును గలిగి వెలుంగుచున్న యా యన్నులమిన్నను గాంచి సఖుఁడు కృష్ణుఁ డది యెవ్వరో తెలిసి కొనిరమ్మని పంపఁగా నర్జునుఁడు వోయి 'సుశ్రోణీ! నీవెవ్వతవు? ఎవ్వనికూఁతురవు? ఎక్కడనుండి వచ్చితివి? ఇట నేమిచేయఁ గోరుచున్నావు? సుందరీ! కన్యామణీ! నీవు పతిని గోరుచున్నట్లు నాకుఁదోఁచుచున్నది. ఇది చెప్పుము' అనెను. కాళింది 'నేను దేవుండగు సూర్యుని కూఁతురను. నేను వరణీయుండును వరదుం డు నగు విష్ణువును బతిగాఁగోరి యందులకై పరమంబగు తపంబు గావించున్నాను.లక్ష్మీనిలయుం డగు నద్దేవునితప్ప మఱియొక్క వీరునిఁ బతిగా వరింపనొల్లను. ఆభగవంతుఁడు దుర్లభుఁ డందు వేమో! అయిన ననాథజనుల కాశ్రయభూతుఁడుగాన యా ముకుందుఁడు నాయెడ సంతుష్టుఁ డగుఁగాక. నాపేరు కాళింది

యంద్రు. అచ్యుతుఁడు నాకు దర్శన మొసంగువఱకును నాతండ్రి యమునాజలమందు నిర్మించియిచ్చిన భవనమందు వసించుచుం దును'అనెను. అంత నర్జునుఁడును నావృత్తాంత మున్నట్లె వాసు దేవునకుఁ జెప్పెను. ఆతఁడు నిదియంతయుఁ దెలిసియున్నవాఁడు గాన యాపూవుంబోఁడిని రథముపయి నెక్కించికొని ధర్మరాజు కడకుఁబోయెను. అంతఁ బాండవులు వేఁడికొనఁగాఁ గృష్ణుఁడు విశ్వకర్మునిగొని మిక్కిలియద్భుతంబును నతివిచిత్రంబు నగునొక నగరమును బాండవులకు నిర్మించి యిచ్చెను. భగవంతుఁడు తన వారికిఁ బ్రియము సేయుకోరిక వలన నానగరమందు వసించియుండి యగ్నికి ఖాండవవనము నొసంగుటకు నర్జునునకు సారథియ య్యెను. ఆయగ్నియు సంతుష్టుఁడై యర్జునునకు గాండీవమను ధనువును ధవళము లయినయశ్వములను రథమును నక్షయ బాణంబు లగుతూణములను రెంటిని నస్త్రధారులకు భేదింప నలవిగాని కవచమును నొసంగెను. మయుఁడు నాయగ్నినుండి తప్పింపఁబడిన కతంబునఁ దనచెలికాఁడయిన యర్జునునకు మేల యినసభ నొకటి నిర్మించియిచ్చెను. ఆసభయందే దుర్యోధను నకు జలమిది స్థలమిదియని తెలియక మతిభ్రమము గలిగెను. కృష్ణుండును ధర్మరాజువలన ననుజ్ఞవడసి సుహృదు లందఱచే ననుమోదితుండై సాత్యకి ప్రముఖులు పరివేష్టించి కొలువ ద్వార కాపురమునకు వచ్చెను. అంత నతండు మిక్కిలియు శుభఋతు వును శుభనక్షత్రమును గలిగి మంచిగ్రహబలసంపత్తితోఁ గూడిన ముహూర్తమునందు పరమమంగళస్వరూపుండు గాన తనవారగు ద్వారకాపురవాసుల కందఱకునుఁ బరమా నందము గలిగించుచు నాకాళిందిని బెండ్లియాడెను.

### మిత్రవిందావివాహము.

అవంతిదేశపురాజు లగువిందానువిందు లిరువురు గలరు. వారు దుర్యోధనునకు వశవర్తులు. వారు కృష్ణుని మేనత్తయగు రాజాధిదేవి కూఁతురును దమకుఁ జెలియఁలు నగుమిత్రవిందకు స్వయంవరము గావించి యందాసుందరి కృష్ణునియందాసక్తి చూపఁగా దుర్యోధనుని పక్షమువారు గావున నాబిడకోరికను వారించినవా రయిరి. కృష్ణుండును నామిత్రవిందను రాజు లందఱుఁ జూచుచుండఁగా బలాత్కారమునఁ గయికొని పోయెను.

### సత్యా (నాగ్నజితి) వివాహము.

నగ్నజిత్తని కోసలదేశ రాజుండెను. అతఁడు పరమధార్మికుఁడు. అతనికిఁ గాంతిదళ్కొత్తు సత్యయను నొక కూఁతు రుండెను. రాజు లాకన్యను వరింపవలసినచో వాఁడికొమ్ములు గలిగి వీరులవాసనగూడ నెంతమాత్రము సయింపక మిక్కిలి దుష్టములై యెట్టివారికిని జెనకఁదరము గాకున్న గోవృషము లేడింటిని గెలిచి తీఱవలయును. లేనిచో నాపడఁతిని బెండ్లియాడ శక్యముగాదయ్యె. అంతభగవంతుఁ డాయదుకులతిలకుండు వృషములను గెలిచియె యాచెలువను గయికొనవలయు ననుటను విని మహాసైన్యము బలసికొలువఁ గౌసల్యపురమునకుఁ బోయెను. ఆకోసలరాజును గృష్ణున కెదురుచని యాసనాదులొసంగి గొప్పపూజలను గావించి కడు నానందింపఁ జేసెను. ఆరాజకన్యయుఁ దనమనసునకు మిక్కిలియుఁ గూర్చునట్టి మేటివరుఁడగు లక్ష్మీపతి కృష్ణుఁడు వచ్చియుండుటను గాంచి యతనినెంతయుఁ గామించి 'ఈతఁడు నాకుఁ బతియగుఁగాత. నేను బుణ్యములను సలిపినదాన నేని,నా కామితములనెల్ల నితఁడు నిక్కము గావించుఁ గాక'యని

యందు. అచ్యుతుఁడు నాకు దర్శన మొసంగువఱకును నాతండ్రి యమునాజలమందు నిర్మించియిచ్చిన భవనమందు వసించుచుం దును'అనెను. అంత నర్జునుఁడును నావృత్తాంత మున్న ట్లె వాసు దేవునకుఁ జెప్పెను. ఆతఁడు నిదియంతయుఁ దెలిసియున్న వాఁడు గాన యాపూవుంబోఁడిని రథముపయి నెక్కించికొని ధర్మరాజు కడకుఁబోయెను. అంతఁ బాండవులు వేఁడికొనఁగాఁ గృష్ణుఁడు విశ్వకర్మనుగొని మిక్కిలియద్భుతంబును నతివిచిత్రంబు నగునొక నగరమును బాండవులకు నిర్మించి యిచ్చెను. భగవంతుఁడు తన వారికిఁ బ్రియము సేయుకోరిక వలన నానగరమందు వసించియుండి యగ్నికి ఖాండవవనము నొసంగుటకు నర్జునునకు సారథియ య్యెను. ఆయగ్నియు సంతుష్టుఁడై యర్జునునకు గాండీవమను ధనువును ధవళము లయినయశ్వములను రథమును నక్షయ బాణంబు లగుతూణములను రెంటిని నస్త్రధారులకు భేదింప నలవిగాని కవచమును నొసంగెను. మయుఁడు నాయగ్నినుండి తప్పింపఁబడిన కతంబునఁ దనచెలికాఁడయిన యర్జునునకు మేల యినసభ నొకటి నిర్మించియిచ్చెను. ఆసభయందే దుర్యోధను నకు జలమిది స్థలమిదియని తెలియక మతిభ్రమము గలిగెను. కృష్ణుండును ధర్మరాజువలన ననుజ్ఞవడసి సుహృదు లందఱచే నను మోదితుండై సాత్యకి ప్రముఖులు పరివేష్టించి కొలువ ద్వార కాపురమునకు వచ్చెను. అంత నతండు మిక్కిలియు శుభఋతు వును శుభనక్షత్రమును గలిగి మంచిగ్రహబలసంపత్తితోఁ గూడిన ముహూర్తమునందు పరమమంగళస్వరూపుండు గాన తనవారగు ద్వారకాపురవాసుల కందఱకునుఁ బరమా నందము గలిగించుచు నాకాళిందిని బెండ్లియాడెను.

## మిత్రవిందావివాహము.

అవంతిదేశపురాజు లగువిందానువిందు లిరువురు గలరు. వారు దుర్యోధనునకు వశవర్తులు. వారు కృష్ణుని మేనత్తయగు రాజాధిదేవి కూఁతురును దమకుఁ జెలియలు నగుమిత్రవిందకు స్వయంవరము గావించి యందాసుందరి కృష్ణునియందాసక్తి చూపఁగా దుర్యోధనుని పక్షమువారు గావున నాబిడకోరికను వారించినవా రయిరి. కృష్ణుండును నామిత్రవిందను రాజు లందఱుఁ జూచుచుండఁగా బలాత్కారమునఁ గయికొని పోయెను.

## సత్యా (నాగ్నజితి) వివాహము.

నగ్నజిత్తని కోసలదేశ రాజుండెను. అతఁడు పరమధార్మికుఁడు. అతనికిఁ గాంతిదళ్కొత్తు సత్యయను నొక కూఁతు రుండెను. రాజు లాకన్యను వరింపవలసినచో వాఁడికొమ్ములు గలిగి వీరులవాసనగూడ నెంతమాత్రము సయింపక మిక్కిలి దుష్టములై యెట్టివారికిని జెనకరాదరము గాకున్న గోవృషము లేడింటిని గెలిచి తీఱవలయును. లేనిచో నాపడఁతిని బెండ్లియాడ శక్యముగాదయ్యె. అంతభగవంతుఁ డాయదుకులతిలకుండు వృషములను గెలిచియె యాచెలువను గయికొనవలయు ననుటను విని మహాసైన్యము బలసికొలువఁ గౌసల్యపురమునకుఁ బోయెను. ఆకోసలరాజును గృష్ణున కెదురుచని యాసనాదులొసంగి గొప్పపూజలను గావించి కడు నానందింపఁ జేసెను. ఆరాజకన్యయుఁ దనమనసునకు మిక్కిలియుఁ గూర్చునట్టి మేటివరుఁడగు లక్ష్మీపతి కృష్ణుఁడు వచ్చియుండుటను గాంచి యతనినెంతయుఁ గామించి 'ఈతఁడు నాకుఁ బతియగుఁగాత. నేను బుణ్యములను సలిపినదాననేని, నా కామితములనెల్ల నితఁడు నిక్కము గావించుఁ గాక' యని

కోరెను. అనగ్నజిత్తును గృష్ణు నట్లర్చించి యతనితో 'నారాయణా! జగత్పతీ! నీవు నీయాత్మస్వరూపానందముచేతనే పరిపూర్ణుండవు. ఇట్టి నీకు నతిక్షుద్రుండ నగు నే నేమి ప్రియముసేయ నేర్తును? ఎవ్వని పాదారవిందపు ధూళిని శ్రీదేవియు బ్రహ్మయు శివుండును లోకపాలురును శిరంబులం దాల్తురో, ఎవ్వఁడు తాను గావించిన ధర్మమర్యాదలను గాచుటకై ధర్మమును జ్ఞానమును గుందువడు కాలమున లీలావిగ్రహములను దాల్చుచుండునో, *యట్టిభగవంతుఁడు నాకైంకర్యము దేనిచేత సంతుష్టుఁడగును'? అనెను. కృష్ణుండు నాసనమును గయికొని చిఱునవ్వు నవ్వుచు మేఘగంభీరం బగు వచనమున నతనితో 'నరేంద్రా! స్వధర్మనిరతుండగు క్షత్రియునకు యాచించుట పెద్దలు మిక్కిలియు నిందించినను, నీతోడి బంధుత్వమునుగోరి నీదుకన్నియను యాచించుచున్నాను. అయినను మేము శుల్కాదుల నిచ్చువారము గాముసుమీ' యనెను. అందులకు నగ్నజిత్తు 'నాథా! నీవు గుణములకెల్ల మేటి యాటపట్టవు. నీవక్షమునందు లక్ష్మీదేవి యెప్పుడు నెడఁబాయక వసించుచుండును. ఇట్టి నీకంటెను నభీష్టుఁడయిన వరుఁడు నాకన్నియకు మఱియెవ్వఁడు గలఁడు? యదుసింహమా! అయినను మేము మునుపే మాకన్నియకు వరునిఁ బరికించుటకై వచ్చు పురుషుల వీర్యమును బరీక్షించుకొఱకు నొకసమయము గావించికొని యున్నారము. ఇవిగోఁ జూడుము గోవృషము లేడింటిని! ఇవి యింకను నడఁచిమడఁచి మెలంపఁబడినవి గావు. కాన

* 'దీఁవలన 'నీవు నారాయణుండవే యగుదువు; ధర్మపరిత్రాణము కొఱకు యుగములం దవతరించి యున్నాఁడవు' అని నగ్నజిత్తు దెలియుట తెలియవలె.

యించుకయు నెట్టివారికిని లోఁకువగావు. రాజకుమారులు పెక్కండ్రు వీనిచేత భగ్నులై భిన్నగాత్రులయిరి. యదునందనా? ఇవి నీచేత నే నడంపఁబడు నేని, శ్రియఃపతీ! నాకూఁతునకు నీవు నభిమతుం డగు వరుండ వగుదువు' అనెను. ఇట్లాతని సమయమును విని ప్రభుండు కృష్ణుఁడు చేల నడుమున బిగించి కట్టికొని తన్ను నేడువురు గావించుకొని యావృషములను నవ లీలగాఁ బట్టి యడంచెను. ఇట్లు కృష్ణుండు వాని కొమ్ములువిఱిచి వీర్యంబులఁదూల్చి త్రాళ్లచే వానిని బంధించి బాలుఁడు దారములచే మ్రానిబొమ్మలను గట్టిలాగువిధమునఁ బట్టి లాగెను. అంత రా జెంతయు సంతోషమును విస్మయమునుబురికొనఁ దన కుమారి నొసంగెను. కృష్ణుఁడును దనకు సమానురాలయిన యాకొమరాలిని యథావిధిగాఁ గయికొనెను. ఆరాజు భార్యలును దమకుమారికిఁ గృష్ణుఁడు మిక్కిలియుఁ బ్రియుండయిన పతిగా లభించుటకుఁ బరమానందము నొందిరి. అప్పుడా పురమున నెంతయు నుత్సవముగలిగెను. శంఖములును భేరులును నానకములును మొరసెను. గీతములును వాద్యములును విప్రాశీర్వాదములును నొక్కపెట్టఁ జెలంగెను. స్త్రీలును బురుషులును మిక్కిలియు ముదంబులు పొదల మేలయిన వలువలుగట్టి చక్కఁగా నలంకరించుకొని యుండిరి. అంత విభుం డగు నగ్నజిత్తును గూఁతునకు బదివేల ధేనువులును, కానులదండలు మెడల గండరింప మేలయిన పుట్టములు గట్టియున్న దాసికలను మూఁడువేలను, తొమ్మిది వేల గజములను, ఏనుంగులకు నూఱుమడుంగులు రథములను, రథములకు నూఱింతలు గుఱ్ఱములను, గుఱ్ఱములకు నూఱురెట్లు పదాతులను నరణముగా నొసంగెను. అపుడు నెయ్యము మనం

బుల నెక్కొనుచున్న యావధూవరులను జెనుసైన్యము పరివేష్టించి కొలువ రథమునెక్కించి వారిపురమునకుఁ బంపిరి. కృష్ణుండు కన్యను గొనిపోవుచుండుటను విని మున్ను యదువుల చేతను నేడు గోవృషములచేతను వీర్యములు భగ్నములయ్యును దుర్ధర్షులై యున్న రాజులు దారియందుఁ గన్నియను గొనిపోవు చున్న యాకృష్ణుని నడ్డగించిరి. అంత నర్జునుఁడు తనబంధువగు కృష్ణునకుఁ బ్రియముసేయువాఁడై గాండీవముగొని యారాజులు బాణసమూహము లేయుచుండఁగా సింహము క్షుద్రమృగంబులనుంబోలె వారినెల్లఁ బలాయితులం గావించెను. అంత భగవంతుఁ డాకృష్ణుఁ డరణమును దీసికొని ద్వారకాపురమును జేరి యీయదుసింహుఁడు సత్యారమణిం గూడి నిచ్చలు రమించుచుండెను. అంతఁ గృష్ణుని మేనత్తయగు శ్రుతకీర్తి కూఁతురును కేకయరాజు కన్యయు నగుభద్రను నాబిడ తోఁబుట్టువులయిన సంతర్దనుఁడు మొదలగువారొసంగఁగాఁ గృష్ణుండు పెండ్లాడెను. మద్రరాజుకూఁతును శుభలక్షణలక్షిత యగులక్షణను స్వయంవరమందు గరుడుఁ డమృతమునుంబోలె దా నొక్కఁడును గొనిపోయెను. మఱియుఁ గృష్ణుండు నరకాసురునిఁజంపి వాని చెఱయందుండినకన్నియలను సొగసుకత్తియలను గూడ వరించెను గాన యీముఖ్యపత్నులం బోలిన నారలతనికి వేనవేల మంది సుందరులును గలిగియుండిరి. ఇది యేఁబదియెనిమిదవ యధ్యాయము.

### నరకాసుర వధారంభము.

రాజు భగవంతుఁడగు కృష్ణునిచేత నరకుం డేకారణమున హతుండయ్యెనో, వాఁ డాస్త్రీల నేల చెఱపెట్టియుంచెనో యది యు,శార్ఙ్గధన్వుం డగు నాకృష్ణుని పరాక్రమమును నాకు వివరింపుము' అని యడిగెను. శుకుఁడు 'నరకుఁడు వరుణునిఛత్రమును హరించి యదితి కుండలములను బలిమిని దీసికొని, మేరుపర్వతమును మణిపర్వతస్థానమును గయికొని పోవఁగా,నింద్రుఁడు వాని యీ చేష్టితములనుఁ గృష్ణునకుఁ దెలిపెను. అతఁడును * భార్య యగుసత్యభామను గూడి గరుడారూఢుండై యంతఁ బ్రాగ్జ్యోతిషపురమునకుఁ బోయెను. ఆపురము పర్వతదుర్గమును శస్త్రదుర్గమును జలాగ్నివాయు దుర్గములును జుట్టుఁ గలిగి బెట్టిదములయి మిక్కిలిగట్టిగానున్న † మురపాశములు వేనవేలు నలుగడల నావరించి యున్నందున నెట్టివారికిని జొర నలవిగాకుండెను.

---

*సత్యభామను దోడ్కొనిపోవుటకు నాపడఁతికి వేడుకగాఁ బోలును. లేక భగవంతుఁడు భూదేవితో 'నీయనుజ్ఞగానియే నీకొడుకును నరకాసురునిఁ జంపుదు' నని యితిహాసమునందుఁ జెప్పఁబడినట్లు భూమికిచ్చిన యావరమును నిజముగావించుటకు భూమి యంశమగు సత్యభామతోఁగూడఁ బోయెనని కాని, లేక నారదుఁడు దెచ్చిన పారిజాతపుష్పము రుక్మిణి కిచ్చినందులకుఁ గుపితయైన సత్యభామను నూఱడించుటకై 'నీకుఁ బారిజాతవృక్షమునే యిచ్చెద'నని హరివంశమునఁ జెప్పఁబడినట్లు అందులకై తోడ్కొనిపోయెనని కాని' గ్రహింపవచ్చును. అభేద్యములయిన యైదుదుర్గములు గలిగియుండుటచే గరుడునిపై నెక్కిపోవుటకుఁ గారణమని తెలియునది.

† మురపాశములనఁగా మురాసురుఁడు వైచిన పాశవిశేషములు, అవి నలుగడలవైపఁగా దాపునకువచ్చిన శత్రువును గట్టిగాఁబట్టుకొని నేలఁబడఁగూల్చుచుండును.

ఆకృష్ణుఁడు గదచేత దుర్గమై యున్నపర్వతములను, బాణముల చేత శస్త్రదుర్గములను, చక్రముచేత నగ్నిజలవాయుదుర్గములను, ఖడ్గముచేత మురపాశములను, దుత్తుమురుగావించెను. మఱియు నాగదాధరుఁడు శంఖధ్వనిచేత యంత్రములను దిట్టలగు మురాసురాదుల హృదయములను, పెద్దగదచేతఁ బ్రాకారమును, భిన్నములు గావించెను. యుగాంతకాలమునఁ బడు పిడుగులవలె భయంకరమయిన యాపాంచజన్యధ్వనిని విని పరుండియుండిన మురాసురుఁడు పంచశిరస్సులు గలవాఁడు జలమునుండి పయికి లేచెను. ఆయసుర యుగాంతకాలసూర్యుఁడును నగ్నియుంబోలె వెలుంగుచు నెంతయుఁ దేఱిచూడరాక దుస్సహుండై త్రిశూలమును గేలనెత్తికొని తనయైదు ముఖములచేత మూఁడులోకములను మ్రింగువానివలెఁ జూపట్టుచు గరుడునిపయిని సర్పమువలె హరిపయి నుపదశించెను. నా డాశూలమును గిరగిరం ద్రిప్పి బలముకొలఁదిని గరుడునిపయిని విసరివైచి యైదు నోళ్లను దెఱచి బిగ్గఱగా నొక్కపెట్ట నార్చెను. ఆ మహాధ్వని భూమిని నాకాశమును దిక్కులనన్నిటిని రోదసిని, వేయేల బ్రహ్మాండకటాహము నంతయు నిండి మిక్కిలియు దెప్పరమై యావరించెను. వాఁడు గరుత్మంతునిపయి నపహరించిన గదను గృష్ణుండు రెండుతూపులనుగొని బలిమి మొఱసి యేసి తుత్తునియలు గావించి వానిముఖములందు బాణములు గాఁడనేసెను. వాఁడును గృష్ణునిపయి రోషమున గదను విసరివైచెను. అట్లు తనపయికి వచ్చుచున్న యాగదను గదాధరుఁడు కృష్ణుఁడు తనగదచేత వేయిదునియలు గావించెను. అంత వాఁడు చేతులెత్తికొని పయిఁబడి వచ్చుచుండఁగాఁ గృష్ణుండు చక్రము

చేత నవలీలగా వాని శిరములు ద్రుంచివైచెను. వాఁడు తలలు దెగి యింద్రుని తేజం బగువజ్రంబున శిఖరములు దెగి పడు పర్వతమువలె, నుసులు వీడి జలములందుఁ ద్రెళ్లెను. వాని కొడుకులు తామ్రుఁడు, అంతరిక్షుఁడు, శ్రవణుఁడు, విభావసుఁడు, వసువు, నభస్వంతుఁడు, అరుణుఁడు నని యేడ్వురు గలరు. వారు తండ్రివధమున కెంతయు దుఃఖితులై, పగదీర్చుకొనవలయు ననురోషము మల్లడిగొన, నరకుండును బురికొలుప యుద్ధమునకై పూని యాయుధంబులుగొని పీఠుం డనువాని సేనాపతిగాఁ బురస్కరించుకొని బయలు వెడలిరి. వారు కృష్ణునిఁ దారసించి బాణములను, గత్తులను, గదలను, శక్తులను, యష్టులను, శూలములను, గోపంబునఁ జెలంగుచుఁగృష్ణునిపైఁ బ్రయోగించిరి. భగవంతుఁడును నమోఘవీర్యుండుగాన యాబాణసమూహమును దన బాణములచేతఁ దిలలంతేసిగాఁ దుత్తునియలు గావించెను. అంతఁ బీఠుండు మొదలయిన యారాక్షసముఖ్యులను, దలలను, దొడలను, బుజములను, చరణములను, దేహములను, గవచములను దుండించి యమునింటికిఁ బంపెను. దుర్ధర్షుఁడగు నరకుఁడు తన సేనాపతులు కృష్ణునిబాణముల నట్లు బ్రుంగుటను గాంచి సముద్రమునంబుట్టినవై మదజలములు బిట్టు గార్చుచున్న మేలిగజములను గూడి వెడలివచ్చెను. అట్లు వచ్చి సూర్యునిపయిని మెఱపుఁదీఁగతోఁ గూడియున్న మేఘముంబోలి గరుడునిపయి నిల్లాలగు సత్యభామతోఁ గూడియున్న యాకృష్ణునిఁగాంచి యతనిపయిని శతఘ్నిని బ్రయోగించెను. వాని యోధులందఱు నొక్కపెట్టఁ దమతమ యాయుధములచేత నతనిని గారించిరి. భగవంతుఁడు

కృష్ణుఁడు నా నరకాసురుని సైన్యమును జిత్రములగు తెక్కలు
గట్టిన వాఁడితూపులచే బుజములను,దొడలను, దలలను,గుత్తుక
లను, దేహములను గండతుండెములుగాఁ ద్రుంచి యందలి
యశ్వములను గజములను దునిమి తూఁటాడెను. నరకాసురుని
యోధులు ప్రయోగించిన శస్త్రాస్త్రము లొక్కొక్కటికిని గృ
ష్ణుఁడు గరుడునిపయినుండి, మూఁడేసి వాఁడిబాణము లేసి
నుగ్గు గావించెను.గరుడుండును గృష్ణుని మోచుచునే తనయిరు
తెక్కలచే నేనుంగులను బడఁగొల్చుచుండెను. గరుత్మంతుఁడు
తన తుండముచేతను నఖములచేతను గజములను దూల్చుచుం
డఁగా, నవి యెంతయు నార్తినొంది పట్టణము వంకకుఁ బరువి
డిచొచ్చినవి.నరకుం డొక్కఁడును యుద్ధంబున నిలిచి పెనఁగెను.
వాఁడు తనసైన్యము గరుడునిచేత నలఁగి పరుగెత్తుచుండుటను
గాంచి తొల్లి యింద్రుని వజ్రమునుగూడ దూలించిన తనశక్తిని
గొని యాగరుడునిఁ గొట్టెను. గరుడుఁ డాశక్తిచేఁ గొట్టువడియుఁ
బూదండచేతఁ గొట్టువడినయేనుఁగువలె నించుకయుఁ జలిం
పఁడయ్యె. అట్లు గరుడునియందుఁ దనపూన్కి వ్యర్థము గాఁగాఁ
గృష్ణుని వధించుటకు వాఁడు శూలమును గయికొనెను. నర
కుఁ డా శూలమును వైచుటకుమునుపే హరి గజముపయి నున్న
వానిశిరసును వాఁడియంచు గలతనచక్రముచేతఁ ద్రుంచి
కూల్చెను. కుండలయుక్తమై సొగసైన కిరీటముచే నీటుగులు
కుచున్న వానిశిరసు నేలం గూల్పఁబడి యెంతయు మెఱయుచుం
డెను. అంత ఋషులును దేవతావరులును 'హాహా' యనియు
'బాగు బా'గనియు ముకుందునిపయిఁ బూవులు వెదచల్లుచు
నెంతయుఁ బొగడిరి. అంత భూదేవి కృష్ణునికడకువచ్చి మేలి

కడానిబంగరుచేతను రతనములచేతను దలతల మెఱయుచున్న యదితి కుండలములను, వరుణుని ఛత్రమును, మేరుపాలయిన మందర శిఖరం బగు మహామణిని, వైజయంతియును వనమాలి కతోఁగూడ హరికి సమర్పించెను. అంత నాభూదేవి భక్తిప రాయత్తం బగు బుద్ధితోడ దేవదేవులచేత నర్చితుండును విశ్వే శుండు నగు నాకృష్ణునిఁ బ్రణతయై యంజలిగీలించి యిట్లనిస్తు తించెను.

భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట.

భూదేవి— దేవదేవేశా! శంఖ చక్ర గదాధరా! పరమాత్మా! భక్తుల ననుగ్రహించుకోరికచే విగ్రహములం దాల్చు నీకు నమస్కారము. పంకజనాభుఁడును, పద్మమాలికాధరుండును, పద్మనేత్రుండును, పంకజములంబోని పదములుగల వాఁడు నగు నీకు నమస్కారము. వాసుదేవుండును, మన్వాది పురుషరూపుండును, ఆదికారణుండును, విష్ణుండును, స్వానందానుభవపరిపూర్ణుండును భగవంతుండు నగు నీకు నమస్కారము. జగమునకెల్ల నింపుఁజేయువాఁడును గార్యముల వికారములు లేకుండునజుండును బరబ్రహ్మంబును ననంతశక్తుండును, పరాత్ముండును భూతాత్ముండును బరమాత్ముండు నగు నీకు నమస్కారము. విభూ! నీవు తొలుత * సృజింపఁగోరి రజస్సును

---

* ఇట రజస్సునుమిక్కుటముగాఁదాల్చియుండు వనఁగా రజోగుణ ప్రధానుఁడగు చతుర్ముఖుండను దేహమును బ్రవేశించి సృజింతువనుట. ఇట్లే తమప్రధానము లగు రుద్రాదుల దేహములను బ్రవేశించి సంహారమును సత్త్వప్రధానములగు మన్వాదిశరీరములను దాల్చి రక్షణమును గావింతువని భావము. సృష్టిసంహారములు నద్వారకముగఁజేసినను స్థితిని మాత్రము అద్వారకముగ నీవే

నుత్కటముగాఁ దాల్తువు. జగములను సంహరించుటకొఱకు మిక్కుటముగాఁదమస్సును, స్థితికొఱకు మిక్కుటముగా సత్త్వమును దాల్చియుందువు. స్థితియందుమాత్ర మితరజీవాదులచే సంవృతుఁడవు గాక కేవలము నీయవతారరూపముననేదానిని గావింతువు.* కాలమును, ప్రధానమును పురుషుఁడు,నివిగాక తక్కినయదియు నీవేయగుదువు. నేనును, జలమును, అగ్నియును, వాయువును, ఆకాశమును, శబ్దాదులగు తన్మాత్రలును, ఇంద్రియాధిష్ఠాతలగు దిగ్వాతాది దేవతలును, ఇంద్రియములును, అహంకారమును, మహత్తును, చరాచర మఖిలమును, సమానవస్తువు మఱియొకటి లేమింజేసి యద్వితీయుండవై ప్రకృతి పురుషకాలశరీరకుండవై యున్న నీయందే, మట్టియందుఁ గుండయుంబోలె నున్నవి.కుండ మట్టియగునట్లు, అవి నీకంటె భిన్నములు గావు. భగవంతా ! ఈపృథివ్యాదులు స్వతంత్రవస్తువు లనెడి యీమతి, వట్టి భ్రమయేకాని మఱేమికాదు. ఆ నరకాసురుని కొడుకు వీఁడు భీతుండవై, ప్రపన్నార్తిహరా ! నీ పాదారవిందమును శరణుఁజొచ్చినాఁడు. వీనిని బాలింపఁగదే. అఖిలకల్మషహారంబయిన నీ హస్తపంకజమును వీని శిరమునం దుంపఁగదే' యని ప్రార్థించెను.

{ కృష్ణుఁడు నరకాసురుని యంతఃపురమం దున్న రాజకన్యకాదులనెల్లఁ గొనిపోవుట. }

శుకుఁడు—ఇట్లు భూదేవి భక్తిచే వినమ్రయై స్తుతివచనం

చేయుదుమని యిట భావము దెలియునది. ఇందులకై మూలమున 'అనంవృతః' అని యున్నది.

* ఇవి యొల్లశరీరముగాఁ గలవాఁడవని భావము.

బుల నర్చింపఁగా భగవంతుఁ డభయం బొసంగి సకలసంపత్స మృద్ధిచే సొంపారుచున్న యా నరకాసురుని భవనమును బ్రవేశించెను. అందు హరియు నరకాసురుండును బెక్కులు రాజుల వలననుండి బలత్కారమునఁ జెఱలుగొని పెట్టియున్న రాజకన్యకలను బదాఱువేలమందిని గాంచెను. అతఁ డందుఁ బ్రవేశింపఁగానే యా పూవుంబోండ్లు మేటివరుం డయినయతనిని జూచి, తమకు భాగ్యవశమున మనస్సునకు మిక్కిలియుఁ గూర్చునట్టి వరుండు ప్రాప్తించెనని యెంతయు మోహితలై మనంబులందుఁ దమ కతిప్రియుండయిన వరునిఁగా వరించిన వారయిరి. వారు తమలో 'ఇతండు నాకుఁ బతియగుఁగాత. నా యీకోర్కి యా బ్రహ్మ యనుమోదించుఁగాక'యని యందఱును వేఱువేఱ కృష్ణునియందు శృంగారభావంబు పొంగారఁ దమహృదయముల నెలకొలిపిరి. అంతఁ గృష్ణుఁడు వారిని జలకమార్చి నెఱసులేని మేలివలువలు దొడుగం జేసి పల్లకీలపయిని ద్వారకాపురమునకుఁ బంపెను. మఱి మిక్కిలియు వెలపొడుగయిన రథములను మిక్కుటమయిన ధనమును, ఐరావతకులమందుఁ బుట్టినవియు మిక్కిలియు బలముగలవియు నాలుగు దంతములతోఁ గూడినవియు నగు తెల్లని గజములను నఱువదినాలుగింటిని హరి ద్వారకకుఁ బంపెను.

**శ్రీ కృష్ణుండు పారిజాతమును గొనివచ్చుట.**

అంతఁ గృష్ణుఁ డింద్రుని మందిరమునకుఁబోయి యదితికిఁ గుండలములనిచ్చెను. దేవేంద్రుఁడును శచియు నాకృష్ణునినిసత్యభామను నెంతయుఁ బూజించిరి. అంతఁ గృష్ణుఁడు దనకాంత పురికొలుపఁగాఁ బారిజాతమును బెకల్చి గరుడునిపయి నుంచి యందుల

కయి యెదిర్చిన యింద్రాదిదేవతలను జయించి తనపురమునకుఁ గొంపోయెను. అట్లుకొనిపోయి దానిని సత్యభామయింటి పెరఁటి పూఁదోఁటయందు నందముగులుకునట్లు నాఁటెను. అంతఁ దుమ్మెద కదుపు లాపారిజాతంబు గమగమతావులు గుబాళించు మకరందమునకుఁ బేరాసపడి స్వర్గమునుండి దాని వెంటనంటి వచ్చినవయ్యె. ఇంద్రుఁడుఁ దనకిరీటాగ్రములు కృష్ణునిపాదములను సోఁక మ్రొక్కి యతనియర్థుల కోరికల నెల్లఁ గొనసాగించు నాపారిజాతమును దొలుత యాచించెను. అంత నది తనకు దొరకుటవలనఁ గృతార్థుఁడై యపుడే యతని తోడ విరోధించెను. మరల యాచించి దానినిబడసి మిక్కిలి యాఢ్యుఁడయ్యెను. ఇస్సీ! వారియహంకారమును వారియాఢ్యతయును గాల్పనా!

### నరకాంతఃపురమునుండి తెచ్చినరాజకన్యలను కృష్ణుఁడు పెండ్లియాడుట.

అంత నవ్యయుం డాకృష్ణుం డొక శుభముహూర్తంబున నాసుందరులను వారివారిమందిరంబులందు, వా రెందఱో యన్నిరూపులం దాల్చి పెండ్లాడెను. అచింత్యములగు కృత్యము లాచరించునట్టి యాభగవంతుఁడు మనుజరూపముదాల్చి యున్నను దన యసాధారణదివ్యప్రభావము విడువక స్వానందానుభవపరిపూర్ణుం డయ్యును భోగ్యవస్తువుల పెంపుసొంపున నీడుంజోడుగాని యెక్కుడుగాని లేక యక్కజంబై యుండు వారలగృహములందు నెప్పుడును నెడఁబాయక నెలకొని యుండి ప్రాకృతుం డగుజనునివలె గృహస్థధర్మముల నాచరించుచు రమణీయ లయిన యారమణీమణులతోడ రమించిన

వాఁడయ్యె. ఆమురారి కృష్ణుఁ డపరిచ్ఛిన్నుఁడు సమాభ్యధికర హితుఁడు.మఱి భక్తుల చిత్తము ననువర్తించువాఁడు. కనుక నట్టివానికిఁ దన యిల్లాండ్రయందు నొక్కొక్కడినే వారివారికిఁ దగు రూపమును వేఱువేఱ తాల్చుట యొకచిత్రమా ! వాని యద్భుతములలో నీవింత యెంతమాత్రము ! యోగేశ్వరేశ్వరుండయిన యాకృష్ణుఁ డప్పుడేకాదు; ఇప్పుడునయితము హృదయము లోపలను వెలుపలను మఱిచుట్టును బరిపూర్ణభక్తి యోగు లగువారికి వందలతెఱంగులను వేనవేల చందములను దానెంతయును జూపట్టుచున్నాఁడు. ఇట్లు బ్రహ్మాదులునయిత మెవ్వనిమహిమను దెలియఁజాలరో యట్టి లక్ష్మీనాథునిఁ గృష్ణునిఁ బతిగాఁబడసి యాపడంతు లంతకంతకు ననురాగంపుఁ జెఱునవ్వులు నాలుకొను చికిలిచూడ్కులతోడి నవకంపుఁ గూటువలును నర్మంపుఁ బలుకులును నునుసిగ్గులును నగ్గలింప ముదంబులు పెచ్చుపెరుఁగ నతనిని గొలుచుచుండిరి. మఱియు నాముద్దియల కొక్కొకతికిని వేఱువేఱ దాసికలు వందలకొలఁది నుండియునుఁ దమ విభునకుఁ గృష్ణునకుఁ దామె యెదుర్కొని వచ్చి మేలయిన యాసనంబు లొసంగి, యడుగులుగడిగి, కప్పురంపు విడియములిచ్చి, బడలికలు వాయ వీవనలు విసరి, గంధము లలంది, పూదండలు దొడిగి, కురులు చక్కదువ్వి, సెజ్జలుపఱచి, జలకములార్చి, వలయుకానుక లొసంగి యూడిగములు సేయుచుండిన వారయిరి.' ఇది యేఁబదితొమ్మిదవయధ్యాయము.

### శ్రీరుక్మిణీకృష్ణులకుఁ బరస్పరము సరసవిరసోక్తులు.

ఒకానొకప్పుడు రుక్మిణీదేవి జగన్నాథుండు కృష్ణుండు దన పర్యంకమునందు సుఖముగా నాసీనుండై యుండఁ దనకెంగేలఁ జామరగొని వీచుచుఁ జెలికత్తియలుం దానును నతనికిఁ బరిచర్య గావించుచుండెను. ఎవ్వఁడీ జగమునంతయు నవలీలగా సృజించుచును రక్షించుచును సంహరించుచునుండునో, జగదీశ్వరుఁ డతఁడే తనకావించినయట్టి ధర్మమర్యాదలను రక్షించుకొఱకు నజుం డయ్యు యదువులం దవతరించినవాఁడయ్యెఁ గాని మఱి యొకఁడుగాఁడు. ఆయంతఃపురములోని మందిరమునఁ జకచకని ముత్తియపుసరులు జాలరులుగా వ్రేలుచున్న యొక మేలుకట్టు తలతల మెఱయుచుండెను. మణిమయములగు దీపములు నలుప్రక్కల రాణించుచుండెను. మఱియు నందు గుమగుమ వాసనలకుఁ దుమ్మెదకదుపులు మూఁగి ఝుం ఝుం మ్మని రవళులు సేయు నుల్లసిలుచున్న మల్లెపూదండలును ధూపములును నేపారుచుండెను. మఱియు నుదయచంద్రుని యొఱ్ఱని వెలుంగులు కిటికీల సందులంజొచ్చి దాని సోకయందము గూర్చుచుండెను. మఱియుఁ బూఁదోఁటయందు నీటుగులుకుచున్న పారిజాతపుఁ జెట్లచాలునుండి కమ్మని తావుల గుబాళించుచుండు నెలదెమ్మెరలు పొలయుచుండెను. మంచి యగరుకట్టియల ధూపములు గవాక్షములసందులనుండి బయలువెడలుచుండెను. అట్టి కేళికాగృహమునఁ బాలనురువుంబోలి తెల్లనయి మేలయిన దుప్పటి పఱచియున్న యొక మంచమున జగత్పతి యాయీశ్వరుండు హాయిగాఁ గూర్చుండియుండఁగా రుక్మిణి యతని నల్లనఁ గదిసివచ్చెను. ఆ మెఱుఁగుంబోఁడి చెలికత్తియలచేత రతనంపుఁగాఁడతోఁ

గూడియున్న వింజామరను దానందుకొని యీశ్వరుని కల్లనల్ల వీచుచుఁగొలిచియుండెను. ఇట్లా చెలి రతనాలగిలుకుటందియలు గల్లుగల్లని మొరయించుచు,నుంగరములును గడియములును వింజామరయును ముంజేత రంజిలుచుండఁ,బయంట చెఱంగు మఱుంగునమిట్టాడు మెఱుంగుగబ్బిగుబ్బలకుంకుమ చేత నెఱు పెక్కినహారము మెఱయుచుండ,బలితంపుఁ బిఱుందులపయిని మిక్కిలియు వెలపొడుగయిన మొలనూలు దళుకొత్తుచుండ, నాకృష్ణుని దండ నెంతయు గొనబు మిటారించుచుండెను. మనుష్యరూపము దాల్చిన యామహాలక్ష్మిని, ఏయవతారమందును దన్నే కృష్ణునే పతిగా వరించియున్న యాపతివ్రతామణిని, లీలార్థముతానే రూపముదాల్చినను దాని కనురూపమయిన రూపుదాల్చుచుండునా నాయికారత్నమును,గృష్ణుండుచూచి నెన్నుదుటిపయి నలకలు తుంపెసలాడ, నిద్దంపుమెఱుంగుఁగమ్మ లెమ్మెలు చూప, రతనాలపతకములు కుత్తుకయందుఁ దళతళమని యత్తమిల్లఁ, దళుకొత్తుచున్న యాజవరాలి ముద్దునెమ్మొగమునందు నమృతరస మూరినట్లు దియ్యనై యొయ్యనినవ్వు మొలకొత్తుచున్నందులకు మనంబునఁ బ్రియమెంతయు దయివాఱ నల్లన నవ్వుచుఁ దా నాహరిణాక్షితో నిట్లనియె.

భగవంతుఁడు — రాజపుత్రీ ! మున్ను లోకపాలురవంటి యైశ్వర్యములు గలిగి, రూపంబును నౌదార్యంబును బలమును దేజంబును నెంతయు రాజిల్లుచుండ, శ్రీమంతు లయి మహానుభావులై, వెలయు భూపాలు రనేకులు నిన్నుఁ గామించియుండిరి. శిశుపాలుఁడు మొదలుగాఁ గలయారాజులు నిన్ను వేఁడి మరులుకొన్న నివ్వటిల్ల వరింప వచ్చియుండిరి. మఱి నీ తోఁ

బుట్టువును దండ్రియును వారికి నిన్నిచ్చుటకుఁగూడ నుండిరి. నీకు సమానులైన యట్టిమహారాజులను * నీ వేల వరింపవయితివి ? సుభ్రూ ! మేమో, యట్టిరాజులకు భయపడుచు సముద్రమును శరణుఁజొచ్చి యున్నవారము. మఱి తోడుగలదంటివా, మిక్కిలి బలవంతులగు జరాసంధాదులతోడఁ బగ.పడవిని జూచితివా, †బహుళతరముగా మేము సింహాసనమే దిగనాడియైనది. ఇట్లు నీకు నేవిధమందును నీడుంజోడుగాని మమ్మేలవరించితివి? మఱిమాపుట్టువు తెఱంగో‡యిట్టిదని తేటపడదు. §మా నడవళ్లో లోకముపాటిది గాదు. ఇట్టిపురుషులగు మమ్ముఁజెట్టునట్టి మా దారిఁ దొక్కునట్టి పడఁతులు, సుభ్రూ ! తఱచుగా వెతలపాలయి కీడ్పడుదురు సుమీ. మే మించుకయినను ధనము లేనివారముగాన యెప్పుడు నకించనులము. మాకు నిష్కించనులగు జనులే ప్రియులుగాని మఱొక్కరు గారు. కాఁబట్టి సుమధ్యమా!

---

* ఇందులకు నాంతరంగికమగు విశేషార్థములు గలవు. విస్తరభీతినిట వ్రాయంబడవయ్యెనని తెలియునది.

† యాదవులకు యయాతిశాపమువలన రాజ్యసింహాసనము లేదనుట యిట దెలియునది.

‡ వసుదేవునికొడుకుగాన క్షత్రియుఁడనియు నందునికొడుకుగాన వైశ్యుఁడనియు నిట్లుపుట్టువు జాతి తెలియకున్నదని యభిప్రాయము.

§ ఇవి 'అస్పష్టవర్త్మనాం పుంసా మలోకపథమీయుషామ్। ఆస్థితాః పదవీం సుభ్రు ప్రాయస్సీదన్తి యోషితః' అని మూలము. 'అస్పష్టవర్త్మనాం' అనఁగా తనస్వరూపస్వభావములు దెలియనలవిగానివనియు, 'అలోకపథమీయుషామ్' అనఁగా తనయాచారము లోకాతీతము. అనఁగా కర్మవశ్యముగానిదనియు విశేషార్థము. ఇట్టితమ్ముఁజెందిన స్త్రీలు తమయాథార్థ్యమును 'సీదన్తి' తెలియుదురనుట.

తలఁచుగా సంపన్నులగుజనులు మమ్మెంతమాత్రమును గొలువరుసుమీ. ఏయిరువురకు ధనమును, గులమును, నైశ్వర్యమును, రూపమును సమానములుగానుండునో, యట్టివారికే వివాహమును మైత్రియును బొసఁగునుగాని యుత్తమాధములగు నిరువురకు నెచ్చటను నవి పొసఁగనేరవు. వైదర్భీ! నీవు దీనిని దెలియకయు దవ్వులవిచారింపకయుఁ దుదిఁబోయి మమ్ము * గుణహీనులగువారిని, గావుననే యాఢ్యులుగాక భిక్షువులగువారుమాత్రము † లేనిగుణములు నారోపించి పొల్లుగాఁ గొనియాడుచుండునట్టి వారిని, మమ్ము వరించితివిగదే. పోయినది పోనిమ్ము; ఇఁకనైనను నెట్టివానిని జేపట్టిన నీదు కామితము లిహమందును బరమందును నిక్కముగా నొనఁగూడునో, నీకనురూపుఁ డయినయట్టిక్షత్రియతిలకుని భజింపుము. 'అట్లేని నన్నేల గొనివచ్చితివందువా'? వామోరూ! శిశుపాలుఁడును, సాల్వుఁడును, జరాసంధుఁడును, దంతవక్త్రుఁడును, రుక్మియును నన్ను ద్వేషించుచుండురుసుమీ. వీర్యమదములచేతఁ గన్నుఁగానక

* 'నిష్కిఞ్చనా వయం శశ్వ న్నిష్కిఞ్చనజనప్రియాః। తస్మాత్ప్రాయేణ నహ్యాఢ్యా మాంభజన్తి సుమధ్యమే' యని మూలము. నిష్కించను లనఁగా అవాప్తసమస్తకాములు. నిష్కించన జనప్రియులనఁగా, అకించనులై అనన్యప్రయోజనులైన యేకాంతిజనులకుఁ బ్రియులయినవారు. కాఁబట్టి ఆఢ్యులై ఆభిజాత్యమదాదులచేఁ దమ్ము సంపన్నులుగాఁదలఁచు జనులు మమ్ముఁగొలువరని విశేషార్థము.

† 'వృతా వయం గుణైర్హీనా భిక్షుభి శ్లాఘితాముధా' అనిమూలము. గుణహీనులనఁగా అకల్యాణగుణములు లేనివారమనియు, భిక్షువులచేఁ గొనియాడఁబడువారమనఁగా నారదాదులచేతఁ గొనియాడఁబడువార మనియు విశేషార్థము.

విఱ్ఱవీఁగుచున్న వారలకావర మడంచిపుచ్చుటకై, తన్వీ! దుష్టాత్ముల తేజంబులను హరించువాఁడనుగాన యందులకై, నిన్నుఁగొని తెచ్చితి. నింతే. మఱియు మేమో గృహకళత్రములందు నుదాసీనులము. * నారీషణ యుదరేషణ పుత్రేషణ యనునీ మూఁటియందును మాకుఁగోర్కి కలుగదు. ఏలన మేమాత్మానుభవలాభముచేతనే తృప్తినిందారి మఱిదేనికి నాసపడకుందుము. మఱి స్వయంప్రకాశంబగు స్వాత్మస్వరూపము స్ఫురించుటచే నితరము లగు ప్రాకృతవ్యాపారములనుమాలి యూరక గృహములందు వర్తించుచుందుము. ఇట్టిమేమెక్కడ! విలాసవతు లగుయువతులెక్కడ' యనెను.

భగవంతుఁ డింతపఱుకుఁ జెప్పి తన్నెప్పుడును నెడఁబాయకుండుటవలనఁ దానే కృష్ణునకు మిక్కిలియు గారాబుపడఁతియని తలంచుచుండిన గర్వమును బోనడఁచుటకై యింత చెప్పి యంత నూరకుండెను. ఇట్లు త్రిలోకాధిపతియగు తన ప్రాణేశ్వరుఁడు తా నింతకు మునుపు విని యెఱుఁగనియట్టి యప్రియములను బలుకఁగా విని వెఱఁగంది గుండెలు తటతటఁగొట్టుకొన రోదనము సేయుచు దురంతమగు చింతపాలయ్యెను. మఱియు నాముద్దియ సొగసుగా సమరిననై నునుగోళ్ల మొఱ్ఱని జిగిదళుకొత్తుచున్న యడుగుఁదమ్మిచే నేల వ్రాయుచుఁ గాటుకతోఁగూడిన కన్నీరు కాలువలయి చిప్పిలి కుంకుముపూఁతచే నొప్పుగులు కుబ్బ చన్నుంగవను దడుపుచుండఁగా, మోము వాంచి దుఃఖము పెల్లున డగ్గుత్తికవడ నేమియుఁదోఁచక నిలుచుండెను. మిక్కుటమయిన

* ఇట స్త్రీలకు మిక్కిలియు దుస్సహములయిన ఔదాసీన్యము అకామకత్వము మొదలగు విరక్తిలక్షణములను జెప్పుట తెలియునది.

దుఃఖమునను భయమునను శోకమునను మతి యెంతయుఁ దూలియున్న యారాజవరాలి కేలుఁదమ్మినుండి కడియములు గణగణ మొరయుచుండ, వింజామర పట్టువీడి నేలంబడెను. అట్లు బుద్ధి దిటచెడుటయు నాపడఁతి, దేహమును దోడనే తెలివిదప్పి నిలువనేరక కురులు విరియఁబాఱఁగా గాలి తాఁకినఁ గూలు కదళియుంబోలె నేలంబడెను. భగవంతుఁడు నట్లు తనపరియాచకంపుఁబోఁడిమిని దెలియనిదానివలెఁ జూపట్టుచున్న యా ప్రియురాలి ప్రేమపాశమునుగాంచి జాలిపయిగొని మించఁ దోడనే తానును వెఱఁగందినట్లు వడఁకెను. అంతనాచతుర్భుజుఁడు, మంచమును దిగ్గనడిగ్గి యాకొమ్మనుబట్టి పయికెత్తికొని నున్నని కురులనుదువ్వి తనకేలుఁదామరచే నాకొమరాలి నెమ్మొగము నల్లఁ దుడిచెను. మఱియుఁ గన్నీరించుక నిలిచియున్న కన్నుంగవను దుడిచి యాయశ్రుధారలచేఁ దొప్పఁదోఁగిన చన్నుంగవను దుడిచి, తన్నె కాని మఱియొక్క పురుష విషయమును నెఱుంగని యా పతివ్రతను, దనపరిహాసంపు విన్నాణమునం జేసి మనస్సు బ్రమసి యందులకెంతమాత్రము దగని దగునాపతివ్రతను, ఆదీన యగురుక్మిణీదేవిని, జేయిసాఁచి కౌఁగిలించుకొనెను. అతఁ దూఱడింపు మాటలయందు విన్నాణి; కాన సజ్జనులకుఁ బ్రాపయిన యాబలుదంట కనికరముమీఱ నూఱడించెను. అతఁ డాచెలువతో 'రుక్మిణీ! నను నేవగించుకొనకుమీ! నీవు నన్నె పెనుదిక్కుగాఁ గలిగియుండుట నాకుఁ దెలియును. అయినను బదులేమి చెప్పుదువో యాతీపారుపలుకులు వీనులవిందుగా విన నువ్విళ్లూరుచుంటిని; కాన యంగనా! నవ్వులాటలకు నిట్లు గావించితిని. మఱియుఁ బ్రణయకోపమునఁ గంపించుచున్న

నీకెంపారుమోవియు, నిద్దపుఁజెక్కులయందుఁ గోపావేశంబునఁ జలించుకన్నుంగవ యదరున నెఱ్ఱవాఱిన నీకడఁగన్నులను, జె న్నారు నెఱవంక కనుబొమముడియుఁ గొమరుచూపుచున్న నీ ముద్దునెమ్మొగమును, జూచుటకును ద్రస్తరుల నిట్లు గుస్తరించితి; నింతేకాని నిక్కమునకుఁగాదు. ఇట్లు జగడము పెట్టుటలో వేదు కగాని సుఖముగాని యేమున్న? దందువేని, భీరూ! భామినీ! ప్రియురాలితోడి నెయ్యంపుఁగలహములచేత జాము లుబుసు పుచ్చుట యనునిదియే గృహస్థులకు గృహములందుఁ గలపరమ లాభముచుమీ! ఇదియే గృహమందుఁ గలపరమసుఖము' అనెను. ఇట్లు కృష్ణుఁడు తన్నూఱడింపఁగా రుక్మిణి యది పరి యాచకంపు మాట యనియెఱింగి ప్రియుండు తన్ను దిగనాడు ననుభయము వీడినదయ్యె. అంత నక్కాంతామణి పురుషసిం హుండగు నాభగవంతుని మొగమును నునుసిగ్గుతోడి నగవున సొగసుగులుకుచున్న నెయ్యంపుఁగడకంటిచూడ్కులం జూచుచు నిట్లనిపలికెను. రుక్మిణి-'అరవిందాక్షా! నీకు సాటిగాని మమ్మేల వరించితి'వని యడిగితివి; ఆసాటికామి యటుండనీ. నీకన్నుల యందు మొకటిచేతనే నీకు సాటియెవ్వరును లేరే! నేను నీకు సాటి గానిదాన నని నీవు చెప్పితివే యదిసత్యమే. స్వరూపస్వభావము లందపరిచ్ఛిన్నుండగు నీకుసాటిగానసనుట నిజమెట్లుగాదు? సద్గుణ పరిపూర్ణుండును, ముల్లోకముల కధినాథుండును, తనయసాధా రణంబగు నిత్యవిభూతియందు నభిరతుండు నగు నీవెక్కడ! నీ గుణములకును నీయిచ్ఛకును లోనయి యనువర్తించు స్వభావ ముగలదానను. మఱియు నీకుఁ బరతంత్రురాలని తెలియనివారు మాత్రమే నా యడుగులను గొల్తురు. ఇట్టినే నెక్కడ! 'రాజ

లకు వెఱచి సముద్రమును శరణుఁజొచ్చితి' నంటివి. మూఁడడుగులచేతనే ముల్లోకములను గొలిచిన యురుక్రమా! ఇట్టి నీవా, రాజులకు వెఱచుట! నాతండ్రియగు పాలసముద్రునికిం గల యగాధిత్వాది గుణములు కలిగియుండుటనుబట్టి లవణసముద్రమునడుమఁ జొచ్చితివనుట నిజము. పయికి భయపడి చొచ్చినట్లు చూపట్టుచుఁ జొచ్చితివేకాని నాయందలి ప్రీత్యతిశయమును జూపుటకొఱకే యట్లుచేసితివి. మఱి ప్రియతమ నగు నన్నుసంబంధించిన యీసముద్రుఁడును నీకాత్మయుంబోలెఁ బ్రియతముండేకదా! కాన వానివంటిగుణములుగల యీలవణసముద్రుఁడు నీకు నాత్మవలెఁ బ్రియతముఁడేయగును. మఱి 'నాకు బలవంతులతోడఁ బగ' యంటివి. కుత్సితము లయినయింద్రియములును శబ్దాదివిషయములును గలవారలతోడ నీ వెప్పుడును విరోధమును గలిగియుందువుగాని ప్రీతిగలిగియుండవు. కాన యిదియొక కొదువగాదు. 'తఱచుగామాకు రాజాసనము లే'దంటివి. రాజాసనము గాఢతమమువంటిదై నరకావహ మగును. కనుక నీ సేవకులే వానిని దృణప్రాయముగా నెంతు రనఁగా నుభయవిభూతి నాయకుండగు నీకది యేపాటిదో చెప్పనేల? 'నీపుట్టువు కలరూపుదెఱంగు తేటపడ'దంటివి. నీపాదారవిందముల మకరందమును గ్రోలుచుండు మహామునులకే నీకలరూపు తేటపడకున్నది. ఇఁకఁ దక్కినవారికిఁ జెప్పనేల! భగవంతా! ఆహారనిద్రామైథునాదులందుమాత్ర మాసక్తు లగుటంజేసి పశుప్రాయులై యుండుమనుష్యులకు దానిఁజింతించుటకు నయిన శక్యముగాదు. 'మానడవడి లోకముపాటిఁగా'దంటివి. ఎవరు నిన్ననువర్తింతురో వారిచేష్టితములు నయిత నలౌకికముగానుండును. ఇఁక నప

రిచ్ఛనున్నాండవై యీశ్వరుండవగు నీచేష్టితము లలౌకికములగుటను జెప్పనేల ? 'నిష్కించనుల' నంటివి. ప్రభూ ! నీవు నిష్కించనుండవనుట సత్యమే. పొందవలసినది కించిత్తును లేమివలన నీవు నిష్కించనుండవుగాని యేమియు లేనందునఁ గాదు. ఏలందువా ? ఇతరులవలనఁ బూజలందుచుండువా రయిన బ్రహ్మాదులు నయిత మెవ్వనికిఁ బూజలర్పించుచుందురో యట్టి సర్వేశ్వరునకు నీకు నేమియు లేకుండుననుట—దారిద్ర్యము-ఎక్కడిది ? 'మఱి నిష్కించనజనులే నాకుఁ బ్రియు' లంటివి. పూజార్హు లగునారదాదులకును, అకించనులును ననన్యప్రయోజను లైనవారలకు నీవు మిక్కిలియుఁ బ్రియుండవు. అట్లె పూజార్హు లగువారును నీకు మిక్కిలియుఁ బ్రియులు. కాఁబట్టి యాభిజాత్యాదులచేతఁ దమ్ము నాఢ్యులుగాఁ దలంచుకొని కన్నుఁగానకుండు వివేకశూన్యులు తమకుఁ గలరూపమున నాయువున కంతకుండయిన నిన్ను భజింపరు. మఱి తమయింద్రియముల కేతృప్తి సేయుచుందురు. 'ఏయిరువురకు విత్తాదులు సమములుగానుండునో వారికే చెలిమియుఁ బెండ్లియుఁ బొసఁగునంటివి' నీవే సమస్తపురుషార్థస్వరూపుఁడవు ; మఱి యాభీప్సితఫలరూపం బగునాత్మవును. ఇట్లు జతుర్విధ పురుషార్థనిర్వాహకుండును నిరతిశయానందరూపుండు నగునీకు సుఖలేశసాధనము లయినవిత్తాదులు గలవారితో సామ్యమెట్లుగలుగును ? అట్లు నిస్సముఁడ వగుటచే నీతోడి వివాహము నాకుఁ దగదందువా ? ఎవరు నీదాస్యమందుఁ జెనువాంఛ కలిగియుండుటవలన నది తప్పఁ దక్కినదంతయు దిగవిడిచి యొల్లకుందురో యట్టిజనులు మిక్కిలియు బుద్ధిమంతు లగుదురు. అట్టివారికిని నీకును సాంగత్యము విభూ ! యెంత

యు నుచితమే. కేవలసురతాసక్తిం దగిలి దానివలని సుఖదుఃఖములపాలై యున్న పురుషులకును స్త్రీలకును సంగతి యుచితము గాదు. 'భిక్షుకులు నన్నుఁ బొల్లుగాఁ బొగడుచుందురు' రంటివి. దండమును దిగవిడిచి సర్వభూతసుహృత్త్వమును బ్రార్థించుచుండువారలు నీప్రభావమును గొనియాడుదురు. ఏలన నీవు ముల్లోకములకును నాత్మవు; ఆత్మపర్యంతము నొసంగుదాతవు. కావుననే నిన్నువారు గొనియాడుదురు. నీ విట్టివాఁడవని నిన్నెఱింగి నీకనుబొమలనుండి పుట్టినకాలంపు నురవడిచేతఁ గామితములు దూలుచుండునట్టి బ్రహ్మేంద్రాదులను విడిచి వారు నాకుఁ బుత్త్రులువంటివారు గాన వారియందలి విత్తాదులవలని సామ్యమును బాటింపక నిన్ను వరించితిని. బ్రహ్మాదులనే విచారింపఁ దగదనఁగా నిక శిశుపాలాదులయిన యితరులనుగుఱించి విచారించుట యెక్కడిది ? 'రాజులకు వెఱతు'వంటివి. గదాగ్రజా! ఎవ్వఁడు శార్ఙ్గధ్వనిచేత శత్త్రురాజులను బలాయితులు గావించి సింహము పశువులనుదఱిమి దనభాగంబుకొని చనునట్లు, నన్నుఁ గొనితెచ్చెనో యట్టి నీ వారాజులకు భయపడి సముద్రమును శరణుఁజొచ్చితిననుట వినువారికి నీవేమో భయపడి చెప్పినట్లు గాఁదోఁచి తెలివిఁదూలించును. 'పుట్టువు నడవడి మొదలయినవి తేటపడ కుండుమముబోఁటులఁ గొల్చువారు గీడ్పడుదు'రంటివి. అంబుజాక్షా! నిన్నుభజింపవలయునను మనోరథముచేత రాజోత్తములగు అంగుఁడు, పృథుఁడు, భరతుఁడు, యయాతి, గయుఁడు మొదలుగాఁ బ్రసిద్ధులయినవార లేకాధిపత్యంబగు తమ రాజ్యమును దిగవిడిచి వనమును బ్రవేశించి నీపదవిని ననువర్తించిరే! వారేమేని వెతలుగుడిచిరా! మఱియీలోకమందే

యున్నారా? నీతోడిసాధర్మ్యము నేకదా పొందినవా రయిరి. ఇఁక 'నీకుఁ దగిన క్షత్త్రియవరునిఁ జెట్టపట్టు' మంటివి. కల్యాణగుణములకెల్ల నాటపట్టయిన నీదుపాదపద్మముల గంధమును, జనములకు నిరతిశయ ఫలరూపంబై లక్ష్మి నగునాకు నాశ్రయమై సజ్జనులు మూరుకొనుచుండునట్టి దానిని, సరకుసేయక, మరణశీలుండై యెప్పుడును పెనుభయమునకుఁ బాలయియుండు మఱియొక పురుషునిఁ, బడఁతి యెవ్వతి తన హితాహితములను వివేచించి కనుఁగొనఁజాలినట్టిదయేని, యాశ్రయించును? అట్టిదొక్కటియు నాశ్రయింపదు. ఇట్లు జగములకెల్ల నధీశ్వరుఁడై పరమాత్ముఁడై యిహపరములందలి కామములనెల్ల నొడఁగూర్చునట్టి నిన్ను, ననురూప మయినవానిని, భజించితిని. జన్మజన్మమునందుఁ దిరుగుచునఘుచు నీకు సహధర్మచారిణినై యున్ననాకుఁ బాపమును దన్మూలమైన సంసారమును దూలించుచు భజించువారలను భజించు చుండెడునీదుపాదపద్మ మే యాశ్రయం బగునుగాత. ఇదియ నాప్రార్థనము. 'రాజపుత్త్రీ! పెక్కులు రాజులు నిన్నుఁ గామించి' రని వారిగుణముల నెత్తి చెప్పితివి. అచ్యుతా! స్త్రీలు ప్రధానలై యుండు గృహములం దెవరు ఖరములవలె వట్టిబరువులు మోయుచును, నెద్దులవలె నిత్యమును నూడిగముల నలఁగుచునుఁ, గుక్కలవలెఁ దక్కువపాటొంది వాకిటఁ గావలిగాచుచునుఁ, బిల్లులవలె దీనులై కాలం దాఁచినను మరలమరల ననువర్తించుచును, నిట్లుపంచిన పనుపు సేయుచుందురో యట్టిరాజులు, శత్రుకర్శనా! నీవుగాని శివబ్రహ్మాదుల సభలయందుఁ గీర్తింపఁబడుచుండు నీదు కథలుగాని యెవ్వతి చెవిని సోఁకవో యట్టి

దౌర్భాగ్యురాలికిఁ బతులగుదురుగాక. నీపద్మాబ్జమకరందమును మూరుకొనక నీకథ యొకప్పుడును వినకయుఁ గావున నేమూఢురాలై తనకాంతుఁ డనుతలంపుగొని యుండునట్టి పడఁతి, వెలుపలఁ దోలును మీసలును రోమములును నఖములును గురులును గప్పియు లోపల మాంసమును నెముకలును రక్తమును బురుగులును మలమును గఫమును వాతపిత్తములను గలిగియు జీవచ్ఛవంబగు కళేబరము గలిగియుండు పురుషాధమునిఁ దనకుఁ గాంతుఁడను తలంపునఁ గొలుచుచుండును. 'మే ముదాసీనుల' మంటివి. అంబుజాక్షా! ఆత్మారాముండవై నాయందుఁ గన్న మిక్కిలియు లేమింబట్టి యకాముకుండవై యున్నను నీదు పాదయుగమునందు నా కనురాగముగలిగి యుండుఁగాత. నీవు, దాసీనుండును నకాముకుండునై గృహస్థధర్మములను బయి కభినయించుచు మాత్రముండినను, నాకుఁగూడ నీచరణము లందలి యనురాగము మాత్రమే వేఁడవలసినదిగాని యంత కన్న నెక్కుడేమియుఁ గోరరాదు. ఎప్పుడు నీ వీజగత్తు సమృద్ధికొఱకు సృష్టికుపయుక్తమయిన రజోగుణము మిక్కుటముగాఁ గలిగియుందువొ యప్పుడు విచిత్రంబగుజగమును సృజించుచు నా యనుమోదనముకొఱకు నన్ను నీక్షింతువు. అదియె నా యందు నిరతిశయ మయినకృప చుమీ. మధుసూదనా ! 'నీ కనురూపుఁ డయినపతిని జూచుకొ' మ్మన్నమాట యబద్ధము గాదని నేను దలంచుచున్నాను. ఏలందువా ! లోకమందు సామాన్యముగాఁ గన్యలకుఁ, గాశిరాజపుత్రి యైనయంబికకుఁ సాల్వునియందుఁ గలిగియుండినట్లు, ఒకానొకపురుషునియందు రతి బహుతరముగాఁ గలిగియుండుట గలదు. అట్లె పెండ్లి

యాడినదయ్యు సతి గానట్టివానిమనను క్రొత్తక్రొత్త పురుషునే పొందుచుండును. శాస్త్రజ్ఞుఁడగువాఁడు దుష్టయగు పడఁతిని బెండ్లియాడఁడు. దానిని భరించునట్టి పురుషుఁ డిహాపరసౌఖ్యములు రెంటినుండియు వీడినవాఁ డగును' అనెను.

భగవంతుఁడు 'సాధ్వీ! రాజపుత్రీ! నీముద్దుఁ బల్కులను వినవలయునను తమింజేసి నవ్వులాటలకు నీమాట లంటిని. నేను జెప్పినదానికంతయుఁ దాత్పర్యమును బచరించి బదులు చెప్పితివి. అదియంతయు సత్యమే; నాయభిప్రాయమెచుమిూ! మానినీ! నన్నెడఁబాయు వ్యతిక్రమము నివర్తించుటకై 'నీయడుగులే నాకరణము గావలయును' 'నీచరణములందు నాకనురాగముండవలయు' నని యేయేకామితములను గోరుచున్నావో యవియన్నియు నాయం దేకాంతభక్తురాల వయిననీకుఁ గల్యాణీ! నిత్యమును గలిగియెయున్నవి. ఇఁక నీవు క్రొత్తగా వేఁడి నే నియ్యవలసినదొకటియు లేదు. అనఘురాలా! నీకుఁ బతినగు నాయందుఁ బ్రేమం జేసి గలిగియున్న పాతివ్రత్యమును నాకుఁ దెలియనయినది. ఏలన నేను జెప్పరానట్టి వాక్యములాడి నిన్నెంత మనస్సు చలింపఁ జేయుచున్నను నీబుద్ధి నాయందునుండి పాయదయ్యె. జను లెవ్వరు నీచములగు కోరికలచేత మనంబులు చెడి నేను మోక్షాధిపతినై యుండియు దంపతుల కుపభోగ్యములగు సుఖములను మాత్రముగోరి దపస్సుచేతను వ్రతచర్యలచేతను గొలుతురో, వారు నామాయచేత మోహితులగుదురు. మానినీ! మోక్షలక్ష్మికి సొంతగాఁడనై మఱి తక్కినసంపదలకును జుతినగునన్నుఁ బొంది తపస్సు మొదలగువానిచేఁ బ్రసన్నునిఁగావించి యపవర్గముతప్పఁ దక్కినకామములనే యెవరు వాంఛింతురో యా

జనులు మందభాగ్యులే యగుదురు. ఏలనఁగా మనుష్యులకుఁ గలుగు శబ్దాదివిషయసుఖములు సుఖలవాత్మకము లగుటంజేసి నరకమందును గలిగెడిని. కనుక దంపతులకుఁ బయికి మంచిదిగాఁ గనంబడునట్టి సంగమము నరకమే.—నరకప్రాయమె చుమీ! అట్టి సంగమమును గోరెడి యీ జనులు మందభాగ్యులే. గృహేశ్వరీ! నీవు నాయందు భవబంధనివర్తకమై నిష్కామంబగు ననువర్తనము సలిపితివి. ఇది నాభాగ్యము. ఇట్టి యనువృత్తి దుర్జనులకు నెంతకష్టపడినను సలుప నలవిగాదు. దురభిప్రాయములుగలదియునింద్రియతృప్తిపరాయణయు, వంచనాపరురాలు నయిన పడఁతికి నిది యెంతమాత్రము చేయనలవిగాదుచుమీ. మానినీ! తక్కినవారల గృహములందు నీయట్టి ప్రేమవతి యగు నిల్లాలిని నేను జూడనేరను. నీవు నీవివాహకాలమందు వచ్చియున్న రాజులనెల్ల నరకుసేయక నీ మేలిముచ్చటల నెల్లఁ జనులవలన వినియున్న నాకడకు రహస్యవార్తను దెలుప బ్రాహ్మణు నొక్కనినింబంపితివే! ఇట్టి యిల్లాలినిఁగూడ వేఱొక్కడనేని జూడఁదరమా! యుద్ధమున గెలిచినయన్నను విరూపునిఁ గావించినదియు, అనిరుద్ధుని వివాహమహోత్సవమునఁ బాచికలాడుపట్టున నతనిని వధించినదియు, దుఃఖము వెల్లుగా రేఁగినను మమ్ము నెడఁబాయుటకు భయపడి లోపలనే యోర్చుకొంటివి. కాన మమ్మొకటియేనియు నాడినదానవుగావు. దానిచేత మేము నీకు వశ్యులమయితిమి. నీవు నన్నుఁ బడయుటకై నీయాలోచనము లెల్లఁ జక్కఁగా వివరించి తెలిపి యొకదూతను బంపితివి. అప్పటికిని నేను రాక యించుకజాగుసేయఁగా, నీజగమునంతయుఁ బాడుపడినదిగాఁ దలఁచి యనన్యార్హ మయిననీయీతనువు

మేనిని దిగవిడిచెదనని పూనియుంటివిగదే. నీయందుఁ గలయిట్టి
భావమునకు మేము ప్రతిసేయనేరక యూరక యుప్పొంగుచు
మాత్ర మున్నవారము' అనెను. ఇట్లు భగవంతుఁ డా దేవకీ
సుతుఁడు తా నాత్మారాముండయ్యును, లక్ష్మియవతారంబయిన
యారుక్మిణీదేవితోడ మనుష్యలోకము ననుకరించుకొఱకు ను
రత నర్మంపుసుద్దు లాడుచు రమించినవాఁడయ్యె. అట్లె లోక
గురుం డాహరి తక్కినముద్దియల గృహములందును, గృహ
స్థాశ్రమియుంబోలె గృహస్థధర్మములను ననుష్ఠించుచునే యుం
డెను. ఇది యఱువదియవయధ్యాయము.

—•—

## భగవంతుఁడు పదియాఱువేల స్త్రీలను సమ్మోహింపఁజేయుటను వర్ణించుట.

శుకుఁడు—కృష్ణుని చెలువలయం దొక్కొక్కరును సమస్త
ములయిన తమసొంపు పెంపులచేతఁ దండ్రికిఁ దక్కువగాకున్న
పుత్త్రులను జెటి పదేసిమందిని గాంచినవా రయిరి. ఆరాజపుత్త్రి
కలు కృష్ణుండు తమతమగృహములనుండి వెడలిపోవకుండు
టను జూచి యతనికలరూపును దెలియనివారుగాన యొక్కొక్క
తియుఁ దానే యాతనికి మిక్కిలియుఁ బ్రియతమయని తలంచిన
దయ్యె. ఆవనితలు స్వరూపస్వభావములందును బరిపూర్ణుండ
యిన యాభగవంతుని యప్పుడు విరిసిన తామరపూవుంబోని
నెమ్మొగమును నిడుదలయినబుజములును గన్నుంగవయునుజూచి
బ్రేమదొలంకు నవ్వులచేతను శృంగారరసమొలుకు చూడ్కుల
చేతను నీటయిన మాటలచేతను నెంతయుఁ దమంత మోహిత

లయిరి కాని తమ విభ్రమములచేత నతనిమనసు జయింపనేర రయిరి. *అల్లని మంతనంపునగవుతోడి కడకంటిచూడ్కులు మనంబుగుట్టులు పట్టి యియ్యఁగా మిటారించుచున్న కను బొమల త్రిప్పులలో నూలుకొనుచున్న మరుకేళి మంత్రము లందుఁ బ్రగల్భములయిన మన్మథుని బాణములచేతను, మఱి యుఁ గామశాస్త్రప్రసిద్ధము లయినతక్కుంగల కరణముల చేతను, బదియాఱువేల పత్నులును నతని మనంబును గలంచి పుచ్చుటకు నించుకయుఁ జాలరయిరి. ఇట్లెవ్వని కలరూపును బ్రహ్మాదులునయితము దెలియఁజాలరో యట్టి లక్ష్మీనాథునిఁ దమకుఁ బతిగాఁబడసి యాకృష్ణుం డెడ తెగక నాఁడునాఁటికి నను రాగముతోడి నవ్వులును జూడ్కులును నవకంపుఁగూటువలం దలి తగులును మఱియుఁ దక్కునయ్యాటములునుమీఁదుమిక్కి లియు నెఱపుచుండఁగా,ముదముపొదల నతనిని గొలుచుచుండిరి. మఱియు నాకులుకుంబోండ్ల కొక్కొక్కతికిని నూఱుల కొలఁది పనికత్తియ లున్నను, వా రావిభునకుఁ గృష్ణునకుఁ దామే యెదురుచని మేలయినయాసనములిడి, యడుగుఁదమ్ములనుగడిగి, కప్పురపువిడెము లొసంగి, బడలికతీఱ వీవనలు విసరుచు గంద ములలంది పూదండలు దుఱిమి కురులుదువ్వి సెజ్జలుపఱచి జల కములార్చి మఱియుఁ గానుకలర్పించి దమంతటనే యూడిగ ములు సేయుచువచ్చిరి.

పదుగురేసి పుత్రులను గన్నవారని మున్ను చెప్పఁబడిన యాకృష్ణుని కాంతలలోపల ముఖ్యురాండ్రయిన పట్టపుదేవు

* ఈశ్లోకములు సౌందర్యమునుబట్టి పలుమాఱు చటనచటఁ జెప్పంబడుట తెలియునది.

### కృష్ణునికి నష్టభార్యలందుఁ బుట్టిన పుత్త్రుల సంఖ్యయును నామములును.

లైనమంద్రు. వారలపుత్త్రులగు ప్రద్యుమ్నుఁడు మొదలగు వారలను నీకుఁ జెప్పెదను. రుక్మిణియందుఁ బ్రద్యుమ్నుఁడు, చారుదేష్ణుఁడు, సుదేష్ణుఁడు, చారుదేహుఁడు, సుచారుఁడు, చారుగుప్తుఁడు, భద్రచారుఁడు, చారుచంద్రుఁడు, అతిచారుఁడు, చారుఁడు నని పదుగురు కృష్ణునకు సదృశులయినవారు పుట్టిరి. సత్యభామయందు భానుఁడు, సుభానుఁడు, స్వర్భానుఁడు, ప్రభానుఁడు, భానుమంతుఁడు, చంద్రభానుఁడు, బృహద్భానుఁడు, రతిభానుఁడు, శ్రీభానుఁడు, ప్రతిభానుఁడు నను పదుండ్రు పుట్టిరి. జాంబవతికి సాంబుఁడు, సుమిత్త్రుఁడు, పురుజిత్తు, శతజిత్తు, సహస్రజిత్తు, విజయుఁడు, చిత్త్రకేతుఁడు, వసుమంతుఁడు, ద్రవిణుఁడు, క్రతువు నని తండ్రిం బోనివారు పుత్త్రులైరి. నాగ్నజిత్తికి భానుఁడు, చంద్రుఁడు, అశ్వసేనుఁడు, చిత్త్రగుఁడు, వేగవంతుఁడు, వృషుఁడు, ఆముఁడు, శంకుఁడు, వసువు, ధృతియుఁ బుట్టిరి. కాళిందికి శ్రుతియు, కలియు, వృషుఁడును, సుబాహుఁడును, భద్రుఁడును, ఏకలుఁడును, శాంతియు, దశుఁడును, పూర్ణమాసుఁడును, సోమకుఁడును బుట్టిరి. మాద్రియందుఁ బ్రజంఘుఁడు, గాత్రవంతుఁడు, సింహుఁడు, బలుఁడు, ప్రబలుఁడు, ఊర్ధ్వగుఁడు, మహాశక్తి, సహుఁడు, ఓజుఁడును బుట్టిరి. మిత్త్రవిందయందు, వృకుఁడు, అర్కుఁడు, అనిలుఁడు, గృధ్రుఁడు, బహ్వాన్నుఁడు, అన్నాదుఁడు, మహాశుఁడు, పవనుఁడు, వహ్ని, క్షుధియుఁ బుట్టిరి. భద్రయందు సంగ్రామజిత్తు, బృహత్సేనుఁడు, శూరుఁడు, ప్రహరణుఁడు, అరిజిత్తు, జయుఁడు, సుభద్రుఁడు, వాముఁడు, ఆయువు, సత్యకుఁ

డును బుట్టిరి. రోహిణియందు, దీప్తిమంతుఁడు, తామ్రపత్రుఁడు మొదలయినవారు హరికిఁబుట్టిరి. ప్రద్యుమ్నునికి భోజకట మనుపురమున నున్న రుక్మికూఁతురగు రుక్మవతియందు మహా బలుండగు ననిరుద్ధుండు పుట్టెను. మఱియుఁ గృష్ణుని తక్కిన పుత్రులకును బుత్రులును పౌత్రులును గోట్లకొలఁదిని బుట్టిరి. ఏలనఁ గృష్ణునికిఁ బుట్టిన కొడుకుల దల్లులు పదియాఱువేలమంది గదా. తక్కినవారు లెక్కకు మీఱియుండుట వింతగాదు' అనెను.

రాజు 'రుక్మి కృష్ణునిచేత యుద్ధమున నవమానితుండై యత నిని జంపుటకు రంధ్రము నే యెప్పుడును వెదకుచుండెడివాఁడు. అట్టివాఁడు తనపగవాని కొడుకునకుఁ దనకన్నకూఁతు నెట్లిచ్చెను? బ్రాహ్మణోత్తమా! ఆపగతురకు నిరువురకును పరస్పరము వైవాహికబంధ మెట్లుగలిగెనో నాకుఁజెప్పుము. మీరు మము బోఁటుల యింద్రియముల కగోచర మయినవియు దవ్వయి నవియుఁ, గొంచె మెడగలిగి యుండునవియు నగువిషయములు, జరుగనివానిని గాని జరిగినవానిని గాని జరుగుచున్న వానిని గాని యోగులుగావునఁ జక్కఁగాఁ గనుఁగొనుచుందురు గదే' యనెను.

**{ ప్రద్యుమ్న కృతవర్మా నిరుద్ధులకును రుక్మవతీ చారుమతీ రోచనలకును వివాహము. }**

శుకుఁడు—రుక్మి, కృష్ణునిచే నవమానితుండై వైరమును స్మరించుకొనుచుండియును దనచెలియలికిఁ బ్రియము సేయు కొఱకుఁ దన మేనల్లునకుఁ గూఁతునిచ్చినవాఁ డయ్యెను. ఆ చెలు వయు నా ప్రద్యుమ్నుని మనసున వలచియుండెను. ప్రద్యు

మ్నుఁడును స్వయంవరమునఁ దానేకరథుండై యుద్ధంబున వచ్చికూడినరాజులనెల్ల జయించి యామింపుఁబోఁడిని వరించి కొనిపోయెను. రుక్మిణికూఁతు రగుచారుమతిని కృతవర్మనిపుత్త్రుఁడును బలవంతుఁడునగు విశాలాక్షుఁడనువాఁడు వరించెనఁట. మఱియు రుక్మి కృష్ణునితోడ బద్ధవైరుండై యుండియును జెలియలికిఁ బ్రియముసేయు తలంపునఁ దనదౌహిత్త్రుఁడగు ననిరుద్ధునకుఁ దనపౌత్త్రియగు రోచనను నట్టి *వైవాహిక సంబంధ మధర్మమని తెలిసియు స్నేహపాశమునకుఁ గట్టువడి యిచ్చువాఁడయ్యెను.

## (అనిరుద్ధునివివాహమందు బలరాముఁడు రుక్మిని వధించుట.)

ఆ వివాహమంగళమునందు రుక్మిణియు రామకృష్ణులును బ్రద్యుమ్నుఁడు మొదలగు బంధువులును మఱియుఁ దక్కుఁగలవారును భోజకటపురమునకుఁ బోయినవారయిరి. అపుడు పెండ్లి నిర్వర్తించినాఁగా నంతఁ గళింగుఁడు మొదలగు రాజులు, మిక్కిలియు గర్వించి రుక్మితోడ 'బలరాముని: బాచికలందు గెలువుము. బలుఁ డక్షములను జక్కఁగాఁ దెలియఁడు. అయినను దానియందు వానికి వ్యసనము మిక్కిలి' యని పురికొలిపిరి. అది విని యారుక్మియు బలుని జూదమునకుఁ బిలిచెను. రుక్మియు నాబలునితోఁ బాచికలాడెను. రాముఁడు మొదట నూఱును బిదప వేయియు నవలఁ బదివేలును బందెముచఱచెను. రుక్మి దాని

---

* శత్రువుతో వివాహబంధమువలనఁ భోజనప్రతిభోజనములు ప్రసక్తించును. 'ద్విషదన్నం న భోక్తవ్యం ద్విషదం నైవభోజయేత్' అని న్యాయము. ఇది యిట్లు న్యాయ విరుద్ధముగాన యధర్మమనుట తెలియునది.

నంతయుఁ దాను గెలిచెను. అపుడు కాళింగుఁడుఁ దనపండ్లు వెలికిఁ దెలియునట్లుగా బిగ్గరఁ బకపకనవ్వెను. అందులకు హాలాయుధుఁడు సైఁపఁడయ్యె. అంతరుక్మి లక్షపందె మొడ్డెను. ఆపణమును బలరాముఁడు గెలిచెను. అయినను రుక్మి వంచన నూఁది 'నేనే గెలిచితి' ననెను. అంత నాశ్రీమంతుఁడు బలుఁడు కోపంబు దీపింపఁ బర్వమునందు సముద్రుండునుంబోలె నెంతయుఁ గలంగి మిక్కుటమయిన కినుకచేఁ గన్నుంగవ నొత్తివాఱ మును పటివలెనే పందెము సలిపెను. దానిని సయితము రాముఁడే ధర్మమున గెలిచెను. కాని రుక్మి మాయ నూఁది 'నేనే గెలిచితిని. ఇట్లని కాళింగుడు మొదలగువారు చెప్పెదరు. వారి నడుగవలసి యున్నది' అనెను. అంత నాకాశవాణి 'బలుఁడే పందెమును ధర్మమున గెలిచెను. వంచనచేత రుక్మి యిట్లు పొల్లుపలుకుచున్నాఁడు' అనెను. రుక్మి యామాటలను పాటింపక దుష్టులగు రాజులు పురికొలుపఁగా బలరామునిఁ బరిహాసించుచుఁ గాలచోదితుఁడై యతనితో 'ఓరీ! మీరు గొల్లలు. అడవియందుఁ ద్రిమ్మరువారలగు. మీకు నక్షములందు విన్నాణ మెక్కడిది? రాజులగువారే చుమీ యక్షములతోను బాణములతోను నాడుచుందురుగాని నినుఁబోఁటి వారుగారు' అనెను. రుక్మిణి యిట్లాక్షేపించుటయుఁ దక్కినరాజులును నపహసించుటయుఁ గాంచి బలరాముఁడు క్రుద్ధుఁడై యతనిని రాజసభయందుఁ బరిఘంబుగొని కొట్టిచంపెను. మునుపు దన్ను పండ్లు తెలియునట్లు పకపక నవ్విన కళింగరాజది చూచి ఫలాయితుండు గాఁగా, దాను వెన్నాడి పరుగిడి పదియవయడుగున బలిమిమెయిం బట్టుకొని క్రుద్ధుండై వానిపండ్లు డుల్లనేసెను. తక్కినరాజులు బలుని

పరిఘముచేఁ గొట్టువడి చేతులును దొడలును దలలును బగిలి నెత్తురం దొప్పదోఁగుచు భయముగొని పరువెత్తిరి. అట్లు బావ రుక్మి నిహతుండు కాఁగా, కృష్ణుఁడు రుక్మిణికిని బలరామునకు నెయ్యమొక్కఁడఁ జెడునో యనుభయమున మంచిదని కాని చెడ్డదని కాని యొక్కటియుఁ బలుకకుండెను. అంత రామాదులగు దశార్హులు, క్రొత్తపెండ్లి కూఁతుతోడ ననిరుద్ధుని మేటిరథము నెక్కించుకొని మధుసూదనుండగు శ్రీకృష్ణు నాశ్రయించిన వారుగాన సమస్త ప్రయోజనములును సిద్ధించినవారై ద్వారకకుం బోయినవారయిరి. ఇది యఱువదియొకండవయధ్యాయము.

---

## ఉషాపరిణయము.

రాజు 'యదుతిలకుండయిన యనిరుద్ధుఁడు బాణుని కూఁతురయిన యుషను బెండ్లియాడెను. అపుడు హరికిని శంకరునకును భయంకరమయిన మహాయుద్ధము జరిగెను. మహాయోగీ! దీని నంతయు నీవు నాకుఁ జెప్పఁదగును' అని యడిగెను.

శుకుఁడు—మహాత్ముఁడగు వామనదేవునకు భూమిని నొసంగిన మహనీయుం డా బలిచక్రవర్తికి నూఱ్వురు పుత్త్రులలోఁ బెద్దవాఁడు బాణుఁడు. వాఁ డాబలికి నౌరసపుత్త్రుఁడు; సదాశివభక్తితత్పరుఁడు. మఱియు వాఁడు మాన్యుఁడు, వదాన్యుఁడు, బుద్ధిమంతుఁడు, సత్యసంధుఁడు, దృఢవ్రతుఁడు. వాఁడు తొల్లి శోణిత మనెడుపురమున రాజ్యముచేసెను. వానికి శంభుని ప్రసాదమువలన దేవతలు కింకరులుంబోలె నుండిరి. వానికి బాహువులు వేయిగలవు. శివుఁడు తాండవము సలుపు నపుడు

వాఁడు తనవేయిచేతులచేతనే నూఱువాద్యములు వాయించుచు నామృడుని సంతోషపెట్టెను. భగవంతుఁడును, సర్వభూతనాథుండును శరణ్యుఁడును భక్తవత్సలుండు నగు నాశంభుఁడు వానిని వరమువేఁడుమని సెలవొసంగెను. వాఁడు శివునిఁ దనకుఁ బురరక్షకుఁడుగా నుండునట్లు వరమువేఁడెను. వాఁడొకనాఁడు వీర్యమున మిక్కిలి చెడుమత్తుకొని తనపార్శ్వమున నున్న గిరీశునికి శివునికి సూర్యునివలె ధగధగ వెలుఁగు బంగరు కిరీటము తదీయపదాంబుజములు సోఁక మ్రొక్కి యతనితో 'మహాదేవా! లోకములకెల్ల గురుండును నీశ్వరుండును బూర్ణకాములు గాని పురుషులకుఁ గామములెల్లఁ బూరించు కల్పవృక్షమునగు నీకు నమస్కారము. నీవు నాకు బాహువులు వేయి నొసంగితివి; కాని, యవి నాకు వట్టిపెనుబరువుమొా పయినవేకాని మఱేమి యుఁబనలేదయ్యె. మూఁడులోకములందు నాతోఁ బ్రతియుద్ధము సేయుటకు నీవు దప్ప నా కీడయినవాఁడు వేఱొక్కఁడును దొరకఁడయ్యె. చేతులెల్ల మిక్కిలియుఁ దీఁటగొని తుటారించుచున్నందున యుద్ధము సేయవలెనని కోరి దిగ్గజములకడకుఁ బర్వతముల నుగ్గునూఁచ గావించుచుఁ బోయితిని. కాని, యవి సయితము పరుగులెత్తినవి. ఏమిసేయుదు' ననెను. అదివిని భగవంతుఁ డాశంభుఁడు క్రుద్ధుఁడై 'మూఢా! నీకేతు వెప్పుడు విఱిగి కూలునో, యపుడు నీకావరము నడంచునంతటి దిట్టయు మత్సమానుఁడు నగువానితో యుద్ధముగలుగును బో' మ్మనెను. వాఁడామాటకుఁ గుమతిగావున మిక్కిలియు నుబ్బి తనగృహము నకుఁబోయి'తనవీర్యమును దూల్చునట్లు శివుం డానతిచ్చినదానిని బుద్ధిచెడినవాఁడుగాన యెదురుచూచుచుండెను. వానికూఁతు

రుషయను కన్య తా నింతకు మును పెన్నఁడును గని విని తెలి యని యొకసొగసుకానితో—అనిరుద్ధునితోఁ - గూడినట్లు కలగాంచెను. అచ్చెలువ యంత నచ్చట ననిరుద్ధునిఁ గానక 'ఎక్కడఁ బోయితివి? ఎక్కడనున్నా'వని యవశయై పలుకుచుఁ జెలికత్తియలనడుమ లేచి చూచి యెంతయు సిగ్గు నొందినద య్యెను. బాణునిమంత్రియగు కుంభాండుఁ డనువానికిఁ జిత్రలేఖ యను నొకకూఁతురుగలదు. అది యుషకు ననుంగుఁజెలి. అది యాపడఁతిరతికి నెంతయు వేడుకపడి, దానితో 'సుభ్రూ! ఎవ నినో యొకవన్నెకానిని వెదకుచున్నావు. నీమనోరథమునకుఁ బాత్రుండయిన యాకాంతుఁ డెట్టివాఁడోకదే! రాజపుత్రీ! నీవు చెట్టపట్టిన వాఁడింతకు నిట్టివాఁడని నాకు నేర్పడకున్నదే!' యనె ను. ఉష—'చెలీ! నేను గలయం దొకానొకసొగసుకానిని జూచితిని. వాఁడు చామనిచాయవాఁడు. తామరరేకులవంటి కన్నులవాఁడు.నిడుదలయిన బుజములుగలవాఁడు. వాఁడు పచ్చని వలువగట్టి, చెలువలమనంబుల కెంతయునింపయి చూపట్టువాఁడు గదే! ఆ చెలువునే నేను వెదకుచున్నాను. వాఁడు తనయధరా మృతమును నాకుఁ గోలనిచ్చి నాకు మితిలేనితమిని బుట్టించి యిట్టి వ్యసనసముద్రమునఁ బడఁద్రోచి కట్టా! యొక్కడికిఁ బోయినాఁడోకదే"! యనెను. చిత్రలేఖ - 'పోనీ! నీవ్యసనమును నేను బోకార్చెదనుబో. మూఁడులోకములందు నెవ్వనినిగాని వీఁడే నాచెలువుఁడని నిశ్చయించుకొంటివేని, నే నాపురుషునిఁ దోడితెచ్చెదను. అంత నీమనస్సును హరించినవానిని గుఱించి నాకానతిమ్ము' అనెను.చిత్రలేఖ యిట్లుచెప్పి యంతనొక్కపటం బున దేవతలను, గంధర్వులను, సిద్ధులను, చారణులను, బన్నగు

లను, దైత్యులను, విద్యాధరులను, యక్షులను, మనుజులను, గల రూపున వ్రాసెను. మనుష్యులయందు నాపడఁతి వృష్ణులను, శూరుండగు వసుదేవునిని, రామునిని, గృష్ణునిని, బ్రద్యుమ్నునిని, వ్రాసెను. ఉష యాప్రద్యుమ్నునిని జూచి లజ్జనొంది యంత ననిరుద్ధుని వ్రాయఁగాఁ జూచి సిగ్గునఁ దలవాంచి 'వీఁడే వీఁడే వాఁడు' అని నవ్వుచును బలికెను. చిత్రలేఖయు నాచెలువునిఁ గృష్ణుని మనుమఁడుగాఁ దెలిసి యోగశక్తినూఁది యాకాశమునఁ గృష్ణపాలితంబగు ద్వారకాపురమునకుఁ బోయెను. అట మంచముపైఁ బరుండి నిదురించుచున్న యనిరుద్ధుని యోగమునాశ్రయించియెత్తికొని శోణితపురమునకుఁ దెచ్చిదన చెలికినాప్రియునిఁ జూపెను. మిక్కిలియు సుందరుఁడయిన యాపురుషతిలకునిం గాంచి యుష నెమ్మొగమెంతయు సంతసమున వికసిల్ల, మఱ వారికి నెంతమాత్రము గనుంగొనరాని తన కేళిగృహమున నా యనిరుద్ధునితో రమించినదయ్యె. మఱియు నా వన్నెకాఁడు మిక్కిలి మేలయిన వస్త్రములను మాల్యములను గంధములను ధూపదీపములను నాసనాదులను బానభోజనములను భక్ష్యములను దీపారు వచనములను దక్కిన శుశ్రూషను నెంతయుఁ బూజితుండయ్యె. ఆవయసుకాఁడాయంతఃపురంబున గూఢుండై యుండి యంతకంతకు నెయ్యము దియ్యము పెరుఁగుచున్న యామెఱుఁగుఁబోఁడితో నెడతెగక యెప్పుడును గలసి మెలసి, యింద్రియములు తదాయత్తములుగాఁ దినములెన్ని గడచినను దెలియఁడయ్యె. అట్లాయదువీరునిచే ననుభవింపఁబడినదై కన్యావ్రతము గుందియున్న యాకలికి కప్పిపుచ్చరాకున్న కొన్ని చిహ్నములవలనఁ జెడినట్లు కనుఁగొని కావలియున్న భటులు

బాణునితో 'రాజా! కన్నియ యగునీకూఁతురు కులమును జెఱుపునట్టి విపరీతచేష్ట గావించునట్లు తెలియుచున్నారము. మే మొకక్షణమయినను బాసియుండక నిజగృహమునఁ గావలి గాచుచున్న కన్నియను, గంటికి జూడనైనఁ దరముకానట్టి దానిని, నింతవఱకు మగవారువచ్చి చెఱుపఁగా మే మెఱుంగము. ఇది యేమోావింతగా నున్నది' యని తెలిపిరి. బాణుఁడు తన కూఁతురు చెడుటను విని మనంబున నెంతయు వంతగూరి త్వరితుఁడై కన్యాకాగారమును జేరి యందున్నయాయదుతిలకునిఁ గాంచెను. చామనిచాయ గలిగి పచ్చని వలువగట్టి తామర రేకులవంటి కన్నుంగవతోడ నున్న యా జగదేకసుందరుఁడు—నిడుదలయిన బుజములు వెలయ,కుండలములఁ జికిలిడాలునను, జకచకని ముంగురుల జిగిని, దెలిచిఱునవ్వునను, జికిలిచూపులను, వన్నెగులుకుచున్న నెమ్మొగము గలయామనుష్యథకుమారుఁడు—నాకొమరాలి యంగసంగమువలన దాని గబ్బిగుబ్బలకుంకుము జొబ్బిలుచు, నామని మల్లియలు గ్రుచ్చియున్న పూమాలికను బుజములందుఁ దాల్చి,యాచిన్నారి ముంగరఁగూర్చుండి యాప్రియురాలితోఁ బాచికలాడుచుండెను. దానిని జూచి బాణుఁడు విస్మయము నొందెను. అపుడు బాణుం డాయుధములఁ గేల నెత్తికొని యున్నభటు లనేకులు బలసి రాఁ జొచ్చి వచ్చెను. ఆ బాణునిం గాంచి యనిరుద్ధుఁ డినుపపరిఘము నొకటి యెత్తికొని వారిని జంపం బూని దండమును గేలందాల్చిన యంతకుండునుంబోలె నిలుచంబడెను. మేటియొంటికానిని వేఁటకుక్కలుంబోలె నతనినిఁ బట్టుకొనవలయునని నలుప్రక్కలఁ గ్రమ్ముచున్న యాభటుల నతం డా పరిఘముచేఁ జావనడిచెను.

అట్లతఁడు చావఁగొట్టుచుండఁగా వారు తలలుపగిలి తొడలు విఱిగి చేతులుద్రెస్సి యాభవనమును వెలువడి పరుగువాఱిరి. అట్లు తనసైన్యమును హతము గావించుచున్నయాకుమారుని బలవంతుఁడగు బాణుండు కుపితుండై నాగపాశములచే బంధించెను. ఉష యతఁడు బద్ధుఁడగుటను వినఁగానే యెంతయుశోకవిషాదములచే వివశయై, కన్నుల నశ్రుబిందువులు గాలువలుగట్ట బిట్టు రోదనము చేసినదయ్యె. ఇది యఱువదిరెండవ యధ్యాయము.

—•—

## బాణాసుర యుద్ధకథారంభము.

శుకుఁడు—అనిరుద్ధుఁడు కానఁబడక పోవఁగా బంధువు లందఱును మిక్కిలియు శోకించుచుండిరి. ఇట్లు వాన నెలలు నాలుగును గడచిపోయెను. అంత నారదుండు వచ్చి యనిరుద్ధుఁడు గావించిన కృత్యమును నతఁడు బద్ధుఁడై యుండుటయును విని కృష్ణరక్షితులై యుండు వృష్ణులు శోణితపురమునకుఁ బోయిరి. ప్రద్యుమ్నుఁడు, సాత్యకి, గదుఁడు, సాంబుఁడు, సారణుఁడు, నందుఁడు, ఉపనందుఁడు, భద్రుఁడు మొదలగువారు, రామకృష్ణుల ననువర్తించుచుండు యదుసింహములు, పండ్రెండక్షౌహిణులంగూడి బాణునిపట్టనమును నన్నిప్రక్కలను ముట్టడించిరి. వారు, పురమునుద్యానములను బ్రాకారములను నట్టళ్లు మొదలగు వానిని గోపురములను విఱిచి కూల్చుచుండఁగాఁ జూచుచు బాణుండు కోపావేశంబు నొంది వారియంత సేనను గొని పట్టనమునుండి వెడలివచ్చెను. ఆబాణుని కొఱకు భగవంతుఁడు రుద్రుఁడు తనపుత్రునిఁగూడి ప్రమథగణములు పరివేష్టించి రా, నంది

వృషభము నారోహించి రామకృష్ణులతో యుద్ధము గావించెను. అంతఁ గృష్ణునకును శంకరునకును, ప్రద్యుమ్ననకును గుమారస్వామికిని, మిక్కిలి యద్భుతమై గగురుఁ బుట్టించునంతటి ద్వంద్వయుద్ధ మయ్యెను. కుంభాండకూర్ప కర్ణులతోడ సాంబుండును బాణునితోడ సాత్యకియుఁ దలపడిరి. బ్రహ్మ మొదలగు దేవతాశ్రేష్ఠులును మునులును సిద్ధులును జారణులును గంధర్వులును అప్సరసలును యక్షులును విమానముల నెక్కి యాయుద్ధమును జూడవచ్చిరి. హరి శంకరుని యనుచరులయిన భూతములను ప్రేతములను గుహ్యకులను, ఢాకినులను యాతుధానులను యక్షులను రాక్షసులను వినాయకునిని ప్రేత మాతృకలను, పిశాచములను కూశ్మాండులను బ్రహ్మరాక్షసులను శార్ఙ్గధనువునుండి వాఁడిమొనలుగల బాణములను నిగిడించి పలాయితులం గావించెను. పినాకియగు శివుఁడును నానా విధములయిన యస్త్రములను హరిపైఁ బ్రయోగించెను. హరియు వానినెల్లఁ జీరికింగొనక ప్రతిబాణంబులచే నడఁచివుచ్చెను. ఆకృష్ణుఁడు బ్రహ్మాస్త్రమునకు బ్రహ్మాస్త్రమును, వాయవ్యాస్త్రమునకుఁ బార్వతాస్త్రమును,ఆగ్నేయాస్త్రమునకుఁ బర్జన్యాస్త్రమును, పాశుపతాస్త్రమునకు వైష్ణవాస్త్రమును బ్రయోగించి, శివుని, జృంభణాస్త్రముచేత నావులింతగొని మూర్ఛిలునట్లు గావించి, యంత బాణునిసైన్యమును ఖడ్గముచేతను గదచేతను బాణములచేతను నుగ్గాడెను. కుమారుఁడు ప్రద్యుమ్నుని బాణసమూహములచేత నలుగడలఁ బీడితుండై యంగములనుండి నెత్తురొలుకుచుఁ దననెమిలినెక్కి యుద్ధమునుండి పరువిడెను.కుంభాండుఁడును కూపకర్ణుఁడును బలరాముని

ముసలమునఁగొట్టువడి నేలంగూలిరి. వారిసైన్యములు, నాథులు హతులగుటం జేసి నలుగడలఁ బరువిడినవి. బాణుండు తనసైన్యములు చీకాకగుచుండుటను జూచి సాత్యకిని విడిచి యుద్ధంబునఁ గృష్ణునిఁ దలపడెను. బాణుఁడును నొక్కపెట్ట నేనూఱువిండ్లను సారించి యుద్ధంపుఁ గ్రొవ్వు నివ్వటిల్ల నొక్కొక్క బాణమునకు రెండేసి తూపులుగాఁ బ్రయోగించెను. హరి యావిండ్లనెల్ల నొక్కపెట్టఁ ద్రుంచి వానిసారథిని రథమును నశ్వములను జంపి శంఖము పూరించెను. వానితల్లి కోటరయనునది తన పుత్రుని ప్రాణములను రక్షింపఁగోరి దిగంబరయై తలవెండ్రుకలు విరియఁబోసికొని కృష్ణుని ముందఱవచ్చి నిలిచెను. అంత నాకృష్ణుం డాదిగంబరను జూడక మొగము మరల్చుకొనెను. అంతలో బాణుఁడును రథమువిఱిగి, విండ్లుదునిసి, పట్టనమును బ్రవేశించెను. భూతగణము లెల్లఁ బాఱిపోవఁగా, మహాదేవుఁడు శివుఁడు శైవజ్వరము ప్రయోగించెను. అది మూఁడుదలలును మూఁడుకాళ్లును గలిగి, బెట్టిదమయిన రూపమునఁ జూపఱకు వెఱపు గొలుపుచుఁ బదిదిక్కులనును దహించునదియుంబోలెఁ గృష్ణునిపయి నురవణించెను. అది యట్లు శార్ఙ్గధన్వుండగు హరి యెదుటఁ బోడకట్టెను. అంత నారాయణుండును దానినిజూచి తనజ్వరమును బయిని విడువఁగా శైవజ్వరమును వైష్ణవజ్వరమును రెండును దలపడి పోరసాఁగెను. శైవజ్వరము వైష్ణవజ్వరముచేత బలముకోలుఁదిని బీడితమై యెంతయు నాక్రందించెను. ఆజ్వరము భీతినిగాని మఱియొండుచోట నభయము గానక హృషీకేశునిఁ గృష్ణుని శరణుఁజొచ్చి యిట్లు స్తుతించెను. శైవజ్వరము-'పరులైన (ఉత్కృష్టులైన) బ్రహ్మాదులకును నీశుం

డును, సమస్తమునకు నాత్మభూతుండును, కేవల జ్ఞానమాత్ర స్వరూపుండును, ననంతశక్తుండును, విశ్వమున కుత్పత్తి స్థితి లయములకు హేతువైనవాఁడును, వేద ప్రమాణకుండును, వేదాంత ప్రతిపాదితంబగు బ్రహ్మంబును, నశనాయాదులగు నూర్ములు లేమిం జేసి ప్రశాంతుఁడు, నగు నీకు మ్రొక్కుచున్నాను. కాలమును, కాలాద్యభిమానియగు దేవతయు, జీవాదృష్టంబగు కర్మమును, జీవుఁడును, అయావస్తు స్వభావమును, పృథివ్యాది భూతపంచకమును, వీని కుత్పత్తి భూమియగు ప్రకృతియు, పంచ వృత్తియగు ప్రాణమును, మతియు, వికారమును, వీని సంఘాతమైన శరీరమును, కార్యకారణ ప్రవాహమును ననెడి యిది యంతయు నీదుమాయ; నీసంకల్పరూప జ్ఞానమునకు లోనయి నవి. ఈప్రకృతిప్రాకృత సమస్తవస్తు గతిములయిన ప్రకారము లెల్ల నెవ్వనియందు లేదు లే దని నిషేధింపఁబడుచున్న వ్రా యట్టి నిన్ను శరణుఁ జొచ్చుచున్నాను. 'నీవు చెప్పిన పరేశుఁడు వేఱు. నేను యదువులం దొకానొకండనే' యనకు. కర్మమును బట్టి కాక లీలనుబట్టి మాత్రమే నీయందుఁ బొసఁగుచున్న నానా విధములగు మత్స్య కూర్మాద్యవతారములచేత దేవతలను సాధువులను ధర్మమర్యాదులను బోషించుచుందువు. మఱి విచ్చలవడిని వర్తించుచుఁ దప్పుదారిని ద్రొక్కినట్టి వారిని నాశముసేయుచుందువు. నీయీ యవతారమును భూమి భారమును నపహరించుటకే యగును. శాంతంబయ్యుఁ దుదిని మిక్కిలి యుగ్రంబై యించుకయు సయింపఁ దరముగాని నీ తేజంబున వెలుంగు నీదుజ్వరముచేత నేనెంతయుఁ దప్తమయితిని. ప్రపన్నమగు నన్నుఁ గావుము. ఎంతవఱకు దేహధారులు రజ



2143. శ్రీకృష్ణుఁడు బాణాసురుని బాహువులను ఛేదించుట.

కుఁడు వేఱొకఁడు గలఁడనెడియాశచే బద్ధులై నీపాదమూలము ను సేవింపకుందురో యంతవఱకే తాపము నొందుదురు. నీసేవ యందుఁ బ్రవృత్తులయినపిదప వారికిఁ దాపము దగదుగదే' యనెను. భగవంతుఁడు 'త్రిశిరా! నీయెడఁ బ్రసన్నుఁడనయితిని. నాజ్వరమువలని భయము దిగవిడువుము. మనయిరువురకు జరిగిన యీసంవాదము నెవఁడు స్మరించునో వానికి నీవలన భయము గలుగదు' అనెను. మహేశ్వరజ్వరమును హరికి నమస్కరించి వీడుకొనిపోయెను. బాణుఁడు రథారూఢుఁడై కృష్ణునితో యుద్ధము సేయుటకు వచ్చెను. ఆయసుర వేయిబాహువులందు నానాయుధములు ధరించివచ్చి క్రుద్ధుండై యాచక్రాయుధుని మీఁదఁ బరిఘమును బ్రయోగించెను. అట్లు వాఁడొక్కపెట్ట బాణములు వేయుచుండఁగా హరియు వాఁడివాదర గలతన చక్రముచేతఁ బెద్దమ్రాఁకుగొమ్మలనుంబోలె, వాని బాహువులను ద్రుంచెను. అట్లు బాణుని బాహువులు ఛేదింపఁ బడుచుండఁగా భగవంతుఁడు శివుఁడు భక్తులయందుఁ గనికరము గలవాఁడు గాన చక్రాయుధుని కడకువచ్చి యిట్లనియె—రుద్రుఁడు—'నీవు వాఙ్మయంబగు బ్రహ్మమునందు (ఉపనిషత్తునందు) గూఢంబై జ్ఞానస్వరూపంబై యుండు పరబ్రహ్మంబవు. యోగవిశుద్ధాంతఃకరణు లగువారికే నీవు చూపట్టుచుందువు. మఱి యాకాశమువలె నిరస్తనిఖిలదోషుండవు. నీకు నభము నాభి, అగ్నిముఖము, అంబువులు రేతస్సు, దివి తల, దిక్కులు చెవి, పుడమి యడుగులు, చంద్రుఁడు హృదయము, సూర్యుఁడు కన్ను, నేను అహంకారము, సముద్రము కడుపు, భుజము లింద్రాదులు, ఔషధములు రోమములు, మేఘములు తలవెండ్రుకలు,

బ్రహ్మ బుద్ధి, ప్రజాపతి మేఢ్రము, ధర్మము హృదయము. ఇట్టి పురుషుండవగు నీవు లోకములెల్ల నీయంగములుగాఁ గల్పించుకొని యున్నవాఁడవు గాన లోకకల్పుండవు. అకుంఠ తేజా! నీవవతారదశయందు నీసర్వజ్ఞత్వాదిస్వభావములను విడువక ధర్మమును రక్షించుటకును బ్రపన్నలోకమున కభ్యుదయముకొఱకుఁగదా నీయీయవతారము. లోకపాలుర మగు మేమందఱమును నీచేతఁ దొలుత సృజింపఁబడి పిదపఁ బాలింపఁబడినవారమై యేడు భువనములను బాలించుచున్నవారమే కాని మాయంతటఁ గాదు; కాన పరతంత్రులమే చుమీ. నీవీ జగంబునకుఁ గారణమవు. అయినను జతుర్ముఖాదులకుఁ గారణముగల యట్లు నీయంతట నీకుఁ గారణంబుగలుగదు. మఱియు (విభక్త నామ రూపంబులగు సూక్ష్మ చిదచిత్తులచే విశిష్టుఁడవై యంతయు నీవ కా చూపట్టుటం జేసి) యొక్కఁడవు. మఱి జగదుపాదానంబగుటం జేసి యాద్యుండగు పురుషుండవు. మఱి నీకంటె రెండవయధిష్ఠాత లేనందున జగంబునకు నిమిత్తకారణంబవు. ఇట్లు ప్రకృతిపురుషవిలక్షణుండ వగుటం జేసి స్వయంప్రకాశమానజ్ఞానస్వరూపుండవును. జాగ్రదాదులయిన యవస్థాత్రయముతోడి సంబంధములేని తురీయుఁడవు. ఈశుండవు. ఇట్లు పరస్పర విరుద్ధముగా నున్నను, నీ కపృథక్సిద్ధవిశేషణము లగు ప్రకృతి పురుషాదులన్నిటికి దేవమనుష్యత్వాద్యాకారములు సిద్ధించుకొఱకు నీసంకల్పముచేతఁ బ్రకృతి పురుషగతములయిన యాయా వికారముల కనుగుణముగా (అనఁగా వానియందంతరాత్మవై యుండి వానివాని నామరూపములకు నిర్వాహకుం

డవుగా) వేదాంతములఁ *జూపట్టుచున్నావు. సూర్యుఁడు తనకుఁ బ్రకాశ్యమును మేఘాదిరూపమునగు ఛాయచేతఁ దన స్వరూపాదులుమఱుఁగుపడకయె యుండ,నా మేఘాదిరూపమగుఛాయను నదియొడగాఁ గలిగియున్న రూపములనును జక్కఁగా నెట్లు ప్రకాశింపఁజేయునో యట్లె భూమా! సత్త్వాదిగుణమయ మగు ప్రకృతిచేత నీదు స్వరూపాదులు మఱుఁగుపడకయె యుండ నీవు ప్రకృతితత్కార్యగతము లయినధర్మములను బ్రకృతిమొదలగువానినిఁ బ్రకాశింపఁ జేయుచున్నావు. మఱి నీవాత్మ ప్రదీపుండవు (స్వప్రకాశుండవు). నీదుమాయచేత బుద్ధి మోహితమైనవారు పుత్రదారగృహాదులందుఁ దగులువడి దుఃఖసముద్రమందు మునుఁగుచును దేలుచును నుందురు. నిరతిశయ కృపాళుండ వగునీవు నిన్నారాధించి నీమాయను దరించుకొఱకు నొసంగిన యీమనుష్యదేహమును బడసియు నింద్రియపరవశుండై పురుషుం డెవ్వఁడు నీచరణారవిందములను సేవింపఁడో వాని దౌర్భాగ్యమునకు మిక్కిలియు శోకింపవలసియున్నది. ఏలన వాఁడు తన్నుఁదానే † వంచించుకొన్న వాఁడగుచున్నాడు.

---

* నీస్వరూపస్వభావములు ప్రకృతిపురుష విలక్షణములై యున్నను నా ప్రకృతిపురుషులకు దేవమనుష్యత్వాది వికారములు గలుగుకొఱకు వానియందాత్మయైచొచ్చి వానికి నాయానామరూపములను గలిగించుచున్నావనుట. నీవు లోపల నాత్మగాఁ జొచ్చియుండనియెడల వానికి నామరూప వికారములే కలుగవనిభావము. అట్లు వానినామరూపములు నీపర్యంతమును జెల్లుటచే నవియంతయు మొత్తమునకు నీవయై జగదుపాదానమును జగత్కారణము నగుచున్నావని యాశయము.

† 'యో౽న్యథాసన్తమాత్మాన మన్యథా ప్రతిపద్యతే। కింతేన నకృతం పాపం చోరే ణాత్మాపహారిణా' అను శ్లోకార్థమిచట ననుసంధింపఁబడినదని తెలియునది.

మనుజుం డెవ్వఁడు తాను మరణశీలుండయ్యుఁ దనయాత్మస్వరూపమును బ్రియుండగు నీశ్వరుని నిన్నును దిగవిడిచి సేవింపక యనాత్మలును నప్రియములును ననీశ్వరములునగు శబ్దాదివిషయములందు నార్తిగలిగి యమృతంబగు నిన్నును నమృతతుల్యంబగు నీసేవనును విషమని తలంచి విడుచుచున్నాఁడో, వానిని గుఱించి మిక్కిలియు శోకింపవలసియున్నది. నేనును బ్రహ్మయు, దేవతలును, నిర్మలాంతరంగు లగుమునులును నాత్మభూతుండును బ్రియతముండును నీశ్వరుండు నగునిన్ను సర్వవిధముల శరణుఁజొచ్చినవారము. దేవా! ఇట్లు జగదుత్పత్తిస్థితిలయ కారణుండును, సముండును (ఊర్మిరహితుండు గాన) ప్రశాంతుండును, సుహృదుండును, నాత్మనాయకుండును, దనవంటి సెవ్వఁడు మఱియొకఁడు లేనివాఁడును, ఆత్మలమగు మాకెల్ల నాధారంబునునగు నిన్ను నైహికసుఖమునకును మోక్షమునకును భజించుచున్నారము. ఈబాలుఁడు నిన్ను శరణుఁజొచ్చినట్టినాకు నిష్టుండయిన భక్తుఁడు; మఱియు గారామైనవాఁడు; నన్నను వర్తించువాఁడు. దేవా! వీనికి నే నభయ మొసంగితిని. నే నిచ్చిన యభయము సఫలము గావింపుము. నీవు దైత్యనాథుండగు ప్రహ్లాదునియెడ 'నీవంశపువానిని జంప' నని చేసిన ప్రసాదము చొప్పున వానివంశపువాఁడయిన వీనిని గావుము. ఇదియె నాయెడ నీయనుగ్రహము' అనెను. భగవంతుఁడు— 'రుద్రా! నీవు మాకుఁ జెప్పినదేదియో నీకుఁ బ్రియమేమియో వానిని జేయుదుము. నీకుఁ బ్రియమయినదియె మాకును బ్రియము. నీవు నిశ్చయించినదానిని (వీనిని రక్షించుటను) నేనును జక్కఁగా ననుమోదించితిని. వీఁడు బలికొడుకుగాన నాకును వీనిని

వధింపరాదు. ఏలన నేను బ్రహ్లాదునికి నీవంశమును వధింపనని వరమిచ్చితిని. అయినను వీనికావరము నడఁచిపుచ్చుటకై వీని బాహువులు నేను ద్రుంచితిని. మఱియు భూమికి భారముగా నుండిన వీనిసైన్యమును నాశముచేసితిని. వీనికి నాలుగుచేతులు ననుగ్రహించి మిగిల్చితిని. వీఁడు జరామరణముల నొందక మఱి దేనివలనను భయముగాంచక నీకుఁ బార్షదముఖ్యుఁడై యుండఁగలఁడు' అనెను. ఇట్లు బాణుఁడు భయమును బొంది కృష్ణునికి శిరసు నేల సోఁక మ్రొక్కి యనిరుద్ధుని నతనివధువగు నుషతోడ రథము నెక్కించికొని కొనివచ్చెను. కృష్ణుండును నక్షౌహిణీసైన్యము బలసి కొలువ, మేలయిన వలువలు గట్టి చక్కఁగా నలంకృతుఁడై పత్నియగు నుషతోడఁ గూడి యున్న యనిరుద్ధుని ముందిడికొని, రుద్రుఁడను మోదింపఁ, దానును వానివెంటఁ బురమునకుఁ బోయెను. అతఁడు ధ్వజముల చేతను దోరణములచేతను జక్కఁగా నలంకృతంబై మార్గములందును జత్వరములందును గలయంపులు చల్లంబడి యుల్లసిల్లుచున్న నిజరాజధానికిఁ బోయి. శంఖానకదుందుభి ధ్వనులు సెలంగుచుండఁ బౌరులును సుహృదులును బ్రాహ్మణులును నెదుర్కొని సత్కరింపఁ, బ్రవేశించినవాఁడయ్యె.ఎవఁడు కృష్ణుని విజయమ్మును శంకరునితోడి యుద్ధమును వేకువను లేచి స్మరించునో వానికిఁ బరాజయ మెన్నఁడును గలుగదు. ఇది యఱువదిమూఁడవయధ్యాయము.

---

**నృగోపాఖ్యానము.**

శ్రీశుకుఁడు ——ఒకనాఁడు యదుకుమారులయిన సాంబుఁడు

ప్రద్యుమ్నుఁడు, చారుభానుఁడు, గదుఁడు మొదలగువారు క్రీడిం
చుటకు నుపవనమునకుఁ బోయిరి. వారచ్చటఁ జాలసేపు క్రీడించి
యంత దప్పిగొని నీటికొఱకు నరయుచు నీరులేని యొక
పాడుబావి యందు నద్భుతమయిన యొక్క జంతు వుండఁగా
గాంచిరి. వా రందుఁ గొండంత యూసరవెల్లి నొకటిని గాంచి
మనంబుల నెంతయు వెఱఁగుపడి దానియెడ దయపుట్ట దానిని
బయికెత్తుటకుఁ బ్రయత్నించిరి. అంతఁ దోలు త్రాళ్లను నూలి
త్రాళ్లను దెచ్చి దానినిగట్టి యూపసివాండ్రు పైకి నెత్తఁజూచిరి
గాని యందులకు శక్తులుగారయిరి; కాన యెంతయు నుత్సుకులై
యావిషయమును గృష్ణునకుఁ జెప్పిరి. అంత విశ్వభావనుండగు
భగవంతుఁ డారవిందలోచనుఁ డయ్యెడకు వచ్చి దానిని
జూచి తన యెడమకేల నవలీలగాఁ బయికెత్తెను. అట్లాయుత్త
మశ్లోకుని హస్తస్పర్శము గలుగఁగా నది తోడనె యప్పటి
యూసరవెల్లి రూపమునువిడిచి తలతలమెఱయు నపరంజిచాయ
రంజిల్ల మిక్కిలి యబ్బురంబులగు నలంకారములను వస్త్రమా
ల్యములనుదాల్చి దివ్యుండై పొలిచెను. ముకుందుఁ డతని
పుట్టువును దెలిసినవాఁ డయ్యును నతనిపట్టుఁ బూర్వోత్తరం
ములను నెల్లవారికిఁ బ్రకటించుకొఱకు నడుగువాఁడై 'మహా
భాగా ! నీవెవ్వఁడవు ? సర్వజనస్పృహణీయంబగు రూపంబున
వెలుఁగుచున్నావు. నిన్ను నొకదేవోత్తముఁడుగా నెన్నుచు
న్నాను. ఇది నిజము. నీ వేకర్మమున నీకెంతయు నసహ్యముగాని
యుట్టిస్థితిని బొందితివి. నీరూపెంతయు మెఱయుచున్నది. నిన్నుఁ
దెలియ నువ్విళ్లూరుచున్నవారము గాన మాకు నీకలరూపును
జెప్పఁదగు నేని చెప్పుము' అనెను. ఇట్లు మనుష్యుం డయిన

యూరా జెల్లవారికి నానందము గొలుపుచున్న మూర్తిగల
యాకృష్ణుఁ డడుగఁగా సూర్యునివలె వెలుఁగుచున్న తనకిరీట
మతని యడుగులుసోఁకఁగా మ్రొక్కి యతనితో 'ప్రభూ!
నేను నృగుఁడను రాజను; ఇక్ష్వాకుని పుత్త్రుఁడను. ఆయా వారు
చేసిన దానములు వారువారు చెప్పుకొనునపుడు నావిషయమును
మీచెవి సోఁకియుండవచ్చును. నాథా! సమస్తభూతముల
బుద్ధులను సాక్షాత్తుగాఁ గనుఁగొనుచుండువాఁడవు. మఱినీ
యెఱుక కాలముచేతఁ బొనుఁగుపడునదిగాదు. ఇట్టినీకుఁ దెలి
యని దేమున్నది? భూమియం దెన్ని యిసుకలుగలవో, ఆకాశ
మున నెన్ని చుక్కలుగలవో, వర్షధార లెన్నిగలవో, యన్ని
గోవులను దానముచేసితిని. ఆగోవు లెట్టివి! మిక్కిలి పాఁడిగలవై
లేఁతవయస్సుగలిగి, పసటములేక మంచిశీలమును రూపునుగుణ
ములును నమరి కపిలవన్నెయుఁ గొమ్ములందు బంగారు సొమ్ము
లును గొరిజలయందు వెండి యలంకారములును గొమరార
దుకూలములుగట్టఁబడి మాల్యాభరణయుక్తములై యున్నట్టివి.
మఱి నేను న్యాయముగాఁ గడించినట్టివి. వానిని జక్కఁగా
నలంకృతులై మంచిగుణశీలములు గలిగి, దంభాచారులుగాక
యథార్థవ్రతులై తపంబున వాసికెక్కి బ్రహ్మవాదులై సజ్జ
నులై యౌవనవంతులగు బ్రాహ్మణులకుఁ, గుటుంబములు క్లేశ
పడుచున్నట్టివారికి, నొసంగితిని. గోవులనేకాదు. భూములను,
బంగారమును, గృహములను, గుఱ్ఱములను, గజములను, బని
కత్తియలతోడఁ గన్నియలను, నువ్వులను, వెండిని, శయ్యలను,
వస్త్రములను, రత్నములను, గృహోపకరణములను దానము
చేసితిని. మఱి యజ్ఞములను యజించితిని. స్మార్తక్రియలను

నాచరించితిని. ఒకానొక బ్రాహ్మణోత్తముని గోవు తప్పి నా గోవులయందువచ్చి కలసికొనెను. అది నాకుఁ దెలియదుగాన నేను నాగోధనముతోడ నాగోవును మఱియొక బ్రాహ్మణునకు దానముచేసితిని. అతఁ డాగోవును దీసికొని పోవుచుండఁగా దానితొంటి యొడయుఁడు చూచి 'యిది నాది'యనెను. అప్పుడు పుచ్చుకొన్నవాఁడు 'ఇది నాది నృగుఁడు నాకిచ్చె' ననెను. ఆవిప్రులిరువురును దమతమ ప్రయోజనములనే సాధింపఁబూని జగడము లాడుచు నాకడకువచ్చి 'నీవే యిచ్చినావు. మరల నపహరించినాఁడ' వనిరి. అదివినఁగా నాకుఁ దిబ్బిబ్బుపుట్టెను. ఇట్లు నేను ధర్మసంకటమునఁజిక్కి యాయిరువురు విప్రులకును 'మేలిరకావు లొకలక్ష యిచ్చెద. దాని నాకిండు. నేను మీకింకరుఁడను; ఇది నాకుఁ దెలియక జరిగినది. కాన యిరువురు నాయందనుగ్రహముంపుఁడు. ఆశుచియగు నాకిమనఁ బడుచున్న నీసంకటమును గడియుద్ధరింపుఁడు' అనియెంతయు సమాధానపెట్టితిని. కాని వానితొంటి స్వంతకాఁపు 'రాజా! లక్షగోవుల నిచ్చినను దీసికొనను' అని చెప్పి వెడలిపోయెను. రెండవవాఁడు 'వేఱుగోవులు పదివేలిచ్చినను నొల్ల'నని చెప్పిపోయెను. అంతఁ గాలయోగంబునను బరమునెఱుఁగు నీసంకల్పముచేతను మృతుఁడనైదేవా! దైవవశమున నప్పటికిఁ గొంపోవఁబడితినో నీసమ్ముఖమున విన్నవించెదను. ఈనడుమ యమదూతలు నన్నుఁబట్టికొని యమలోకమునకుఁ గొంపోయిరి. దేవదేవా! జగత్పతే! అచ్చట నున్న యముఁడు 'రాజా! ముందఱ నీవు పాపమును గుడిచెదవా? లేక పుణ్యమునా? నీవు చేసిన దానమునకుఁ గలపుణ్యఫలమునకుఁ దుదిగానక యెంతయు వెలుఁగుచున్నది' యనెను. 'నేను

ముందఱనే పాపమును గుడిచెద' నంటిని. అంత నతఁడు 'పదు' మనెను. ప్రభూ! అట్లు నేను బదునప్ల డూసరవెల్లిని గాఁగాఁ జూచితిని. రాజా! నేను బ్రాహ్మణభక్తియుక్తుఁడును, దాత యును నీకు దాసుండును నై యుండినకతన నిన్ను సందర్శింప వలయునని యువ్విళులూరుచున్న నాకు స్మృతి యింతకును దూలినదిగాదు. ప్రభూ! మహాయోగీశ్వరులగువారికిఁ గన్నులకుఁ గాక యుపనిషద్దృష్టికిమాత్రమె నిర్మలహృదయమందుఁ గేవలము చింతించుటకుమాత్ర మలవి యగు పరమాత్ముండవు. మఱి భక్తులుగాని వారి యింద్రియముల కగోచరుండవు. ఇట్టి నీవు మాంసపుఁగన్నుల కెట్లగపడితివి? ఎవ్వనికి సంసారనాశము గలదో యట్టివానికి బుద్ధి,వ్యసనముచే మందటిలి యున్నను హృదయము శాంతమై యుండెనేని, తప్పక చూపట్టనేర్తువు. దేవదేవా! జగన్నాథా! గోవిందా! పురుషోత్తమా! నారాయణా! హృషీకేశా! పుణ్యశ్లోకా! అచ్యుతా! అవ్యయా! ప్రభూ! కృష్ణా! దివ్యగతికిఁ బోవుటకు నాకనుజ్ఞ యిమ్ము. ఎక్కడనుండిన నయినను నామనంబు నీయడుగుఁదమ్ములకుఁ బట్టయి యుండుఁగాత. సర్వవస్తుశరీరకుండును, బ్రహ్మంబును ననంతశక్తియు వాసుదేవుండును యోగములకుఁ బతియునగు కృష్ణునకు నీకు నమస్కారము' అనెను. ఇట్లతండు చెప్పి కృష్ణుని వలగొని తనశిరంబుచే నతనియడుగులకు మ్రొక్కి యనుజ్ఞగొని మేటివిమానము నారోహించి మనుజులందఱును జూచుచుండఁగా దివికిఁబోయెను. అంత భగవంతుఁడును దేవకీసుతుండును నగు కృష్ణుఁడు బ్రహ్మణ్యదేవుండును ధర్మాత్ముండు నగుటం జేసి రాజులనెల్ల ననుశాసించుకొఱకుఁ దన పరిజనులనుజూచి 'ఔరా!

బ్రహ్మస్వమును గొంచెమేనియు భుజించినచో నగ్నింబోలె నతి
మాత్రము తేజముగలవానికి నయినను నది యఱిగించుకొనుట
యెంతయుఁ గష్టము. ఇఁకఁ దమ్ము నీశ్వరులని తలంచుకొని విఱ్ఱ
వీఁగుచుండు రాజులమాట చెప్పనేల! నేను హాలాహలమును
గూడ విషమని తలంపను. ఏలన దానికిఁ బ్రతికారముగలదు.
బ్రహ్మస్వమే విషమనఁబడినది. ఏలన దానికి భూమియందుఁ బ్రతి
కారము లేనేలేదు. విషము దన్ను భుజించినవానినే హింసిం
చును. అగ్ని నీళ్లచే నాఱిపోవును. బ్రహ్మస్వమనెడి యరణియం
దుఁ బుట్టినయగ్నియో, తన్నుఁగొన్నవాని కులమునంతయు సమూ
లముగాఁ గాల్చివైచును. మఱియు బ్రహ్మస్వము లెస్సగాఁ దెలి
యక భుజించినచోఁ దన్నును దనపుత్రునిని పౌత్రునిని మువ్వు
రు పురుషులనును జంపుచున్నది. తోడు బలిమినిబట్టి బలవంత
ముగా భుజించినవానినో, వెనుకఁ దండ్రి తాతలు మొదలగు
పదితరములవారిని ముందు కొడుకు మనుమఁడు మొదలగు పది
తరముల వారినిని జంపుచున్నది. రాజులెవ్వరు బ్రహ్మస్వము
లెస్సగాఁ దమది యని తెప్పఁదలంతురో వారు రాజ్యలక్ష్మిచేఁ
గన్నుఁగాననివారు; దానివలనఁ దాము గూలునట్టి నరకమును
విచారింపరు. కాన వారు కేవలము మూఢులేయగుదురు. దాం
తులును గుటుంబులు నయినవిప్రులధనమునునపహరించుకొనఁగా
వారేడ్చునపుడు వారికన్నీటిబొట్టు లెన్ని పాంసువులను దడుపునో
యన్ని సంవత్సరములు రాజులును రాజకులమువారును నట్లు
బ్రహ్మస్వము నపహరించినందులకు నిరాతంకముగాఁ గుంభీపాక
నరకమునఁ గాఁగుచునుందురు. ఎవ్వఁడు బ్రాహ్మణుని బ్రతుకునకు
దా నిచ్చినదానినిగాని పరులిచ్చినదానినిగాని నపహరించునో

వాఁడిఱువదివేల సంవత్సరములు మలమందుఁ గ్రిమిగాఁ బుట్టి యుండును. నాకు బ్రాహ్మణధన మెప్పుడును వలదు. దానికై పేరాసగొను రాజు లల్పాయుష్యులై యపజయమునొంది రాజ్య పదవులనుండి దూలుదురు. కాన దానివిషయమై మీ కందఱకు భయపడుచున్నారము. మీరు నావా రగుదురేని,విప్రుఁ డపరా ధము గావించినను వానికి ద్రోహము సేయవలదు. అతఁడుమిమ్ముఁ గొట్టుచున్నను దిట్టుచున్నను నిత్యమును నతనికి నమస్కరించు చుండుఁడు. నే నెట్లు మూఁడుప్రొద్దులును సమాహితుఁడనై విప్రులకుఁ బ్రణమిల్లుదునో యట్లె మీరును నమస్కరింపుఁడు. ఎవఁడిట్లు నడవఁడో వాఁడు నావలన దండమునొందును. బ్రాహ్మణధనము నపహరింపఁబడు నేని,యపహరించినవానిని, వాఁడు తెలియక యట్లుచేసినను నృగుని బ్రాహ్మణునిగోవుంబోలె నధోలోకమునఁ బడఁద్రోయుచున్నది' అనెను. ఇట్లు సర్వ భూతపావనుండును భగవంతుండు నగు నాముకుందుఁడు ద్వారకాపురవాసుల కెల్ల వినిపించి యంత నిజమందిరమును బ్రవే శించినవాఁడయ్యె. ఇది యఱువదినాలుగవయధ్యాయము.

బలరాముఁడు మరల గోపల్లెకుఁ బోవుట.

శ్రీశుకుఁడు—భగవంతుఁడు బలభద్రుఁడు వ్రేపల్లెయందలి చుట్టములను జూడవలయునని యువ్విళ్లూరుచు గాటంపుఁ దమ కముగొని రథము నెక్కి నందగోకులమునకుఁ బోయెను. అట గోపకులును గోపికలును జిరకాలముగాఁ దహతహ పడుచుం డినవారుగాన రాముని బిగ్గఁ గౌఁగిలించికొనిరి. రాముఁడు తలి దండ్రులగు నందయశోదలకు మ్రొక్కఁగా వారు దీవెనలిచ్చి

యెంతయు నభినందించిరి. వారు రామునిఁజూచి 'దాశార్హా! జగదీశ్వరా ! నీవును నీదమ్ముఁడునుఁ మమ్ముఁ జిరకాలముగాఁ బ్రోవుఁడు' అని తొడపయినిడికొని యాలింగనముచేసి, కన్నుల నీరు పెట్టుకొనిరి. రాముఁడు గోపవృద్ధులకు విధ్యుక్తముగా నభివాదనముచేసి, తనకంటెఁ జిన్నవయసువారలవలన మ్రొక్కులుగొని మఱియుఁ దనవయసునకును జెలిమికిని జుట్టఱికమునకును దగురీతిని నాయాగోపకులను బరిహాసకమాడుచును, జేయివట్టికొనుచు,నివి మొదలయిన సయ్యాటముల నెఱపుచుఁ దఱిసి రాఁబట్టుకొనెను. అంతనతఁడు విశ్రమించి సుఖాసీనుఁడై యుండఁగా గోపకులందఱును దామరరేకులవంటి కన్నులుగల చెన్నారుచుండు కృష్ణునియందుఁ దమబుద్ధులనెల్లఁ బెట్టుకొలిపి తక్కినవెల్ల మఱచి యారామునిచుట్టు బలసి తమవారి కుశలము నడిగి యంతఁ బ్రేమముచేత నెలుఁగు డగ్గుత్తికపడ నతనితోఁ 'రామా! మనబంధువులెల్లవారును కుశలముగానున్నారుగదా! రామా ! మీరును మీయాలుబిడ్డలును మమ్మును దలంచుకొందురా ! అదిమొక్కడిది! భాగ్యవశమున పాపాత్ముఁడు కంసుఁడు హతుఁడయ్యెను. మనచుట్టములందఱును భాగ్యవశమున వాని బారినుండి విడివడిరి. మీరును బగవారిని జంపియు గెలిచియు బలువయిన దుర్గమును నాశ్రయించియుండుటయు భాగ్యము' అనిరి. అంత గోపికలు రామునియందే చూడ్కులు సారెకు నాలుకొలిపి తెలిచిఱునవ్వులు దొలఁక నతనితో 'రామా! * పురస్త్రీ జనులకు వల్లభుండగు కృష్ణుండు సుఖముగనున్నాఁడు

---

* పురస్త్రీజనవల్లభుఁడనుటచే గ్రామ్యస్త్రీజనుల మగుమాకెట్లు వల్లభుఁడగునని భావము సూచితము.

గదే! వాఁడు బంధువులను దల్లిని దండ్రిని దలంచుకొనునా? అమ్మహాభుజుఁడు మమ్మును మాయెడ తెగక చేసినకొలువును దలంచునా? ప్రభూ! యదుతిలకా! ఎవ్వనికొఱకుఁ దల్లులను, దండ్రులను, దోఁబుట్టువులను, బతులను, బుత్రులను, జెలియండ్రను, దిగవిడిచితిమో యట్టిమముఁ దటాలున దిగవిడిచి నెయ్యమును ద్రుంచికొనిపోయినాఁడుగదే! వాని నేల పోనిచ్చితి రందువా! వాఁడు మరలివత్తునన్నమాట నమ్మి. అట్టినీటుమాటను మాబోఁటిపడఁతు లెట్లు నమ్మకుండ నేర్తురు! మావిషయము లుండనీ! మన స్వీకృతిరూనఁ గుదురు లేక చేసినమేలు మఱచునట్టివానిని దెలివి దేట గలయూపట్టనపుఃబడఁతు లెట్లు గయికొనెదరో కదా!' (యనికొందఱు సుందరులనఁగా వేఱుకొందఱు) 'వాఁడు పలుకు చిత్రంపుఁ బలుకులకును,సొగసయిన చిఱునవ్వు మురియు పిసాళిమాడ్కులకును మారులు పెల్లుబ్బఁగి కుదిలఁబెట్టఁగా వారును గయికొనెదరు. కయికొన కెట్లుందురే!' (యనిరి. వేఱుకొందఱు పడఁతులు) 'గోపికలారా! మనకు వానిముచ్చటలతోఁ బనియేమి! వేఱుసుద్దు లేవేని చెప్పుఁడు.*మనము లేకయే వానికిఁ బ్రొద్దుపోవునట్లు వాఁడు లేకయు మనకు నెట్లో ప్రొద్దుపోవుచునే యున్నది గదా! ఉబుసుపోక నిలిచియున్నదా! వానిమాటలు తలపెట్టకుఁ' డనిరి. ఇట్లు వారందఱును కృష్ణుని పరియాచకములు, మాటసీటులు, సొగసుంజూపులు, నడలు, నెయ్యంపుఁ గౌఁగిలింతలును దలంచుకొనుచు నెంతయు రోదనము చేసిరి. బలరాముఁడును బలువగల నూఱడించుటయందు మిగుల నాఱె

* మనములేక వానికిని వాఁడులేక మనకునుసరిగా ప్రొద్దుపోవుచున్నదిగాని వానికి సుఖముగాను మనకుఁ గష్టముగాను జరుగుటయే తారతమ్యమనిభావము

తేటిన దిట్టగాన కృష్ణుఁడు మనంబలరఁ జెప్పిపుచ్చిన మాటలు చెప్పి వారినెల్ల నూఱడించెను. రాముండచట చైత్రవైశాఖ మాసములు రెండును వసించియుండి రాత్రులందు * గోపికలకు రతిఁగూర్చుచునుండెను. అంతనతఁడు పూర్ణచంద్రుని కిరణములచేఁ బురణించుచుఁ గలువతంపర తావులు గుబాళించు కమ్మతెమ్మెరలు పొలయుచు యమునాతీరమం దున్నయుపవనమందుఁ, గుందరదనలు గుంపులుగొని బలసికొలువ, రమించుచుండెను. వారుణీదేవి వరుణుఁడు పంపఁగా వచ్చి యందలి యొక మ్రాని తొఱ్ఱనుండి తొరుఁగుచు నావనమునంతయుఁ దనగంధముచేత గుబులుకొనఁ జేసినదయ్యె, ఆమధువు ధారవలని వాసనను, వాయు వెలయించి తేఁగా బలుండు మూర్కొని యాకందువకుఁ జని సుందరులును దానునుగూడి దానిని గ్రోలెను. అతఁడు పూవుంబోండ్లు పొలుపుఁగులుకఁ దన్నుఁ జుట్టి తన్నుఁ గుఱించి గీతములు పాడుచుండఁగాఁ దానును బాడుచు నాఁడుగజములతోడ నింద్రుని యైరావతగజమునలెఁ, గూడి క్రీడించెను. అపు డాకాశమున దుందుభులు మ్రోఁగెను. దేవతలు ముదంబున బువ్వులు గురిసిరి. గంధర్వులాడిరి. మునులు ముదమున నతని వీర్యములను దెలుపువాక్యముల స్తుతించిరి. ఇట్లతఁడు పడఁతులు దనచరితములను బాడుచుండఁగాఁ గల్లుచే మైమఱచి యామత్తుచేఁ గన్నులు సుడివడ వనములందు విహరించుచుండెను. అతఁడు పూదండదాల్చి యొకకుండలము దొడిగి కలుచొక్కు పిక్కటిల్ల వైజయంతిమాలిక పొలుపుగులుక జెఱు

* ఇట నీగోపికలు బలరాముఁడు తాను మున్ననుభవించిన గోపికలుగాని వ్రేపల్లెవిడిచిపోయినపిదపఁ బుట్టినగోపికలుగాని కావలయును.

నవ్వు దళుకొత్తు మోముదామరవయిని గ్రొంజెమరు మంచుం బోలెఁ గొమరుచూప నే పారుచుండెను. అతఁ డీశ్వరుఁడుగాన యమునానదిని జలక్రీడకొఱకు రమ్మని పిలిచెను. ఆనదియు నతఁడు మత్తుండని తలఁచి యతనిమాటను బాటింపక రాకయుండఁగా రాముఁడు కుపితుఁడై తన హలముకొన దగిల్చి దానిని బట్టి యీడ్చి 'ఓసీ పాపాత్మురాలా! నీవు నే నెవఁడనో తెలియక నేనుబిలిచినను రావయితివిగా! కనుక విచ్చలవిడిని వర్తించు నిన్ను నాఁగేటికొనచే నూఱుపలియలుగావించెదను జూడు' మనెను. ఇట్లతం డదల్పఁగా నాయమ భయమునొంది గడగడవడఁకుచు నాయదునందనుని పాదములంబడి 'రామా! రామా! మహాబాహూ! నీపరాక్రమము నే నెఱుంగనుజుమీ! జగత్పతీ! నీ * యేకాంశముచేత జగమునంతయుఁ దాల్తువు. మహాత్మా! భగవంతుఁ డగు నీపరస్వభావమును దెలియనిదానను గాన విశ్వాత్మా! భక్తవత్సలా! నన్ను, నిన్ను శరణుఁజొచ్చిన దానిని, విడిచిపుచ్చఁదగును' అనెను. అంత నాభగవంతుఁడు బలుఁ డట్లు యమునబతిమాలుకొనఁగా దానిని విడిచిపుచ్చెను. అంతదాని జలములం దతఁ డాఁడుగజములతోడ గజరాజుం బోలెఁ బూఁబోండ్లంగూడి జలకమాడి క్రీడించెను. అట్లతఁడు నిచ్చ నచ్చినట్లు దానియందు విహరించి యంతజలములనుండి దరికి రాఁగా యమున యతనికి రెండు † నల్లనియంబరములను మిక్కిలి వెలపొడుగయిన భూషణములను మిక్కిలికాంతి వెలుంగు

---

* నీవేయితలలో నొకతలయుందలి యొక భాగముచేత నని భావము.

† విష్ణుపురాణమందు 'వరుణప్రహితాంచాస్మై మాలామమ్లానపఙ్కజామ్। సముద్రాభే తథావస్త్రే నీలే లక్ష్మీరయచ్ఛత' అని లక్ష్మి వరుణునిపంపున నా

చుండు నొకమాలికను నొసంగెను.బలుండానల్లనిపుట్టములను రెంటిని గట్టుకొని యాబంగారుపూదండను మెడయందుఁదొడిగి చక్కఁగానలంకృతుండై,కలపమలంది,యింద్రుని యైరావతముం బోలె వెలింగెను. నేఁటికి నాయమునానది, బలుండు తన్నుఁ బట్టి యీడ్చినదారియందే యనంతవీర్యుండయిన యాతనిబలిమి సూచించుచున్నదియుంబోలెఁ గనుపట్టుచున్నది.ఇట్లు రాముఁడు తనమనను రతిప్రవణమై వ్రజమందు రమించుచుండఁగా, నతనివిలాసములచేత గొల్లచెలువలకు నారాత్రులన్నియు నొక్క రాత్రియుంబోలెఁ జూపట్టినదయ్యె. ఇది యఱువదియేనవ యధ్యాయము.

—·✦·—

## శ్రీకృష్ణుఁడు పౌండ్రకునిఁ గాశీరాజును వధించుట.

రాముఁడు వ్రేపల్లెకుఁ బోయినపిమ్మట, కరూశదేశమునకు రాజయిన పౌండ్రకుండు మూఢుఁడుగాన దాను వాసుదేవుఁడని తలఁచి కృష్ణునికడకు నొకదూతను బంపెను. అజ్ఞులు గొందఱు వానిని జూచి 'నీవే వాసుదేవుఁడుగా నవతరించియున్న భగవంతుండవు, నీవే జగత్పతివి' అని స్తోత్రములుచేయఁగా వాఁడు బేలువడి తన్నేయచ్యుతునిఁగాఁ దలఁచెను. ఆమందుఁ డవ్యక్త స్వరూపస్వభావుండగు కృష్ణునికడకు 'ద్వారకయందు, బాలు రొకబాలుని రాజుగా నాటకై కల్పించినట్లు, తెలివిమాలిన నిన్నుఁ దెలివిలేనివారు రాజుగా నేర్పఱచియున్నారు' అని చెప్పి

వస్త్రాదుల నిచ్చినట్లున్నది. అందును లక్ష్మి సర్వసౌభాగ్యమయి మూర్తిదాల్చిన యమునయే యగునని యీప్రకరణముకథాసందర్భమునుబట్టి యర్థము గ్రహించుట యుక్తము.

దూతనుబుచ్చెను. ఆదూతుఁడును ద్వారకకుఁబోయి సభయం దాసీనుఁడై యున్న ప్రభుండును గమలపత్త్రాక్షుండునగు కృష్ణునిఁ జూచి తనరాజుచెప్పిన సందేశమును జెప్పెను. అదియేదన- 'నే నొకఁడనే సమస్తభూతములను గరుణించుకొఱకు వాసుదేవుఁడనై యవతరించియున్నాఁడను. మఱియొకఁడు వాసుదేవుఁడు గాఁడు. నిన్నుఁ బొల్లుగా వాసుదేవుఁడందురు. సాత్వతా! నీవు మూఢత్వము వలన మాచిహ్నము లేవేవి దాల్చియున్నావో వానినెల్ల విడిచి నన్ను శరణుఁజొరుము. లేదా! నాకుయుద్ధమిమ్ము' అనుటయె.

ఇట్లల్పబుద్ధియగు నాపౌండ్రకుని వికత్థనములను విని సభయందున్న యుగ్రసేనుఁడు మొదలగువారపుడు బిగ్గరగాఁ బకపకనవ్విరి. భగవంతుఁడు కృష్ణుఁడు నాదూతంజూచి పరిహాసకపు ముచ్చటగానే 'మూఢా! నీవేమి చిహ్నములచేత నిట్లు వికత్థనము లాడుచున్నావో వానెల్ల నిన్నుడిపించెదనుబో. నీవును నీముఖమును గప్పికొని కంకగృధ్రగణములు బలసి మూఁగఁగా హతుండవై పరుండియున్నచోఁ గుక్కలకు శరణంబగుదువు చుమీ' యని చెప్పిపుచ్చెను. ఆదూతయు నాయాక్షేపవచనములనెల్లఁ దనస్వామికిఁ గొంపోయెను. కృష్ణుండును రథారూఢుఁడై కాశికివచ్చెను. మహారథుఁ డాపౌండ్రకుఁడును నాకృష్ణుని పూనికనుదెలిసి యక్షౌహిణులంగూడి పురము వెలుపలికి వెడలివచ్చెను. వానికిఁ గాశిరాజు మిత్త్రుఁడుగాన పార్ష్ణిగ్రాహుఁడై మూఁడక్షౌహిణులతోఁగూడి వెంబడించి వచ్చి యాపౌండ్రకునిం గాంచెను. అంతఁ గృష్ణుండు శంఖచక్రఖడ్గగదాశార్ఙ్గములు శ్రీవత్సము మొదలయినవానితోఁ గూడిన

వాఁడై కౌస్తుభమణిని దాల్చి వనమాలచే విభూషితుండై పచ్చనిపట్టువలువలు రెంటినిగట్టి గరుడధ్వజమును గలిగి యమూల్యమగు మౌళిభూషణమును దళతళ మెఱయు మకరకుండలములను దాల్చియున్న యాపౌండ్రకునిఁజూచినవాఁడయ్యెను. అతఁడట్లు రంగస్థలమున నటునివలెఁ దన్నుంబోనికృత్రిమవేషము దాల్చియున్నవానిని జూచి పకపకనవ్వెను. అంత నాయిరువురు శత్రువులును శూలములచేతను గదలచేతను, బరిఘములచేతను,శక్తులచేతను,ప్రాసతోమరములచేతను,ఖడ్గములచేతను,బట్టసములచేతను, బాణములచేతను హరిని బ్రహరించిరి. కృష్ణుండు నాపౌండ్రక కాశీరాజుల సైన్యమును రథగజతురగపదాతియుక్తమైనదానిని గదాఖడ్గ చక్రములచేతను బాణములచేతను, యుగాంతమందలి యగ్నిప్రజలనుంబోలెఁగలంచి నలంచిపుచ్చెను. చక్రముచేత వారిరథములును నశ్వములును గజములును బదాతులును ఖరములును లొట్టియలును ఖండితములై కుప్పంగూరఁగాఁ బడఁగా నాయుద్ధస్థలము, శూరులకుఁ జాల సంతోషకరమై కల్పాంతమందు భూతపతియగు రుద్రుని క్రీడాస్థానముంబోలె దారుణంబయి ప్రకాశించెను. అంతఁ గృష్ణుండు పౌండ్రకునింజూచి 'ఓరోరీ! పౌండ్రకా! నీవు దూతచేతఁ జెప్పిపుచ్చిన యస్త్రములనే నీపయి విడిచెదను. మూఢా! నీవు బొల్లుగాఁ దాల్చియున్న నాపేరినిసైతము విడిపించెదను. మఱి నేను యుద్ధమునకు నొల్లక వెఱచితినేని నిన్ను శరణుఁ జొచ్చెదను' అని యాక్షేపించి వాఁడిబాణములచే వానిని విరథునిఁగావించి యింద్రుఁడు వజ్రముచేతఁ బర్వతమునుంబోలెఁ జక్రముచేత వానిశిరమును నఱకెను. అట్లు కాశీపతి కాయము -

నుండి శిరమును బాణములచేఁ ద్రుంచి దానిని, గాడ్పు తామర మొగ్గనుంబోలెఁ గాశికాపురియందుఁ బడఁగూల్చెను. ఇట్లు హరి తన్ను మచ్చరికించిన యాపౌండ్రకునిని వాని చెలికానిని జంపి సిద్ధులు తనకథామృతమును గానముసేయ ద్వారకకుఁ బోయెను. ఆపౌండ్రకుఁడు నిత్యమును భగవద్ధ్యానము వలన సకల కర్మబంధములును ధ్వంసమునొందఁగా నెప్పుడును హరి రూపమును దాల్చియుండిన కతమునఁ దన్మయత్వము నొందెను. కాశియందు రాజద్వారమున శిరసుపడఁగాఁ జూచి యందలిజను లిది యేమియని భ్రమించి యంతఁ గుండలములతోఁ గూడి యుండఁగా నెవరిముఖమని యెంతయు సంశయించిన వారయిరి. అంత నది కాశీరాజు శిరస్సని తెలియఁగా సతిని పట్టపుదేవులును బుత్రులును బాంధవులును బురజనులును రాజు హతుఁడయి నందున 'నాథా ! నాథా'! యని రోదనముచేసిరి. వానికొడుకు సుదక్షిణుఁడనువాఁడు తండ్రికి నుత్తరక్రియలు గావించి తండ్రిని జంపినవానిని జంపి తండ్రిఋణము నీఁగెదనని తనబుద్ధిని నిశ్చయించుకొని యుపాధ్యాయునిం గూడి, పరమంబగు ధ్యానయోగమున మహేశ్వరుని రుద్రుని నారాధించెను. వాఁడు తనపితను వధించినవానిని జంపుటకు నుపాయము పరమేశ్వరుని వేఁడెను. భగవంతుఁడు రుద్రుఁడును బ్రీతుండై యేకాంతమున వానికి వరమిట్లొసంగెను. రుద్రుఁడు—నీవు మంచిఋత్విజులంగొని దక్షిణాగ్నిని నభిచార హోమముచే నారాధింపుము. అట్లు పరిచరింపఁగా నాయగ్ని ప్రమథగణములంగూడి * బ్రహ్మణ్యునియందుఁ బ్రయుక్తమై నీయుద్దేశమును సాధింపఁగలదు'

* బ్రహ్మణ్యునియందుఁ బ్రయోగించినచో తన్నేచంపునని యిటభావము.

అనెను. ఆ మానతి చొప్పున నా దుర్బుద్ధియుఁ గృష్ణునికి ద్రోహము సేయువాఁడై యతనియెడఁ బ్రయోగించెను. అంత నగ్నిదేవుఁడు కుండమునుండి మూర్తిఁగొని యతిభయంకరుఁడై యుప్పతిల్లెను. వాని తలవెండ్రుకలును గడ్డమును మీసలును గాఁచిన రాగివలె నెఱ్ఱనయి యుండెను. వాని కన్నులు నిప్పుక లుమియుచుండెను. బెడిదములయిన కోఱపండ్లును కనుబొమలును, దంతములును గలిగి వానిముఖము మిగులఁ గఠోరముగా నుండెను. వాఁడు తన నాలుకచేత సెలవుల నాకికొనుచు దిగంబరుఁడై తలతల జ్వలించుచున్న త్రిశూలమును గేలం ద్రిప్పుచుండెను. మఱి తాటిచెట్లంతలు గాళ్లచే భూతలమును గ్రక్కదల్చుచు దిక్కులను దహించుచుఁ బ్రమథగణములు పరివేష్టింప ద్వారకాపురము పయి నెత్తివచ్చెను. ఆ యభిచారాగ్ని వచ్చుచుండఁగాఁ ద్వారకాపురజనులు చూచి, దావాగ్నినిజూచిన మృగములవలె, నందఱును దిగులుగొని వడఁకఁజొచ్చిరి. వారు భయాతురులై సభయందుఁ బాచికలాడుచున్న కృష్ణునిం గని 'త్రిలోకేశా! కావు కావుము. పట్టణమును గాల్చుచున్న యగ్నినుండి రక్షింపుము' అని మొఱపెట్టిరి. ఆజను లిట్లు దటతప్పి యుండుటయు నట్లు తనవారెల్ల వడఁకుచుండుటయును జూచి సర్వశరణ్యుం డా హరి పక్కున నవ్వి వారితో 'భయపడకుఁడు. మిమ్మును గాఁచెదను జుఁడీ' యనెను. సమస్త ప్రాణులలోపలను వెలుపలనుండి యన్నింటిని జక్కఁ జూచుచుండు సాక్షియగు నా బలువంటయది మహేశ్వరుని కృత్యమని తెలిసి దాని నివారించి దూల్చుటకై ప్రక్కనున్న చక్రమున కాజ్ఞాపించెను. కోటి సూర్యులుంబోనిదై మీఁదుమిక్కిలి జ్వలించుచు, ప్రలయ

కాలాగ్నివలె వెలుంగుచున్న ముకుందుని యస్త్రము, ఆసుదర్శనచక్రము, తన తేజముచేత దిక్కులను భూమ్యాకాశములను మ్రింగుచువచ్చి నాయగ్నిని మర్దించెను. అట్లు చక్రాయుధుని తేజోరూపమైన యాసుదర్శన చక్రముచేఁ బ్రతిహతమై యాకృత్యాగ్ని, ముఖము భగ్నమై పెడమరలి కాశికిఁబోయి యందు నభిచారము గావించిన యాసుదక్షిణునిని వాని ఋత్విగ్జనమును దహించివుచ్చెను. ఆచక్రము పిదపఁ గాశియందుఁ బ్రవేశించి యందలి యట్టళ్లను సభలను గృహములను సంగళ్లను గోపురములను నట్టాలకములను గోష్ఠములను గోశములను గజాశ్వశాలలను రథశాలలను నన్నశాలలను దహించెను. విష్ణుచక్రంబగు సుదర్శనమట్లు వారణాసీపురము నంతయుఁ గాల్చి, యంత నెట్టికృత్యము నేని చల్కం జేయఁజాలిన యాకృష్ణుని కెలన నచ్చి నెలకొనియుండెను. ఉత్తమశ్లోకుండయిన కృష్ణుని యీ చరిత్రమును మనుష్యుం డెవ్వఁడు వినిపించునో మఱి సమాహితుఁడై తాను వినునో యతఁడు సమస్తపాపములనుండి విడివడుచున్నాఁడు. ఇది యఱువదియాఱవ యధ్యాయము.

---

## బలరాముఁడు ద్వివిదుఁడను వానరుని సంహరించుట.

రాజు 'అద్భుతకర్ముండును ననంతుఁడును నప్రమేయుండునగు నా ప్రభుండు బలరాముఁ డింకను నేమి కావించెనో మఱియు వినఁగోరుచున్నాను' అనెను. శ్రీశుకుఁడు—నరకాసురుని చెలికాఁడు ద్వివిదుఁడను వానరుఁడొకఁడు గలఁడు. వాఁడు సుగ్రీవునకు సచివుఁడు, మైందునకు దోఁబుట్టువు, మిక్కిలి వీర్యవంతుఁడు. ఆవానరుఁడు తన చెలికాఁడయిన నరకుని ఋణము తీర్చుకొన

వలయునని తలఁచి రాష్ట్రమున కెల్ల నుపద్రవము గావించుచుఁ బురములను గ్రామములను నడుమఁగల ఘోషములను నగ్ని దరికొలిపి కాల్చుచువచ్చెను. వాఁడొక్కచోఁ గొండలను బెకల్చి చేకొని వానిచే దేశములను,అందును మిక్కిలియు శత్రుహంత యగు హరియున్నట్టి యానర్తక దేశములను, నుగ్గునూఁచ గావించెను. వాఁ డొకప్పుడు సముద్రమునడుమ నుండి రెండు చేతులను దాని జలములనెత్తి వేయిగజముల బలముగలవాఁడు గాన చెలియలి కట్టయందున్న దేశములను ముంచెను. ఋషిముఖ్యులకు నాశ్రయము లైయున్న గొప్పవృక్షములను భస్మము గావించి యాఖలుఁ డాహవనీయాదులయిన యగ్నులను మూత్ర పురీషములచేఁ జెఱిచెను. మఱియు వాఁడు పోతరించి పురుషులను స్త్రీలను బర్వతపుద్రోణులందును గుహలందును వైచి తుమ్మెద పురువునుంబోలె, వానిని శిఖరములను దెచ్చివైచి కప్పి పుచ్చును. ఇట్లు దేశముల కపకారము కావించుచుఁ గులస్త్రీలను జెఱుపుచు రైవతక పర్వతమునుండి మిక్కిలి యింపయిన గీతము నొకటివిని యచటికిఁ బోయెను. అచట వాఁడు పద్మమాలికను దాల్చి యంగములెల్లఁ గనువిందులుచేయు సంతము చూప, సుందరీ బృందమునడుమ నున్నయదుపతిని బలరామునిఁ గాంచెను. అప్పుడు రాముఁడు కల్లుద్రావి మత్తుచేఁ గన్నుంగవయున్న వెసఁగ, నెమ్మేను దానెంతయు మెఱయుచుండఁ, బాడుచు మత్తిల్లిన యేనుంగువలె వెలుంగుచుండెను. ఆ చెడుగోఁతి యొక చెట్టుకొమ్మనెక్కి మ్రాఁకులనెల్లఁబట్టి యల్లలార్చుచుఁ దన మేనును జూపుచుఁ గిలకిలమని యార్చుచుండెను. వాని దుడుకుఁదనమునుజూచి యందు బలదేవుని యిల్లాండ్రగు జవ్వ

నులు తమజాతి చాపలమునుబట్టి పరియాచకమన్నఁ బ్రియముగాన వానిని జూచి పకపక నగిరి. ఆకపియు వారిని జూచి బొమలు త్రిప్పుచును నెదురవచ్చి పండ్లిగిలించుచును రాముఁడు చూచుచుండఁగా వారలకుఁ దనగుదమును జూపుచు నిట్టిదుండగములచే వారిని వెక్కిరించుచుండెను. ప్రహరించువారియందు మిన్నయగు నాబలుండు వానిపైని బెనుఱాతినిగొని క్రుద్ధుండై వేసెను. వాఁడాఱాతిని దప్పించుకొని కల్లుకలశము నెత్తికొని ధూర్తుండై యతనిని గినియించుచు నవ్వుచును నవమానించెను. వాఁడా కలశమును విఱుగఁగొట్టి మిక్కిలియుఁ గావరమున నాకొమరాండ్ర వలువలనుబట్టి యీడ్చి బలరాముని సరకుసేయక మదంబునఁ బదటమున నలిరేఁగి, బలవంతుండై యతనికెంతయు నపకారముగావించెను. బలుఁడు వాని పదటమును జూచి వాఁ డుపద్రవము గావించిన దేశములను దెలిసి క్రుద్ధుఁడై యాపగతునిఁ జంపుతలంపున ముసలమును హలమును గయికొనెను. ద్వివిదుఁడును మహావీర్యుఁడుగాన చేతనొక చెట్టును బెఱికికొని పయినిదలపడి బలముకొలఁది దానిచే బలుని తలపయి నడిచెను. బలుఁడును దన తలపయిని గొండయుంబోలెఁ బడుచున్న యాపెట్టును గయికొని యంత నునందమను ముసలముచేత వానిని గొట్టెను. వాఁ డాముసలము నెత్తిని గొట్టఁగా నందుండి దొరుఁగుచున్న రక్తధారచేఁ, గొండ గైరికధాతు రేఖచేతంబోలె నెంతయు రాజిల్లెను; కాని యాదెబ్బను నించుకైనను బాటింపఁడయ్యె. వాఁడు మఱియొక చెట్టును గొని బలంబున దానియందలి యాకులనెల్ల దులిచి మిక్కిలియుఁ గనలగ్గలింప బలునిఁ గొట్టెను. కాని బలరాముఁడు దానిని నూఱు

పఱియలుగాఁ ద్రుంచెను. వాఁడు మఱియొక చెట్టును బెఱికికొని కొట్టెనుగాని దానినిసయితము బలుఁడు నూఱుతునియలు గావించెను. ఇట్లు వాఁడు బలునితోఁ జెట్లు పెకల్చుకొని పోరాడుచు నది దునిసి దునిసి పడుచుండఁగా మరలమరల నలుగడల నున్నమ్రాఁకులనెల్ల లాగి తెచ్చుచు నిట్లావనమునందు నొక చెట్టును లేకుండఁ జేసెను. అంత వాఁడు బలునిపయిని గినుకమెయి శిలావర్షము గురియించెను. ముసలాయుధుఁడు దానినంతయు ననలీల నుగ్గునూఁచ గావించెను. అంత నాకపీశ్వరుఁడు తాటిమ్రాఁకులంత లగుతన నిడుదచేతులను బిడికిలించుకొని బలునిఁ గదిసి దానిచే నతనివక్షమున గ్రుద్దెను. ఆ యదుతిలకుండును హాల ముసలములను బడవైచి వానిని రెండుచేతులఁ బట్టికొని క్రుద్ధుఁడై జత్రుదేశములందుఁబట్టి యదిమెను. వాఁడును నెత్తురుగ్రక్కుచుఁ గూలెను. వాఁ డట్లు పడునపు డాపర్వతము కంటకములగు మ్రాఁకులతోఁ గూడ, జలమందలి యోడ వాయువుచేతనుం బోలె, గడగడ గంపించెను. అంత నాకాశమున సురలును సిద్ధులును మునీంద్రులును జయజయ యనియు నమోనమ యనియు బాగుబాగనియు బిట్టుపలుకుచుఁ బువ్వులసోనలు గురిసిరి. ఇట్లు బలుఁడు జగమున కుపద్రవము గావించుచున్న యాద్వివిదునిఁ జంపి జనులెల్ల స్తుతులు గావించుచుండ స్వపురమును బ్రవేశించినవాఁ డయ్యె. ఇది యఱువదియేడవయధ్యాయము.

## బలరాముఁడు నాఁగటిచే హస్తినాపురము నెత్తి గంగలోఁ ద్రోయంబూనుట.

శ్రీశుకుండు — జాంబవతీదేవిసుతుఁ డయినసాంబుఁడు, దుర్యోధనుని సుత యగులక్ష్మణ స్వయంవరమునం దుండఁగా, దానిని బలిమిని బట్టికొనిపోయెను. కౌరవు లందులకుఁ గుపితులై 'ఈకుఱ్ఱఁ డౌరా దుండగీఁడు. త న్నొల్లనికన్నియను మనలను సరకుగొనక బలవంతముగాఁ గొనిపోయినాఁడు. ఈపలుగాకిని బట్టికట్టుఁడు. వృష్ణులేమిసేయుదురు ? మనము పరాక్రమముచే గడించి పెద్దపెంచి దయయుంచియిచ్చినభూమి ననుభవించువారేకదా ! వారు మఱిరాజులగుదురా ? అట్టివారేమి సేయఁగలరు ? తమపుత్రునిఁబట్టి యడఁచియున్నామని విని యాయాదవు లిటవచ్చిరేని క్రొవ్వులన్నియుఁ జెడి, ప్రాణాయామాదులచే నడంపఁబడిన యింద్రియములవలె, వారడఁగి మడిఁగి పోదురు' అనిరి. ఇట్లు కర్ణుఁడును శల్యుండును భూరిశ్రవుఁడును యజ్ఞకేతుండును, దుర్యోధనుఁడును, గురువృద్ధుల సమ్మతిని సాంబుని బంధింపఁదొడంగిరి. మహారథుఁడాసాంబుఁడు ధార్తరాష్ట్రులు తనవెంటఁ దఱుముకొని వచ్చుటనుజూచి రుచిరంబగు విలుగొని తానొక్కరుండును సింహమునుం బోలె నిలిచెను. వానిని బట్టుకొనఁగోరి నిలునిలుమని యదల్చుచు, నావిలుకాండ్రు కర్ణుని మున్నిడికొని మిక్కిలియుఁ దారసించి బాణములను వానిపై నవ్వారిగాఁ గురిసిరి. ఆయదునందనుఁడు కురువులచే విద్ధుఁడై యచింత్యుండగు కృష్ణుని యర్భకుండుగాన, నీచమృగములచేత విద్ధంబైన సింహమువలె, నందుల కెంతమాత్రము సైఁపఁడయ్యె. ఆవీరుఁడు బలువిలుగొని యెక్కుపెట్టి పిడుగుపాటుం

పోలె దానిని మొరయించి కర్ణాదులగు నార్వురు రథికులను నొక్కొక్కని నాఁజేసి బాణముల నొక్క పెట్టఁ గాఁడనేసెను. అట్లే నాలుగేసి బాణముల నాలుగు గుఱ్ఱములను నొక్కొక్క బాణమున సారథులను రథికులను గాఁడనేసెను. కర్ణాదులగు నారథికులు సాంబుని యొక్కకడిందికృత్యము నెంతయుఁ గొని యాడిరి. పిదప వారిలో నలువురు రథికులు వాని నాలుగు గుఱ్ఱములను గూల్చిరి. మఱియొకఁడు సారథిని గూల్చెను. ఇంకొకఁడు వానివిలు ద్రుంచెను. ఇట్లాఱుగురు వానిని విరథుంగావించిరి. ఇట్లా కౌరవులు యుద్ధమున నెంతయుఁ గష్టమున వానిని నట్లు విరథునిఁ గావించి యాకుమారునిని దమకన్యను గొని గెలుపొంది దమపురమునకుఁ బోయిరి. ఈ వృత్తాంతమును నారదుఁడువచ్చి తెలుపఁగా యదువులు మిక్కిలియుఁ గుపితులై యుగ్రసేనాదులు పురికోలుపఁగాఁ గౌరవులను దలపడ మాఱు ప్రయత్నములు చేయసాగిరి. అట్లు యుద్ధసన్నద్ధులయిన యదుపుంగవులను రాముఁడు సమాధాన పెట్టి కలిమలాపహారుండతఁడు కురువులకును యదువులకును గలహము గలుగుటకు నొల్లఁడయ్యె. అంత నతఁడు సూర్యునివలె ధగధగ మెఱయుచున్న రథము నెక్కి బ్రాహ్మణులును గులవృద్ధులును, జంద్రుని గ్రహములవలెఁ దన్నుఁబరివేష్టించి నడవ హస్తినాపురమునకుఁ బోయెను. రాముఁడట్లు హస్తినాపురమును జేరి యందు బయటి యుపవనమందు విడిసి తనరాక వారికిఁ దెలియుటకై యుద్ధవునిఁ బంపెను. అతఁడును బోయి ధృతరాష్ట్రునికిని భీష్మునికిని, ద్రోణునికిని, బాహ్లికునకును దుర్యోధనునికిని, విధ్యుక్తముగా నభివందనము గావించి రాముఁడు వచ్చియుండుటను జెప్పెను. వారును

సుహృత్తముఁడగు రాముఁడు వచ్చినది విని సంతసిల్లి యంద
ఱును జేతులఁ గానుకలుగొని యతని నెదురుచని యర్చిం
చిన వారయిరి. వారట్లతనిఁ జేరఁజని విధ్యుక్తముగా గోవు
నర్పించి యర్ఘ్యమును నివేదించిరి. వారలయం దాబలుని ప్రభా
వమును దెలిసినవా రతనికిఁ దలనేలసోఁకఁ బ్రణమిల్లిరి. బల
భద్రుండును బంధువు లెల్లఁ గుశలురుగా నునికి విని వా రారో
గ్యముగను శుభముగను నుండుట నడిగి, యంతఁ బరస్పరము
దిట్టమైనపలుకుల వారితో 'రాజరాజయిన యుగ్రసేనుఁడు
ప్రభుఁడు మాకొకటి యాజ్ఞాపించియున్నాఁడు. దానిని
బుద్ధితడఁబాటులేక విని యట్లుగావింపుఁడు; జాగువలదు. మీరు
పెక్కండ్రుగూడి యొక్కనిని ధార్మికుని నధర్మమున జయించి
బంధించితిరి. దానిని, బంధువులెల్ల గలసిమెలసియుండవలయు
నను తలంపున సహించితిని' యనెను. అట్లు బలదేవుఁడు తన
వీర్యమునకును శౌర్యమునకును బలమునకుఁ దగునెగపుగలిగి తన
శక్తికి సాటియైన యిట్టిమాటపలుకఁగాఁ గౌరవులువిని మిక్కిలి
యుఁగుపితులై యిట్లనిరి. 'ఔరా! ఇదేమిచిత్రము! దురత్యయం
బగు కాలగతిచేత నిట్టి వింతలును గలుగునా? పావలు కాలియం
దుండక కిరీటాలంకృతమైన శిరసు నెక్కఁజూచుచున్నవి గదా!
వీరు కుంతివివాహమును బట్టి సంబంధులై మనతోఁ బాటిగా
శయ్యాసనాహారాదులు పడసిరి. మఱియు మనమే రాజాసనము
లొసంగి మనకు నీడుగాఁ గావించికొంటిమి. మనయుపేక్షచేత
వీరు చామరములు, వ్యజనములు, శంఖములు, తెల్లనియాతపత్ర
ములు, కిరీటము, ఆసనము, శయ్యను ననుభవించుచున్నారు. యదు
వులకు రాజలాంఛనములుచాలును; అవియిచ్చినవారికే, పాముల

కమృతముపోసినట్లు మిక్కిలియుఁ బ్రతికూలములుగా నున్నవి. మన యనుగ్రహమునఁ జేకొన్న యాదవు లిపుడుసిగ్గుమాలిమనల నాజ్ఞాపించుచున్నారుగా! ఏమిచోద్యమిది. భీష్మద్రోణాదులయిన కౌరవులు తామై యొసంగకున్నదానిని, సింహము గ్రసించిన దానిని మేఁకయుంబోలె, నింద్రుఁడేనియుఁ గయికొని యెట్లనుభవింపఁగలఁడు? ఆసింహము పట్టినదానిని గొఱియ గుడుచునా'? యనిరి. ఇట్లాకౌరవు లాభిజాత్యముచేతను, బంధువుల బలిమిచేతను,సంపత్తిపెంపుచేతను,మిక్కిలి మత్తిల్లి యసభ్యులుగాన రాముని నాడరానిమాటలు వినిపించి యంతఁ బురమును బ్రవేశించిరి. రాముఁ డాకురువుల చెడునడవడిని జూచి, వారాడిన యాడరాని పలుకులనువిని, కోపంబున మిక్కిలియు నురవడించి దేఱిచూడనురాక మాటికిబిట్టు నవ్వుచు నిట్లనియె. 'పలుతెగల కావరములచేతఁ బొగరెక్కిన పలుగాకు లడఁగి మడఁగి (సంధిగలిగి) యుండుటను గోరరు. వారలకుఁ (బసులకు దుడ్డుకఱ్ఱవలె) దండమే యడఁచిపుచ్చునది. ఔరా! అప్పుడు యదువులు మిక్కిలి యురవడింపఁగాఁ గృష్ణుండును గుపితుండై యుండఁగా వారిని మెల్లమెల్లగా నెట్లో యూఱడఁబుచ్చి వీరలకు శమమును గలిగింపఁగోరి యిటవచ్చితిని. వీరలా మందమతులు,ఖలులు;కావుననే కలహమం దాసక్తులై యున్నవారు. కాఁబట్టి యప్పనికై వచ్చిన నన్నుఁదెలియక నిరసించి యహంకారులై క్రొవ్విదములు పలికిరి. ఇంద్రుఁడు మొదలయిన లోకపాలురుసయితమెవ్వని యాజ్ఞచొప్పున నడచుకొను చుందురో యాయుగ్రసేనుఁడు—భోజులకును వృష్ణులకును, నంధకులకును నధీశ్వరుఁ డయినయాసార్వభౌముఁడు—ప్రభువు గాఁడఁటగా!

ఎవఁడు సుధర్మ నాక్రమించి కయికొనెనో, మఱియు దేవతా వృక్షమును పారిజాతమును నెవఁడు బలిమిని దెచ్చియనుభవించు చున్నాఁడో యట్టివాఁడు - మన యీకృష్ణుఁడు - సింహాసనా ర్హుఁడు గాఁడఁటఁగా ! ఎవ్వనిపాదారవింద యుగళమును సర్వే శ్వరి యగు శ్రీదేవి తనంతట నుపాసించుచుండునో యట్టిశ్రీనా థుఁడు నరనాథచిహ్నములకుఁ దగఁడటే ! ఎవ్వని యడు గుఁదమ్ముల పరాగమును, దీర్థములనెల్ల నుపాసించిన యోగుల కున్నైతము పావనమగుదానిని, లోకపాలురెల్ల వారును దమ యూదలలందుఁ దాల్తురో, మఱి యెవ్వని యంశాంశభూతుల మగు నేనును (బ్రహ్మయు) భవుండును లక్ష్మీదేవియును దాల్తుమో, యట్టివానికి నృపాసనమెక్కఁడిదా ! కౌరవులు దయచేసి యొసం గిన భూమండలమును వృష్ణు లనుభవించుచున్నారఁట ! మేము పాదుకలమఁట ! కౌరవులు శిరస్సఁట ! ఔరా! కలుత్రావి కై పెక్కి, విచ్చలవిడి విఱ్ఱవీఁగు కావరములవలె నైశ్వర్యము చే మతిల్లి మైమఱచి యీ పలుగాకు లఱచినయీ బిఱుసుకాఱు కూఁతలను, దండించుటకు సమర్థుఁడగువాఁడెవఁడు సయించును? నాకు మిక్కిలియుఁ గోపము దీపించినదిగాన యిదిగో నేఁటికి నీభూతలమందుఁ గౌరవుఁడన్న పేరు లేకుండఁ జేసెదను' అని సం రంభించి నాఁగేటిని కేలంగొని ముల్లోకములను గొల్చువాని వలెనే లేచి నిలిచెను. అంత నబ్బలియుఁడు నాఁగేటిమొన హాస్తినాపురము దక్షిణప్రాకారమూలమున గ్రుచ్చి పయికిఁ బెకల్చి గంగయందుఁ బడఁద్రోయుటకై కన లగ్గలింపఁ బట్టి లాగెను. ఆనగరము నట్టు లీడ్చుచుచుండఁగా నది తెప్పయుం బోలెఁ దిరుగుడువడుచు గంగయందుఁ బడుచుండుటనుగాంచి

కౌరవులు మిక్కిలియు వడవడవడంకుచు బ్రతుకుఁగోరి తమ తమ కుటుంబములును దారును రాముని శరణుఁజొచ్చిరి. మఱియు లక్ష్మణతోఁగూడ సాంబుని మున్నిడికొని యంజలిగీలించి యతనితో 'రామా! రామా! నీ వఖిలాధారుండవుగదే! నీ ప్రభావము మే మెఱుఁగమయితిమి సుమీ. మేము మూఢులము. మఱియు దుర్బుద్ధులము. కాన, మా కావించిన యపరాధమును, అధీశ్వరా! మన్నింపఁదగునుగదే! నీవు జగము సృష్టిస్థితిలయములకు నొక్కండవు హేతువగుదువు. నీకు నీవే యాధారమవు. ఈశా! క్రీడాసక్తుండ వయిన నీకు లోకము లాటలాడుకొను నుపకరణములుగా నీకలరూపు నెఱింగినవారు చెప్పెదరు. *అనంతా! సహస్రమూర్ధా! నీ వొక్కండవే యీ భూమండలమునంతయును నీశిరసునందు నవలీలగా భరించుచున్నాఁడవు. ప్రళయమందు నీవిశ్వమంతయు నీయందు లీనముగాఁగా నీ వొక్కండవును శేషించి యీడుఁజోడు రెండవదిలేక శయింతువు. బలరామా! భగవంతా! నీవు భూపాలనపరాయణుండవుగదే; కాన శుద్ధ సత్త్వమునుబోలెఁ శరీరమునుదాల్చియున్న నీకుఁ గోపము కేవలము శిక్షించుకొఱకే కాని ద్వేషము వలనఁగాదు; మత్సరమువలనను గాదు. సర్వభూతాత్మా! సర్వశక్తిధరా! అవ్యయా! నీకు నమస్కారము. విశ్వకర్తా! నీకిదె మ్రొక్కుచున్నారము. నిన్ను మే మందఱమును శరణుఁజొచ్చితిమి' అనిరి. ఇట్లు దిగులుగొని వడవడవడంకుచు, వారు శరణుఁజొచ్చి యతనిమనస్సు కలంకఁ బుచ్చఁగా, నతఁడును బ్రసన్నుండై 'భయపడవల' దని యభయమిచ్చెను. దుర్యోధ

* ఇట పరమార్థదృష్టిని బలరాముతో వర్ణించుటను దెలియునది.

నుండును గూఁతునకు నల్లునకు నుపాయనముగా నలువదియేండ్ల ప్రాయముగల గజములవేయి నిన్నూటని, అశ్వములను నయుతమును, బంగారుమయములై సూర్యునివలె ధగధగ మెఱయుచున్న రథముల నాఱువేలును, గుత్తుకలందు బంగారుపతకములు గలిగి వెలుఁగుచున్న దాసీలను వేయిమందిని, గూఁతునందలి మక్కువచేత నిచ్చెను. భగవంతుఁడా యదువృషభుఁడు బలరాముఁడు దానినంతయుఁ బ్రతిగ్రహించి కొడుకును గోడలినిం దోడుకొని సుహృదులభినందింప బయలుదేఱి పోయెను. అంత నాహలాయుధుఁడు నిజపురమును బ్రవేశించి యనురక్తచిత్తులగు బంధువులు చేరి యదుపుంగవులెల్ల నిండియున్న సభ నడుమఁ గౌరవులయెడఁ దాను గావించినకృత్యము నంతయుఁ జెప్పెను. రాజా! నేఁటికిని మీపట్టణ మిది బలరాముని పరాక్రమమును సూచించుచు దక్షిణపువైపున గంగానది దిక్కుగాఁ బొడవయి యుండుటఁ జూపట్టుచున్నది' అనెను. ఇది యఱువది యెనిమిదవయధ్యాయము.

---

## శ్రీకృష్ణునికడకు నారదుండువచ్చుట.

కృష్ణుఁడు నరకాసురునిఁజంపి వానియొద్ద నుండినపూవుంబోండ్లను బెక్కండ్రను దానొక్కండును బెండ్లియాడెనని విని నారదుఁడు దానిని జూచుటకెంతయుఁ గుతూకపడెను. అతఁడు తనలో 'ఔరా! ఒకఁడు పదియాఱువేల గృహములందు నందఱుపడఁతులను నొక్క దేహముచేతనే వేఱువేఱ యొక్క కాలముననే పెండ్లియాడెననుట యెంతో వింతగానున్నది' అని యుత్సుకుఁ డాయెను. ఆదేవర్షి దీనినిజూచుటకు ద్వార

వతికి వచ్చెను. ఆపురమును, నెల్లప్పుడును గమియుఁబూచియున్న
పట్టనపుఁదోఁటలయందును గృహముల తోఁటలందును నున్న
పక్షుల కదుపుల కలకల ధ్వనులచే బోరుకొనుచుండెను.
మఱియు విరిసియున్న కటికి నల్లనిగలువలును, దామరలును,
నెఱ్ఱగలువలును, దెల్లగలువలును, నంతిగా నలుపుగాని కలువ
లును దంపరగాని చెలువు గులుకుచున్న కొలంకులయందు
హంసములు సారసములు మొదలగు జలపక్షులెప్పుడును రొదలు
సేయుచుండును. మఱియు నందుఁ బటికమయములును వెండి
మయములునగు ప్రాసాదములు తోమ్మిదలకు లింద్రనీలముల
తోను మేలయిన బంగారముతోను దక్కుంగల రత్నముల
తోను జేయఁబడిన యుపకరణములుగలిగి పురణించుచుండెను.
అందు రథ్యామార్గములును జత్వరములును నంగడులును శాల
లును సభలును సొబగుగా విభక్తములై యుండును. మఱి
దేవాలయము,లందుఁ బొలుపారుచుండును. మార్గములందును
ముంగిళ్లయందును పీథులయందును వాకిండ్లయందును గల
యంపి చక్కఁగాఁ జల్లఁబడియుండును. మఱి వాయువశమునఁ
జలించుచున్న పతాకలచేతను ధ్వజములచేతను నెండసోఁకు
వారింపఁ బడియుండును. ఆపురమునందుఁ గృష్ణుని యంతః
పురము సమస్తములయిన యుపకరణముల సొంపు పెంపారుచు
లోకపాలు రందఱచేతను మిక్కిలి మెన్నికగాంచి వన్నె
గులుకుచుండెను. మఱి యందు హరికొఱకు విశ్వకర్మ తాను
గఱచిన శిల్పవిద్యా నైపుణమంతయుఁ బూర్ణముగా నెఱపి
యుండెను. అందుఁ గృష్ణునిపత్నులు పదియాఱువేలమంది
మందిరములు వేనవేలు మిక్కిలియు దానికి వన్నెగూర్చు

చుండెను. అట్టియంతఃపురమునందుఁ గృష్ణుని భవనము నొక్క దానిని నారదుండు ప్రవేశించెను. దానికి బంగారు కంబము లును దాని కాశ్రయములుగా వైడూర్యమయములగు మేలి పలకలును నాధారమై యుండెను. మఱియు నది యింద్రనీల మయములైన కిటికీలతోఁ గూడి మేటిమరకతపుఁగంబములును నూతగాఁ గలిగియుండెను. విశ్వకర్మ నిర్మించిన మేలుకట్లు ము త్తెసరుల జాలరులు వ్రేలుచుండెను. దంతముతోఁ జేయఁ బడిన యాసనములును బర్యంకములును మేలయిన మణులు దాపి యలంకరించియుండిరి. మఱియు బంగారుపతకములు మెడలందుఁ గలిగి మేలయిన వలువలుతొడిగియున్న దాసికలు దాని నెంతయు నలంకరించుచుండిరి. మఱియుఁ బురుషులు కంచుక ములును దలచీరలును మేలయిన వస్త్రములనును మణికుండల ములనును దొడిగి బెడఁగుచూపుచుండిరి. అందు మణిదీప సమూహములచేఁ జీఁకట్లు తుప్పలఁదూలియుండెను. అందున్న వలభులయందలి నెమిళ్లు, వైచిన యగరుధూపముల దట్టంపుఁ బొగలు కిటికీలనుండి వెడలుచుండఁగా వానిని నల్లనిమబ్బులని తలంచి బిట్టుగాఁ గూయుచుచు నర్తనము సేయుచు నుండును. అట్టిమందిరమునందున్న యిల్లాలురుక్మిణి.ఆబిడ,గుణములందును రూపమునందును వయస్సునందును మేలివేషమునందును దనకు సాటియైనదాసికలు వేలకొలఁదిని దన్నెప్పుడును బరిచరింప వెల యుచుండెను. ఆగృహిణి బంగరుకాడగల యొకవింజా మరనుగొని సాత్వతపతికిఁ గృష్ణునికి మెల్లగవీచుచుండఁగా నార దుఁడు చూచెను. అమ్మునిని జూడఁగానే యాభగవంతుఁడు రుక్మిణీదేవిమంచమునుండి దిగ్గన లేచి వచ్చి సకలధార్మికుల

యందును మిన్నగాఁపున నతనిపాద యుగమునకుఁ గిరీటయుక్త
మయిన తనశిరను దగులునట్లు మ్రొక్కి చేతులు మొగిచి యతనిని
దనయాసనమందుఁ గూర్చుండఁబెట్టెను. ఆభగవంతుఁడు తాను
సాధులోకులకెల్లఁ బరమగురుండయ్యు సత్పురుషులకెల్లఁ బతి
యయ్యు నామునియడుగులను గడిగి యాజలములను శిరం
బునఁ దాల్చినవాఁడయ్యెను. బ్రహ్మణ్యదేవుఁడని యన్వర్థమయిన
నామ మాభగవంతునకే కలదు. మఱిగంగాది తీర్థములన్నియు
నతనియడుగుల సంబంధమునుబట్టియే పవిత్రములై యుండునవి.
అట్టివానికి నాబ్రాహ్మణుని పాదతీర్థము తీసికొనుట యుక్తమే
కదా! పురాణఋషియు నరసఖుఁడు నగునారాయణుఁడు శా
స్త్రోక్తంబగు విధానమున నాదేవఋషివర్యుని మిక్కిలియుఁ
బూజించి యమృతంబు లొలుకుచున్న కొలఁది పలుకులు పలికి
'ప్రభూ! దేవరకు మేము చేయవలసిన దేమి'? యనియడిగెను.
నారదుఁడు 'విభూ! నీవు సకలలోకనాథుఁడవు గాన సమస్త
ములయిన జనులయందుఁ జెలిమి నీకుండుట యొకయబ్బు
రముగాదు. మఱి ఖలులగువారి నడఁచుటయు నొకవింతకాదు.
ఏలనఁగా, ఉరుగాయా! జగమును రక్షించుటకును బరిపాలిం
చుటకును మోక్షము నొసంగుటకును నీవు నీయిచ్ఛ మెయి
నవతరించితివి; మేము లెస్సగా నెఱుఁగుదుము. కాన దుష్టుల
నడఁచి సాధులమన్నించుట యుక్తమే. ప్రపన్నజనసమూహ
మునకు నపవర్గప్రదంబును, బ్రహ్మాదులగు యోగీశ్వరులకును
గంటికిఁ దెలియరాక మనంబులందు చింతింపఁదగినది మాత్ర
మునై, యగాధంబగు జ్ఞానమునకుఁ బట్టయి, సంసారమనెడు
కూపంబునఁబడినవారి లేవనెత్తుటకు నూఁతయై యున్న నీ

యంఘ్రియుగళమును గంటిని; కృతార్థుఁడనయితిని. కనుక దాని నే ధ్యానించుచుఁ గ్రుమ్మరెదను. దానివిషయమందే నాకుఁ దలంపు గలిగియుండునట్లుగా నను గ్రహింపుము' అనెను. అంత నా నారదుఁడా యోగేశ్వరేశ్వరుని యోగమాయను (ఆశ్చర్య శక్తిని) దెలియంగోరి యాకృష్ణుని మఱియొక పత్నిమందిర మునకుఁ బోయెను. అచ్చట నయితము కృష్ణుఁడొక ప్రియురాలితోను నుద్ధవునితోను బాచికలాడుచుండెను. అతఁడు నారదునిఁ జూడఁగానే పరమభక్తియుక్తిని లేచి యెదుర్కొనుట మొదలగుసత్కారములం బూజించి యతఁడు వచ్చినది మున్ను తెలియనివారివలెనే 'మీ రెప్పుడు వచ్చితిరి ? అపరిపూర్ణుల మగు నస్మదాదు లన్నిటఁ బరిపూర్ణులయి యున్న మీ కేమిచేయ నేర్తుము! ఏమియు లేదు. బ్రాహ్మణోత్తమా ! అయినను వలయునది చెప్పుము. మా యీపుట్టువు మంచిద గావింపుము' అనెను. ఆనారదుండును విస్మితుండై లేచి యేమియుఁ బలుకక వేఱొకయింటికిఁ బోయెను. అందును గోవిందుఁడు పసిబిడ్డలను గొడుకులను లాలించుచుండఁగాఁ జూచెను. అంత మఱియొకయింట మజ్జనమునకై యతఁడుద్యమించుచుండఁ గాంచెను. మఱియొకచో వితానాగ్నిని వేల్చుచును, నొకచోఁ బంచమహాయజ్ఞములను గావించుచునుండఁ జూచెను. మఱియొకచోట బ్రాహ్మణులకు భోజనము వెట్టించుచుఁ దచ్ఛేషమును గుడుచుచుండఁగాఁ జూచెను. మఱియు కృష్ణుం డొక్కెడ సంధ్య నుపాసించుచును నొక్కచో వేదమును జపించుచు నొకయెడ మౌనవ్రతముదాల్చియు నొక్కయెడఁ గత్తియు బలకయునుగొని ఖడ్గమార్గములందు మెలంగుచు

నుండఁ జూపట్టెను. మఱియు నొకచో నశ్వములను రథము
లను గజములను నెక్కుట యాచరించుచును, నొక్కచో మంచ
ము పయిని బరుండియు, నొక్కయెడ వందిజనులచేతఁ బొగడం
బడుచును నుండెను. మఱియొకచో నుద్ధవుఁడు మొదలయిన
మంత్రులతో నాలోచనము సేయుచును నొక్కచో జలక్రీడ
లఁ దగిలి యాడుచును, నొక్కవలన వారస్త్రీజనులచేఁ బరివృతుం
డయ్యు నుండెను. అతఁడు వేఱొకచోట బ్రాహ్మణోత్తములకుఁ
జక్కఁగా నలంకృతములయిన గోవులను నొసంగుచును మంగ
ళములగు నితిహాసపురాణములను వినుచును నుండెను. ఇంకొక
చోటఁ బ్రియురాలితోడఁ బరియాచకంపు సుద్దులాడుచునవ్వుచు
నుండెను. ఒక్కచోట ధర్మము నాచరించుచును, మఱియొక
చో నర్థకామములను సేవించుచు నుండెను. మఱియు నతం
డొకచోఁ బ్రకృతికిఁ బరంబైన పురుషుని దివ్యాత్మస్వరూప
మును ధ్యానించుచునుండెను. కొన్నిపట్టులఁ బెద్దలకు వలయు
కామమును భోగములను నొడఁగూర్చి సపర్యసలిపి శుశ్రూష
సేయుచుండెను. మఱియొకచోటఁ గొందఱు పురుషులతోఁ
గలహము చేయుచును వేఱుకొందఱు పురుషులతో సంధి
గావించుచును నింకొకచోట రాముని సజ్జనుల క్షేమము నాలో
చించుచు నుండెను. పుత్రులకుఁ దగినభార్యలతోను, బుత్రికలకుఁ
దగినవరులతోను నాయాయుక్తకాలములందు, శాస్త్రోక్తంబగు
విధిని, వివాహములు సేయుచు కూఁతుండ్రు కోడండ్రు నల్లుం
డ్రు మొదలగువారిని దమగృహమునుండి వారిగృహములకుఁ
బంపుచును వారిగృహమునుండి తమగృహమునకుఁ గొనివచ్చు
చును నిట్లు కొడుకులకును గూఁతుండ్లకును మహోత్సవములను

గావించుచుండెను. యోగేశ్వరేశుండైన యాశ్రీకృష్ణుని యీపుత్రాదిమహోత్సవములను గాంచి లోకములన్నియును మిక్కిలియు విస్మయమునొందినవయ్యె. మఱియు నతం డొకచోట నూర్జితములగు క్రతువులచేత సకలదేవతలనును యజించుచును, బావులు త్రవ్వట తోఁటలు పెట్టుట యాలయములు నిర్మించుట మొదలయిన పూర్తధర్మములనును గావించుచునుండెను. ఒకచోట నశ్వము నెక్కి యదుపుంగవులు బలసి వెంటరా వేఁటకుఁ బోయి పవిత్రములగు జింక మొదలగు మృగములను జంపుచుండెను. అమాత్యులు మొదలగు ప్రకృతులయందును, అంతఃపురచరులు మొదలగువారియందును, వారివారి యభిప్రాయములను దెలియఁగోరి వేషాంతరమునఁ దన్నుఁ దెలియకుండఁ జేసికొని యాయోగేశుండు క్రుమ్మరుచుండెను. మనుష్యదేహమును జేష్టలును బూనియున్న యాభగవంతుని యోగమాయకుఁ (సర్వైశ్వర్యకరంబయిన శక్తికిఁ) గలవైభవమును గాంచి నవ్వుచును నారదుఁడు హృషీకేశునితో 'యోగేశ్వరా! యోగులకుఁ దెలియరానిదయ్యు నీయోగమాయను (ఆశ్చర్యశక్తిని) నీపాదసేవా ప్రభావముచేత మామనస్సు మిక్కిలియు వెలుంగుచుండఁగాఁ దెలియుచున్నారము. దేవా! నీయశంబున మునింగి తేప్పలఁ దేలుచున్న యీలోకములందు జగత్పావనిలైన నీలీలను బాడుచుఁ గ్రుమ్మరుచుండునట్లు నాకనుగ్రహింపుమీ' యనెను. భగవంతుఁడు 'బ్రాహ్మణోత్తమా! నేను ధర్మముగ నుపదేశించువాఁడును నాచరించువాఁడును మఱి యనుమోదించువాఁడును నగుదును. దానిని జనులకుఁ గఱపుకొఱకు నీ మనుష్యదేహమును దాల్చి యీ ప్రాకృతచేష్టల ననుసరించు

చున్నాఁడను. ఈశ్వరుండయ్యుఁ బ్రాకృతుండనయితినని మోహం
బున భేదమునొందకుము' అనెను. ఇట్లు గృహస్థులకు విహితము
లయిన ధర్మములనే యాచరించుచును, నపుడే సమస్తదేహ
ములందును నాత్మయై యేకరూపంబున వర్తించుచుండఁగాఁ
జూచెను. ఆఋషి యనంతవీర్యుఁడగు కృష్ణుని యోగమాయా
మహావైభవమును మాటిమాటికిఁజూచి యెంతయుఁ గౌతుక
మున మిక్కుటయాశ్చర్యమునొందెను. ఇట్లు ధర్మార్థకాములందు
లోకశిక్షార్థము మనంబునం దక్కుటఁగలిగి మెలంగుచున్న యా
కృష్ణుఁడు తన్నెంతయు సత్కరింపఁగా నారదుఁడు ప్రీతుండై
యతనినే తలంచుకొనుచుఁబోయెను. ఇట్లు సకలజనుల యభ్యు
దయముకొఱకు దివ్యవిగ్రహమును దాల్చిననారాయణుండగు
తాను మనుష్యచేష్టితములననువర్తించుచు, సిగ్గును నెయ్యమును
దియ్యమును నెఱపుఁజూడ్కులును నవ్వులును నివ్వటిల్లు
చుండఁ బదియాఱువేల నారీరత్నములతోడ రమించినవాఁ
డయ్యెను. విశ్వమునకు నుత్పత్తిస్థితి ప్రలయములకు హేతు
వయిన హరి,యీలోకమందుఁగావించిన యనన్యసాధారణము
లయిన కర్మములను నెవ్వఁడు పాడునో వినునో యనుమోదిం
చునో వాఁడపవర్గప్రాపకుఁడయిన భగవంతునియందు భక్తి
గలవాఁడగును. ఇది యఱువదితొమ్మిదవయధ్యాయము.

(జరాసంధనిబద్ధులైనరాజులు కృష్ణునకు సందేశము పంపుట. నారదుని రాక.)

అంతఁ దెలతెలవాఱెను. అపుడు కృష్ణుఁడు మెడబిగియఁ గౌఁ
గిలించుకొనియుండ హాయిగానిదురించుచుండిన యతని మిం

చుఁబోండ్లు విరహంబునకు నించుకయు సైఁపక కుక్కురో
యనికూయుచున్న కుక్కుటములను దిట్టినవారయిరి. ఆసమయ
మునందు మందారవనమునుండి పొలయుచు నున్నట్టి చల్లని
మెల్లనిగాడ్పులకు మేలుకాంచి తుమ్మెదలు జుంజుమ్మని పాటలు
పాడుచుండఁగాఁ బులుఁగులు వందిజనులవలెఁ గృష్ణుని
మేలుకొలుపునకై కలకలమని మాటిమాటికి నెలుఁగులు
గావించెను. ఆసమయమంత మిక్కిలి యొప్పుగులుకుచున్నను
రుక్మిణియు నితరరమణులును బతియక్కునఁ జొక్కుచున్నవారై
యాకౌఁగిలిపొందు పాయుటకు నించుకయుఁ దాళక, యాప్రొద్దు
ముద్దును నూహింపక, దాని నెగ్గుగానే తలంచిరి. మాధవుఁడు
బ్రాహ్మముహూర్తమందు లేచి జలముల నాచమించి యంతఁ
బ్రకృతికి విలక్షణంబై, సమాధికరహితంబగుటంజేసి యేకంబై,
స్వయంప్రకాశస్వరూపంబై తనకు శరీరంబుగానిది వేఱొక్క-
టియు లేమినిబట్టి యనన్యంబై, జాత్యాదికల్పనారహితంబగుటం
జేసి యద్వయంబై, బ్రహ్మాదులవలె నయ్యైసుకృతంబులంజేసి
మాయాకాలంబుల నతిశయంబు నొందునట్లు గాక తన
యందుఁదాను లెస్సగ నిర్వికారంబై నెలకొనియుండుటవలన
నెప్పుడును బుణ్యపాపాత్మకము లగు సమస్తకల్మషములను దూలి
యుండునదై, యీజగంబునకు నుత్పత్తిస్థితినాశకారణత్వ
రూపంబులగు నిజధర్మంబులచేతి సత్యాత్మకంబగు తనసత్తను
నానందరూపంబగు తనస్వరూపమును దెలుపునదియై, బ్రహ్మం
బనఁబడు తనపరమాత్మస్వరూపమును బ్రసన్నము లగునింద్రి
యములతో ధ్యానించెను. అంతఁ దేటనీటియందు జలక
మాడి, విధిచొప్పునఁ దక్కుంగల క్రియాకలాపముల నిర్వ

ర్తించి, వలువలుగట్టికొని, యానుత్తముఁడు సంధెవార్చి యగ్ని
హోత్రమును వేల్చి యంత వాఙ్నియమమున గాయత్రిని జపిం
చెను, అంత నుదయించుచున్న సూర్యుని యుపస్థాపనము
గావించి, తనకళ లయిన దేవతలకుఁ దర్పణముగావించి, ఋషు
లను బితరులనును, వృద్ధులనును, బ్రాహ్మణులనును, శ్రద్ధమె
యి సర్చించి, యంత నలంకృతు లగుబ్రాహ్మణులకు సాదువు
లును మిక్కిలిసాఁడిగలవియు నగు తొలుచూలిగోవులను దూ
డలతోడను బట్టు వస్త్రములతోను కృష్ణాజినములతోనును
దిలలతోడను నొక్కొక్కపద్మసంఖ్యను బ్రతిదినము నిచ్చుచుం
డెను. అవి బంగారుచే నలంకృతముయిన కొమ్ములును వెండి
చేత మండితములయిన గొరిజకొనలును గలిగి ముత్తెములసరు
లతోఁగూడిమేలయిన వస్త్రవలువలు గట్టంబడి యుండెను. అంత
గోవులకును, విప్రులకును, దేవతలకును, వృద్ధులకును, గురువుల
కును, భూతములకును, దనవిభూతు లయిన యెల్లవానికి నమస్క
రించి మంగళద్రవ్యములగు కపిలాదులను స్పృశించెను. అంత
వస్త్రములనుగట్టి భూషణము లలంకరించుకొని దివ్యములగు
మాల్యములను ననులేపనములనును గయికొని పిదపఁ బురము
నందును నంతఃపురమునందును వర్తించుసమస్తవర్ణములవారి
కిని మంత్రిమొదలగుప్రకృతులకును వలయు కామముల
నిప్పించి, వారి నభిమతవస్తువులచేత సంతుష్టులు గావించి, యంత
నానందము నొందెను. పిదపఁ దన యెదుర నాసీనులం గావించి
యున్న విప్రులకుఁ బూదండలను దాంబూలములను నను
లేపనములనును జక్కఁగాఁ బంచియిచ్చి, యంత నేతిని నద్దమును
గోవృషమును బ్రాహ్మణులను దేవతలనును దర్శించి, పిదప

సుహృదులను మంత్రి మొదలగు ప్రకృతులను భార్యలను దనంతఁ
గూడిమాఁడి మెలఁగుచుండెను. తర్వాత సూతుఁడు సుగ్రీవము
మొదలయిన యశ్వములం బూన్చిన రథమును మిక్కిలి యద్భు
తమైన దానిని దీసికొనివచ్చి, మ్రొక్కి ముందఱ నిలుచుండె
ను. కృష్ణుఁడును సారథి కయికొండగొని సాత్యకితోడను నుద్ధ
వునితోడను గూడి సూర్యుఁ డుదయాద్రినివలె నారథము నారో
హించెను. అపుఁ డంతఃపురకాంతలు సునుసిగ్గుతోడ నెయ్యం
పుఁ జూడ్కులు నిగుడ్చుచుండఁగా వారిచూపులనుండి యెట్లో
విడివడి, వారిమనంబుల నువ్వెత్తుగాఁ జూఱగొని, చిఱునవ్వు
నెమ్మొగముపయిని దొలఁకుచుండ బయలు దేఱెను. అట్లుచని
యాదవులందఱును బలసివచ్చుచుండఁగా సుధర్మ యనుసభను
బ్రవేశించెను. ఆసభ నున్న వారికి నాఁకలిదప్పి శోకము మోహము
జరామరణముల నెడి యూర్ములాఱును గలుగవు. ప్రభుఁ డందు
సింహాసనమునఁ గూర్చుండి తనకాంతిచేత దిక్కులను వెలింగిం
చుచుఁ బురుషసింహులగుయదువులు చుట్టును గొలుచుచుం
డఁగా, ఆకాశమందు నక్షత్రగణములచేఁ బరివృతుండయిన
చంద్రునివలెఁ బ్రకాశించినవాఁడయ్యె. అందుఁ బరిహాసకులు
నానావిధములగు హాస్యరసములచేతను, నట్టువులును నర్తకీజను
లును వేఱువేఱ పలువగల నృత్యములచేతను, బ్రభుని నుల్ల
సిలఁ జేయుచుండిరి. మఱి సూతులును మాగధులును వందిజను
లును మృదంగములను వీణియలను మురజములను బిల్లంగ్రోవు
లను దాలములను శంఖములను వాయించుచు నర్తనము
లాడుచును గానములు సేయుచును స్తోత్రములుసల్పుచును నుం
డిరి. అం దాసీనులై యుండిన బ్రహ్మవాదు లగుబ్రాహ్మణులు

కొందఱు మహాసత్త్వులయిన తొంటిరాజుల కథలను జెప్ప
చుండిరి. అట్టిసమయమున నింతవఱకుఁ జూడనియొక పురుషుఁడు
వచ్చి యున్నాఁడని భగవంతునకు ద్వారపాలకులు తెలుప, యాతని
యనుమతిని లోనికి [illegible] వచ్చెను. అట్లు వచ్చి,
వాఁడు పరమేశ్వరునకు నమస్కారము జేసి మొఱ్ఱపెట్టె. జరా
సంధుని చెఱఁ జిక్కిన రాజులు తమ దుఃఖమును [illegible]
జెప్పెను. జరాసంధుఁడు దిగ్విజయము చేసి [illegible]
[illegible] రాజుల [illegible]
ముగాఁబట్టి చెఱఁబెట్టెను. [illegible] లాపాలముగా
గాఁ కృష్ణా! [illegible] కృష్ణా! [illegible]
ప్రపన్నజనభయాపహ! [illegible]
దాని [illegible]
[illegible] చుచుఁ దు[illegible] చున్నాము. జను
[illegible] విషయసుఖ[illegible]
[illegible] గీతాదులను [illegible] దేశ[illegible] భగవ[illegible]
[illegible] మును. స్వామి[illegible]
[illegible] దురు, [illegible]
దుర్[illegible] వారి జీవితాశను ద్రోసినే [illegible]
[illegible] మన[illegible]ము. జగదీశ్వరా! నీవు
లోకమున సజ్జనుల [illegible] దుష్టులనిగ్రహము [illegible]
ను నీకళయగు బలభద్రునితో [illegible] యవతరించితివి. 'నేనిట్టివాఁడ
నగుదునేని యెవఁడేని దుఃఖించుట యెందులకందువా? ఈశా!
ఎవఁడేని నీయాజ్ఞ నతిక్రమించెడినా? లేక తాను జేసిన పాప
ఫలమును గుడిచెడినా? ఈ రెంటిలో నేది యందులకుఁ గలమా

మాకు నిశ్చయింప శక్యముగాకున్నది. అయినను వానివాని
ర్మమున కనుగుణముగా నీశ్వరుఁ డిచ్చుచున్నాఁడనుటయె
ుద కుపపన్నముగా నున్నది. రాజు లనుభవించుసుఖమో స్వ
న్నమునందలిదియుంబోలె క్షణికమే. ఏలన నదికర్మమునకుఁ బర
ంత్రమైనది. కనుక మాకీచెఱకు మునుపుగాని సుఖము లేదు.
మఱి శత్రువులవలన నెప్పుడును భయముగలదై పీనుంగుంబోలి
యున్న యీదేహమనెడు బరువును మోచికొని యున్నారము.
కాఁబట్టి యీశా! నీయనుగ్రహమువలన నిష్కాములకు ల
భ్యంబగునట్టిదైన నీవలని సుఖమును దిగవిడిచి మీఁదు మిక్కి
లియుఁ గృపణులమై, నీదుమాయచేత మోహితులమై యిహం
బున వెతలు గుడుచుచున్నారము. నీవు శరణాగతుల శోకము
లను హరించిపుచ్చు నడుగుందోయి గలవాఁడవుగదే! కాఁబట్టి
యట్టివారమై యిప్పు డిట్లు బద్ధులమై యున్నమమ్ము జరాసంధ
రూపమున నున్నకర్మపాశమునుండి విడిచిపుచ్చుము. మాయం
తట విక్రమించి విడిచిపుచ్చుకొనలేము. ఏలందువా? వాఁడు
పదివేలయేనుఁగులబలిమి తా నొక్కఁడును దాల్చి రాజుల
నల్ల మేఁకలను మృగరాజగుసింహమువలె నడఁచిపుచ్చినాఁడు
చుమీ! వాఁడును నీపయినెత్తి వచ్చినపుడు నీ మేటిసుదర్శన
చక్రముగని పదియేడుమార్లు యుద్ధమున భంగమునొందినాఁడు;
కాని యనంతవీర్యుండయ్యు మనుష్యచేష్టఁ దగిలియున్న నిన్ను
నొక్కమాఱు గెలువఁగానే గర్వమునఁ జిమ్మిరేఁగి నీదు ప్రజలను
మమ్ము, నజితా! పట్టి పీడించుచున్నాఁడు. మాకు సుఖము
గూర్పవే' యనిరి. కనుక జరాసంధునిచేఁ జెఱంబడి భవద్దర్శ
నమునకై యువ్విళ్లూరుచు నీపాదమూలమును శరణుఁజొచ్చి

యున్న యాసీనులకు సుఖముతోడఁగూర్చవలయును" అనెను. ఆరాజులదూత యిట్లు చెప్పుచుండఁగా మహాద్యుతియగు దేవర్షి నారదుఁడు పింగలవర్ణము లగుజడలగుంపు దాల్చి సూర్యుఁడు నుంబోలెఁ బొడతెంచెను. అమ్ముని తనకుఁ బ్రియుఁడయిన యాకృష్ణుని కర్మములను జన్మములను బాడుచుఁ గృష్ణునిని జన సభలను లోకములనును దన గానామృతముచే మిక్కిలియుఁ గరఁగించుచును రమింపఁజేయుచును వచ్చెను. సర్వలోకేశ్వ రుం డగు కృష్ణుం డతనినిజూచి తానును సభ్యులును నను కు లును ముదము గడలుకొన నాసనంబున నుండి దిగ్గనలేచి తల యతని యడుగులుసోఁకఁ జాఁగి పడిమ్రొక్కెను. అంత నతనికి వలయు సత్కారములను విధ్యుక్తముగాఁ గావించి తగినగద్దియను యిడి యాసీనుం డయినపిదప శ్రద్ధం జేసి మధురవాక్యముల నమ్మునికి విందులుగావించుచు 'మహాత్మా ! లోకములు మూఁ డింటికిని నిపుడు దేనివలనను భయము గలుగదుగదా ! దేవర లోకములనెల్లఁ గ్రుమ్మరుచుండుటవలన మాకు సకలవృత్తాంత మును దెలియుట మిక్కిలియు నొకగొప్పలాభముచుమీ! ఈశ్వ రుఁడు గావించియున్న లోకములందు నీకుఁ దెలియని యొక్కటి యును గలుగదు. కాఁబట్టి పాండవు లేమిచేయఁగోరుచున్నారోని న్నడుగుచున్నార' మనెను. అందులకు నారదుఁడు 'విభూ!భూమా! సర్వజ్ఞత్వాదులగు నీశక్తులతోడఁగూడి భూతములం దంతరాత్మ వై తిరుగుచున్న నీకు, బ్రహ్మకును వ్యామోహకుండవగు నీకుఁ, 'బాండవులు చేయఁదలఁచిన దడుగుచున్నార' మనెడి యిది మమ్మారక వ్యామోహపెట్టుట మాత్రమని మేము నిశ్చయించి యున్నారము. అయిన నావ్యామోహము మాకుదాఁట నెంత

మాత్రమలవిగాదుగదే. 'భూతములం దెల్లఁ జరించువాఁడ నేని భూతముల కేల తెలియఁబడకున్నా' నందువా? నిప్పు నివుఱుచేఁ గప్పినట్లు నీప్రకాశమును నీవుగప్పికొని యున్నావు; కాఁబట్టి నీవిట్లడుగుట మొదలగునవి నాకొక యద్భుతముగాదు. నీవో, నీదుమాయచేత నీజగమును సృజించుచు నడంచుచు నుండువాఁడవు. నీజగమునఁగాని వారమైన మాలో నెవ్వఁడట్టి నీవు చేయఁగోరిన దిదియని లెస్సఁ దెలియ నేర్చును? నీయభిప్రాయ మిట్టిదియని నిశ్చయింప నలవి గాకున్న నీకు, సర్వవిలక్షణస్వరూపునకు, నమస్కరించుచున్నాను. సంసారమను చీఁకటింబడి యనర్థావహమయిన శరీరమును విడిచిపుచ్చుకొను నుపాయము గనుఁగొన నేరక యున్న జీవునకు నాచీఁకటిని బుచ్చి విడివడు నుపాయమును దెలుపు దీపమగు నీయశమును, నీదు లీలావతారములచేత వెలింగించుచుందువు. అవతారప్రయుక్తమగు నీయశస్సును విన్ననే ముక్తి కుపాయము తెలియఁగూడునుగదే. ఇట్టి నిన్ను శరణఁజొచ్చుచున్నాను. బ్రహ్మమా! అట్లయ్యును, మనుష్యలోకము ననుకరించుచున్న నీకు నీమేనత్త కొడుకయిన రాజు యుధిష్ఠిరుఁడు, నీదుభక్తుఁడు, చేయఁదలఁచి యున్న కార్యమునెల్ల వినిపించెదను. ఆయుధిష్ఠిరుఁడు బ్రహ్మత్వమునుఁ బడయఁగోరినవాఁడై యిపుడు, నిన్నుఁగూర్చి మేటియజ్ఞమగు రాజసూయమును యజింపఁ గోరుచున్నాఁడు. దాని నీ వామోదింపవలయును. అందులకుఁ *కీర్తిమంతులగు రాజులు పెక్కండ్రు చూడఁగోరి రాఁగలరు. చండాలాదులు

* అనఁగా నారాజసూయమునకు శిశుపాలాదులును వత్తురు. నీచేత హతులగుదురు భూభార నివర్తనకార్యమును దీఱునని యభిప్రాయము.

సయితము కామక్రోధాదులవలననేని నిన్నువిన్నను గీర్తించినను ధ్యానించినను బాపములెల్లం దూలిపవిత్రులగుదు రనఁగా బ్రహ్మమయుని నీశుని నిన్నుఁ గన్నులారఁ జూడనోఁచినవారిని గుఱించి చెప్పనేల? భువనమంగళా! నిర్మలమయిన నీ కీర్తి దేవలోకమందును పాతాళమందును భూమియందును బ్రసిద్ధికి నెక్కి దిక్కులనెల్ల మేలుకట్లుంబోలె నలంకరించుచున్నది. నీపాదజలము, దేవలోకమున మందాకిని యనియుఁ బాతాళలోకమున భోగవతియనియు నీలోకమున గంగయనియు వెలసి ప్రపంచమునంతయుఁ బవిత్రముచేయుచున్నదిగదే' యనెను. అంతఁ గేశవుం డచటంగల తనపక్షమువారు జరాసంధునిపయి నెత్తిపోయి జయించి తీఱవలయు నని గుజగుజలు వ్రూవుచుండఁగా, మృదువచనంబుల నుద్ధవునిఁ జూచి 'ఓయీ! నీవేకదా మాకుఁ బరమంబయిన కన్ను. నీవే మాకు మంత్రివి. సుహృదుఁడవు, అర్థతత్త్వవిదుండవు. కాఁబట్టి యీపట్ల మనముచేయవలసినదేది చెప్పుము. మేము నమ్మి యట్లే చెయుదుము' అనెను. అట్లు తనయధిపతి యా కృష్ణుఁడు సర్వజ్ఞుఁడయ్యు నేమియుఁ దెలియనివానివలెఁ దన్నాలోచన మడుగఁగా నాయాజ్ఞ శిరసావహించియుద్ధవుం డిట్లని చెప్పెను.ఇది డెబ్బదియవయధ్యాయము.

### కృష్ణుఁడు సపరివారముగా హస్తినాపురమునకుఁ బోవుట.

ఇట్లు దేవర్షి యగు నారదుండు చెప్పినదివిని, యుద్ధవుఁడు మొదట జరాసంధవధమునకే పోవలయు నని సభ్యులకుం గల

యభిప్రాయమును, రాజసూయ యజ్ఞమునకే పోవలయునని కృష్ణునికిఁగల మతమును మహామతిగాన తెలిసికొని యిట్లనియె. ఉద్ధవుఁడు-'దేవా! ఋషి, నీమేనత్త కొడుకయిన ధర్మరాజు యజింపనున్నదానికి నీవు సాహాయ్యము చేయవలయు నన్నదియుఁ జేయవలయును. నిన్నుశరణుఁ జొచ్చినరాజుల రక్షణమును జేయవలయును. విభూ! యుధిష్ఠిరుఁడు దిక్కులను జయించియె రాజసూయమును యజింపవలయును. (ఆ దిగ్విజయము వ్యాజమున రాజరక్షణమును జేయవచ్చునుగాన) మనము ముందిచట నుండి యింద్రప్రస్థమునకుఁ బోవలయును. ఆయింద్రప్రస్థమునందు యుధిష్ఠిరు ననుజ్ఞగొనియె యతనికొఱకు జరాసంధునిఁ జంపుము. ఆకారణమున జరాసంధ జయమును గలుగుచున్నది. మఱి రాజసూయము జరుగుట, శరణాగతులను రక్షించుట, యనెడి రెండుప్రయోజనములును గలుగునని నాకుఁ దెలియుచున్నది. రాజసూయార్థ మక్కడికిఁ బోవుటచేతనే మనము సాధింపఁగోరిన ప్రయోజనమంతయు నొడఁగూడుచున్నది. మఱి రాజులను జెఱ విడిపించుటవలన గోవిందా! నీకు యశస్సును గలుగుచున్నది. మనయాదవులందఱును ముందు వెనుకఁజూడక జరాసంధునిపైఁ దలపడఁ జూచుచున్నారు గాని యారాజు పదివేల గజములబలిమి గలవాఁడు. కాన యెవ్వరికిఁగాని యతనిని మార్కొని నిలుచుట మిక్కిలియుఁ గష్టము. ఉగ్రబలుం డగు భీముఁ డొక్కఁడుదప్పఁ దక్కిన మహాబలవంతుల కెట్టివారికిని నతనిని దాఁకుట కడిఁది. వానిని ద్వంద్వ యుద్ధముననే జయింపవలయును. వేఱురీతిని జయింపవలయు నన్న వందల కొలఁది యక్షౌహిణులచేతనుగాదు. అమితసైన్యములు బలసి

యున్నవానిని ద్వంద్వయుద్ధమున జయించు టెట్లందువా? వాఁడు బ్రాహ్మణులయందు మిక్కిలి భక్తిగలవాఁడు; కనుక విప్రులేదేని యభ్యర్థించిరేని యెన్నఁడును దాని నిరసింపఁడు. కాఁబట్టి భీముఁడు బ్రాహ్మణవేషమును దాల్చి పోయి వానిని యుద్ధభిక్ష యడుగవలయు. అతఁడు జరాసంధుని నెక్కటియుద్ధమున నీసన్నిధానమును జేసి సందేహము లేక చంపిపుచ్చును. నీవో జగమునుత్పత్తి ప్రలయములకుఁ బరమకారణమవు. ఈశుండవు. కాలశరీరకుండవై ప్రాకృతరూప రహితుండవై సమస్తమును సృజించుచుఁ ద్రుంచుచునుండు నీకు బ్రహ్మయు శివుఁడును నీయంశములై జగదుత్పత్తిలయములకు నవాంతరకారణములే యగుదురు. గోపికలు తాము శంఖచూడునికిఁ జిక్కి విముక్తి నొందుటను బాడునట్లును, నిన్ను శరణుఁజెందిన మునుల మగు మేము గజేంద్రుని మోక్షణమును రావణునుండి సీతాదేవి విముక్తియుఁ, గంసునివలననుండి మాతలిదండ్రులగు దేవకీవసుదేవుల విడుమరను గానము సేయునట్లును, నీవు విడిచిపుచ్చు రాజులపత్నులు తమశత్రువగు జరాసంధునిఁ జంపుటను దమనాథులను విడిచిపుచ్చుటను గానము సేయుచుందురు. కృష్ణా! జరాసంధుని వధ మంతటితోఁ బోక మిక్కిలియు గొప్ప ప్రయోజనమును (శిశుపాలాదివధమును) నొడఁగూర్చుటకుఁ జాలినదగును. మఱియు రాజుల పూర్వసుకృతములు పండుట కారణముగా రాజసూయము నీకును యుధిష్ఠిరునకును నభిమతమయ్యెను. కాన ముందచటికే పోవఁదగును' అనెను. ఇట్లందఱకును భద్రముగా నుద్ధవుండు చెప్పినవాక్యమునువిని దేవర్షి యగు నారదుఁడును, యదువృద్ధులును, బలరాముఁడును ననుమోదించిరి. అంతఁ

భగవంతుఁడు విభుఁడు కృష్ణుండు పెద్దలయనుజ్ఞఁగొని భృత్యులగు దారుకుఁడు జైత్రుఁడు మొదలగువారిని బయనమునకై యాజ్ఞచేసెను. ఇట్లు కృష్ణుండు బలరామునియు యదురాజునను జ్ఞఁబడసినవాఁడై యంతఃపురకాంతలను వారిసుతులతోను బరికరములతోను బురము వెలువడఁబంచి సూతుఁడు గరుడధ్వజము పన్ని తెచ్చిన నిజరథము నారోహించినవాఁ డయ్యెను. అంత రథగజతురగపదాతివరులచే బెట్టిదమై తనసేన బలసి కొలువ, మృదంగములు, భేరులు, ఆనకములు, గోముఖములు మొదలగు వాద్యముల ఘోషముచే దిక్కులు బోరుకొన, బయలు వెడలెను. పతివ్రతలయిన రుక్మిణీదేవి మొదలగువారలు తమతమ పల్లకీలను గుఱ్ఱములను బంగారు శిబికలను నెక్కి బిడ్డలతోడం గూడి, మేలయిన వస్త్రమాల్యాభరణ విలేపనముల నలంకృతలై, వాలును బలుకయును గేలందాల్చిన మనుష్యులు గాపుసేయుచుండఁ, బతులవెంటంబోయిరి. వారి వెంటఁ బరిచారికలును వారస్త్రీలును జక్కఁగా నలంకృతలై మనుష్యులు, లొట్టియలు, నెద్దులు, నెనుములు, గాడిదలు, కంచరగాడిదలు, బండ్లు, ఆఁడేనుగులు మొదలగువాహనముల నెక్కి, వట్టివేరు వెదుళ్లు మొదలగుతృణములచే నయినగృహములును గంబళ్లును, వస్త్రములును, మొదలుగా శిబిరాదిసాధనములగు వాని నన్నిటి నెద్దులు మొదలగువానిపయి గట్టిగా బిగియఁ గట్టించి, వెడలిపోయిరి. మఱియూ సైన్యము తుములంబయిన ధ్వనిగలిగి పెద్దధ్వజ పటములును, ఛత్రములును, చామరములును, మేలయిన యాయుధములును, నాభరణములును, గిరీటములును, గవచములును, నెరసిబెరసియుండఁ, బగటిపూఁటఁ దిమింగిలా

దులచేఁ బెనుకరుల్లు చిమ్మిరేఁగినదై సూర్యకిరణములు పయి నిగిడియున్న మహాసముద్రమువలెఁ బ్రకాశించుచుండెను. అంత మునియగు నారదుఁడును గృష్ణునిచేఁ బూజితుఁడై వలఁయు సత్కారములొంది యతఁడు నిశ్చయించినదియుఁ దెలిసికొని యాముకుందుని సందర్శనమువలన నింద్రియములెల్ల నానందమొంద నతనిని హృదయంబునఁ బ్రణమిల్లి యాకాశమార్గంబునఁ బోయెను. భగవంతుఁడు కృష్ణుఁడు రాజు దూతనుజూచి, 'దూతా! భయపడవలదు. మీకు భద్రంబగుత. జరాసంధునిఁ జంపించెదను' అని చెప్పిపంపఁగా నాదూతయుఁ బోయి జరిగినట్లువారికిఁజెప్పెను. వారును జెఱనుదొలఁగఁగోరి కృష్ణుని సందర్శనమునకై యెదురు చూచుచుండిరి. హరియు నానర్తకమును సౌవీరమును మరుదేశమును వినశనమును గడచి, మఱియుఁ బర్వతములను నదులను దాఁటి, పురములను గ్రామములను వ్రజములను నాకరములను దరించి యంత దృషద్వతిని సరస్వతినిని గడచి పాంచాలములను మత్స్యదేశములను దరించి యింద్రప్రస్థపురము గదియ నేతెంచెను. మనుష్యులకు దర్శింపఁ దరముగాని యాకృష్ణుఁడు వచ్చియుండుటను విని, యజాతశత్రుఁడు ప్రియము గడలుకొన నుపాధ్యాయులను గూడి సుహృదులు పరివేష్టింప బయలువెడలెను. ఆ యుధిష్ఠిరుఁడు గీతములయు వాద్యములయు ఘోషమును వేదఘోషమును మిక్కిలియుఁ జెలంగ, నింద్రియము లయిదును మరలి వచ్చిన పంచవృత్తి ప్రాణమునుంబోలె, నెదుర్కొని వచ్చెను. అట్లువచ్చి కృష్ణునిఁగాంచి యతనివలని నెయ్యమున మనంబు మిక్కిలియు నార్ద్రంబుగాఁగఁ జిరకాలమునకు వచ్చి కనుపట్టిన

యా ప్రియతముని మాటిమాటికి బిగియఁ గౌఁగిలించుకొనెను. ఆరాజన్యుఁడు లక్ష్మీదేవికి నిరర్గలంబగు నాటపట్టయిన యాముకుందుని గాత్రమును రెండుచేతులఁ గౌఁగిలించి కన్నుల నానంద బాష్పములు గ్రమ్మ, మేనెల్లఁ బులకింప, లోకవ్యవహార మంతయు మఱచి, యెంతయు నానందము నొందెను. భీముఁడును నామేనమామ కొడుకును గౌఁగిలించికొని నవ్వుచుఁ బ్రేమజలంబులచేఁ గన్నులు కలంగ, నెంతయుఁ జొక్కినవాఁడయ్యెను. నకుల సహదేవులును నర్జునుఁడును గన్నులయందు నీరు మిక్కిలియుఁ దొరుఁగఁ దమ సుహృత్తముండగు నచ్యుతునిఁ గౌఁగిలించికొనిరి. కృష్ణుండును యుధిష్ఠిరునకును భీమునకును బాదముల కభివందనము గావించి యర్జునునిఁ గౌఁగిలించుకొని సహదేవుల యభివాదనమును గయికొనెను. అంత బ్రాహ్మణులకును బెద్దలకును వారివారి యంతరువుల చొప్పున నమస్కరించి కురుసృంజయ కేకయులచే మానితుండై తానును వారిని మన్నించెను. సూతులును మాగధులును బ్రాహ్మణులును బరిహాసకులును, మృదంగములను శంఖములను బటహములను వీణలను వేణువులను గేలంగొని యరవిందాక్షుని స్తుతించిరి. గాయకులు గానముచేసిరి. నర్తకులు నృత్యమాడిరి. ఇట్లా పుణ్యశ్లోకశిఖామణి సుహృదులు పరివేష్టింప, జనులు జైవారములుసేయుచుండ, నలంకృతం బయిన పురంబును బ్రవేశించెను. మఱి యాపట్టనము గమగమ గుబాళించుచున్న గజమద జలములచే మార్గములెల్లఁ దడిసియుండెను. మఱియు నందుఁ జిత్రధ్వజములెత్తి బంగారు తోరణములుగట్టి పూర్ణకుంభములు నిలిపియుండిరి. మఱియు నందలి పురుషులును

బడఁతులును జక్కఁగా జలకములాడి క్రొత్తలగు పట్టువస్త్రములను భూషణములను మాల్యములను గంధములను గయిసేసి దానికెంతయు సొంపుగూర్చుచుండిరి. అందు నొక్కొకయింట దీపములు వెలిఁగించి పువ్వులు మొదలగు బలులు చల్లియుండిరి. మఱియును బ్రతిగృహమునను గిటికీలనుండి ధూపములపొగలు వెడలుచు దానికొక సొగసుగూర్చుచుండెను ఒక్కొకయింటను బతాక లెత్తంబడి వెలుంగుచుండెను. అందలి భవనములు వెండి శిఖరములు గలిగి శిరసునందు బంగారు కలశములచే వెలయుచుండెను. కృష్ణుం డిట్లున్న యాకురురాజధానిని నింద్రప్రస్థపురమును గాంచెను. ఇట్లు మనుష్యులు కన్నులతోఁ దనివారఁ గ్రోలుటకు నర్హుఁడయిన యాకృష్ణుఁడు వచ్చెనని విని మిక్కుటమయిన తమకముచేతఁ గ్రొమ్ముడులు వీడఁ బోఁకముళ్లూసడల నింటిపనులు దిగవిడిచి. తల్పములందున్న మగలను బోవిడిచి యాతనిని జూచుటకు నాపురమందలి జవరాండ్రు రాజమార్గమునకు వచ్చిరి. అట్లువచ్చి యామచ్చెకంటులు గృహముల మేడలపయి నెక్కి రథగజతురగ పదాతులచే మిక్కిలియుఁ గ్రిక్కిఱిసియున్న యారాజమార్గమునఁ గృష్ణుని నతని భార్యలనును గాంచి పువ్వులుచల్లుచు మనస్సుచేతఁ గౌఁగిలించికొని చిఱునవ్వతోడి చూడ్కులచేత నతనికి మంచి స్వాగతమును గావించిరి. ఆచెలువ లామార్గమందుఁ జందురునితోఁ గూడియున్న చుక్కలుంబోని కృష్ణుని చక్కెరబొమ్మలం గాంచి 'ఔరా! పురుషలలాముం డయినకృష్ణుం డుదారుం బయిన చిఱునగవుతోడి విలాసంపుఁజూడ్కి నించుక నిగిడించి వీరల కన్నుంగవలకుఁ బెనుఁబండువు సేయుచున్నాఁడే! వీ రేమిపుణ్యము

చేసిరోకదా'! యని చెప్పుకొనిరి. అంత నాపురమునందలి యాయాశిల్పజీవులందు ముఖ్యులయినవార లందందుఁ గృష్ణునిఁ దఱిసి, చేత మంగళద్రవ్యములను గొనివచ్చి కృష్ణునికి సపర్యలు గావించి పాపములు నిర్మూలించిన వారయిరి. అంత రాజు నంతఃపురజనులు సంతసంబునఁ గన్నులు పెద్దవిరియ, నెంతయు సంబరమునఁ దన్నెదుర్కొనిరాఁ గృష్ణుండు రాజమార్గమును బ్రవేశించెను. కుంతి, తనయన్న కొడుకును ముల్లోకముల కీశ్వరుండు నగు నాకృష్ణునిఁ గాంచి మనంబునఁ బ్రీతి నుప్పిరిగొనఁ దానును దనకోడండ్రు నగు ద్రౌపదియు సుభద్రయు మంచెలనుండి దిగన లేచి కృష్ణునిఁ గౌఁగిలించుకొనెను. రాజయిన యుధిష్ఠిరుఁడు దేవదేవేశుని గోవిందుని గృహమునకుఁ దోడితెచ్చి యాదరంబు మీఱఁ బూజయందుఁ గర్తవ్యమేమియో యాక్రమమును, మిక్కిలియుఁ బ్రమదమున మునింగి తబ్బిబ్బు పడుటచేతఁ, దెలియఁడాయెను. అంతఁ గృష్ణుండు తనమేనత్తకును బెద్దలగు తక్కిన స్త్రీలకును నభివాదనము గావించెను. అంత ద్రౌపదీ సుభద్రల యభివాదనములను గైకొనెను. అత్తగారగు కుంతి పంపున ద్రౌపది కృష్ణపత్నులయిన రుక్మిణీదేవిని సత్యభామను, భద్రను, జాంబవతిని, గాళిందిని, మిత్రవిందను, లక్ష్మణను, నాగ్నజిత్తిని మఱియుఁ దోడవచ్చిన యితరభార్యలను వస్త్రమాల్యాభరణాదులచే నెంతయుఁ బూజించెను. ధర్మరాజును నప్పటప్పటికిఁ గ్రొత్తక్రొత్తలగు సపర్యలఁ గృష్ణుని నతనిసైన్యమును, ననుచరులను, నమాత్యులను, బత్నులనును, సుఖంబుగా వసించియుండునట్లు గావించెను. కృష్ణుం డందుండి యర్జునునింగూడి ఖాండవముచే నగ్నికిఁ దృప్తిగావించి

యందుండి మయుని విడిచిపుచ్చి వానిచేత ధర్మరాజునకు దివ్యం బయినసభ గావించి యిచ్చెను. మఱి యాకృష్ణుండు ధర్మరాజునకుఁ బ్రియముసేయు తలంపున నర్జునునింగూడి రథారూఢుండై పెక్కురథములు బలసిరా విహరించుచు, నందుఁ గొన్ని మాసములు వసించియుండెను. ఇది డెబ్బదియొకండవయధ్యాయము.

---

దిగ్విజయము. జరాసంధవధాదులును.

యుధిష్ఠిరుఁ డొకనాఁడు సభామధ్యమున మునులును బ్రాహ్మణులును క్షత్త్రియులును వైశ్యులును దోఁబుట్టువులును నాచార్యులును, గులవృద్ధులును, జ్ఞాతులును, సంబంధులును, బాంధవులును, దన్నుఁ బరివేష్టించి వినుచుండఁగాఁ గృష్ణునిం జూచి 'గోవిందా ! మేటియజ్ఞం బయినరాజసూయముచేతఁ బావనములయిన నీవిభూతులను (దేవతలను) యజించెదను. ప్రభూ ! కాన, దాని నాకొడఁగూర్పుము. కమలనాభా ! అశుభములనెల్ల నడఁగించునట్టి నీపాదుకలను నెవ్వరు దేహముచేతఁ బరిచరింతురో, మనస్సుచేత ధ్యానింతురో, వాక్కుచేతఁ బలుకుదురో, వారు పరిశుద్ధాంతఃకరణులై భవనాశమును (మోక్షమును) బొందుదురు. ఈశా ! అట్టివారు నీవలన నవేని కామితముల నాశించిరేని వానిని సైతము పొందుదురు. అట్లు పరిచర్యాదులు చేయనివారు చక్రవర్తులయినను బొందరుచుమీ. భక్తపక్షపాతివగు నీపదారవిందముల నాశ్రయించినవారికి సమస్తములయిన మనోరథములును సుకరములే చుమీ ! కాఁబట్టి, దేవదేవా ! ఈలోకము నీ చరణారవిందములను సేవిం

చుటవలని ప్రభావమును గాంచి యీవిషయమును నిశ్చయించుకొందురు గాక. విభూ ! కురువులయందును సృంజయులయందును మాబోటులెవరు నిన్ను భజింతురో, మఱి దుర్యోధనాదులు లెవరు నిన్ను భజింపకుందురో, యీయిరువురకుంగల స్థితిని- అనఁగా నభ్యుదయము కలిమిని లేమిని - దెలుపుము. నీవు హేయప్రత్యనీకకల్యాణగుణగణపరిపూర్ణుం డగు బ్రహ్మమవు గాన నీకు సొంతము లాఁతియను భేదబుద్ధి గలుగదు. ఏలన నీవు సమస్తమునకు నంతరాత్మవుగాన యన్నియు నీదు శరీరము. శరీరావయవములం దొకటి సొంతము, మఱొకటి లాఁతి యని గలదా ! కాన యన్నింటియందు నీకు సొంత మనెడిసమదృష్టి యుండును. మఱి యపరిచ్ఛిన్నమయిన స్వరూపానందము ననుభవించుచుండు నీకు వైషమ్యమూల మయినరాగద్వేషాదులును గలుగవు. అట్లు నీకు సొంతము లాఁతి యను బుద్ధి లేకుండియు నిన్ను సేవించుచుండువారికే నీయనుగ్రహము గలుగును. అందును వారిసేవించు రీతికిఁ దగినట్లె ఫలము నుండును. కల్పవృక్షమునకు నందఱు సములయ్యును దన్ను సేవించువారికే కదా యది ఫలమునిచ్చుచున్నది. అంతమాత్రముచే దానియందు వైషమ్యము గలుగదుగదా' యనెను. భగవంతుఁడు 'రాజా ! శత్రుకర్శనా ! నీవు నిశ్చయించినది మిక్కిలి చక్కఁగానున్నది. దీనివలన నీకు శుభం బగు కీర్తిగలిగి లోకములం దెల్ల వ్యాపింపఁగలదు. ప్రభూ ! ఈయజ్ఞరాజము ఋషులకును పితృదేవతలకును మాకును భూతములకును నెల్లవారికిని నీప్సితంబగును. సమస్తరాజులను జయించి జగత్తునంతయు వశగతముచేసికొని సమస్తములయిన సంభారములను సమకట్టించి యీమహా

యజ్ఞము ననుష్ఠింపుము. ఎట్లు జయింపశక్తుఁడ నగుదు నందువా? రాజా! నీతమ్ములు వీరలు లోకపాలాంశమునం బుట్టిన వారు. జితేంద్రియులు గానివారి కెంతమాత్రమును వశీకరింప నలవిగాని నేను, మద్భక్తి ప్రవణచిత్తుండగు నీచేత వశీకృతుఁడనై యున్నాను. నీకు సాధింపరానిదేమి? నన్నే యుత్కృష్టునిఁగాఁ గలిగి నాయందే మనస్సు దగిలి యుండునట్టివానిని దేవుండయినను దేజస్సుచేతఁగాని, యశస్సుచేతఁగాని, సంపత్తిచేతఁగాని, సేనమొదలగున పెంపులచేతఁగాని క్రిందుపఱుపఁ జాలఁడు. ఇఁక రాజులు క్రిందుపఱుప నేరరనుట చెప్పనేల'? యనెను. ధర్మరాజును భగవంతుఁడు కృష్ణుఁడు చెప్పినదివిని ప్రీతుఁడై ముఖారవిందము వికసిల్ల, విష్ణుతేజంబున బలంబులు పెచ్చు పెరిఁగియున్న తనతోఁబుట్టువులను దిగ్విజయమునందు నియోగించెను. సహదేవుని సృంజయులతోడం గూర్చి దక్షిణదిక్కునకుఁ బంపెను. నకులునిఁ బడమటి దిక్కునకుఁ బంపెను. అర్జునుని నుత్తరదిక్కునకుఁ బంపెను. మాత్స్యులను కేకయులను మద్రకులనుం గూర్చి భీమునిఁ దూర్పుదిక్కునకుఁ బంపెను. వారందఱును వీరులయిన రాజులను గెలిచి యాయాదిక్కులనుండి యజింప నున్న యజాతశత్రునకుఁ దేజంబున సవారమగున ధనములను దెచ్చియిచ్చిరి. జరాసంధుని జయింపకున్నందులకు రాజు యుధిష్ఠిరుఁ డుపాయము చింతించుచుండఁగా, హరి యదియెఱిఁగి యుద్ధవుఁడు మున్ను చెప్పినయుపాయమునే యుపుడతనికిఁ జెప్పెను. అంత భీమసేనుఁడును నర్జునుఁడును, కృష్ణుఁడును బ్రాహ్మణవేషములను దాల్చి జరాసంధుఁ డున్న గిరివ్రజమునకుఁ బోయిరి. ఈ రాజు లట్లు బ్రాహ్మణవేషములం బోయి బ్రాహ్మణ్యుండయిన

వలువలు మాసియు, నాఁకట నకనకంబడుచును, మోము లెండ, జెఱంబడి మిక్కిలియుఁ జిక్కియుండిరి. వారంత మేఘము వలె నల్లని చాయగలిగి,బంగరుపట్టువలువ గట్టినశ్రీకృష్ణునిఁగాంచిరి. అతఁడు శ్రీవత్సంబను మచ్చగాఁల, నాలుగు నిడుద బాహువులును, దామర రేకులుంబోని కన్నులును, సొగసై ప్రసన్నంబగు మొగమును, జలించుచున్న మకరకుండలములును, దామరలవంటి హస్తములును, గలిగి గదాశంఖచక్రములతోఁ గూడియుండెను; కిరీటహారకటకములును గటిసూత్రములును నంగదములను దాల్చి కంఠమున మేలగు న కౌస్తుభమణి వెలుంగ, వనమాల వక్షమునఁ జెలంగ వెలయుచుండెను వా రాకృష్ణునిఁ గన్నులంగనలచేఁ ద్రావునట్లును, నాలుకచేత జుఱ్ఱునట్లును, ముక్కులచేత మూరుకొనునట్లును, చేతులచేతఁ గౌఁగిలించుకొనునట్లును, జూచుచు హరియడుగులయందు నొసలలు సోఁకఁబడి ప్రణామములుగావించిరి. మఱియు వారు కృష్ణుని సందర్శించుటవలని యుబ్బువెంపునఁ జెఱఁబడ్డ వెతలన్నియుఁ దూలిపోఁగాఁ, జేతులు మోడ్చికొని యాహృషీకేశు నిట్లని పొగడిరి—రాజులు—'దేవదేవేశా! ప్రపన్నార్తిహరా! అవ్యయా! కృష్ణా! బెట్టిదమయిన సంసారంబునంబడి యేమియుందోఁపక వగరుపుచ్చు నిన్ను శరణుఁజొచ్చిన మమ్ము రక్షింపుము. మధుసూదనా! నాథా! మే మీ జరాసంధునియం దెగ్గుదలంపము; గుణములనే యెన్నుదుము. ఏలందువా? విభూ! రాజులగు మాకు రాజ్యమునుండి భ్రంశమునొందుట యాజరాసంధుని మూలమున నీవు గావించిన యనుగ్రహమే కాని మఱొకటి గాదు. రా జయినవాఁడు రాజ్యముచేతను నైశ్వర్యముచేతను

మంచుఁ బరబ్రహ్మంబగు నన్నుఁ బొందెదరు' అనెను. భువనేశ్వరుండగు భగవంతుఁడు కృష్ణుఁ డిట్లు నృపులకానతిచ్చి వారలకభ్యంగస్నానాదులు గావించుకొఱకుఁ దగుపురుషులను స్త్రీలను నియోగించెను. మఱియు వారలకు రాజులకుఁ దగువస్త్రములను భూషణములను మాల్యములను విలేపనములను సహదేవుచేత నిప్పించి సపర్యలు గావించెను. అట్లు చక్కఁగా స్నానములుచేసి చక్కఁగా నలంకృతులై యున్నవారలకు మేలయిన యన్నముల భోజనములు సేయించి నానావిధములయి రాజోచితము లగుతాంబూలాదిభోగముల నొడఁగూర్చినవాఁడయ్యె. అట్లా రాజులు ముకుందునిచేతఁ [illegible] పూజితులై మెఱుఁగు పెట్టిన కుండలములు చెవులఁ జవుకళింప, వర్షాకాలము తుదను గ్రహములుం బోలె వెలుంగుచుండిరి. అంతఁ గృష్ణుఁడు వారలను రత్నకాంచనమండితములయిన మంచి యశ్వములు పూన్చియున్నరథముల నెక్కించి తియ్యనిమాటల నలరించి వారిదేశములకుఁ బుచ్చినవాఁడయ్యెను. వారట్లు మహాసంకటమునుండి యత్యంతమహాత్ముఁడగు కృష్ణునిచేత విముక్తులై, యాజగత్పతినే మనంబుల నెన్నుచును నతనికృత్యములను ముచ్చటించుకొనుచును బోయిరి. వారట్లుపోయి ప్రకృతులకందఱకు నమ్మహాపురుషుఁడు గావించినవెల్లఁ జెప్పి యాభగవంతుఁడు తమకు నియమించినచొప్పునఁ దప్పక ప్రాలుమాలిక లేక నడచుకొనిరి. కేశవుఁడు భీమసేనునిచేత జరాసంధునిఁ జంపించి సహదేవునిచేతఁ బూజితుండై భీమార్జునులం గూడి బయలుదేఱెను. వా రట్లు శత్రువును గెలిచి యింద్రప్రస్థమునకుఁ బోయి సుహృదుల కుబ్బును దుర్హృదులకు దుఃఖమును గలుగు

నట్లుగా శంఖములను బూరించిరి. ఇంద్రప్రస్థమునందలి వార లాధ్వనిని విని మనముల సంతసములు గడలుకొన జరాసంధుఁడు తీఱెనని తలంచిరి. రాజు యుధిష్ఠిరుఁడును మనోరథము నొందినవాఁడయ్యెను. అంత జనార్దనుఁడును భీమార్జునులును రాజునకు నభివందనము గావించి తాము చేసినకృత్యము నంతయు నతనికి వినిపించిరి. ధర్మరాజట్లు కృష్ణునిచే ననుగ్రహమొంది జరిగిన యా వృత్తమునంతయు విని యానందాశ్రుబిందువులను విడుచుచుఁ బ్రేమ పెల్లునం జేసి యించుకయుఁ బలుకనేరకుండెను. ఇది డెబ్బదిమూఁడవయధ్యాయము.

---

## ధర్మరాజు రాజసూయయజ్ఞము చేయుట.

రాజయిన యుధిష్ఠిరుఁ డిట్లు జరాసంధునివధమును బ్రభుండగుకృష్ణుని ప్రభావమును విని మిక్కిలి ప్రీతుండై యాతనితో 'ముల్లోకములకు గురువులగు సనకాదులును, లోకములందలి జనులెల్ల వారును వారిపాలకులందఱును నెవ్వని యనుశాసనమును, దుర్లభంబగుదానిని, బడసి భాగ్యములచేతనే యది పడయఁదగునని బహుమానంబున దానిని శిరంబులఁ దాల్తురో, యట్టినీవు, అరవిందాక్షా! తమ్మీశులుగాఁ దలంచుకొను జనుల యనుశాసనమును దలఁదాల్చుచున్నావే! భూమా! ఇది నీయందుఁ బెద్దవేడబముగా నున్నది! ఏకంబును నద్వితీయంబు నగు బ్రహ్మమును, నిత్యవిభూతిస్థితుండుగాన పరమేష్ఠియునగు నీకుఁ బ్రాకృతశత్రుజయాదులచేఁ దేజము, సూర్యునికి నుదయాస్తమయాది కర్మములచేతంబోలెఁ, బెరుఁగుటయుఁ దగ్గుటయుఁ గలుగదు. అజితా! మాధవా!! పశువులంబోని దేహా

త్త్వాభిమాను లగువారలకు నేను నాది నీవు నీది యని నానా విధములయిన బుద్ధివికారములు గలుగునట్లు నీభక్తులకుఁ గలు గవు. కనుక, వానివలనఁ గలుగు తేజోవృద్ధియుఁ దేజోహ్రాస మును వారికెక్కుడివి. ఇఁక నీకు నెక్కుడివని చెప్పనేల' ? యనె ను. ఇట్లు చెప్పి రాజాయుధిష్ఠిరుఁడు యజ్ఞమునకుఁ దగినకాల మునఁ గృష్ణుని యనుమోదమునొంది యభియుక్తులును బ్రహ్మ వాదులునగు బ్రాహ్మణులను ఋత్విజులుగా వరించిన వాఁడయ్యెను. కృష్ణద్వైపాయనుఁడును భరద్వాజుఁడును, సుమంతుఁడును, గౌతముఁడును, అసితుఁడును, వసిష్ఠుఁడును, చ్యవనుఁడును. కణ్వుఁడును. మైత్రేయుఁడును, కవషుఁడును, త్రితుఁడును, విశ్వామిత్రుఁడును, వామదేవుఁడును, సుమతియు, జైమినియు, క్రతువును, పైలుఁడును, పరాశరుఁడును, అగ స్త్యుఁడును, వైశంపాయనుఁడును, అథర్వుఁడును, కశ్యపుఁ డును, ధౌమ్యుఁడును, పరశురాముఁడును, ఆసురియు, వీతిహో త్రుఁడును, మధుచ్ఛందుఁడును, వీరసేనుఁడును, అకృతవ్రణుఁ డును, పిలువంబడిరి. మఱియు నితరులగు ద్రోణుఁడును భీష్ముఁ డును, కృపుఁడు మొదలగువారును, ధృతరాష్ట్రుఁడును నతని పుత్రులును, మహామతియగు విదురుఁడును బ్రాహ్మణులును, క్షత్రియులును, వైశ్యులును, శూద్రులును, సమస్తరాజు లును, రాజుల ప్రకృతులును యజ్ఞమును జూడఁగోరి యం దులకువచ్చిరి. అంత బ్రాహ్మణులు యజ్ఞభూమిని బంగారు నాఁగేళ్లచేత దున్ని చక్కఁబఱిచి రాజగు యుధిష్ఠిరుని దీక్షాయుక్తునిఁ గావించిరి. తొల్లి వరుణునకుం బోలె ధర్మ రాజునకును బంగారు మయములైన యుపకరణములచేత నే

యజ్ఞము ప్రవర్తిల్లెను. బ్రహ్మయు శివుఁడును నింద్రాదు లగు లోకపాలురును దేవగణములును సిద్ధులును గంధర్వులును విద్యాధరులును మహోరగులును మునులును యక్షులును రక్షస్సులును, గరుడులును, కిన్నరులును, చారణులును, మఱియుఁ బిలువంబడిన రాజులును, వారి పత్నులును నెల్లవారును నచ్చటికి వచ్చిరి. వారందఱును శ్రీకృష్ణభక్తుం డగుపాండవుని యుధిష్ఠిరుని రాజసూయమునకు వెఱఁగుపడక యది చక్కఁగా నొప్పియున్నదని తలఁచిరి. దేవవర్చసులగు యాజకు లంత దేవతలు వరుణుచేతంబోలె మహారాజుచేత యథావిధిగా రాజసూయమును జేయించిరి. ఆరాజును సోమాభిషవదినమునందు సదస్సుపతులను యాజకులను మఱియుఁ దక్కిన మహాభాగులను మిక్కిలి మెచ్చికతోడఁ బూజింపఁదొడంగెను. అంత నతఁ డగ్రపూజకు నర్హుం డెవఁడని సభాసదులను గలయంజూచుచుఁ డగువారు పెక్కండ్రుగలిగి యొక్కఁడును నెక్కుడుగాకుండుట వలన నట్టివానిని దెలియ నేరకుండెను. అపుడు సహదేవుఁడు బ్రహ్మాదులకు స్వామియగు నచ్యుతుం డగ్రపూజకు నర్హుండగును. ఏలన నీభగవంతుఁడే సమస్తదేవతాత్మకుఁడు, యజ్ఞమునకగు దేశమును వసంతాదికాలమును యజ్ఞోపయుక్తము లగుధనములును యజమాన ఋత్విగాదులును నీతఁడే యగును. ఈవిశ్వమంతయు నితనిమయము. క్రతువులన్నియుఁ దన్మయములు. అగ్నిహోత్రమును, నాహుతులును, మంత్రములును * సాంఖ్యమును యోగమును దన్మయములు. చిదచిదాత్మక మయినయీ


---

* సాంఖ్యమనఁగా ప్రత్యగాత్మ స్వరూపచింతనము. యోగమనఁగా పరమాత్మోపాసన. అన్నిటికి భగవంతుఁడే నిర్వాహకుఁడని యర్థము.

ప్రపంచమున కీభగవంతుఁడే యంతరాత్మ. తొల్లి యితఁడు విభక్తనామరూపచిదచిద్విశిష్టుఁడుగానుండుచేఁ దానొక్కఁడయ్యు నిమిత్తాంతరములేమింజేసి యద్వితీయుండయ్యునుండెను; ఇట్టి యితఁడు తనకుఁదానే యాశ్రయుఁడై తన్నే యుపకరణముగాఁ గొని సమస్తములయిన సమష్టివ్యష్టి పదార్థములను సృజించుచును రక్షించుచును సంహరించుచు నున్నాఁడు. ఇట్టివాఁడయ్యుఁ దనకు శరీరభూతములగు చిదచిత్తుల యుత్పత్త్యాది వికారములను బొందక యజుండై యుండును. ఇట్టివాఁడేని మనవలెఁ జేష్టింపనేల యన్నచో లోకములకెల్లను ధర్మార్థకామమోక్షములనెడి శ్రేయములనెల్లను నొడఁగూర్చుటకుఁగాను నానావిధములయిన కర్మములు చేయుచున్నాఁడు గాని మఱేమి కాదు. కాఁబట్టి సర్వోత్కృష్టుం డగుకృష్ణునకు నగ్రపూజ నిత్తురుగాక. అట్లని, సమస్తభూతములకును, బూజ నొసఁగు తనకును, నంతరాత్ముండు గాన బహుమానంబు గావించిన ట్లగుచున్నది. సమస్తభూతములకు నంతరాత్మభూతుండై, తనకంటె వేఱొక్కటిని గానఁబడమింజేసి సర్వశరీరకుండై, రాగాదిద్వేషాది రహితుండుగాన శాంతుండై, యవాప్తసమస్తకాముండై, కావుననే నిత్యసంతోషియగు కృష్ణునకు, అట్టికృష్ణునకే, దానమున కనంతఫలమును గోరువాఁ డియ్యందగును. కృష్ణుని ప్రభావము నెఱింగిన సహదేవుఁ డిట్లు చెప్పి యంత నూరకుండెను. అందులకు బ్రాహ్మణులు బాగుబాగని పలికిన యులిపును విని సభాసదులకుఁ గలిగిన యభిప్రాయమును నెఱింగి రాజు యుధిష్ఠిరుఁడు ప్రీతి దొంతరలుగొనఁ బ్రణయంబు వెల్లగుటంజేసి పరవశుండై యాహృషీకేశుని నర్చించెను. మఱియు

నతని పాదంబులు గడిగి లోకపావనంబు లయిన యాజలములను దానును భార్యయును దమ్ములును మంత్రులును దక్కిన కుటుంబమువారును ముదంబున శిరంబునఁ దాల్చినవాఁ డయ్యెను. పిదప మిక్కిలియు విలువగల పచ్చపట్టు వలువలనును, భూషణములనును, నతనికిఁ గానుకలొసంగి కన్నుంగవల నశ్రువులు గ్రమ్ముచుండ, నాభగవంతునిఁ దేఱిచూచుటకు శక్తుండు గాఁ డయ్యె. ఇట్లాకృష్ణుండు పూజితుండగుటను జూచి సమస్తజనులును జేతులుమోడ్చి 'నమోనమ' 'జయజయ'యని మ్రొక్కిరి. పువ్వులవానలు గురిసినవి. ఇట్లు కృష్ణుని గుణములను వర్ణించుట విని శిశుపాలుఁడు కోపమునొంది తనగద్దియనుండి లేచి చేయి పయికెత్తి యందుల కెంతయు సైఁపక యించుకయు జంకక యాసదస్సునందు భగవంతునిఁ బరుషములగు మాటల నిట్లు పలుకువాఁడై 'బ్రహ్మాదులకును బ్రభువయిన కాలమును గడచుట యరిదియని వినెడి వీనికి యథార్థమైనదే. ఏలనఁగా వృద్ధులగు వారిబుద్ధులు సైతమొక చిఱుతవానిమాటలచేఁ దలక్రిందయ్యె డినే! సదస్యులారా ! మీరలు పాత్రవిదులందు మిన్నలు. పసివాని పల్లఱపులు చేకొనకుఁడు. కృష్ణుఁడు పూజకు సమ్మతుఁడైనవాఁడను మాట పాటింపకుఁడు. తపమును విద్యను వ్రతములను ధరించినవారై జ్ఞానముచేఁ గల్మషములనెల్ల ధ్వంసముగావించి బ్రహ్మనిష్ఠులును లోకపాలురచేతనుఁ బూజితులునగు పరమర్షులను సదస్యులను గడపిపుచ్చి కులాధముఁడయిన యీగొల్లఁడు కాకి పురోడాశమునుంబోలెఁ బూజనుబొందఁ దానెట్లర్హుఁ డగును ? వీనికి వర్ణమును నాశ్రమమును గులమును లేదు. సర్వధర్మములకు వీఁడు వెలియైనవాఁడు. మఱి విచ్చలవిడి వర్తించు

చుండువాఁడు. మంచిగుణములు వీనియందు నున్న. ఇట్టివాఁడు సపర్య కెట్లర్హుఁడగును ? యయాతివలన వీనికులము శపింపఁ బడెను. కాన యది సత్పురుషులగు కులీనులకు వెలియైనది. అందును వీఁడెప్పుడును వ్యర్థముగాఁ బాపములు చేయుటయందే తగులుగలవాఁడు. ఇట్టివీఁడు సపర్య కెట్లుదగును? బ్రహ్మసేవితం బగు నార్యావర్తదేశములను బ్రహ్మవర్చసమును దిగవిడిచి, సముద్రనడుమ నిషిద్ధమగు దేశము నాశ్రయించి దుష్టసత్త్వము వలె జనులను బాధించుచున్నాఁడు' అనెను. ఇట్లాశిశుపాలుఁడు తనశుభంబులన్నియు నశించుటవలన నిట్టి యశుభంబులగు పరుషములాడెను. కాని యందులకు భగవంతుఁడు నక్కకూఁత విన్న సింహముంబోలె వినియుఁ దానొక్కటియుఁ బలుకఁ డయ్యెను. భగవంతు నట్లు దుస్సహముగా నిందించినది విని యాసభాసదులు చెవులుమూసికొని కినిసి శిశుపాలునిఁ దిట్టుచు సదస్సు వెడలిపోయిరి. భగవంతుని గుఱించి నిందనముగాని భగవద్భక్తుండగు వానిని గూర్చిన నిందనమునుగాని వినుచు నెవఁడచ్చటనుండి వెడలిపోవఁడో వాఁడు సుకృతమును వీడి యధోగతినొందును. అంతఁ బాండవులును మాత్స్యులును కేకయులును సృంజయులును క్రుద్ధులై యాయుధము లెత్తికొని శిశుపాలునిఁ జంపు తలంపున లేచిరి. అంత శిశుపాలుఁడును దొట్రుపడక సదస్సునందుఁ గృష్ణపక్షమువారగు రాజులను నదల్చుచు వాలును బలకయును గయికొనెను. అంతలో భగవంతుఁడు తాను దిగ్గనలేచి తనవారిని నిలువరించి రోషంబు దీపింప వాఁడి యంచుగల తన చక్రముచేఁ బయిబడలపడి వచ్చుచున్న యాపగతుని శిరమును ద్రుంచెను. అ ట్లాశిశుపాలుఁడు హతుఁడు



2213. రాజసూయాధ్వరమున శ్రీకృష్ణుఁడు శిశుపాలుని వధించుట

కాఁగా బిట్టుగా నొక పెద్దకోలాహలము పుట్టెను. వాని యను చరులయిన రాజులందఱును బ్రతుకును గోరి పరుగులు వాఱిరి. ఆశిశుపాలుని దేహమునుండి యొక జ్యోతి వెలువడి సకల భూతములును జూచుచుండఁగా మింటనుండి పుడమింబడు నొక యుల్కయుంబోలె వెలుంగుచు వాసుదేవునిఁ బ్రవేశించెను. ఆశిశుపాలుఁడు మూఁడుజన్మములనుండి యనుసరించి వచ్చుచున్న వైరమువలన బుద్ధియం దతనినే తలంచుకొనుచుండి తన్మయత్వము నొందినవాఁ డయ్యెను. చిత్తవృత్తియె శుభాశుభజన్మములకుఁ గారణముగదా! పిదప నాయుధిష్ఠిరుఁడు ఋత్విజులకును సదస్యులకును నవ్వారిగా దక్షిణల నొసంగి యందఱను విధ్యుక్తముగాఁ బూజించి యంత నవభృథస్నానముచేసెను. యోగీశ్వరేశ్వరుం డగుకృష్ణుఁడు ధర్మరాజు యజ్ఞమునుసాధించి యంత సుహృదులు వేఁడికొనఁగా నందుఁ గొన్ని నెలలు వసించియుండెను. అంత దేవకీసుతుఁడు కృష్ణుఁడు యుధిష్ఠిరుఁడు సమ్మతింపకున్నను నతని యనుజ్ఞ నెట్లోకొని భార్యలను సమాత్యులనుంగూడి నిజపురంబునకుఁ బోయెను. వైకుంఠవాసు లగుజయవిజయులు బ్రాహ్మణుల శాపమువలన మరలమరలఁ బుట్టఁగా వారిచరిత్రమునంతయు మిక్కిలి విరివిగా నీకుఁ జెప్పియున్నాను. రాజు యుధిష్ఠిరుఁడు రాజసూయమందలి యవభృథముచేత స్నాతుండై బ్రహ్మక్షత్రియు లున్న యాసభనడుమ దేవరాజుంబోలెఁ బ్రకాశించెను. దేవతలును మనుష్యులును ఖేచరులును నందఱును రాజుచేత మిక్కిలియుఁ బూజితులై కృష్ణునిఁ గ్రతువునును బొగడుచు ముదంబునఁ దమ నెలవులకుంబోయిరి. వారియందెల్లఁ గురుకులమునకుఁ

దెవులు వ్రాలెఁ గలియంశమునఁబుట్టిన పాపుఁడు దుర్యోధనుఁడు మాత్రము పాండుపుత్త్రులకు నట్లు మిక్కిలియుఁ బెంపారి పొదలుచున్న సిరిసొంపును జూచి సయింపఁడయ్యె. విష్ణుఁ శిశుపాలుని వధించుట మొదలయిన కర్మములను రాజులను జె విడిపించుటయు రాజసూయయజ్ఞము జరుగుటయు నెవ్వఁ కీర్తించునో వాఁడు సర్వపాపములనుండియు విడివడుచున్నాఁ
ఇది డెబ్బదినాలుగవయధ్యాయము.

---

### ధర్మరాజవభృథస్నానము సేయుట. దుర్యోధనుని యవమానము.

రాజు—మహాత్మా! 'అజాతశత్రుం డగుధర్మరాజు గా చిన యీరాజసూయపు మహావిభవమునుగాంచి యందు వచ్చిన రాజులును ఋషులును దేవతలును దుర్యోధనుఁ క్కఁడుతక్కఁ దక్కిన వారందఱును ముదమునొందిరని విం దుర్యోధనుఁ డొక్కఁడు సంతాపమునొందుటకుఁ గారణ మే యో చెప్పవలయును' అని యడిగెను. శుకుఁడు—మహా డగు నీపితామహుని రాజసూయమహాయజ్ఞమందు బాం లగువారు ప్రేమకులోనయి యాయాపరిచర్యలు గావిం చుండిరి. భీముఁడు వంటయింటికి నధ్యక్షుఁడుగా నుండె దుర్యోధనుఁడు ధనములకెల్ల నధ్యక్షుఁడుగా నేర్పఱుపఁబడె సహదేవుఁడు వచ్చువారిని సమ్మానించుటయందును, నకులుఁ వలయు ద్రవ్యములను సమకట్టుటయందును నుండిరి. అర్జునుఁ సత్పురుషులకుఁ జందనలేపనాది శుశ్రూషలు గావించుటయంద ము, కృష్ణుఁడు వారికిఁ బాదప్రక్షాళనము గావించుటయందును,

ధృష్టద్యుమ్నుఁడు వడ్డించుటయందును, మహామనస్కుఁడగు
కర్ణుఁడు దానము సేయుటయందును నియమింపఁబడిరి. సాత్య
ఆ కు వికర్ణుఁడును గృతవర్మయు విదురుఁడు మొదలగువారును,
 హ్లీకుఁడును నతని పుత్రులు భూరిశ్రవుఁడు మొదలగువారును
య ప్రడాయాకర్మములు పెక్కింట నియమింపఁబడఁగా వారును
ఆశీ జునకుఁ బ్రియముసేయఁగోరి యూపనులయందు వర్తించు
చు ండిరి. ఋత్విజులును సదస్యులును విద్వాంసులును మిక్కిలి
తేః హ్రుదు లయినవారును బ్రియవాక్యములచేతను నలంకారా
శు ర్షణములచేతను, దక్షిణలు మొదలగువానిచేతను జక్కఁగాఁ
ఋ జితులయినపిదప, శిశుపాలుఁడును శ్రీకృష్ణుని యడుగులను
య ప్పినవెనుక నందఱును గంగానదియం దవభృథస్నానము
మ ంచిరి. అవభృథస్నానమహోత్సవమునపుడు మృదంగము
ము ు, శంఖములును, బణవములును, దుందుభులును, ఆనకము
నె ు, గోముఖములును, మఱియుఁ బలువిధములయిన వాద్య
ష్ఠిర లును జెలంగినవి. నర్తకీజను లుబ్బులు గుబ్బతిల్ల నాట్యము
లన రి. గాయకులు గుంపులు గుంపులుగాఁగూడి గానముచేసిరి.
కుఁ రు వాయించు వీణెలయు వేణువులయు ధ్వనులును, దాళ
ము ల చప్పుళ్లును నింగి ముట్టి చెలంగినవయ్యెను. చిత్రములగు
విగ్రజములును బతాకలును ముందునడువ, మేటిగజములును
ము థములును నశ్వములును జక్కఁగా నలంకృతులయిన భటు
య ను వెంటరా, యదువులును, సృంజయులును, గాంభోజులును,
మ రువులును, కోసలులును, కేకయులును, యజమానుండగు
బ యుధిష్ఠిరుని మున్నిడికొని సైన్యములచేఁ బుడమిని గ్రక్క
దల్చుచు బంగారు దండలుదాల్చి బయలువెడలిన వారయిరి.

సదస్యులును ఋత్విజులును దక్కంగల బ్రాహ్మణశ్రేష్ఠులును, మిక్కుటముగా బ్రహ్మఘోషము సెలంగఁబోయిరి. దేవతలును ఋషులును బితరులును గంధర్వులును బువ్వులసోనలు గురియుచు స్తుతులుగావించిరి. పురుషులును బడఁతులును గంధపుష్పమాలికాభూషణవస్త్రములచేఁ జక్కఁగా నలంకృతులై పలువగల రసముల నొండొరులకుఁ బూయుచు నొకరిపయి నొకరు వసంతములు వోయుచు, విహరించిరి. మఱియుఁ బురుషులు తైలములను గోరసములను జందనజలములను బసపునీరును దట్టంపుఁగుంకుమజలములను బయిని బూసి వసంతములాడఁగా వారకాంతలును మరలవానిని వారికిఁబూసి వసంతములాడుచుఁ గ్రీడించిరి. దివియందు దేవతాస్త్రీలు మేటివిమానములచేతంబోలె, రాజులదేవులును భటులచేతగుప్తలై రథాదియానములెక్కి యవభృథస్నానమును జూచుటకు బయలు వెడలిరి. ఆ రాజకాంతలు మేనమామకొడుకులును సఖులును వసంతములు చల్లఁగా, నునుసిగ్గులచేతను నవ్వులచేతను నెమ్మొగంబు లుల్లసిల్ల నెంతయు విలసిల్లిరి. మఱియు నాముద్దియలు మఱఁదండ్రనును సఖులనును దృతుల (తోలు తిత్తుల)చేత వసంతములు చల్లి తడుపుచు వారలు దమపైఁ జల్లఁగాఁ గట్టినపుట్టంబులు దొప్పఁదోఁగుటవలన నవయువములును బలితంపుగుబ్బలును దొడలును నెన్నడుములును దేటపడఁగా, వసంతమునందలి తమకంపుఁబెంపునం జేసి క్రొమ్ముడులనుండి పువ్వులు జలజల రాల సొంపులుగులుకు సయ్యాటములవలనఁ గాముకు లగువారి మనంబుల కెంతయుఁ గలంకగావించుచుండిరి. అంత సమ్రాట్టగునా యుధిష్ఠిరుఁడు బంగారుదండలచేత గండరించుచున్న మేటిగుఱ్ఱ

ములు పూన్చినరథము నారోహించి తనపత్నులంగూడి యంగ
క్రియలచే రాజసూయమునంబోలె మిక్కిలియుఁ దేజరిల్లెను.
ఋత్విజులాధర్మరాజుచేతఁ బత్నీసంయాజములు నవభృథ్యము
లు ననుక్రియలఁగావించియాచమింపఁజేసి యంత ద్రౌపదితోడం
గూడ గంగానదియందు స్నానముచేయించిరి. అప్పుడు దేవతల
దుందుభులును మనుష్యదుందుభులును నొక్కపెట్టఁ జెలంగెను.
దేవతలును ఋషులును బితరులును మనుష్యులును బువ్వులవా
నలు గురిసిరి. పిదపఁ దమతమవర్ణములయు నాశ్రమములయుఁజొ
ప్పున నెలకొనియున్న యాయాజను లెల్లవారును నందు స్నాన
ములుచేసిరి. ఏలన మహాపాతకి యగువాఁడు సైతమాస్నానము
చేసినచోఁ దోడనే యప్పాపమునుండి విడివడుచున్నాఁడు గదా.
అంత రాజు యుధిష్ఠిరుఁడు నూతనములగు తెలిపట్టువస్త్రము
లను దొడిగి, చక్కఁగ నలంకృతుఁడై ఋత్విజులకును సదస్యు
లకును బ్రాహ్మణులు మొదలగువారికిని వలయుభూషణములను
వస్త్రములనునొసంగి యర్చించినవాఁడయ్యె. మఱియు నారాజు
సర్వము నారాయణాత్మకముగాఁ దలంచువాఁడుగాన బంధు
వులను జ్ఞాతులను రాజులను మిత్రులను సుహృదులను దక్కిన
వారినందఱనును మాటిమాటికిఁ బూజించినవాఁడయ్యెను. సకల
జనులును మణికుండలములనును బుష్పమాలికలనును దలచీ
రలనును, గంచుకములనును, బట్టుపుట్టములును దొడిగి మిక్కిలి
వెలపొడుగయిన హారములచే నలంకృతులై వెలింగిరి. పడఁ
తులును, గమ్మలదోయి మెఱుఁగులు దుఱఁగలింప, ముంగురులు
గుబురుగొని తుంపెసలాడ, నెమ్మొగమ్ముల మొమ్మె లతిశయిల్లు
చుండ, బంగరుమొలనూళ్లు దులకింప, నెంతయుఁ దళుకొత్తు

చుండిరి. అంత సుస్వభావులును బ్రహ్మవాదులు నగు ఋత్విజులును సదస్యులునుఁ దక్కినబ్రాహ్మణులును క్షత్రియులును వైశ్యులును శూద్రులును రాజులును మఱి యటవచ్చిన దేవతలును ఋషులును పితరులును భూతములును లోకపాలురును వారియనుచరులును ధర్మరాజుచేతఁ బూజితులై యతనిచే వీడుకోలువడసి తమతమ నెలవులకుం బోయిరి. హరిదాసుం డగు నారాజర్షి ధర్మరాజు రాజసూయము మహోదయమును జనులెంత ముచ్చటించినను మర్త్యుఁ డమృత మెంతద్రావియును దృప్తిఁబొందనియట్లు వారు తృప్తులు గారయిరి. అంత రాజు యుధిష్ఠిరుఁ డెడఁబాయుటకు సైఁపక జంకి సుహృదులను సంబంధులను బాంధవులనును గృష్ణునిని బోవకుండునట్లు ప్రేమంబున వారించెను. భగవంతుఁడు కృష్ణుండును యదువీరులగు సాంబుఁడు మొదలగువారిని గుశస్థలమునకుఁ బయనము చేసిపుచ్చి యాధర్మరాజునకుఁ బ్రియంబు సేయువాఁడై యచట వసించియుండెను. ఇట్లురాజు యుధిష్ఠిరుఁడు తనమనోరథమనెడి మహాసముద్రమును, నెంతయుఁ దరింపరాని దానిని, గృష్ణునిచేత నుత్తరించి మనసుతుందుడుకు వీడినవాఁ డయ్యె. ఒక్కనాఁడు దుర్యోధనుఁడు నచ్యుతునియందు మనస్సు నెలకొల్పి యున్నయాధర్మరాజు నంతఃపురమునం గలసిరిపెంపుసొంపును రాజసూయము మహత్త్వమును గాంచి మనంబున నెంతయుఁ దపించినవాఁడయ్యె. ఆ యంతఃపురమునందు విశ్వకర్మ పన్నిన లక్ష్ములు—రాజేంద్రులయు దైత్యచంద్రులయు భోగ్యభోగోపకరణాదు లయినసొంపుపెంపులు-నానావిధముల వెలయుచుండెను. అట్టి పెంపుసొంపులతోఁ గూడి ద్రుపదరాజ

కుమారి పతిని బరిచరించుచుండెను. ఆబిడయుం దా కురురాజు మనసు మిక్కిలియుఁ దగులువడి యెంతయు మరులునఁ జొక్కుచుండెను. మఱియు నాయంతిపురమునందు యదుపతియగు కృష్ణుని పత్నులు వేయిమంది బలితంపుఁబిఱుఁదుల బరువునఁ యందియ లల్లల్లన మొరయ నిడునట్టియడుగుల కాంతులు కలయఁబర్వ, నెన్నడుము మిక్కిలియు సన్నమై చెన్నుఁజూప, గబ్బిగుబ్బల కుంకుముపూఁతల హారంబు లెఱుపువన్నె మిటారింప, నెమ్మొగంబెంతయు నెమ్మొగులుకఁ, జెక్కులపయిఁ గమ్మలు చౌకళింప, నెన్నుదుటిపై ముంగురులు చిందులు ద్రొక్క, దిరుగుచుండుట యాదుర్యోధనుని కెంతయుఁ బరితాపము గలిగించెను. ఒకప్పుడు మయుండు నిర్మించిన యాసభయందు సమ్రాట్టగు ధర్మరాజు తమ్ములును బంధువులును దన హితాహితములందుఁ గన్నుగలిగి కాచుచుండు కృష్ణుండును బలసియుండఁ, బరమేష్ఠి సిరిపెంపునకు సాటియగు సొంపు పెంపారుచుండ,వందిజనులు కైవారములుసేయ, బంగారు సింహాసనమున సాక్షాద్దేవేంద్రుఁడుంబోలె నాసీనుండై యుండెను. అప్పుడు సాహంకారుఁ డగు దుర్యోధనుఁడు మేలికిరీటమును బుష్పమాలికయును దాల్చి తన్నుఁజుట్టును దమ్ములుకొలిచి చనుదేరఁ గేల ఖడ్గంబూని రాజుల నేమో నిందించుచు నాసభయందుఁ బ్రవేశించెను. ఆ సభ శత్రువులకు జలస్థలబుద్ధి భ్రమను గలిగించునట్లు మయుండు నిర్మించెనుగాన యామయునిమాయచేత మిక్కిలియు మోహితుండై స్థలమును జలముగా వగచి కట్టినపుట్టము చెఱంగు నెగఁద్రోచికొనెను. అట్లె యందొకచోట స్థలమును జలముగాఁ దలఁచి పడెను. అట్లె జలమును స్థలముగా భ్రమించి

పడెను. దానినిజూచి భీముండును స్త్రీలునుఁ దక్కినరాజులును, రాజగు యుధిష్ఠిరుఁడు వలదని యెంతవారించుచుండినను, గృష్ణుం డియ్యకొని ప్రేరేపఁగాఁ, బకపకనవ్విరి. ఆదుర్యోధనుం డం దులకు మిక్కిలియు లజ్జితుండై మొగముల్ వ్రేల వాంచి కోపం బున మండిపడుచు నేమియు ననక యాసభ వెలువడి హస్తినా పురమునకుఁ బయనమైపోయెను. అప్పుడు దుర్యోధనుఁ డవ మానితుండయ్యె. హా! హా! యనుశబ్దము బెట్టిదముగా నందుఁ జెలంగినదయ్యె. అజాతశత్రుండును మిక్కిలియు మనంబునఁ గుందినవాఁడయ్యె. ఆకృష్ణుండును భూభారమును బరిహరింప నువ్విళులూరుచుండువాఁడు గాన యందులకేమియుఁ బలుకక యూరకుండెను. అతని దృష్టిమాత్రముననేకదా దుర్యోధనుఁ డట్లు [illegible]ంతినొందిన వాఁడయ్యె. * మయునిమాయ వట్టి నిమిత్తమాత్రమే. రాజా! ఈవిషయమై నన్నడిగినదానిని-అనఁ గా రాజసూయ మహాయజ్ఞమందు దుర్యోధనునికి యుధిష్ఠి రుని సిరిపెంపును జూచుటవలనఁ బుట్టినదుర్జనత్వమును - నీకుఁ దెలియఁ జెప్పితిని. ఇది డెబ్బదియేనవయధ్యాయము.

---

## సాల్వవధ కథారంభము.

శ్రీశుకుఁడు.—రాజా! క్రీడామనుష్య విగ్రహమును దా ల్చి కృష్ణుండు గావించినమఱియొకయద్భుతకృత్యమును - అనఁ గా నతఁడు సౌభపతిని హతునిఁ గావించినవిధమును - వినుము. శిశుపాలుని సఖుఁ డగుసాల్వుఁడు రుక్మిణీవివాహము నపుడు

---

* కృష్ణుడు భూభారమును దీర్చుటకై దుర్యోధనునకు భీమాదుల పరిహాస మూలమున నవమానముఁబన్ని యంతనూరకుండెనని భావము.

వచ్చియుండి యుద్ధమునందు యదువులచే జయింపఁబడెను. అప్పుడు జరాసంధుఁడు మొదలగువారును జయింపఁబడిరి. అపుడు సాల్వుఁడు సకలరాజులును వినుచుండఁగా 'నేనుభూమియం దొక్కయాదవుఁడును లేకుండునట్లు చేయుదును. నా పౌరుషమును జూడుఁ'డని ప్రతిజ్ఞగావించెను. ఇట్లామూఢుఁడు ప్రతిజ్ఞగావించి ప్రతిదినము నొకపిడికెఁడు పాంసువులను నొకమాటు లోఁగొనుచుఁ బ్రభుండగు పశుపతిని దేవుని నారాధించెను. అట్లు సంవత్సరము చేసి ముగియఁగా నాకడపట భగవంతుఁడగు నుమాపతి భగద్ద్వేషమునుబట్టి మిక్కిలి సంతసిల్లక యించుక సంతసించి శరణాగతుఁడయిన యాసాల్వుని 'వరము వేఁడు'మని యానతిచ్చెను. వాఁడు దేవాసురులకును మనుష్యులకును గంధర్వులకును నురగులకును రక్షస్సులకును, నభేద్యంబై కామగమనంబై యదువులకు భయంకరమగు నొక విమానము వలయునని వేఁడెను. శివుఁడును వల్లె యని మయునికట్టి విమానమును నిర్మించియిమ్మని యాజ్ఞాపించెను. అతఁడు శత్రుపురంబుల జయించు దిట్టగాన యినుముతో సౌభంబనెడి యొకపురమును నిర్మించి సాల్వున కొసఁగెను. అట్లు కామగమనమై యంధకారమునకుఁ బట్టయి. యెవ్వరికిని జెనకరాకున్నయావిమానమును బడసి సాల్వుండు వృష్ణులు గావించిన వైరమును దలంచుకొని ద్వారకాపురమునకుఁ బోయెను. సాల్వుఁడట్లుచని పెనుసైన్యముచే నాపట్టనము నరికట్టి, యందలి యుపవనములను నుద్యానవనములను నన్నింటిని మఱియు గోపురములను ద్వారములను బ్రాసాదములను నట్టాలకములను బ్రతోళికలను విహారస్థానములను భగ్నముగావించెను. మఱి

యు మేటివిమానమునుండి శస్త్రములును, శిలలును వృక్షము లును, పిడుగులును సర్పములును వర్షములుగాఁ గురిసెను. మఱి జడివానలును గులకఱాలును గురిసెను. పిదపఁ బ్రచండ మయిన సుడిగాలియు సుడిసెను. దానిచే దిక్కులన్నియు ధూళిగ్రమ్మి గానరాకుండెను. ఇట్లు సౌభముచే మిక్కిలినలంపఁ బడుచుఁ గృష్ణుని నగరం బాద్వారక త్రిపురములచేత భూమి యుంబోలె నించుకేని సుఖముగాంచదయ్యె. అంత మహాత్ముం డగు ప్రద్యుమ్నుఁడు తన ప్రజలు బాధ నొందింపఁ బడుచుండు టనుజూచి మహారథుం డగువీరుఁడుగాన 'భయపడవల' దని చెప్పి రథారూఢుఁడై సాల్వునిఁ దలపడెను. సాత్యకియుఁ జారు దేష్ణుఁడును సాంబుఁడును నక్రూరుఁడును దక్కిన సమ్ములును హార్దిక్యుఁడును భానువిందుఁడును గదుఁడును శుకసారణులును మఱియుఁ దక్కిన మేటివిలుకాండ్రును, రథయూథపతులును దక్కిన దళవాయులును గవచములనుదాల్చి రథగజతురగ పదాతులచే రక్షితులై బయలువెడలిరి. అంత సాల్వసైనికులకును యదువులకును యుద్ధము సురలకును దేవతలకునుంబోలెఁ దుములమై గగురుఁబుట్టించుచుఁ బ్రవర్తింపసాగెను. పిదప రుక్మిణీసుతుండు ప్రద్యుమ్నుఁ డాసౌభపతియగు సాల్వుని మాయలను తన దివ్యాస్త్రములచేత, సూర్యుండు రాత్రిచీకట్లంబోలె,క్షణమున నాశముగావించెను. అంత బంగారు పింజలును నినుపమూఁతు లును గలిగి చదునైనకణుపులుగల బాణము లిరువదియేనింటిని బ్రయోగించి సాల్వుని సేనాపతిని గాఁడనేసెను. మఱి నూఱు బాణములచే సాల్వునిని, ఒక్కొక్కబాణముచే సైనికులను, బదేసిబాణములచే సారథులను, మూఁడేసిబాణములచే వాహన

ములను, గొట్టెను. మిక్కిలి యద్భుతమయినయా వెనుకృత్య
మును మహాత్ముఁ డగు ప్రద్యుమ్నుఁడు గావించినదిచూచి యిరు
దెగల సైనికు లెల్లవారు నతనిని గొనియాడిరి. మయునిచే
రచితమగుటంజేసి మాయామయమైన యావిమాన మొక్క
చోటఁ బెక్కురూపములుగను మఱియొక్కచో నొక్కరూప
మునను, నొక్కయెడఁ గనఁబడుచును మఱియొక్క యెడఁ
గనఁబడకయు, నిట్లు పరులకెంతమాత్రము నిరూపించి తెలియుట
మిక్కిలికష్టముగా నుండెను. అదియొక్కచో భూమియందును
నొక్కచో నాకాశమం దొకపర్వత శిఖరముననను, నొక్కయెడ
జలమందును, నిట్లు కొఱవిగుండ్రముగాఁ ద్రిప్పినట్లు దిరుగుచు,
నొక్కచోటను స్థిరముగా నెలకొని యుండదయ్యె. సాల్వుఁ
డెందెందు సైనికులతోడను సౌభముతోడను గనుపట్టు[illegible] యా
యావలన యదు సేనాపతులు బాణములను విడుచుచుండిరి. పరు
లు వైచినశరము లన్నియును సూర్యాగ్నులవలె నంటు
టకు వేండ్రములై యాశీవిషములవలెఁ జెనకరానివై తనపుర
మును సైన్యమునుబట్టి పీడించుచుండఁగా నా సాల్వుఁ డేమియుఁ
దోఁపకుండెను. సాల్వుని సేనాపతులు శస్త్రసమూహములచే
యదువీరులు మిక్కిలియుఁ బీడితులైనను ముల్లోకములను గెలువ
నుంకించుచున్న దిట్టలుగావున యుద్ధమందలితమతమ నెలవులను
విడిచినవారుగారయిరి. సాల్వునిమంత్రియగు ద్యుమంతుఁడను
వాఁడు ప్రద్యుమ్నుని యస్త్రములచే మిక్కిలియుఁ బీడితుఁడై దార
సిలి యినుపగుదియఁగొని బలిమిమెఱసి యతనిని గొట్టెను.
ఇట్లరిందముఁడా ప్రద్యుమ్నుఁడు వక్షమున గదచేఁ గొట్టువడి
మూర్ఛనొందఁగా దారుకుని కొడుకయిన యతనిసారథి యుద్ధ

ధర్మముల నెఱింగినవాఁడు గాన యుద్ధభూమినుండి తొలఁగఁ గొనిపోయెను. అంతఁ బ్రద్యుమ్నుఁడు ముహూర్తము సేపటికిఁ దెలివొంది సారథింజూచి 'సూతా! అక్కటా! నన్ను యుద్ధము నుండి తొలఁగఁ దెచ్చితివే! ఇది యెంతమాత్రము లెస్సగాదు సుమీ. యదువుల కులమునందుఁ బుట్టినవాఁ డెవఁడుగాని, పిఱికిగుండె యగునాసారథిచేత నిట్టి యపయశస్సు నొందింపఁ బడిన నే నొక్కఁడుతప్ప మఱెవ్వఁడుగాని, యుద్ధమునుండి వెను దగిలినట్లు విన్నది లేదు. నేను నాతండ్రు లగురామకృష్ణులను సంధించితి నేని యట్లు ధర్మయుక్తంబగు యుద్ధమునుండి తొలఁగి వచ్చినవాఁడను గాన వారడుగఁగా నేది తగినదని చెప్పఁగలను. మఱియు నాయన్నదమ్ముల భార్యలు యుద్ధమం దట చెడి వెన్నిచ్చిన[illegible]న్నఁగూర్చి నవ్వుచు నెట్టట్లు గేరడములు చెప్పకొందురు? తప్పక చెప్పకొందురే! వీరా! వారేకాదు. మఱి తక్కినవారు నెట్లుచెప్పరు?' అనెను. అందులకు సారథి 'ఆయుష్మంతా! ప్రభూ! నేను యుద్ధధర్మమును దెలిసియే యిట్లుచేసితిని గాని తెలియక కాదు. రథికుని సంకటమునఁ జిక్కినపుడు సారథియు, సారథి నట్టియెడ రథికుఁడును గాపాడవలయును. ఇది ధర్మము గదా! ఇది తెలిసియే నేను నీవు పరులచేఁ దాఁకువడ గదచేఁ గొట్టువడి మూర్ఛితుండ వయితివని రణభూమినుండి తొలఁగఁ దెచ్చితి' ననెను. ఇది డెబ్బదియాఱవయధ్యాయము.

## కృష్ణుఁడు సాల్వుని వధించుట.

అంత నాప్రద్యుమ్నుఁడు జలముల నాచమించి కవచముఁ దొడిగి విలుదాల్చి సారథితో 'నన్ను ద్యుమంతుఁడున్న చక్కికిఁ

గొంపొమ్ము' అని యానతిచ్చెను. ప్రద్యుమ్నుఁడు తనసైన్య
ములను దుప్పులఁ దూల్చుచున్న ద్యుమంతుని నడ్డగించి నవ్వుచు
నెనిమిదినారాచములఁ గాఁడ నేసెను. మఱి నాలుగు బాణ
ములచేఁ దురగములను నొక్కబాణముచే సూతునిని రెంటిచే
వింటినిని కేతువును మఱియొక్క బాణముచే ద్యుమంతుని శిర
మును ద్రుంచెను. గదుఁడు సాత్యకి సాంబుఁడు మొదలగువారు
సౌభపతియగు సాల్వుని బలములను దునిమితూఁటాడిరి. సౌభ
ములోనివా రందఱును గుత్తుకలు తెగి సముద్రమునం బడిరి.
ఇట్లు యదువులును సాల్వులును నొండొరులను గొట్టుచు
నుండఁగా నాయుద్ధమిరువదియేడురాత్రులుతుములమై మిక్కిలి
వేండ్రముగా జరిగెను. కృష్ణుండు ధర్మరాజు పిలిపింపఁగా నింద్ర
ప్రస్థమునకుఁ బోయియుండి రాజసూయము నెఱవే[illegible] శిశు
పాలుఁడు హతుఁడయినపిదపఁ గురువృద్ధులగు భీష్మాదులను ముని
లను గుంతిని నాయిమపుత్రులను వీడుకొని మిక్కిలి ఘోరము
లయిన నిమిత్తములను గాంచుచు ద్వారకాపురమునకుఁ
బోయెను. అతఁడు ధర్మరాజాదులతో 'నేను మాయన్న బల
భద్రునితోడ నిక్కడకు వచ్చితిని. కనుక శిశుపాలుని పక్షము
వారగు రాజులు తప్పక నాపట్టనమును ముట్టడించి నలంతురు.
కాన పోయెద' నని చెప్పి వచ్చెను. అంత నతం డాయుద్ధమును
గాంచి బలరామునిఁ బురరక్షణమునందు నియమించి సౌభమును
సాల్వరాజును జూచి దారుకునితో 'సారథీ ! నారథమును
సాల్వునిదగ్గఱకు బిగ్గరఁ గొనిపొమ్ము. ఈసౌభరాజు మాయావి
కాన వీనితో యుద్ధము సేయవలయును' అనెను. అదివిని దారు
కుఁడు రథమునందుఁ గూర్చుండి దానిని వేగతోలెను. ఇరు

దెగలవారును గరుడధ్వజంబున వెలుంగుచున్న యారథమును గృష్ణుఁ డారోహింపఁగాఁ జూచిరి. సాల్వుఁడును దనబలములును దళపతులును దఱచుగా హతులుగాఁగా, నంతఁ గృష్ణునిఁగాంచి ఘట్టిదముగా మ్రోఁగుచున్న శక్తిని,నాయుద్ధమునఁ గృష్ణసారథి యగు దారుకునిపైఁ బ్రయోగించెను. ఆశక్తియు నాకాశంబునఁ బెనుపిడుగుంబోలె నతివేగంబున దిక్కులనెల్ల వెలింగించుచు వచ్చుచుండఁగాఁ గృష్ణుఁడు బాణములచే నూఱుపఱియలుగాఁ ద్రుంచెను.మఱియు నాసాల్వునిఁ బదియాఱు బాణములఁగాఁడ నేసి యంతరిక్షమునఁ దిరుగుచున్న యాసౌభమును, సూర్యుం డాకాశమును దనకిరణములచేతనుంబోలె, శరసమూహములచేత గ్రుచ్చినవాఁడయ్యె. సాల్వుఁడు కృష్ణుని శార్ఙ్గధనువుతోఁ గూడిన యెడమచేతిని గాఁడ నేయఁగా నాహస్తమునుండి శార్ఙ్గము క్రిందఁబడెను. అది యొకయద్భుతముగా నుండెను. అప్పుడు దానిని జూచుచున్న భూతములు బిట్టుగా హాహాకారముగావించెను. సాల్వరాజును బెగ్గర నార్చి జనార్దనునిఁ జూచి 'మూఢా ! మేమందఱును జూచుచుండఁగా మా చెలికాఁడగు శిశుపాలునిభార్యను నపహరించికొని పోయితివి. మఱియామా నెచ్చెలి నేమఱియుండఁగా సభామధ్యమునఁ బట్టి గూల్చితివి. ఇట్లుగావించి యెందును నన్నుగెలువ నెవరికిఁ దరముగాదని యెన్ని విఱ్ఱవీఁగుచున్న నిన్ను నిదిగో, వాఁడిబాణముల నాయెదుర నిలుతునేని, మరలిరానిగతికి మృత్యువునకుఁ బంపెదను జూడు' మనెను. కృష్ణుఁడు—'మందా ! ఊరక ప్రేలుచున్నావు. కాని దగ్గఱ మూఁడియున్న మృత్యువు నెఱుఁగవు. శూరులు తమమగతనమును జూపుదురేకాని పెక్కులు వద

రుట లేదు' అనిపలికి బెడిదంబగు వేగముగల గదగొని మిక్కిలి క్రుద్ధుఁడై సాల్వుని జత్రువునఁ గొట్టెను. వాఁడు నెత్తురు గ్రక్కుచు బిట్టు వడఁకెను. కృష్ణుఁ డాగదను దిగుచుకొనఁగానే సాల్వుఁ డంతర్హితుఁడయ్యెను. అంత నొకముహూర్తమున నొక పురుషుఁడువచ్చి హరికి శిరమువంచి ప్రణమిల్లి 'దేవకిపంపఁగా దేవరకడకు వచ్చితి'నని యేడ్చుచు మఱియు 'కృష్ణా! కృష్ణా! మహాబాహూ! పితృవత్సలా ! నీతండ్రిని సాల్వుఁడు, పశువును జంపువాఁడు పశువులుంబోలెఁ, గట్టి కొంపోయినాఁడు' అనెను. ఆవిప్రియమును విని కృష్ణుఁడు మనుష్యస్వభావము నూఁది యుండుటవలన, మనంబు దిటదూలి జాలిపయికొన నెయ్యమునఁ బ్రాకృతునింబోలెఁ దనలో 'మాయన్న రాముని సురాసురులకును గెలువ నలవిగాదు. మఱియు నతఁడు తొట్రుపాటు లేక మెచ్చరికతోడనే యున్నవాఁడు. అట్టివానిని మిక్కిలి యల్పుఁడగు సాల్వుఁ డెట్లు గెలిచి నాతండ్రిని గొంపోయినాఁడు? విధి మిక్కిలి బలీయమైనది సుమీ' యని యిట్లనుకొనుచుండఁగా సాల్వుఁడు వసుదేవునిఁ దీసికొనివచ్చి నిలిచి యాకృష్ణునితో 'వీఁడుగో నిన్నుఁ గన్నతండ్రి. వీనికొఱకే కదా నీ విందు జీవించి యుండుట. నీవు చూచుచుండఁగానే వీనిని వధించెదను. సమర్థుఁడవయితేని మూఢా! వీనిని గావుము చూతము' అనెను. ఇట్లామాయావి బిట్టదల్చి యావసుదేవుని శిరమును ఖడ్గముచేఁ దెగనఱికి దానిని జేకొని యాకాశమున నున్న సౌభమును బ్రవేశించెను. కృష్ణుఁడు తనజనులయందు మిక్కిలి యాసక్తుండగుటం జేసి యంత ముహూర్తము సేపు దనయసాధారణసర్వజ్ఞత్వము నుడిగి మానుషస్వభావమునందుఁ మునింగినవాఁడై యుండి

యంత మహానుభావుండు గావున నది మయుండు సాల్వున కుప
దేశించిన యాసురియను మాయను సాల్వుఁడు పంపెనని తెలి
సినవాఁడయ్యెను. అట్లు తెలిసినపుడే యతఁ డాయుద్ధరంగమున
దూతనుగాని తండ్రి కళేబరమునుగాని, కలగని లేచినవాఁడు
కలలోని పదార్థములంబోలెఁ, గానఁడయ్యె. కాని, యాకాశ
మునందుఁ దిరుగుచున్న సౌభములోఁ గూర్చున్న యాశత్రుని
సాల్వునిఁగాంచి చంప నుద్యుక్తుండయ్యెను. రాజర్షీ ! ఋషులు
కొందఱు పూర్వాపరములను సరిగాఁ గలయఁగూర్చి చింతింపక
యిట్లు పలికెదరు. * తమపలుకు లొండొంటికి విరుద్ధములై
యుండుటను వారు తలంపరు. ఇదినిజము. † శోక మోహాములు

---

* ఇటపై నేమనఁగా— శ్రీకృష్ణుఁడు రాజసూయమునకు రామునితోఁ గూడి పోయెను. ఏలన 'సంకర్షణ మనుజ్ఞాప్య' అని మున్ను రాముని పిడుకొని పోయినట్లు చెప్పఁబడియున్నది. ఇంద్రప్రస్థమునకుఁ గృష్ణుఁడు పోయియున్న పుడు సాల్వుఁడు ద్వారకపైకి రాలేదు. ఏలన కామ్యకవనమం దున్న పాండవులతోఁ గృష్ణుఁడు 'నేను సాల్వునితోడి యుద్ధమునఁ దగిలియుండి నందున మీయాపదను తెలియనయితి' నని వారి కూఱడిలఁ బలికెనని వ్యాసులు చెప్పియున్నారు. కాన పూర్వోత్తరముల నరయక యిట్లు, రామునితోఁ గూడ నింద్రప్రస్థమునకుఁ బోయెననియుఁ గృష్ణుఁడక్కడఁ బోయియున్న పుడు సాల్వుఁడు దండెత్తెననియు విరుద్ధములు గొందఱు ఋషులు పలికెదరని యాశయము.

† 'మనస్సు దూలి' నాఁడని శోకమును 'మనుష్యస్వభావము నొందినాఁ' డని మోహమును 'జాలిగొని నెయ్యమున' నని స్నేహమును దుర్నిమిత్తములను గని 'తప్పక నాపట్టనమును ముట్టడించి నలంతు'రని భయమును 'చేతనుండి శార్ఙము క్రిందఁబడె'నని యజ్ఞానసంభవమును జెప్పిరిగదా. జ్ఞానవిజ్ఞానము లఖండముగాఁగల పరమాత్మునికి నివియెల్లఁ గలుగుట యసంగతమని యిటచెప్పుట తెలియునది.

గాని, స్నేహముగాని, యజ్ఞానమువలనఁ గలుగునట్టి భయము గాని యెక్కడ! అఖండములగు జ్ఞానవిజ్ఞానములును నైశ్వర్యమునుగల పరమాత్ముఁ డెక్కడ! ఔరా! ఎవ్వని పదారవిందములను సేవించుటవలనఁ బరమాత్మోపాసన మూర్జితమై యనాదిగానున్న దేహాత్మభ్రాంతిమొదలగు పిశాచములను దూలించునో, మఱియు నట్టి యుపాసకు లనంతమై యుపహతపాప్మత్వాదిగుణాష్టకలక్షణమైన యైశ్వర్యమును బడయుదురో, యట్టి పరమునికి, సత్పురుషులకు గతియగువానికి మోహమెక్కడిది?

* ఆసాల్వుఁడు శస్త్రసమూహములచేఁ బ్రహరించుచుండఁగా నమోఘ పరాక్రముండగు శౌరి వానితోఁ బోరాడి వాని కవచమును ధనువును దునిమి, శిరోమణిని ద్రెంచి, వానిసౌభమును గదచేత భగ్నముగావించెను. అట్లు కృష్ణుఁడు ప్రయోగించిన గదచే నాసౌభమును వేయిదునియ లయి నీటం బడియెను. అంత సాల్వుఁ డాసౌభమును విడిచి భూతలముననిలిచిగదనెత్తికొని వేగమచ్యుతునిపైఁ బాఱతెంచెను. అట్లడరుచున్న వాని బాహువును, బాహుపురితోఁ గూడినదానిని, భల్లముతోఁ ద్రుంచి యంత సాల్వుని వధించుటకై యుద్యతంబై ప్రలయార్కునిం బోని చక్రమును జేతందాల్చి సూర్యునితోఁగూడిన యుదయ పర్వతమువలెఁ బ్రకాశించెను. ఆహరి మిక్కిలియు మాయకాఁడగు నాసాల్వుని శిరమును గిరీటకుండల యుక్తమగుదానిని, ఇంద్రుండు వజ్రాయుధముచేత వృత్రునిశిరమునుంబోలెఁ, ద్రుంచినవాఁడయ్యె. అప్పుడు మనుజు లందఱును హాహాకార

* ఇదియె యథార్థముగాఁ జరిగినవిషయమని పూర్వమతములను ఖండించి ప్రతిపాదించుట తెలియునది.

ములుగావించిరి. అట్లాపాపాత్ముఁడుగూలఁగా, నాసౌభమును గద
చేత హతముగాఁగా, నపుడు దేవగణములు దేవదుందుభులను
మొరయించిరి. సఖులయిన యా శిశుపాలాదులకు నుపకారము
సేయుటకై దంతవక్త్రుఁడు కోపమునఁ గృష్ణునిపై నెత్తివచ్చెను.
ఇది డెబ్బదియేడవయధ్యాయము.

---

## కృష్ణుఁడు దంతవక్త్రుని వధించుట.

శిశుపాలుఁడును సాల్వుఁడును దుర్మతియగు పౌండ్రకుఁడును బరలోకగతులుకాఁగా వారికిఁ బరోక్షమునఁ దనచెలిమిని గావించువాఁడై దంతవక్త్రుఁడు మిక్కిలియుఁ గ్రోధంబుగొని తానొక్కండును బదాతియై గదకేలంబూని యడుగులఁ బుడమి గ్రక్కదల్చుచు మహాసత్త్వుండై పయినెత్తివచ్చెను. వాఁడట్లు పయి నడరుచుండుటనుజూచి కృష్ణుండు సత్వరుండై గదనుగొని సముద్రము చెలియలికట్టను గుప్పించివచ్చునట్లు రథమునుండి గొబ్బునదూఁకి పయికొనివచ్చెను. ఆకారూశుఁడగు దంతవక్త్రుఁడును గదనెత్తికొని దుర్మదుఁడై ముకుందునిఁజూచి 'భాగ్యము భాగ్యము ! నీవిపుడు నాభాగ్యవశమునఁ గంటఁబడితివి. కృష్ణా! నీవు నాకు మేనమామకొడుకవు కాని, నామిత్రులకు ద్రోహివి! మఱియు నన్నుఁజంప నువ్విళ్లూరుచున్నవాఁడవు. మందా ! కాఁబట్టివజ్రకల్పంబైనయీ గదచేతఁబొరిపుచ్చెదను జూడుము. అట్లు చేసి యంత నిపుడే నామిత్రులఋణమును మిత్రవత్సలుండను గాన నీఁగికొనెదను. నీవు బంధుఁడవుగాని, దేహమునందుఁ జరించుచున్న వ్యాధియుంబోలె బంధురూపుండవై చరించుచున్న పగవాఁడవు. కాన నిన్నుఁజంపి చెడుగు తీర్చుకొనెదను' అని.

యిట్లు పరుసనివాక్యముల దంతవక్త్రుఁడు, మునికోలలచేత నేనుంగునుంబోలె నొప్పించుచు, గదంగొని యాతని తలపయి నడిచి, సింహనాదము గావించెను. ఆయదుకులతిలకుండు గద చేత యుద్ధంబునఁ గొట్టువడియు నించుక చలింపఁడయ్యె. కృష్ణుండును వానిని మిక్కిలియుఁ బెద్దదియగు కౌమోదకియను గదచేత స్తనాంతరమునఁగొట్టెను. వాఁడుహృదయమునబిట్టుగాఁ గొట్టువడుటయు నోటనుండి నెత్తురు గ్రక్కుచు, వెండ్రుకలు విరియఁబోవఁ గాలుసేతులను జాఁచికొని యునుఱుపీడి నేలపయిం బడెను. అంత సమస్తములయిన భూతములును జూచుచుండఁగా, మున్ను శిశుపాల వధమునందుంబోలె, నద్భుతమై మిక్కిలి సూక్ష్మమైన యొకజ్యోతి వానినుండి వెడలి కృష్ణునియం దావేశించెను. వాని తోఁబుట్టువయిన విదూరథుఁడు నన్నమరణమువలని శోకమునఁ దోఁగి నిట్టూర్పులువిడుచుచుఁ బలుకయు వాలునుగొని కృష్ణునిపై నడరవచ్చెను. అట్లు పయివచ్చుచున్న వానిని జూచి గృష్ణుఁడు మంగలకత్తిచుట్టు వాదరగాఁగల చక్రమునుగొని కిరీటకుండలములతోఁగూడిన వాని శిరసును ద్రుంచెను. ఇట్లు సౌభవిమానమును సాల్వునిని దంతవక్త్రునిని విదూరథునిని మఱియు దుర్విషహులయిన యితరులనును హతులం గావించి దేవతలునుమనుష్యులును స్తుతులుసేయుమునులును,సిద్ధులును, గంధర్వులును, విద్యాధరులును, మహోరగులును, అప్సరసలును, పితృగణములును,యక్షులును,కిన్నరులును,చారణులును, దనవిజయము నెంతయుఁ బొగడుచుఁ గుసుమములు పయిని గురియుచుండ, యదుప్రవరులు బలసికొలువ నలంకృత మగు నిజపురమును బ్రవేశించినవాఁడయ్యె. ఇట్లు యోగేశ్వరుండును

జగదీశ్వరుండు నగు భగవంతుఁడు కృష్ణుఁడు పశు దృష్టులగు మూఢులచేతఁ జరాసంధాదులచేత నిర్జితుఁడనియు జయించి నాఁడనియుఁ దోఁచుచుండును గాని నిర్జితుఁడు జయించుచున్నాఁడనుట భ్రాంతి; అజితుఁడేయై జయించుచున్నాఁడు సుఁడీ.

బలరాముని తీర్థయాత్రయు సూతవధాదులును.

కౌరవులు పాండవులతోడ యుద్ధమునకుఁ దొడంగుటను విని బలరాముఁ డిరుదెగలకును మధ్యస్థుఁడుగాన తీర్థయాత్రా మిషమున బయలు వెడలెనట; అతఁడు ప్రభాసమందుఁ గ్రుంకి యందు దేవతలను ఋషులను పితరులను మనుష్యులను సంతృప్తులం గావించి బ్రాహ్మణపరివేష్టితుండై ప్రతిగ్వాహిని యగు సరస్వతికిఁ బోయెను. అంతఁ బృథూదకమును బిందుసరమును త్రికూటమును సుదర్శనమును విశాలమును బ్రహ్మతీర్థమును జక్రమును బ్రాచిని సరస్వతిని యమునానదిని గంగానదిని ననుసరించి యున్న తీర్థములనును గ్రుంకి పిదప నైమిశమునకుఁ బోయెను. అచట ఋషులు సత్రయాగము చేయుచుండిరి. దీర్ఘకాలముగా సత్రము గావించుచున్న మునులట్లువచ్చిన యా బలరామునిఁ గాంచి యభినందించి విధ్యుక్తముగాఁ బ్రణమిల్లి లేచి యర్చించిరి. అతఁడు తనపరివారముతోఁ గూడ నర్చితుండై యాసనంబు గయికొని యట వ్యాసమహర్షి శిష్యుం డగు రోమహర్షణుఁ డాసీనుండై యుండఁగాంచెను. అట్లాసూతుండు ప్రతిలోమ జాతుం డయ్యుఁ దనకు లేచి యెదురుకొనకయుఁ బ్రణామమును నంజలియుఁ గావింపకయు నుండుటయే కాక యందున్న విప్రుల కంటెను నెత్తుగాఁ గూర్చుండియుండుటనుంజూచి బలరాముఁడు మిక్కిలి కోపంబుగొని 'ఈ ప్రతిలోమజాతుఁ డిందఱు విప్రుల

కును మఱియు ధర్మపాలకులమగు మాకును నెత్తుగాఁ గూర్చుం డుటయెట్లు ? ఈదుర్మతిని వధింపఁదగును. వీఁడు భగవంతుఁడగు వ్యాసమహార్షికి శిష్యుఁడై పెక్కు లితిహాసములను బురాణము లను ధర్మశాస్త్రముల నన్నింటిని బరిపూర్ణముగా నధిగ మించియు దాంతియు వినయమును లేక యూరక తన్నుఁ దాను బండితునిఁగాఁ దలఁచుకొనుచున్నాఁడు. ఇట్లు తెలిసియు మనస్సును గెలువకున్న వీని యీచదువంతయు నీచునకుం బోలె దోషమునకే కాని గుణమునకుఁ గావు. 'వీఁ డెట్లయినను నీకేమి ? యందురా' ధర్మాత్ములని పయికి వేషములు వేసికొను వారి నవశ్యము చంపి తీఱవలయును. అందులకే కిదా నే నీలో కమున నవతరించియున్న వాఁడను. ఏలందురా ? అట్టివారు మిక్కిలియుఁ బాపులు సుఁడీ' అనెను. అమ్మహాత్ముఁ డింతవట్టు సెప్పి యసత్పురుషులను వధించుటను మానియున్న వాఁడ య్యును నట్లు దప్పక జరుగవలసియున్న విధినిబట్టి సమర్థుఁడు గాన కుశాగ్రము గొని యా రోమహర్షుణునిఁ జేతనున్న యా కుశచేత బ్రేసిచంపెను. అంత నచటి మునులందఱును హాహా కారములు సేయుచు మనంబుల ఖేదంబు మల్లడింప బలభద్ర దేవునింజూచి 'ప్రభూ ! నీ వధర్మము గావించితివి. యదునందనా ! మే మీతనికి * బ్రహ్మాసనమును, మాసత్రము ముగియు నందాఁక దేహమునకు శ్రమములేకయుండునట్టి యాయువును నొసంగితిమి. ఇది తెలియక నీవు బ్రహ్మహత్యను బోనిపాపమును జేసితివే. నీవు యోగేశ్వరుండవు గాని కర్మవశ్యుండవు గామిచే

* పురాణవక్తయగు బ్రాహ్మణునకు నియ్యఁదగినదియుఁ బ్రత్యుత్థాన మొకరికిఁ జేయనక్కఱ లేనిదియూ నయినది బ్రహ్మాసన మనంబడును.

బ్రాహ్మణుని వధింపరాదనెడి యామ్నాయము (విధి) సయితము నీకు నియామకముగాదు. కాని లోకపావనా! ఈ బ్రహ్మహత్యకుఁ బ్రాయశ్చిత్తము ననుష్ఠింపుము. ఏలందువా? నీ వితరులు పురికొలుపక నీయంతటనే దాని నాచరించితివేని లోకసంగ్రహము గలుగును జుమీ. శ్రేష్ఠుఁ డాచరించినదే కదా తక్కిన లోకులు నాచరింతురు' అనిరి. అందులకు రాముఁడు 'నేను లోకముల ననుగ్రహించు నిమిత్తము వధమునకుఁ బ్రాయశ్చిత్తము నాచరించెదను. ఇందులకు ముఖ్యమయిన ప్రాయశ్చిత్త మేదియో యుపదేశింపుఁడు. ఈరోమహర్షణునకు దీర్ఘాయుష్యమును, బలమును, నింద్రియపాటవమును, మఱియు నింకేద్ది మీరు కోరుదురో దానిని జెప్పుఁడు. దీనినంతియు నా యోగైశ్వర్య శక్తిచే సాధించెదను' అనెను. ఋషులు—"రామా! కుశాగ్ర రూపం బగు నీ శస్త్రమునకును వీర్యమునకును నితని మృత్యువునకును మఱి 'మా సత్రము ముగియువఱకు దీర్ఘాయులై యుండు'మని మేమాడిన వచనమునకును సత్యత్వము గలుగునట్లు గావింపుము" అనిరి. రాముఁడు 'తానే పుత్రుఁడుగా పుట్టుచున్నాఁడని కదా వేదములు చెప్పెడిని.* కాఁబట్టి

* అఙ్గాదఙ్గాత్సంభవసి హృదయాదధిజాయసే। ఆత్మా వై పుత్రనామాసి స జీవశరదశ్శతమ్' ఇత్యాదులు వేదవచనము. పితయే పుత్రుఁడుగాఁ బుట్టునుగదా. రోమహర్షణుఁడు బ్రదుకమిచే తనయస్త్రమును అతనిమృత్యువును సత్యమగుటయు, అతఁడు తనపుత్రునిరూపమున ఆయువు మొదలయిన వానిని బడయుటచేత మునులవచనము సత్యమగుటయుఁ, గలిగించితినని భావము. రోమహర్షణుఁడే యతనిపుత్రుఁడుగాన పుత్రరూపమున నాయురాదు లతనికాయురాదులనియు తెలియునది.

యితని పుత్త్రుఁడు ఉగ్రశ్రవుఁడు మీకుఁ బురాణవక్తయగుఁగాక; వానికి నాయువు నింద్రియపాటవమును గలిగియుండుఁగాక. మునిశ్రేష్ఠులారా! మీ కేవిషయమునఁ గోరికగలదో దానిని జెప్పుఁడు. బుధులారా! పిదప బ్రహ్మదండమును గయికొని, తెలియక చేసిన నాకు, వేద శాస్త్రానుసారముగఁ బాప పరిహారమును నాలోచించి విధింపుఁడు' అనెను. అందులకు ఋషులు, 'ఇల్వలుని కొడుకుఁ బల్వలుఁడను నొక ఘోరదానవుఁడు పర్వపర్వమునను వచ్చి మాసత్త్రయాగమును జెఱుపుచున్నాఁడు. దాశార్హా! వాఁడు చీము నెత్తురులను మూత్రపురీషములను, సురామాంసములను గురియుచున్నాఁడు. నీ వా పాపాత్మునిఁ బొరిపుచ్చుము. దాశార్హా! అట్లు చేసిన మాకు గొప్పశుశ్రూషణము గావించుటయగును. పిదప మిక్కిలియు నహింసాది బ్రహ్మచర్యాదివ్రతయుక్తుఁడవై తీర్థములందుఁ గ్రుంకుచుఁ బండ్రెండు మాసములుభూమి ప్రదక్షిణముగాఁ దిరిగివచ్చితి వేని పరిశుద్ధుండవగుదువు' అనెను. ఇది డెబ్బదితొమ్మిదవయధ్యాయము.

—·—

## బలరాముని యిల్వలవధమును దీర్థయాత్రయు.

శుకుఁడు.-'అంతఁ బర్వదినము రాఁగాఁ బ్రచండమైన యొక భయంకర వాయువు ధూళిగురియుచు దుర్గంధముగొట్టుచు నలుగడల బిట్టు వీవసాగెను. అంత నా యజ్ఞశాలలయందు నమేధ్యమయంబగు వర్షమును నిల్వలుండు గురియించెను. వాఁడును శూలముదాల్చి చూపట్టెను. పెద్దదయిన కాయము గలిగి, విరిసిన కాటుకరాశివలె మిక్కిలియు నలుపై, కాఁచినరాగివలె నెఱ్ఱని వెండ్రుకలును మీసలును గడ్డమును దాల్చి వెనుఁ

గోటిలచేతను నుగ్రమయిన బొమముడిచేతను బెట్టిదమయిన బలు
మొగముతో వచ్చెను. వానినిగాంచి, రాముఁడు శత్రుసైన్యములను
విదలించు ముసలమును, దైత్యులనడంచి పుచ్చు హలమును,
దలంచుకొనెను. అవి తోడనే పొడకట్టి నిలిచెను. అంతరాముఁడు
నాఁగటికొనచేత నాకాశమునఁ జరించుచున్న యాపల్వలునిఁ
బట్టి తిగిచికొని, ముసలముతో నాబ్రాహ్మణద్రోహిని నెత్తి
మీఁద నడిచెను. వాఁడును నెత్తి తుత్తుమురై నెత్తురులు
గ్రక్కుచు, బిట్టుగా నార్తధ్వని గావించుచు గైరికధాతువులచే
నెఱ్ఱనగు పర్వతము వజ్రముచేతఁ గొట్టువడి పడునట్లు నేలం
గూలెను. మును లందులకు రాముని మిక్కిలియు స్తుతించి య
మోఘములయిన యాశీర్వాదము లొసంగి వృత్రునిఁజంపిన యిం
ద్రునికి దేవతలుంబోలె నమ్మహాభాగునికి స్నానముగావించిరి.
అంత వారతనికి సిరిదొలంకుచు నెప్పుడును వాఁడని తామరలు
గల వైజయంతి యనుమాలికను దివ్యములయిన రెండువస్త్ర
ములను, దివ్యములగు నాభరణములనును నొసంగిరి. అంత
వారలచేత ననుజ్ఞవడసి రాముండు బ్రాహ్మణులంగూడి కౌశికీ
నదికిఁబోయి యందుఁగ్రుంకి పిదప సరయువునది పుట్టిన సరో
వరమునకుఁ బోయెను. తర్వాత నాసరయువు గట్టువెంబడినే
ప్రయాగమునకుఁబోయి స్నానముచేసి దేవాదులకు సంతర్పణ
ములు గావించి పులహాశ్రమమునకుఁ బోయెను. పిదప గోమతి
యందును గండకియందును విపాశయందును గ్రుంకి శోణ
నదమందు స్నానముచేసి గయకుఁబోయి పితృతర్పణములు
విడిచి గంగాసాగరసంగమమునకుం జని మునుకలిడి మహేంద్ర
పర్వతమునఁ బరశురామునిఁగాంచి యభివాదనముచేసి సప్త

గోదావరిని వేణిని పంపానదిని భీమరధిని జలకమాడి, కుమార స్వామినిగాంచి యంత శివుని కాలయంబయిన శ్రీశైలమునకుం బోయెను. అంత నతఁడు ద్రవిడదేశమందు మహాపుణ్యంబయిన వేంకటాచలమును దర్శించి పిదపఁ గామకోటని, గాంచీపురిని, నదీలలామంబగు కావేరిని, హరి సన్నిహితుఁడయియుండు మహాపుణ్యక్షేత్రం బగు శ్రీరంగమును విష్ణుక్షేత్రమగు వన గిరిని, దక్షిణమధురను జూచుచుంబోయి మహాపాతకములను నాశము సేయునట్టి సముద్రసేతువును జేరెను. అచట నాహ లాయుధుఁడు బ్రాహ్మణులకుఁ బదివేలు ధేనువులు దానము చేసెను. అంతఁ గృతమాలమును దామ్రపర్ణిని గులపర్వ తంబగు మలయమును గాంచి యం దాసీనుండై యున్న యగ స్త్యునికి మ్రొక్కి నమస్కరించి యభివాదనముచేసి యతం డొసంగిన యాశీర్వచనములను గైకొని యనుజ్ఞనొంది దక్షిణ సముద్రమునకుఁ బోయెను. అచట నతఁడు కన్యాకుమారి యనెడు దుర్గాదేవిని దర్శించి యంత ననంతపురమును జేరి యుత్తమంబగు పంచాప్సరసమున విష్ణువు సన్నిహితంబై యుండు దాన మునిఁగి యందుఁ బదివేలగోవులను దానము చేసెను. అంత నమ్మహాత్ముఁడు కేరళమునకును శతన్తరకము నకును బిదప ధూర్జటి సన్నిహితుఁడయి యుండు గోకర్ణమనెడి శివక్షేత్రమునకుం జనెను. పిదప ద్వీపమునం దున్నయార్యా దేవినిగాంచి శూర్పారకమునకుఁబోయి తాపి, ప్రయోష్ణి,నిర్విం ధ్య లనుతీర్థములందుఁగ్రుంకి యంతదండకావనమును బ్రవేశించి నర్మదకుఁబోయెను. దానితీరమందు మాహిష్మతీపురము విల సిల్లును. పిదప మనుతీర్థమందు స్నానముచేసి మరలఁ బ్రభాస

తీర్థమునకు వచ్చెను. అట బ్రాహ్మణులు కౌరవపాండవయుద్ధమున సమస్తరాజులును హతులయిరని చెప్పుచుండఁగా విని భూమికి భారము తీసినదని తలంచెను. ఆయదునందనుఁడు భీమదుర్యోధనులు యుద్ధమున గదలంగొని పోరాడుచుండుటను వారించి వారి వినాశ ముడుపుటకు నచటికిఁబోయెను. యుధిష్ఠిరుఁడును నకులసహదేవులును కృష్ణార్జునులును నతనినిజూచి యభివాదనము చేసి 'ఇతఁ డేమిచెప్పఁగోరి యిటవచ్చినాఁ'డని సంశయించుచు నేమియుఁ బలుకకుండిరి. అతఁడా భీమదుర్యోధను లిరువురును సంరంభించి యొండొరులం గెలువంగోరి,గదాపాణులై విచిత్రములగు మండలములం దిరుగుచు నుండుటను గాంచి వారితో 'రాజా! దుర్యోధనా! వృకోదరా! మీరిరువురును సమానబలులగు వీరులరు. మీలో నొకఁడు బలమునం దెక్కుడనియు మఱియొకఁడు సాధనయం దెక్కుడనియు నాకుఁదోఁచుచున్నది. ఇట్లు మీరిరువురు సమానవీర్యులై యుండుట మీలో నెవనికేని విజయముగాని యది కాదేని యపజయముగాని కలుగునని చూపట్టదు. కనుక మీపోరు నిష్ఫలమే; కాన యుడుగుఁడు' అనెను. ఆరాజకుమారు లొకరినొకరాడిన దురుక్తులును నొండొరులకుఁ గావించిన దుష్కార్యములను దలంచుకొనుచుఁ బరస్పరము బద్ధవైరులై యుండుటంబట్టి యాబలుఁడు చెప్పినవాక్యమును గయికొన రయిరి. రాముఁడది దైవకృతమని తలంచుచు ద్వారవతికిఁబోయి సర్వసంపదల నింపుసొంపారుచున్న యుగ్రసేనాదులను జ్ఞాతులను గూడి యుండెను. అతఁడు మరల నైమిశమునకుఁ బోవఁగా, ఋషులు సకలవిరోధములు నివర్తించియున్న యాతనిచేఁ గ్రతువు నంగ

ములతోఁగూడఁ గ్రతువుల నన్నింటిని జేయించిరి. అంత నా భగవంతుఁడు బలుఁడు వారలకు విభుండుగాన విశుద్ధంబగు విజ్ఞానమును (అనఁగా నాధారభూతుండగు పరమాత్మయందు విశ్వమునుండుటయు) దాను విశ్వమంతయు వ్యాపించియుండుటయును నని సంశయాదిరహితంబగు జ్ఞానము నొసంగెను. అతఁడు పత్నింగూడి జ్ఞాతులగు బంధువులును సుహృదులును బరివేష్టించి యుండ నవభృథస్నానము గావించి మేలయిన వస్త్రములం దొడిఁగి చక్కఁగా నలంకృతుఁడై చంద్రుఁడు తనచంద్రికచేతనుంబోలెఁ బ్రకాశించెను. బలశాలియు ననంతుఁడును నప్రమేయుఁడును మాయామనుష్యుఁడు నగు నా బలుని కృత్యము లిటువంటి వనేకములు గలవు సుమీ! అనంతుఁడును నద్భుతకర్ముండు నగు రాముని కృత్యముల నెవ్వఁడు స్మరించునో వినునో, పలుకునో, వాఁడు విష్ణువునకు మిక్కిలి ప్రియుండగుచున్నాఁడు.' ఇది యెబ్బదితొమ్మిదవయధ్యాయము.

---

## సుచేలోపాఖ్యానము.

రాజు—ప్రభూ ! మహాత్మా ! అనంత వీర్యుండును మహాత్ముఁడునగు ముకుందుని వీర్యచరితములు మఱియు నేమేమి గలవో వానినెల్ల వినఁగోరుచున్నాను. బ్రాహ్మణోత్తమా ! విషయములంబడి త్రిమ్మరుచుండువాఁడై నను రసజ్ఞుఁడుగానుండు నేని, యీయుత్తమశ్లోకుని మేలికథల నొక్కమాటు విన్నయెడలఁ జాలునని యుడుగువాఁడెవఁడు? ఆయనంతుని గుణములను గీర్తించు వాక్కే వాక్కు. అతని కైంకర్యములు గావించు హస్తమే హస్తము. స్థావర జంగమములందు వసించు

చున్న యతనిని స్మరించు మనస్సేమనస్సు. అతని పుణ్యకథలను విను చెవియే చెవి. చరాచరములు రెండును శరీరముగాఁ గలయతనిని మ్రొక్కు శిరమే శిరము. అతనిఁ జూచుకన్ను లేకన్నులు. విష్ణుదేవునియు నతనిభక్తులయు పాదజలములను సేవించునట్టియంగము లేయంగము'లనెను. ఇట్లు పరీక్షిత్తడుగఁగా భగవంతుఁడా శుకుఁడు వాసుదేవుండగు భగవంతునియందు మనస్సు లయించినవాఁడయ్యెను. అతఁడు రాజుతో 'బ్రహ్మవిదులందు మిన్నయగు నొక బ్రాహ్మణుఁడు తొల్లి కృష్ణునకుఁ జెలికాఁడై యుండెను. అతనికంతరింద్రియ మగుమనస్సు ప్రశాంతమై బాహ్యేంద్రియములెల్ల జయింపఁబడియుండుటవలన విషయములం దెల్ల విరక్తి గలిగియుండెను. కాన యతఁడు దైవికముగా నేదిదొరకునో దానితోఁ గడుపుఁ బోషించుకొనుచు నుండెను. అతఁడు గృహస్థాశ్రమమున వర్తించుచుండెను. అతని పేరు కుచేలుఁడు. అతని భార్యయు నట్లె జితేంద్రియురాలై యుండెను గాన యేదిదొరకినను బతికివడ్డించి దానాఁకట మలమల మాఁడుచుండెను. ఇట్లాయమ, యాఁకటికిఁ దాళనోపక దారిద్ర్యమున స్రుక్కుచు వడఁకుచును, నోరెండుచుండ, నొకనాఁడు తనపతికడకుఁ బోయి యతనితో 'బ్రాహ్మణోత్తమా! దేవరకు నా హరికృష్ణుఁడే చెలికాఁడుగదా. అతఁడో శ్రియఃపతి; కాన, మన లేమిని బాపుటయతని కెంతపని. మఱి బ్రహ్మణ్యుఁడుగాన బ్రాహ్మణులరగు మీయం దాదరము తప్పక చూపఁగలఁడు. అతఁడు ధర్మార్థకామములనే కాక మోక్షమును గోరువారికిని శరణు చొరందగినవాఁడు. కాన నీకుఁ గేవల విత్తమే కాక నీకోరెడి ముక్తిని నొసంగఁగలఁడు. నీయభిప్రాయమెట్లు దెలియు ననవలదు. అతఁడు జ్ఞానశక్త్యాని

షాడ్గుణ్యపూర్ణుఁడు. పరత్వముచే నిన్నుఁ బొటింపఁడని తలఁప వలదు. నిరతిశయసౌశీల్యమునుబట్టి సాత్వతులకెల్ల మిన్న. అతని నొక్కనినే విశేషించి చెప్పనేల యందువా? అతఁడు మిముబోఁటి సాధువులకెల్లఁ బరమంబయిన ప్రాప్యముచుఁడీ! పొందినచో నేమియిచ్చు నందురా? కుటుంబభరముచే మిక్కిలియు సుడివడుచున్న మీకుఁ బుష్కలముగా ధనము నొసంగఁ గలఁడు. అతఁ డిప్పుడు శత్రువిజయార్థ మెక్కడకును బోలేదు. ద్వారవతియందే భోజవృష్ణ్యంధకుల కీశ్వరుం డయిన యాప్రభుఁడున్నాఁడు. కాఁబట్టి యతనికడకుఁ బొమ్ము. అతఁడుతనపాదకమలములను స్మరించిన వానికిఁ దన్నయిన నిచ్చును. ఇఁక నేదో యొకయర్థమును గోరి దూరమునుండి తన్ను భజింపవచ్చు వారికి నభీష్టములనెల్ల నాజగద్గురుఁ డిచ్చుననుటను జెప్పవలయునా' యనెను. ఇట్లు భార్య తన్ను మాటిమాటికిఁ బ్రార్థింపఁగా నాబ్రాహ్మణుఁడు మెత్తనివాఁడుగాన యియ్యకొని తనలో 'విత్తమేమియు దొరకకపోయినను, నాయుత్తమశ్లోకుని దర్శనము దొరకుచున్నది గదా! ఇదియేనాకుఁ బరమలాభము గదా' యని మనంబునఁ దలంచుకొనుచుఁ బోవుటకు నిశ్చయించుకొన్న వాఁడయ్యె. అతఁడు తనపత్నిం జూచి 'కల్యాణీ! మన యింటఁగానుక కేమేని యున్న యెడల నిమ్ము' అనెను. ఆయమయు, బ్రాహ్మణుల యిండ్లలో నడుకులను యాచించి నాలుగు పిడికెళ్లు దొరకఁగా వాని నొక చినిఁగిన చేలతునుకయందు ముడిచి కానుకగా భర్తకొసంగెను. ఆ బ్రాహ్మణోత్తముఁడు నాయడుకులనుగొని తనలోన 'కృష్ణుని సందర్శనమునా కెట్లుగలుగునో' యని చింతించుచు ద్వారకాపురమునకుఁ బోయెను.

అతఁ డట్లుపోయి ద్వారవతిం జేరి కావలి సేనలున్న మూఁడు గుల్మములను గడచి మూఁడు కక్ష్యలనుదాఁటి యంతఁ గృష్ణు నివలె సంపత్తు మొదలగు గుణములచే వఱలుచున్న యంధకులయు వృష్ణులయు గృహములనడుమ బెడఁగారుచున్న పదాఱువేల కృష్ణుని పత్నుల గృహములను దఱిసి, యందును మిక్కిలి సిరి దొలఁకుచున్న యొకగృహమును, బ్రహ్మానందంబగు మోక్షసుఖము నొందినవాఁడు వైకుంఠమునుం బోలె, బ్రవే శించెను. అపుడు కృష్ణుఁడు, రుక్మిణి దేవితోఁగూడఁ బర్యం కముపై నుండెను. అతఁ డతనిని దూరమునఁగాంచి దిగ్గనలేచి యెదురవచ్చి రెండుచేతులు సాఁచి ముదంబుపొదల నతనిని బిగియఁ గౌఁగిలించికొనెను. తనకు గారాబుచెలికాఁ డయిన యీ బ్రాహ్మణబుషి యంగసంగము వలన మిక్కిలియుఁ జొక్కి యెంతయు సంతోషముప్పొంగ నా జలజాతేక్షణుఁడు, కన్నుల నుండి యానందబిందువులను గార్చెను. అంత నతనిని బర్యంకముపయి తానే యాసీనుంజేసి, తానే కానుకలు దెచ్చి సమర్పించి యతని పాదములంగడిగి యాపాదజలములను శిర సుపయిని లోకపావనుం డాభగవంతుఁడు దాల్చెను. పిదపఁ జందనమును పగురువును గుంకుమను గూర్చి మెదిచిన దివ్య గంధము నతనికి నలంది, గమగమ వాసనలు బుగులుకొను ధూపములొసఁగి, దీపముల నివాళించి, బలులను, మఱియుఁ దక్కిన పూజాసాధనములను నర్పించి,గోవును తాంబూలమును నివేదించి యంత స్వాగతం బడిగెను. దేహమంతయు మురికి గ్రమ్మి, చిక్కియు స్రుక్కియు బీఱనరములు పయికి నెరసి బెరసి యున్న యాకుచేలునికి, రుక్మిణీదేవి చామరఁబుచ్చుకొని వీచుచుఁ

దక్కుంగల పరిచర్యలు గావించుచు నుండెను. అట్లు నిర్మలకీర్తి యగు కృష్ణునిచేత నా యవధూత యతిప్రీతితోడఁ బూజితుం డగుటను జూచి, యంతఃపురమునం గలవారందఱును మిక్కిలి విస్మితులై 'వీఁడో యొకభిక్షుఁడు, అవధూత, సంపదమాలిన వాఁడు; కాన లోకమునం దెల్లవారికి నిందితుఁడును నధముఁడు నైనవాఁడు. ఇట్టివాఁడెక్కడ ! ముల్లోకములకు గురుండును లక్ష్మికి నివాసభూతుండు నగు కృష్ణుఁడెక్కడ ? అతఁడు తనతోడ మంచమునందున్న లక్ష్మిని సయితము విడిచి, వీనిని దనయన్ననుం బోలెఁ గాఁగిలించి కొన్నాఁడే ! ఇతఁ డెట్టిపుణ్యము చేసెనో కదా' యని గుజగుజలు వోయిరి. అంత నాయిరువురును దొల్లి తాము గురువునింట వాసము చేయునపుడు గావించిన యా ముద్దుముచ్చటలనెల్ల నొకరికే లొకరు పట్టుకొని యిట్లు చెప్పుకొనసాగిరి. భగవంతుఁడు—'బ్రాహ్మణోత్తమా ! నీవు గురువునకు దక్షిణ నొసంగి * సమావర్తన కర్మముం గావించుకొని విడిచి వచ్చినపిదప ధర్మములం దెలిసినవాఁడవు గావున నీకుఁదగిన భార్యను గ్రొత్తగాఁ బెండ్లియాడితివా ? ప్రాయికముగా నీచిత్తము గృహధర్మములం దున్నను గామములచేతఁ గొట్టువడకయే యుండును. నీవు విద్వాంసుఁడవు గాన ధనములందును నీకంతగాఁ బ్రీతి లేదు. ఇది నాకుఁ దెలియును జుమీ. కొందఱు మనంబులు కామములచేతఁ గొట్టువడని వారై విష్ణుసంబంధియగు మాయనుండి—అనఁగా ననాది ప్రవృత్తమగు ప్రకృతి సంబంధములనుండి—విడివడుతలంపున బ్రహ్మ

* సమావర్తన మనఁగా వేదములను సాంగముగాను సశిరస్కముగాను నధ్యయనము చేసినపిదపఁ గావించుకొను కర్మమునకు సమావర్తనమని పేరు.

విద్యకు సంగముగా నిత్య నైమిత్తికాదులగు కర్మములను లోకసంగ్రహమును బట్టి నేనెట్లు చేయుదునో యట్లె యాచరింతురు; కాని విషయాభిలాషనుబట్టి కాదు. బ్రాహ్మణోత్తమా! మనము గురుకులమునందు వసించియుంటమే దానిని దలంచుకొందువా ? ఆగురుకులవాసమువలననేకదా ద్విజుఁడు తెలిసికొనవలసినదానిని (స్వపర యాథాత్మ్యమును) దెలిసికొని యజ్ఞానముతుది నందుచున్నాఁడు. ఆ గురుకులవాసమేకదా ద్విజాతులకు వలయు సత్కర్మములనెల్ల నింపనుష్ఠించుటకు హేతుభూతమయిన జ్ఞానము గలిగించుచున్నది. ఆ గురుకులమొక యాశ్రమమగును. అం దుండువారికి నాద్యుండగు నేనుంబోలె గురుఁడు,జ్ఞానప్రదుం డగుచున్నాఁడు. బ్రాహ్మణోత్తమా! ఈలోకమందు సమస్తములయిన వర్ణములయందును నాశ్రమములయందును, నెవరు గురురూపమున నున్న నాయుపదేశ మాత్రముచేత సుఖముగా సంసార మహార్ణవమును దరింతురో వారే పురుషార్థకోవిదులు సుమీ. సర్వభూతాత్ముండ నగు నేను గురుశుశ్రూషచేతఁ దుష్టినొందునట్లు పంచమహాయజ్ఞములచేతను, మంచి జాతిచేతను తపముచేతను శమముచేతను గాని దుష్టినొందను సుమీ. బ్రాహ్మణోత్తమా! మనము గురువునింట వసించియుండఁగా గురువుభార్య యొకనాఁడు మనలను గట్టెలు దెమ్మని పంపినది తలంతువా ? అప్పు డకాలముగానున్నను మనమిరువురమును మిక్కిలియుఁ బెద్దదియైన యొకమహారణ్యమును జొచ్చితిమి. అప్పుడు తీవ్రముగా గాలివానవచ్చెను. ఉఱుములు కట్టిదముగా నుఱిమినవి. ప్రొద్దును గ్రుంకెను. దిక్కులెల్లను జిమ్మచీఁకటి ముంచుకొనెను. అంతయును జలమయం బగుటచే నిది

మిట్టపల్లమని తెలియ నలవిగాకుండెను. అట్లు జల మెల్లెడలఁ బ్రవాహమై పర్వియుండఁగా మనము బిట్టుగాలిచేతను జలముల చేతను నచట మిక్కిలియుఁ బీడితులమై దిక్కులు తెలియక యొండొరుల చేతులు పట్టుకొని యాతురులమై కట్టియలు మోపు మోచికొనుచు నావనమందుఁ బరిభ్రమించితిమే. ఇది యంతయుఁ దెలిసి మనగురువు సాందీపని సూర్యుఁ డుదయించిన పిదప శిష్యులమగు మనలను నాచార్యుండుగాన నలుగడల వెదకుచువచ్చి మనమాతురులమై యుండుటను జూడలేకానిఅట్లుచూచి యతఁడు 'ఔరా! నాపుత్రకులారా! ప్రాణులకెల్ల నాత్మ మిక్కిలియుఁ బ్రియమైనది. మీరు దానినిగూడఁ బాటింపక నాయందే తాత్పర్యముచూపి నాకొఱకిట్లు మిక్కిలియు దుఃఖితులయితిరి. పరిశుద్ధభావముతో సర్వవిధముల గురువునకు నాత్మసమర్పణముచేయుట యనునిదియె మంచిశిష్యులు గురువునకుఁ జేయవలసిన ప్రత్యుపకారము. ద్విజోత్తములారా! నేను మీవలన మిక్కిలియు సంతసిల్లితిని. మీకోర్కులన్నియు సఫలములగుఁ గాక! మీరు నావలనఁ గఱచిన వేదములెల్ల మీకిహమందును బరమందును సత్తువచెడక సార్థకములగుఁ గాక' యనెనుగదా. ఇట్టివి యనేకములు మనము గురుగృహమునందుండఁగాఁ జేసినవి నీకుఁ దలంపునకు వచ్చునా? గురువు ననుగ్రహముచేతఁ బూర్ణుఁడయిననే పురుషుఁడు, ముక్తికి నర్హుఁడగుచున్నాఁడు' అనెను.

బ్రాహ్మణుఁడు—దేవదేవా! జగద్గురూ! సత్యకాముఁడగు నీతోఁగూడ గురుగృహమున వాసముగలిగినట్టి మాకు నేది యొడఁగూడినవి గాకుండును? అన్నియు నొడఁగూడినవే. వేద

మయంబగు బ్రహ్మ మెవ్వని దేహమో పురుషార్థములకెల్ల నెవ్వఁడుపుట్టుచోటో యట్టినీవు గురుకులమందు వాసముచేయుట పెద్దయు వేడబముగదే' యనెను. ఇది యెనుబదియవయధ్యాయము.

---

## కుచేలోపాఖ్యానము.

### అనుబంధము.

శ్రీశుకుఁడు—ఇట్లా హరి యా బ్రాహ్మణోత్తమునితో ముచ్చటలు చెప్పికొనుచు సమస్తభూతముల మనోవ్యాపారములను దెలిసినవాఁడుగాన చిఱునవ్వు నవ్వుచు నాతనితో 'బ్రాహ్మణోత్తమా! నీవు నాకుఁ గానుకయేమి నీయింటనుండి తెచ్చితివి? భక్తులు నాకుఁ దెచ్చియిచ్చు కానుక యణువంత యైనను బ్రేమంజేసి నాకది మిక్కిలియే యగును. కానుక యిచ్చినది మిక్కిలియేయైనను, అభక్తులు తెచ్చియిచ్చినదేని, యది నాకు సంతోషము గలిగింపఁజాలదు. పత్రముగాని పుష్పముగాని ఫలముగాని తోయముగాని పరిశుద్ధాత్ముఁ డెవఁడేని నాకు భక్తిపూర్వకముగాఁ దెచ్చి కానుక యొసంగెనేని, నే ననుభవించుచున్నాను' అనెను. ఇట్లు కృష్ణుం డడుగఁగా, నా బ్రాహ్మణుఁడు మిక్కిలియు సిగ్గునొంది తలవాంచి యాలక్ష్మీనాథునకు దాను దెచ్చిన చేరెఁ డడుకులను నొసంగినవాఁడు గాఁడయ్యె. ఆకృష్ణుఁడు సర్వభూతముల యాత్మను దర్శించునట్టివాఁడును సర్వసాక్షియు నగుటంజేసి యతఁడు వచ్చినందులకుఁ గారణమును బరిశీలించి తెలిసికొని తనలో 'వీఁడు తొల్లి లక్ష్మీకాముఁడై నన్ను భజింపకుండెను. పతివ్రత



2247. కుచేలుఁడు తెచ్చిన యడుకులను శ్రీకృష్ణుఁ డారగించుట రుక్మిణీదేవి మిక్కిలి వలదని వారించుట.

యగు తన యిల్లాలికిఁ బ్రియముసేయంగోరి నాచెలికాఁడయిన యితఁడిట వచ్చినందున నితనికి నేను మనుష్యులకుఁ బడయరాని సంపదల నొసంగెదను' అని యిట్లు చింతించి యాభగవంతుఁ డాబ్రాహ్మణుని చింపితునియలఁగట్టియున్న యడుకులను 'ఏమిది?' యనుచుఁ దానె పట్టి చేకొనెను. అట్లుచేకొని కుచేలునితో 'చెలీ!ఇదినాకుఁ గానుకగాఁ దెచ్చినదిగదా!నామదికెంతో సంతోషము గూర్చుచున్నది. నెచ్చెలీ ! ఈ యడుకులు విశ్వ శరీరకుండగు నాకుఁ దృప్తిగావించుచున్నవి' యనుచు నాయడుకులందొక పిడికెఁడు గొని భక్షించి రెండవపిడికెఁడు గయికొనెను. కాని యంతలో లక్ష్మియగు రుక్మిణి త్వరపడి యాపరమపురుషుని హస్తమును బట్టుకొనివలదని వారించుచు నతనితో 'పుణ్యాత్మా! ఈయొకపిడికెఁడుగొన్నమాత్రనే పురుషునికి నిహమందుఁ గాని పరమందుఁగాని నీకెంతయు సంతసముగలుగునట్లుగా సకలములయినసంపదల పెంపుసొంపారుటకుఁజాలు' ననెను. బ్రాహ్మణుఁ డారేయి కృష్ణుని మందిరమున వసించియుండి సుఖముగా భుజించియుఁ బానీయయులు ద్రావియుఁ దన్ను స్వర్గమందున్నవానింబోలెఁ దలఁచెను. మఱునాఁడు తెల్లవాఱఁగాఁ గుచేలుఁ నిచెలికాఁడయిన యావిశ్వభావనుఁడు కృష్ణుఁడభినందించి యతనితోఁగూడఁ గొంతవఱకు వెంటవచ్చి వందనముచేసి వీఁడుకొలుపఁగా నతఁడు స్వగృహమునకుఁ బోయెను. ఆబ్రాహ్మణుఁడు తన చెలికానివలన ధనమును బడయక పోయెను. మఱి కార్పణ్యముచేత లజ్జితుండై తనంతటయాచింపను యాచింపఁడయ్యె. అయినను మహానీయుండగు భగవంతుని దర్శింపఁ గలిగినంత మాత్రకే యూఱటనొంది తన నెలవునకుఁబోయెను. అతఁడు

తనలో 'బ్రహ్మణ్య దేవుండగు కృష్ణుఁడు బ్రహ్మకులమం దెంత సాధువై యున్నాఁడో చూచినవాఁడనయితిని. కాకేమి; లక్ష్మినే వక్షమునందుఁ దాల్చియుండునట్టి దిట్ట దరిద్రతముఁడగు నన్ను బిగ్గఁ గౌఁగిలించుకొనెనే! ఔరా! ఆతని బ్రహ్మణ్యత నేమందును! నిఱుపేదను, మఱి మిక్కిలి పాపిని. ఇట్టినే నెక్కడ? శ్రీనివాసుండగు కృష్ణుఁడెక్కడ? అయినను నన్ను బ్రహ్మబంధుఁడని తలఁచి రెండుచేతులఁ గౌఁగిలించుకొన్నాఁడు. ఇంతమాత్రమా! తన ప్రియురాలు రుక్మిణి యున్నమంచము పయిని నన్నుఁ దనయన్నదమ్ములంబోలెఁ గూర్చుండఁబెట్టినాఁడే! మఱి పయనముచే బడలియున్న నాకాతని పట్టమహిషి, చేత వింజామరఁగొని వీచినది! ఇంతటితోఁ బోక యాభగవంతుఁడు తాను దేవతలకు దేవుండయ్యును, విప్రులకు దేవుండయ్యును, నన్ను దేవునివలెఁగొని యడుగులు పిసుకుట మొదలుగా నత్యంతంబగు బగు శుశ్రూషగావించి దేవునింబోలెఁ బూజించెఁగదే! పాతాలమందును భూతలమునందును గలసకలము లయినసంపదలకును నణిమాదులగు సిద్ధులకును స్వర్గమోక్షములకునుఁ గారణ మాభగవంతుని చరణార్చనమే, కాని వేఱొండుగాదు. అయిన నాభగవంతుఁడు కారుణికుండు గావున నిఱుపేదయగు ననుబోఁటివాఁడు ధనమును బడసినచో మీఁదు మిక్కిలి మత్తిల్లి విఱ్ఱవీఁగుచుఁ దన్ను స్మరింపఁడని తలఁచి నాకు నవ్వారిగాధనము లొసఁగఁడయ్యె'నని యిట్లాభగవంతునిగుణముల ననుచింతనము సేయుచు నుప్పొంగుచుఁబోయి తనగృహముదాపుచేరెను. అయిన నచటఁ దన మునుపటిగుడిసె లేదు. మఱి సూర్యచంద్రాగ్నులంబోలెఁ దేజరిల్లుచున్న విమానములు నలుగడల నావరించి

యుండెను. మఱియునందుఁ గొలకొలమని కూయుచున్న పులుఁ
గులు మెలుఁగులచేఁ జప్పుడు గొనుచుండు విచిత్రములగు నుప
వనములును నుద్యానములును, వానియందు విరిసియున్న కలు
వలు దామరలు చెంగలువలు నల్లగలువలు మొదలగునవి దుల
కించు కొలఁకుల జలములును, జెలువుచూపుచుండెను. మఱి
యందుఁ బురుషులును లేడి బెళుకుంగన్నుఁగవలఁ దళుకొత్తు
పడఁతులును జక్కఁగా నలంకృతులై వెలయుచుండిరి. వానిని
జూచి కుచేలుఁడు 'ఇదియేమి? ఎవ్వని చోటు? అట్టినాపట్టు దా
నిట్టిది యెట్లయ్యె?' యని యిట్లేమేమొ తలపోయుచుండఁగా
నపుడు దేవతలుంబోలెఁ దేజరిల్లుచున్న బురుషులును స్త్రీలును,
గీతములును వాద్యములును మిక్కిలిబోరుకొన నతనిని రాఁబట్టు
కొనిరి. ఆతని యిల్లాలు దనపతివచ్చెనని విని ప్రీతియును నుబ్బును
బొంగార సంబరమున లక్ష్మి తామరయింటనుండి వెడలునట్లు
గృహమునుండి వేగ వెడలివచ్చెను. ఆపతివ్రత తనపతినిజూచి
మక్కువపిక్కటిల్లుటంజేసి యుత్కంఠదీపింపఁ, గన్నుల నానం
దాశ్రులు చిప్పిలఁ గన్నుంగవ మొగిచి, బుద్ధిచేత నతనికి మ్రొక్కి
మనంబునఁ గౌఁగిలించుకొనెను. అతఁడు తనపత్ని బంగరుకా
సులదండలు మెడలం దాల్చియున్న దాసికలనడుమ వెలుంగుచు
విమానమునందున్న దేవతాస్త్రీయుంబోలెఁ దేజరిల్లుచుండుటను
జూచి యెంతయు విస్మయమునొందినవాఁ డయ్యె. అతండును
బ్రీతుండై యాపూవుంబోఁడినిగూడి నిజమందిరమును బ్రవేశిం
చెను. అది నూఱు మణిస్తంభములతోఁ గూడి మహేంద్రుని
మందిరమువలె నందము గులుకుచుండెను. అందలిశయ్యలు,
పాలనురుఁగుంబోలెఁ గడుఁదెల్లనై యుల్లసిలుచుండెను. దంత

ముచేతను బంగారుచేతను జేయంబడిన పరికరములతో నందలి పర్యంకములు వెలయుచుండెను. అందలి చామరలను వీవనలును బంగారుకాఁడల బెడఁగారుచుండెను. అందుఁగల యాసనములు బంగారుమయములై మెత్తని పఱుపులుగలిగి యుండెను. మేలుకట్లు ముత్తెపుదండల జాలరులుగలిగి మిక్కిలి కాంతి గులుకుచుండెను. అచ్ఛములయిన పటికపుఱాలచేతను బెద్దపచ్చలచేతను రచితములయిన గోడలయందు వెలుంగుచున్న రత్నదీపములను నందు మెలఁగుచున్న లలనారత్నములను గాంచి మఱి యందు సమస్తసంపదలసమృద్ధులనుం జూచి మనంబు చలింపక తన కట్లాకస్మికముగాఁ గలిగిన సిరిపెంపును గూర్చి యిట్లని తనలో వితర్కించెను 'నేనో యీజన్మమున దరిద్రుఁడను. ఇప్పుడే కాదు; మఱి యెప్పటికిని జన్మాంతరమునను నిర్భాగ్యుఁడను. ఇట్టి నాకు నిట్టి పెంపుసొంపు గలుగుటకు హేతువు మహావిభూతి యగునాయదూత్తముని దర్శనము చేతనే కాక మఱొక్కటిచే నలవడుట యెంతమాత్రమును బొసఁగ నేరదు. ఆ భగవంతుఁడు బహుభోగయుక్తుండు; కాన తన్ను యాచించువానికి బహుభాగ్యములనయినను, * దా నిచ్చుటను జెప్పకయె, వాని మఱుఁగుననే, యిచ్చుచున్నాఁడు. ఎట్లనఁ బర్జన్యుఁ డొకప్పుడు మిక్కిలి వానగురిసినను వానిని గొంచెముగానే తలంచుచు నందఱును బరుండియుండఁగా రాత్రియందు నుఱుమక వారిమఱుఁగుననే వర్షించుచున్నాఁడు. అట్లె దాశా

* స్వభోగముతోఁ బోల్చిచూడఁగా బ్రహ్మ భోగమును మిక్కిలితక్కువ యగుటం జేసి యాచకున కిచ్చుట యతితుచ్ఛమే యగునని తలఁచి లజ్జపడి యెదుట నియ్యఁడని భావము.

ర్థులకెల్ల మిన్నయగు నితఁడును సేవకు లర్పించునది యల్పమై
నను గొప్పగానే తలంచుచుఁ గోరినవానికిఁ గోరిన యర్థములను
మఱుఁగుననే కురియుచున్నాఁడు. మఱియు నాభగవంతుఁడు
దానిచ్చిన నైశ్వర్యము మిక్కిలి గొప్పదయ్యును, దానిని
మిక్కిలి యల్పముగా నెంచుచున్నాఁడు. భక్తుఁడు తనకు సమ
ర్పించినది యల్పమైనను దానిని బెద్దసేయుచున్నాఁడు. కాకేమి!
నేను గానుకదెచ్చిన యడుకులను నొక్క పిడికెఁడును నమ్మహా
త్ముండు ప్రీతి గడలుకొనఁ బ్రతిగ్రహించినాఁడే! నాకు భగ
వంతునియందే మేలుగోరు సౌహార్దమును, బ్రియత్వమును,
చెలిమియు, దాస్యమును, జన్మజన్మమునను గలుగుఁగాక;
విభూతివలదు. మఱియు ననంతకల్యాణగుణాశ్రయుండును
మహానుభావుండు నగు భగవంతునితోడ మిక్కిలియుఁ గూడిక
నొందిన నాకు నతనిభక్తులతోడను మిక్కిలియు మేలయిన
సంగముగలుగును. నేను భక్తుఁడనేని నాకైశ్వర్యము నొసఁ
గుట మిక్కిలి చిత్రము. నేను భక్తుఁడనుగాను గాఁబోలు.
ఏలనఁగా నజుం డాభగవంతుఁడు భక్తుఁడగువానికి * సంపద
యును రాజ్యమును విభూతియును బెంపనే పెంపఁడు.ధనవంతు
లకు మదమును బుట్టించునది నైశ్వర్యము.అది నరకమునఁ బడఁ
ద్రోయునది. కాన యది యవివేకమును గలిగించునని తెలిసి
విచక్షణుఁడగుటచే దానిని వారికి సమర్పింపఁడు. కాఁబట్టి నేను
భక్తుఁడనుగానేమో. భక్తికై ప్రార్థించెద' నని తలంచెను.
ఇట్లతఁడు వివేకాత్మకంబగు బుద్ధిచే నిశ్చయించుకొని మిక్కి

---

* సంపద యనఁగా భోగ్యభోగోపకరణభోగస్థానాదిసమృద్ధులు. విభూతులు పుత్త్రపశువిత్తాది సమృద్ధులు.

లియు భగవంతునియందు భక్తియుక్తుఁడై విషయములను మెల్లమెల్ల దిగవిడువ నలవాటుసేయుచును వానియం దంతగాఁ దగులువడక వానిని భార్యం గూడి యనుభవించినవాఁ డయ్యె. ప్రభూ! యజ్ఞనిర్వాహకుండును బ్రహ్మాదిదేవతలకును దేవుండును నగు హరికిఁ బుట్టినియు దైవమును బ్రాహ్మణులే. ఆబ్రాహ్మణుల కంటె వేఱొక దైవ మతనికిఁ గలుగదు. ఇతరులకు జయింప రానివాఁ డయ్యును దనభృత్యులచేత జయింపఁబడి వారికి లోనైయుండు నాభగవంతుని, మిక్కిలియు నతని సుహృదుం డయిన యాబ్రాహ్మణుఁడు దర్శించి యాపరమాత్ముని ధ్యానించుటవలనఁ దన సంసారబంధనము వీడినవాఁడై యాధ్యానమున కంగములుగా ననుష్ఠితములైన మహాయజ్ఞాద్యనుష్ఠానములచేత ముక్తులకుఁ బ్రాప్యంబగు నాభగవంతుని వైకుంఠధామమును బొందినవాఁ డయ్యెను. బ్రహ్మణ్యదేవుం డయినభగవంతుని యీబ్రహ్మణ్యతను విని భక్తిని లభించినట్టివాఁడు ప్రాచీనకర్మరూపములగు బంధములనుండి విడివడుచున్నాఁడు. ఇది యెనుబదియొకండవయధ్యాయము.

---

## సూర్యోపరాగమునఁ గురుక్షేత్రమునకు శ్రీకృష్ణాదులు పోవుట.

రామకృష్ణులు ద్వారకయందు వసించుచుండఁగా నంత నొకనాఁడు సూర్యగ్రహణము కల్పాంతమునందుం బోలె మిక్కిలియుఁ బెద్దదిగాఁ గలిగెను. శిష్టులగువారు దానిని మును పె జ్యోతిర్విదులవలనఁ దెలిసికొని యందఱును బుణ్యమునుగడింపఁ గోరి స్యమంతపంచక మనుకురుక్షేత్రమునకుఁ బోయిరి. శస్త్ర

ధారులయందు మిన్నయగు పరశురాముఁడు భూతలమునందు క్షత్రియుఁ డొక్కఁడును లేకుండునట్లుచేయుచు నందు రాజుల నెత్తుటి వెల్లువలచేతఁ బెద్దమడుఁగులు గావించెను. అందు భగవంతుఁ డాపరశురాముఁడు నృపవధకర్మముచేత స్పృశింపఁబడని వాఁడయ్యును లోకులకు శిష్టాచారమునుబట్టి యిచ్చుకొఱకును మఱియుఁ దెలియని యితరులపాపములను బోఁకార్చుకొఱకును నాక్షేత్రమందు యాగముచేసెను. కనుక నట్టిపుణ్యక్షేత్రమున కందఱు నరిగిరి. ఆ తీర్థయాత్ర మిక్కిలియుఁ బుణ్యావహమైనది గనుక భరతవర్షమునం గలవారందఱును బ్రజలును నచ్చటికిం బోయిరి. అట్లు వృష్ణులును నక్రూర వసుదేవులును నాహుకుఁడు మొదలగువారును బోయిరి. మఱియు గదుఁడును బ్రద్యుమ్నుఁడును సాంబుఁడును సుచంద్రుఁడును శుకసారణులును గూడి తమతమ పాపముల నపనయించుకొఱకు నాక్షేత్రమునకుఁ బోయిరి. అనిరుద్ధుఁడును యూథపతి యగు కృతవర్మయుఁ బురరక్షకై ద్వారకయందే యుండిరి. వారు దేవభవనములుంబోని రథములతోను దరంగములవలెఁ బరుగులువారు హయములతోను, మేఘములుంబోలెఁ బొడకట్టుచు ఘీంకారములు సేయుచున్న గజములతోను, విద్యాధరులవలెఁ గాంతి దళుకొత్తుచున్న మనుజులతోను, వెడలిపోయిరి. ఆమహాభాగులు బంగారుమాలికలు దొడిగి, దివ్యదామములను దివ్యవస్త్రములనుగట్టి దివ్యకవచములను దాల్చి కళత్రములంగూడి దేవతలుంబోలె మార్గమునందుఁ దేజరిల్లిరి. అమ్మహాభాగులందఱు నచ్చట స్నానములుగావించి మిక్కిలి సమాహితులై యుపవసించి బ్రాహ్మణులకు వస్త్రములను, మాల్యములను,

బంగారుదండలును గట్టఁబడినధేనువుల నొసంగిరి. వృష్ణులు రామహ్రదమునందు మరల విధ్యుక్తప్రకారమునఁ గ్రుంకులిడి 'కృష్ణునియందు మాకు భక్తి కలిగి యుండుఁగాక' యని కోరుచు బ్రాహ్మణోత్తములకు స్వర్ణమును దానముచేసిరి. మఱియు వృష్ణులు కృష్ణుఁడే దేవతగాఁ గలవారై యతని యనుజ్ఞచేత భోజనములుచేసి యంత దట్టంపునీడలుగల చెట్లక్రింద నిచ్చలు కూర్చుండిరి. వారచ్చటికిఁ దమకుసుహృదులును సంబంధులునగు రాజులు మత్స్యకేకయ కోసల విదర్భ కురుసృంజయులును, కాంభోజకేకయులును, మద్రకుంతులును, ఆనర్తకేరళరాజులును, మఱి తమపక్షమువారైన యితరులును నితరపక్షమువారలును వందలకొలఁదిని రాఁగాఁ జూచిరి. మఱియుసుహృదులయిన నందాదిగోపకులను, చిరకాలముగా నుత్కంఠితలై యున్న గోపికలను నచ్చటఁ గాంచిరి. ఇట్లాపురుషులందఱును, నొకరినొకరు చూచుటవలన నుబ్బు నిబ్బరము కాఁగా నుల్లంబు లుల్లసిల్ల ముఖారవిందములు సిరినోలంకుచు విలసిల్ల నొండొరుల బిగియఁ గాఁగిలించికొనిఁ గన్నుంగవలఁ గన్నీరుచిప్పిల్ల, మేను గగురుపొడువ, డగ్గుత్తికవడి పలుకనేరక మిక్కిలియు ముదంబునఁ దేలుచుండిరి. పడఁతులును నొండొరులంగాంచి మిక్కిలి నెయ్యము తియ్యముపొంగారఁ జిఱునవ్వులు నివ్వటిల్ల నమలంబులగు కడకంటిచూడ్కులు నిగుడఁ గుంకుమపూఁతలఁ గొమరారు గుబ్బలొండొంటి బిట్టుదాఁకఁ బ్రణయంబునఁ గన్నుంగవల నీరు దొరుఁగుచుండ రెండుచేతుల బిగియఁ గాఁగిలించుకొనిరి. అంత నాయదువులును మత్స్యాదు లగురాజులును దమకుఁ బెద్దలగువారికి నభివందనములు గావించి పిన్నవారివలన మొ

క్కలుగయికొని కుశలంబడిగి యంత నందఱుఁగూడి యాయా ముచ్చట లాడుచుండిరి. కుంతియుఁ దన యన్నదమ్ములను జెలియండ్రను, వారి పుత్రులను దండ్రులను వదిన మఱఁదండ్రను, ముకుందునిఁగాంచి పరస్పరము ముచ్చటలాడుటవలన శోకములనెల్ల దిగవిడిచినదయ్యె. కుంతి వసుదేవునితో 'అన్నా! నాకు మనోరథము లీడేఱనట్టె నేను దలంచుకొన్నాను. ఏలందువా? సత్తములారా! నా కాపదలు వచ్చినపుడు నామాటను సయితము మనంబునఁ దలఁపరు గదా! ఎవనికి దైవము ప్రతికూలముగా నుండునో వానిని దమ కెంత సొంతముగానుండినను, సుహృదులుగాని, జ్ఞాతులుగాని, పుత్రులుగాని, భ్రాతలుగాని, పితరులుగాని, వదినలు మఱఁదండ్లుగాని, మనస్సునఁ దలంచుకొనరుగదే' యనెను. వసుదేవుఁడు 'అమ్మా! మనుష్యులెల్ల దైవమున కాటబొమ్మ లగుదురుచుమీ. అట్టి మమ్మునుగూర్చి యసూయపడవలదు. ఏలందువా? ఈశ్వరుఁడు జనులను దనకు వశముచేసికొని తానుగోరినట్లు పనులు చేయించుచున్నాఁడు. కాన యొక్కఁడును దనంతట నొక్కటియుఁ జేయుట గలుగదు. కంసునివలన మిక్కిలియుఁ దుందుడుకువడి మే మందఱమును దిక్కుదిక్కునకుఁ బాఱిపోయి యుంటిమి. చెల్లెలా! ఇప్పుడేచుమీ మా యెప్పటినెలవులను దైవము పొందింపఁగా వచ్చి చేరితిమి' అనెను. శ్రీకృష్ణుఁడు నుగ్రసేనుఁడు మొదలగు యాదవులచేత నర్చితులై యారాజు లచ్యుతుని సందర్శనమువలని పరమానందముచేత నెంతయుఁ జొక్కినవారయిరి. భీష్ముఁడును, ద్రోణుఁడును, ధృతరాష్ట్రుఁడును, గాంధారియు, నాయమపుత్రులును, బాండవులును, వారి భార్యలును,

గుంతియు, సంజయుఁడును, విదురుఁడును, కృపుఁడును, కుంతిభోజుఁడును, విరాటుఁడును, భీష్మకుఁడును, నగ్నజిత్తును, పురుజిత్తును, ద్రుపదుఁడును, శల్యుఁడును, ధృష్టకేతుఁడును, కాశిరాజును, దమఘోషుఁడును, విశాలాక్షుఁడును, జనకుఁడును, మద్రకేకయులును, యుధామన్యుఁడును, సుశర్మయు, బాహ్లికులు మొదలగువారును, వారి పుత్రులును,మఱి యుధిష్ఠిరు ననువర్తించుచుండు నితరరాజులును వారి పత్నులును, లక్ష్మీనివాసంబైన శ్రీకృష్ణుని దివ్యవిగ్రహమును గాంచి యెంతయు విస్మయము నొందినవారయిరి. అంత నాభీష్మాదులు రామకృష్ణులచేఁ జక్కఁగాఁ బూజలంది ముదమునొంది కృష్ణుఁడు చేపట్టియున్న యావృష్ణుల నెంతయు నిట్లు గొనియాడిరి.—'భోజపతీ! ఉగ్రసేనా! ఈలోకమందు మనుష్యులలోపల మీ రెత్తినజన్మమే సఫలమైనది. ఏలనఁగా యోగులకును గనుఁగొన నెంతమాత్రము కష్టమైన శ్రీకృష్ణుని మాటిమాటికి దర్శించుచున్నారే! వేదములు గొనియాడుచుండు నెవ్వనికీర్తియు, పాదారవిందములను గడిగినజలమును (గంగయు), వాక్కును (కావ్యపురాణాదులును), శాసనమును (వేదమును), నీజగమునంతయును బావనము చేయునో, భూమి కాలముచేతఁ దన మాహాత్మ్యము దగ్ధమయ్యు నెవ్వని పాదపద్మములచోఁకునఁ దన మహత్త్వము మరలఁ బుట్టినదై మనకు సకలమయిన యభీష్టార్థములను గురియుచున్నదో, యట్టి విష్ణుని శ్రీకృష్ణుని దర్శన స్పర్శనములును, అనుగతియు సంభాషణములును, అతనితోడి శయనాసన భోజనములును, పెండ్లివియ్యములును,గోత్రసంబంధములును,మీకుఁగలవు. మఱియు మీగృహమందుఁ గృష్ణుండు దా నవతరించినవాఁ

డయ్యె. మీరు ప్రవృత్తిమార్గమందు వర్తించుచున్నను, భగ
వంతుని సంగమువలన స్వర్గాపవర్గములందును మీకు వెగటుగలి
గినదయ్యెను. ఇట్టి మీజన్మమేకదా జన్మము' అని కొనియాడిరి.
నందుఁడు నచటఁ గృష్ణుఁడు మొదలుగాఁగల యదువులు వచ్చి
యున్నారని తెలిసి యాకృష్ణునిఁ జూచుకోరికలఁ బండ్లుగట్టుకొని
గోపకులు బలసినడువ నక్కడకు వచ్చెను. అతనిని జూడఁగా
వృష్ణులు హర్షమునొంది ప్రాణమువచ్చిన బొందియుంబోలె దిగ్గ
నలేచి చిరకాలముగాఁ జూడఁ దుకతుక పడుచున్నవారు గాన
నతనిని బిగియఁ గౌఁగిలించికొనిరి. వసుదేవుఁడును మిక్కిలియు
సంతసిల్లి మక్కువచే నవయవములు విరవిరఁబోవ నతనిని
గౌఁగిలించికొని కంసుఁడు గావించిన కష్టములను గోకుల
మందుఁ బుత్రుల నిల్లడఁ బెట్టినదియుఁ దలంచుకొన్నవాఁడయ్యె.
కృష్ణుండును రాముండును దలిదండ్రులగు యశోదానందు
లకు నభివాదనముచేసి యాలింగనముఁ గావించుకొని ప్రేమం
బున డగ్గుత్తికవడ, నేమియుఁ బలుకనేరక యూరకుండిరి.
మహాభాగ్యవతి యాయశోద యా యిరువురు కొడుకులను
నొడిపయి నెక్కించుకొని, రెండుచేతులఁ గౌఁగిలించికొని
తనకుండిన దుఃఖములనెల్ల డిగవిడిచినదయ్యె. రోహిణియు
దేవకియు నా గొల్లదొరసానిని బిగియారఁ గౌఁగిలించికొని
యాబిడ మున్ను గావించిన చెలిమిని దలంచుకొని కన్నీరు నుత్తుక
లందుఁ గ్రమ్మ నామెతో 'వ్రజేశ్వరీ! మీరిరువురు చూపినచెలి
మిని నెవ్వతి మఱచును? ఆచెలిమి దేహ ముండువఱకును
మఱవకుండు నదిగదే! అట్టి చెలిమికి నీలోకమందుఁ బ్రత్యుప
కారము, ఇంద్రుని మహైశ్వర్యము నిచ్చిననుగాని, కలుగనే

కలుగదు. ఈయిరువురు పుత్రులును దలిదండ్రులనే యెఱుఁగని యపుడు మీయిరువురకడనే తలిదండ్రులుగా నిల్లడయుండి,మీరు కోరినవెల్ల నిచ్చి తనివిఁ గలిగించుచును, నామకరణము మొదలయిన మహోత్సవములు గావించుచును, బెంచుచును రక్షించుచును రాఁగా నెందువలనను భయమునొందక, కన్నులను ఱెప్పయుంబోలె మీరు రక్షకులై కాచుచుండ, మీకడ వసించియుండిరి. సజ్జనులకు లాఁతివారొకరును గలరే. వారికిఁ దనవారనియుఁ బెఱవారనియుఁ గలుగదు' అనిరి. గోపికలును జిరకాలమునకుఁ దమ ప్రియతముం డయినకృష్ణునిఁగాంచి యతనినెడపడక చూడ నుంకించు కన్నుంగవలకు నడ్డుపడు ఱెప్పలను దిట్టుచు, కన్నుల మూలమున హృదయములం దతనిని జొప్పించి యందుఁ గౌగిలించికొనిరి;మఱి నిత్యమును మనస్సు నతనియందుఁ గూర్చుచుండు యోగులకును దుర్లభంబయిన తద్భావమును-బరిపూర్ణముగాఁ దద్విగ్రహమునం దవగాహించుకోరికను-బొందిన వారయిరి. ఇట్లాత్మభావము నొందిన యాగోపికలను భగవంతుఁ డేకాంతమునఁ గలిసికొని వారిని గౌఁగిలించికొని యారోగ్యమడిగి నవ్వుచు వారితో 'సఖీమణులారా ! మేము సాధు జనులప్రయోజనమును గావించుటకై పోయి చాలఁ దడవు పుచ్చినందులకు మమ్ముఁ దలఁచుకొందురా ? మేమట్లు పెద్దతడవు గావించుటకు శత్రుపక్షము నెల్ల రూపుమాపఁ దలఁచియేకాని మీయెడ విరక్తివలనఁగాదు. మమ్ముఁ గృతఘ్నులే వీరని బుద్ధిని శంకించి నన్ను నవజ్ఞ సేయుదురా ? 'శంకించుటేకాదు. దిగవిడిచి పోవుటచే నిశ్చయించుకొన్నా'మందురేమో? భగవంతుఁడు ప్రాణులను గూర్చుచును బాపుచు

నుండుట నిజము. వాయు వెట్లు మబ్బుల సమూహములనును, దృణములను, దూదిపింజలను, దుమ్ములనును, గూర్చుచును బాపుచును నుండునో యట్లె భూత సృష్టికర్తయగు భగవంతుఁడును నొక్కచో భూతములను గూర్చియు మరలఁ బాపుచున్నాఁడు. నాయందలి భక్తిమాత్రమే ముక్తి నీయఁజాలి యున్నది. మఱినాయందు మీకు నెయ్యముగలుగుట మాకెంతో భద్రముచుఁడీ. ఏలన నది నన్నుఁబొందించునట్టిది. నేను సమస్తభూతములకు * మొదలును దుదియును లోనును వెలిఁయును నగుదును. అంగనలారా! ఆకాశము, జలమును, భూమియును, తేజస్సును, వాయువును ననెడి యీభూతములు భూతవికారాత్మకము లయిన దేవమనుష్యాది శరీరముల లోనును వెలియునై యుండునట్లె నేను నుందును. ఈ యాకాశాదులును వానికార్యము లగుదేవాదిశరీరములు నగు భూతములును, జీవాత్మయును, లోపలను వెలుపలను నాచేత వ్యాప్తములగును. కాఁబట్టి చేతనాచేతనములగు వస్తుసమూహములు రెండును, బరుండును, లోను వెలుపలను వ్యాపించియున్నను వ్యాప్తములగు వాని వికారము లంటకుండుటవలన నక్షరుండును, నగు నాయందుఁ బ్రమితములై యున్నవని కనుఁగొనుఁడు' అనెను. కృష్ణుఁ డట్లు లధ్యాత్మజ్ఞానమును జక్కఁగా నుపదేశింపఁగా గోపికలు భగవదుపదిష్ట మయిన యాత్మ యాథాత్మ్యము ననుస్మరించుటం జేసి (మననపూర్వకమగు నిదిధ్యాసము చేయుట చేత) జీవమును గోశమువలెఁ గ్రమ్మినదై కర్మమూలమైయున్న యజ్ఞానమును ధ్వంసము నొందినవారై భగవంతునిఁ గ్రమం

* మొదలనఁగా సృష్టికారణము; తుదియనఁగా లయకారణము.

బునఁ బొందినవారయిరి. వా రపుడు కృష్ణునింజూచి 'నలిననాభా! అపారమగు జ్ఞానముగల యోగీశ్వరులకును మనంబులఁ జింతిం చుటకే కాని దర్శించుటకు లోనుగాక, సంసారకూటంబునఁ బడినవారి నెత్తి దాఁటించునట్టి యూఁతయై, యున్న నీపాదార విందమును దేహధారులమగు మామనంబులయందుఁ గలరూ పునఁ బొడసూపుచుండునుగాత' మని వేఁడిరి. ఇది యెనుబది రెండవయధ్యాయము.

## కృష్ణభార్యలు ద్రౌపదికిఁ దమతమవివాహవిధ ములు చెప్పుట.

అంత గురుం డాభగవంతుఁడు గోపికలకుఁ దనపదారవింద సంగతి ననుగ్రహించి పిదప యుధిష్ఠిరునిని దక్కిన సుహృదుల నెల్లవారినిని గుశలమడిగెను. ఇట్లు లోకనాథుఁడడిగి యెం తయు సత్కరింపఁగా వారు తత్పాదారవిందదర్శనముచేత నేఁ బాపములెల్లఁ దూలినవారై మనంబుల హర్షముప్పొంగ నత నితో 'ప్రభూ! ఆసవముంబోలెఁ దీయనై, మహాత్ముల పరిశుద్ధ ముఖారవిందములనుండి తొరుఁగుచు, దేహధారులకు దేహమును గల్పించెడి యనాద్యజ్ఞానమును ద్రుంచునట్టి నీదు పదాబ్జకథామృతము నెవరు కర్ణపుటంబులఁ దనివారఁ గ్రోలుదురో వారికెయ్యెడఁగాని యశుభం బెక్కడిది ? సృష్టి స్థితి సంహారములు నితరులకు నీచేతనే కావింపఁబడుచున్నవై నను నీ తేజముంబట్టి యవి నిన్ను ముట్టనేరవు. ఇతరుల కవి గలిగింతువేకాని నీవు వానికి లోనుగావు. మఱి యానంద ప్రవా హమవు. అఖండమై యకుంఠిత మగు జ్ఞానమే స్వరూపముగాఁ గలవాఁడవు. కాలముచేత విప్లవమునొందిన వేదములను రక్షించు

కొఱకు నాశ్చర్యంబగు నీయోగమాయచేత దివ్య విగ్రహమును దాల్తువు. పరమహంసు లగువారికి నీవగతివి. ఇట్టినీకు మ్రొక్కెదము' అనిరి.

ఇట్లుత్తమశ్లోకశిఖామణి యగునా కృష్ణుని జనులు నలుగడల స్తుతించుచుండఁగా నంధక (యాదవ) స్త్రీలును కౌరవ స్త్రీలును గుమిగూడి నొండొరులతో గోవిందుని ముద్దులను ముచ్చటించు కొనిరి. ముల్లోకములందును బాడంబడుచున్న యాగీతములను వర్ణించెదము వినుము. ద్రౌపది కృష్ణపత్నులను గాంచి 'కృష్ణు నెడఁబాయకుండు నో రుక్మిణీ! ఓభద్రా! ఓజాంబవతీ! కౌసల్యయగు సత్యభామా! కాళిందీ! మిత్రవిందా! రోహిణీ! లక్ష్మణా! ఓకృష్ణపత్నులారా! భగవంతుఁడు తన సంకల్పముచేత లోకము ననుకరించువాఁడై మి మ్మెట్లు పెండ్లియాడెనో యావిధమును నాకుఁజెప్పుఁ' డని యడిగెను. అందులకు రుక్మిణి—'రాజులు వెక్కండ్రు విలుగొని శిశుపాలునకు న న్నిప్పింపఁ బూనియుండిరి. అపు డెవ్వని పాదపరాగము, గెలువరాని మేటిభటులకుఁ దలఁదాల్పఁదగినదో యాకృష్ణుఁడు మేఁకల గొఱియల కదుపు నడుమనుండి తనపాలుగొని చను మృగరాజువలె నారాజుల నడుమనుండి నన్నుఁ గొనిపోయెను. అతని యడుగుఁదమ్ములు లక్ష్మికాటపట్టు. అట్టిప్రభుని యడుగులకు నెపుడు పరిచర్య చేయుచుండుదానను' ననెను. సత్యభామ—'మాతండ్రి సత్రాజిత్తు తనతోఁబుట్టువయిన ప్రసేనునికి సింహముచేఁ గలిగిన వధమునకు హృదయంబునఁ దపించుచు, లేనినింద కృష్ణునకుఁ బూసెను. దానిని దుడిచికొనుటకై కృష్ణుఁడు భల్లూకరాజయిన జాంబవంతుని జయించి యాస్యమంతకమును గొని నాతండ్రి

కిచ్చెను. అతఁడు లేని తప్పుమోపినందులకు వెఱచి నన్ను సత్రా
రాదులకు నిచ్చునట్లు ప్రతిజ్ఞచేసినను, గృష్ణునికి రత్నముతోడ
నిచ్చెను. జాంబవతి—‘ననుగన్నతండ్రి జాంబవంతుఁ డీ కృష్ణు
నిఁ దనకు స్వామియుఁ దన కులదైవతము నగు సీతాపతియని
తెలియక యితనితోడ నిరువదియేడుదినములు హోరాహోరిఁ
బోరాడెను. పిదప మాతండ్రి, సీతాపతి యిప్పుడీకృష్ణుఁడై యదు
వులం దవతరించినవాఁడని పరికించి తెలిసికొని యితని యడుగుఁ
దమ్ములను బట్టుకొని కలంకఁబుచ్చి మణితోఁగూడ నన్నుఁగాని
కగాఁదెచ్చి సమర్పించెను. అట్టినే నీభగవంతునికి నాయాత్మ
యుండునంతదాఁక దాస్యము సేయుదానను’ అనెను. కాళింది-
‘నేను దనపదారవిందముల స్పర్శనుగోరి తపస్సుచేయుచుండు
టనుదెలిసి తనచెలియగు నర్జునినితోఁగూడ నాకడకువచ్చి
నన్నుఁ బాణిగ్రహణముచేసికొన్నయీ ప్రభునికి నే నిలునూడ్చు
దాన నగుదును’ అనెను. భద్ర—‘నన్ను స్వయంవరంబున వచ్చి
కుక్కలపదువునడుమనుండి తనపాలుగొని చనుసింగముంబోలెఁ
దనకపకారము చేసినరాజులనును నాయన్నదమ్ములనును గెలిచి
యెవ్వఁడు నన్ను ద్వారకాపురమునకుఁ గొనిపోయెనో యా
శ్రీనివాసుని యడుగులను గడుగుచుండుట నాకు జన్మజన్మము
నను గలుగుచుండుఁగాత ‘మనెను. సత్య—‘మాతండ్రి రాజుల
వీర్యములను బరీక్షించుకొఱకు మిక్కిలియు బలమును వీర్య
మునుగలవై చాలవాడులగు కొమ్ములతోఁ గూడియున్న గో
వృషము లేడింటిని సంతరింపఁగా, వీరుల యడఁపరాని చెడు
క్రొవ్వును సయితముఁ దూలించునట్టి యాదిట్ట గోవృషములను
బలంబు మెయినడంచిపట్టి శిశువులు మేఁకకూనలంబోలె వేడు

కతోఁ బట్టి బంధించెను. ఇట్లు వీర్యమే యుంకువగాఁగల నన్ను రాజన్యుల యుద్ధమున గెలిచి దాసీజనముతోడను జతురంగ సైన్యముతోడను జేకొనిపోయిన యట్టి యతని కెప్పుడును దాస్యము సేయుచుండుట నాకు దొరకొనుఁగాత' మనెను. మిత్రవింద—'ద్రౌపదీ! నాకుఁ గృష్ణుఁడు మేనమామకొడుకు. నే నాతనియందే మనసు దగిలియున్నదానను గాన, మాతండ్రి యాకృష్ణునిఁ దా నైరప్పించి సఖీజనులతోను నొక యక్షౌహిణీ సైన్యముతోను నొసంగినవాఁడయ్యె. నేను గర్మములచేత నొక్కయెడ నేకాక నిందునందుఁ బుట్టుచుగిట్టుచుఁ ద్రిప్పంబడుచుండుదానను. కనుక నాయట్టిపూత్మకుఁ బరమపురుషార్థరూపమగు మేలును గూర్చు నితనిపదాబ్జసంస్పర్శనమ్ము త్రిప్పలంబడునపుడు జన్మజన్మమునందును గలుగుచుండుఁగాత' మనెను. లక్ష్మణ—'రాజ్ఞీ! నారదులు మాటిమాటికి నచ్యుతుని జన్మకర్మములను గానముసేయఁగా విని యాముకుందుని యందుఁ జిత్తము గుదురుకొనెను. పద్మహస్త యగులక్ష్మియు లోకపాలురను సైతమువిడిచి చక్కఁగావిమర్శించి యితనినే వరించినదఁట కదా. ఇఁక ననుఁబోఁటిది వరించుటను జెప్ప నేల? మాతండ్రికిఁ గూఁతురగు నాయందు మిక్కిలియు గారాము. అతని పేరు బృహత్సేనుఁడు. సాధ్వీ! అతఁడు నాతలంపెఱింగి, యందులకొకయుపాయము గావించెను. అది యేదన-నీస్వయంవరమందు నర్జునిని బడయు కోరికచేత నిర్మించినట్లి మత్స్యయంత్రమును నా స్వయంవరముననును నిర్మించెను. * అయిన నా మంత్ర

* ద్రౌపదీ స్వయంవరమందలి మత్స్యము, పైని చూపు నిగుడ్పఁగా కనఁబడుచుండెను; కాన పైకి చూపు నిగిడ్చి బాణ మేయం దగి యుండెను. మిత్ర

యత్స్యము బయట స్తంభముకొనను దెలియుచుండెను. ఇది యట్లుగాదు. బయటఁ దెలియనీక కప్పంబడి స్తంభము క్రింద నున్న జలమునందు మాత్రమే కనుపట్టుచుండెను. దీనిని విని నలుగడలనుండి సమస్త శస్త్రాస్త్రముల తత్త్వముల నెఱింగిన రాజులు తమతమ యుపాధ్యాయులతోడం గూడి వేలకొలఁదిని మాతండ్రి పట్టణమునకు వచ్చిరి. మాతండ్రియు వారిని వారి వారివీర్యములకును వయస్సులకు ననురూపములగు పూజలు గావింపఁగా సభయందు వారు నాయందు బుద్ధినిడి యామత్స్యమును గొట్టుటకు విలు నమ్ములు గయికొనసాగిరి. అందుఁ గొందఱు విలు సేకొన్నను దాని నెక్కుపెట్టంజాలక విడిచిపెట్టిరి. మఱికొందఱు దానికొప్పువఱకు నల్లెత్రాటిని లాగిరి. కాని, దానిని దుదముట్ట గొనయం బెక్కింపనేరక నది తివిచుకొని బిట్టుగాఁగొట్టఁగా నాయేటువడి క్రిందఁద్రెళ్లిరి. జరాసంధుఁడు, అంబష్ఠుఁడు, శిశుపాలుఁడు, భీముఁడు, దుర్యోధనుఁడు, కర్ణుఁడు, మొదలుగా వేలు కొందఱు దానిని నెక్కుపెట్టిరిగాని యామత్స్యమున్న పట్టు కనుఁగొనఁ జాలరయిరి. అర్జునుఁడు జలమునందుఁ గనఁబడుచున్న యామత్స్యము ప్రతిబింబమునుజూచి దాని యునికిపట్టు నెఱిఁగి యత్నించి బాణము

---

విందాస్వయంవరమందో యది పైని చూపునిగుడ్పఁగాఁ గనఁబడకుండునట్లు కప్పంబడియుండెను. దానికి క్రిందనున్న జలములం దది ప్రతిఫలింపగా ఆబింబముఁజూచియె దానిని గొట్టవలయు. అనఁగా దీనిని పైనిజూచి కొట్టక క్రింద నీటియందుఁజూచి కొట్టవలయును. పైనిజూచి కొట్టఁదగునట్లు గావించినచో అర్జునుఁడుకొట్టునని తలఁచి అతనికి నశక్యమై అచ్యుతునకే శక్యమగునట్లుగా గిందఁజూచి కొట్టునట్లు బృహత్సేనుఁడు నిర్మించినాఁడని తెలియునది.

నేసెను. కాని, యాబాణ మామత్స్యము నూరక తాఁకినదే కాని దానిని ద్రుంపకపోయెను. ఇట్లు మానవంతులగురాజులు తమమానము భగ్నమై మరలఁగా, భగవంతుఁ డావిలుగొని యవలీల నెక్కుపెట్టి దానియందు బాణమునుదొడిగి మత్స్యమును జలమునం దొకమాటువీక్షించి సూర్యుఁ డభిజిత్తునం దుండఁగా బాణముచే దానిని ద్రుంచి క్రిందఁబడఁ జేసెను. అప్పుడు దివంబున దుందుభులు మ్రోఁగెను. భూతలమున జయజయ శబ్దములు బోరుకొనెను. దేవతలును హర్షపరవశులై పువ్వులను జడిగాఁ గురియించిరి. అంత నేను మేలయిన క్రొత్త పట్టుపుట్టములను రెంటినిధరించి, క్రొమ్ముడియందుఁ బూదండలు చెఱివి, యడుగులం దందియ లింపుగా మొరయ, బంగారుచేఁ దళతళలాడుచున్న రత్నమాలికను గొని నెమ్మొగంబున నునుసిగ్గును నవ్వును నిమ్ముగొనఁగా నారంగమును బ్రవేశించితిని. ముంగురులు గ్రమ్మ కుండలముల మెఱుఁగులు చెక్కుటద్దములయందుఁ జిందులు ద్రొక్కుచున్న నా నెమ్మొగమును బయికెత్తి చల్లని చిఱునవ్వుతోడి కడకంటివాలుంజూపుల నిగిడించుచు రాజులను గలయంజూచి, యంతె మనంబున ననురాగము సందడింప నల్లల్లన మురారిమూఁపున నమ్మాలిక నుంచితిని.అపుడు మృదంగములును బటహములును శంఖములును భేరులును ఆనకములును మొదలయినవి యొక్కపెట్టఁ జెలంగెను. నటులును నర్తకీజనులు నాడిరి. గాయకులుపాడిరి. ద్రౌపదీ! ఇట్లీశ్వరుండగుహరిని నేను వరింపఁగాఁ, దక్కిన రాజసమూహములు మన్మథాతురులై మచ్చరించుచు నందులకు సహింపరయిరి. చతుర్భుజుం డాహరి యంతకు నన్ను మేటిగుఱ్ఱములు పూన్చియున్న

రథము నెక్కించికొని శార్ఙ్గమును గేలంగొని సన్నద్ధుండై యుద్ధంబున నిలిచెను. రాజ్ఞీ! అంత దారుకుఁడు సమస్తరాజులును జూచుచుండఁగా, మృగములు చూచుచుండఁగా మృగరాజుంబోలెఁ గను పట్టుచు, బంగారుచే సింగారింపఁబడియున్న రథమును దోలెను. అందుఁ గొందఱు రాజులు పూని విల్లెత్తికొని గ్రామసింహములు మహాసింహమునుంబోలె నీతనిని మార్గమందుఁ బోనీక యరికట్టుటకై వెనుదగిలిరి. వారు శార్ఙ్గమునుండి వెడలిన బాణసమూహములచేతఁ జేతులును గాళ్లును గుత్తుకలును దెగి కొందఱు యుద్ధంబునఁ గూలిరి. కొందఱు యుద్ధమువిడిచి పరుగెత్తిరి. అంత యదుపతి కృష్ణుండు సూర్యమండలము గప్పిపుచ్చు ధ్వజపటములను విచిత్రతోరణములను బురణించుచు, దివియందును భువియందును నెప్పుడును బొగడంబడుచుండు కుశస్థలిని, మిక్కిలి యలంకృతమై యున్నదానిని, సూర్యుఁడు తన పట్టయిన యుదయాచలమునుంబోలెఁ బ్రవేశించినవాఁడయ్యె. నాతండ్రియు సుహృదులకును సంబంధులకును బంధువులకును మిక్కిలి వెలపొడుగులయిన వస్త్రములును నలంకారములగు శయనాసనములును దక్కిన పరిచ్ఛదములును నొసంగి వారిని మిక్కిలియుఁ బూజించెను. మఱియు నతఁడు సమస్తవస్తుపరిపూర్ణుఁడగు హరికి భక్తిం జేసి దాసజనులను సమస్తసంపదలనును భటులను గజములను రథములను నశ్వములనును మహార్హములయిన యాయుధములనును నొసంగెను. ఈమా యొన మంద్రును సర్వసంగనివృత్తిరూపంబగు వైరాగ్యముచేతను, దపస్సుచేతను, నాత్మారాముండగు నీభగవంతునికి కేవలము గృహదాసికల మయితిమి' అనెను. అంతఁ బదాఱువేల పట్టమహి

షులు ద్రౌపదితో 'నరకాసురుఁడు దిగ్విజయమున రాజులను జయించి వారికన్యల మగుమమ్ముఁ జెఱఁబట్టియున్నాఁ డని యెఱింగి వానిని వానిబలంగముతోడ యుద్ధమునఁ దునుమాడి సంసారమును విడిచిపుచ్చు నతని పదారవిందమును స్మరించు చున్న మమ్ముఁ జెఱవిడిపించి తాను గామములనెల్లఁ బడసిన వాఁడయ్యు మమ్ముఁ బెండ్లాడెను. సాధ్వీ! మేము సార్వభౌమత్వమునుగాని, యింద్రపదవినిగాని, యీరెంటి భోగభాగ్యములను గాని, యణిమాది సిద్ధులను గాని, బ్రహ్మపదమును గాని, యనంతమగు హరిపదమును గాని కోరము. శ్రీదేవి కుచకుంకుమపు వాసనలును బుగులుకొనుచు సిరిదొలఁకుచున్న యీగదాధరుని పదారవిందపు పరాగమును నౌదలలయందుఁ దాల్పనే యువ్విళ్లూరుచున్నారము. అది దుర్లభమందువా! ఇతఁడు నిరతిశయంబగు సౌశీల్యముగల మనంబువాఁడు. కాన యీ భగవంతుఁడు గోవులను మేపుచున్నపుడు గొల్లపడఁతులును నడవియందలి పుళిందస్త్రీలును, * జెట్లుచేమలును, తృణములును, నితని పాదస్పర్శమును వాంఛించునట్లె మేమును వాంఛించుచున్నారము. వారికిఁ గలుగఁగా మాకును నంత గలుగనేరదా?' యనిరి. ఇది యెనుబదిమూఁడవయధ్యాయము.

---

* సౌశీల్యసౌలభ్యాద్యనంతకల్యాణ గుణాకరుఁ డగు భగవంతుని పాదరజము తద్దాసులకు సులభమేకాని దుర్లభముకాదని భావము. తృణాదులకును చైతన్యముగలదు. అది దుష్కృతాశయము వలన మిక్కిలి యడఁగియుండును. భగవంతుని సన్నిధానమువలన నది యున్మేషింపఁగా వానికి నట్టి వాంఛ గలుగుచున్నదని సూచితము.

శ్రీశుకులు—కుంతిదేవియు గాంధారియు ద్రౌపదియు, సుభద్రయు, దక్కిన రాజపత్నులును గృష్ణభక్తలగు గోపికలును నట్లు రుక్మిణి మొదలయినవార లఖిలాంతరాత్ముం డగుభగవంతుఁడు కృష్ణునియందు నిష్కపటంబగు ప్రేమ పారతంత్ర్యము గలిగి చెప్పినమాటను విని యందఱును, నానందాశ్రు బిందువులు కన్నులంగవలఁ జిప్పిల్ల నెంతయు విస్మయపడినవా రయిరి. ఇట్లు స్త్రీలతో స్త్రీలును, బురుషులతోఁ బురుషులును, ముచ్చటలాడుచుండఁగా రామకృష్ణులను జూచుట కచ్చటికి మునులు వచ్చిరి. వ్యాసుఁడు, నారదుఁడు, చ్యవనుఁడు, అసితుం డగు దేవలుఁడు, విశ్వామిత్రుఁడు, శతానందుఁడు, భరద్వాజుఁడు, గౌతముఁడు, రాముఁడు, అతనిశిష్యులు, భగవంతుఁ డగు వసిష్ఠుఁడు, గాలవుఁడు, భృగుఁడు, పులస్త్యుఁడు, కశ్యపుఁడు, అత్రి, మార్కండేయుఁడు, బృహస్పతి, ద్వితుఁడు, త్రితుఁడు, ఏకతుఁడు, బ్రహ్మపుత్త్రుఁడు, అంగిరసుఁడు, అగస్త్యుఁడు, యాజ్ఞవల్క్యుఁడు, వామదేవుఁడు మఱియు నితరులును నక్కడికివచ్చిరి. అట్లువచ్చిన యాలోకవందితులను గాంచి యంతకుమునుపు గూర్చుండియుండిన రాజులు మొదలగు వారును, పాండవులను, కృష్ణుఁడును, బలరాముఁడును, దిగ్గన లేచి ప్రణామములు గావించిరి. రాముఁడును గృష్ణుఁడు నట్లె తక్కినయందఱును వారిని స్వాగతం బడిగి యర్ఘ్యపాద్యము లొసంగి, యాసనంబులిడి, మాల్యములను ధూపములను నను లేపనముల నర్పించి యర్చించిరి. అంత ధర్మరక్షణమునకై దివ్యవిగ్రహము దాల్చియున్న యాభగవంతుఁడు, ఆ మహాసభయందలి తక్కినవారందఱును

మాటాడక యూరక తన్ను వినుచుండఁగా, సుఖాసీనులై యున్న యామునులను జూచి 'ఆహా! మాజన్మమేజన్మము! జన్మమెత్తినం దులకు ఫలము పూర్ణముగా మాకే లభించినది. ఏలందురా! దేవతలకుఁ బడయరాని యోగీశ్వరుల దర్శనము మాకు లభించెనే! మేమో యల్పపుణ్యులము. మఱి బొమ్మలయందు దేవతాబుద్ధి గల వారము. ఇట్టి మాకు మీదర్శనస్పర్శనములను, మిమ్ము స్వాగతం బడుగుటయు, మీకుఁ బ్రణామములను బాదార్చనములు మొదలైనవి గావించుటయు నెట్లు గలిగెనో! జలమయములయిన తీర్థమును మృచ్ఛిలామయము లయిన దేవతలును దర్శించినంతమాత్రనే పావనము చేయఁజాలవు. అవి పెద్దకాలమునకే యట్లుచేయును. సాధువు లన్ననో దర్శనమాత్రము చేతనే పవిత్రముచేయుదురు. దేహాగత భేదములను నాత్మయందును సంభావించునట్టి వారిపాపములను, అగ్ని, సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములును, భూమియు, జలమును, ఆకాశమును, వాయువును, వాక్కును, మనస్సును, నెంతి యుపాసించినను, బెద్దయుఁ గాలమునకుంగాని హరింపవు. సాధువులో ముహూర్తముసేపు సేవించినంత నే హరించివైతురు. ఎవ్వనికి వాత పిత్త శ్లేష్మము లనెడి మూఁడుధాతువులమయమై పీనుఁగుప్రాయ మైనదేహమే తానె నెడి యభిమానమును కళత్రాదులు తనవి యనెడి మమకారమును, మట్టిబొమ్మలు మొదలయి వానియందు దేవతలను బుద్ధియు, గంగాదిజలములందుఁ దీర్థములను బుద్ధియు, మాత్రముగలిగి, స్వపరమాత్మస్వరూపమును దెలిసిన మిముబోఁటి సాధువులందు నొకప్పుడును దేవ

తలు తీర్థములు ననెడి బుద్ధిగలుగకుండునో యట్టి పురుషుఁడు గోవును గాడిదనుంబోలినవాఁడే యగును' అనెను.

ఆప్రతిహతంబగు మేధ గలయాభగవంతుఁడు కృష్ణుఁడు తన కనురూపముగాని యమ్మాట చెప్పఁగా విని యామునులందఱును 'శౌరీ! తన్ను భజించుటవలననే మహిమనొందిన మనలను దనకంటె మిక్కిలియు నెక్కుడుగాఁ జెప్పుచున్నాఁడే! ఇదేమి విపరీతపుమాట'యని బుద్ధి యేమియుఁ దోఁపక తిరుగుడువడఁగా నూరక పలుకకుండిరి. వారు 'చక్కఁగాఁ దెలియని జను లిట్లు సాధువులను భజింతురుగాక'యని జనుల ననుగ్రహించుకొఱకుఁ దన్ను లోకువయైనవానిఁగాఁ జెప్పికొన్నాఁడేకాని మఱేమి కాదని చాలసేపాలోచించి తెలిసికొని చిఱునవ్వు నవ్వుచు, జగద్గురుం డగునాకృష్ణునితో 'బ్రహ్మాదులకు నధీశ్వరుఁడవగు స్వామీ! మేము తత్త్వవేత్తలయందు మిన్నలమే. అయినను సర్వేశ్వరుఁ డగుభగవంతుఁడవయ్యు మనుష్యచేష్టచేతఁ దన్నుఁ గప్పికొని నియమమునకు లోఁకువయైనవానివలె(కర్మవశ్యునివలె) నాచరించుచున్నావే! ఇందులకు జనసంగ్రహము సేయవలయునని యే కారణము గాని మఱొక్కటి గాదు. ఈనీయభిప్రాయమును మేము తెలిసికొననేరక భ్రమించినవారమే యైతిమి. శౌరీ! భగవంతుఁడవగు నీదుచేష్టిత మతివిచిత్రముగదే! నీవు కర్తాయత్తమగు చేష్ట లేనివాఁడవై సృష్టికిఁ బూర్వము కారణావస్థయందు (నామరూప విభాగము లేని చిదచిత్తులు శరీరముగాఁగల శరీరిరూపమున) నొక్కఁడవై, పిదప (నామరూపవిభాగమునొందిన చిదచిత్తులమయమైన) జగత్తురూపునఁ బెక్కువిధములై వీనిని సృజించుచును రక్షించుచును సంహరించుచు నుందువు. కాని వీనివికా

రములందు నీవు చిక్కుపడవు. భూమి తానొక్కటియె మృత్తిక యయ్యు, కుండ మూఁకుడు మొదలయిన మృద్వికారములచేతఁ బెక్కు నామములను రూపములను దాల్చునట్లు నీవు పెక్కు నామరూపములను దాల్తువు. ఔరా! భగవంతుఁడవగు నీదు చరిత మేమివేడబముగా నున్నది! ఇట్లు సర్వేశ్వరుఁడవయ్యును, నీవు నీదుభక్తులను రక్షించుకొఱకును, ఖలులగువారిని నిగ్రహించుకొఱకును బ్రకృతి పురుషవిలక్షణుండ వగు పరమపురుషుండవయ్యును, వర్ణాశ్రమములతోఁ గూడిన జీవునింబోలెఁ జూపట్టుచు, శుద్ధసత్త్వమయంబగు రూపమును దాల్చుచున్నావు. మఱి నీకు లీలారూపంబగు నాచారముచేత సనాతనమగు వేదమార్గమును బోషించుచున్నావు. వేదములవలన అనశనాది రూపంబగు తపమును, అవ్యయమును వర్ణాశ్రమాను రూపంబగు ధర్మమును, వ్యక్తంబగు శరీరమును, అవ్యక్తం బగునాత్మస్వరూపమును, ఆరెంటికి విలక్షణంబగు పరమాత్మ స్వరూపమును గలరూపునఁ దెలియుచున్నవి. శుద్ధం బగునట్టి వేదము నీదుహృదయము. కాఁబట్టి వేదమే (బ్రహ్మమే) నిన్నుఁదెలియుటకుఁ గారణమగును. ఇటువంటి మహాత్మునకు నీకు బ్రహ్మకులము నిన్నుఁ దెలిసికొను పట్టుగానున్నది. అనఁగా నది నీమాహాత్మ్యము దెలిపెడి వేదమాధారముగాఁ గలిగియున్నది; కాఁబట్టి నీపట్టయినది.అట్టి బ్రాహ్మణకులమును నీవు మిక్కిలియు బహుమానించుచున్నావు. మఱియు నిట్లు బహుమానింపఁ బడుచున్న బ్రాహ్మణులలోపల నీవు శ్రేష్ఠుఁడవు. కావునను నీవువారిని బూజించెదవు. సజ్జనులకు గతివగు నీతోడి సంగతిచేత నేఁడుమాకు జన్మసాఫల్యము గలిగెను. మావిద్యయుఁ దపస్సును గన్ను

లును సాఫల్యమునొందినవి. ఏలందువా! నీతోడిసంగతి శ్రే యస్సులందెల్ల నెక్కుడయిన శ్రేయముగదే! తనయోగమాయ చేతఁ (ఆశ్చర్యశక్తిచేతఁ) దనయైశ్వర్యమును గప్పియున్న పర మాత్ముండును, నకుంఠమేధస్సంపన్నుండును, భగవంతుఁడును, నగుకృష్ణునకు నమస్కారము. సమస్తజీవులను మోహింపఁ జేయు మాయయనెడి మాటునం దున్న యీశ్వరుండవై పర మాత్మరూపంబున లోననుండియు, వెలుపలఁ గాలరూపమునఁ బరిచ్ఛిన్నుండవై యుందువు. ఇట్టి నిన్ను రాజులే కాక నీతో నెప్పుడును గూడిమాడియున్న వృష్ణులు సైతమెఱుంగరు. గుణ పరిణామరూపమగు తత్త్వమైన దేహము నాత్మగాఁ గనుఁగొను నట్టి పురుషుఁడు పరుండునపుడు స్వప్నగతములగు నామరూపేం ద్రియములతోడఁ గూడినదిగాఁ దనయాత్మను దెలియుచున్నాఁ డేకాని, నామాదులు లేనిదై దేహమునకంటె విలక్షణమైనదిగా దానిని దెలియఁడుగదా. బ్రహ్మమా! అట్లే మేలుకనియున్న పురుషుఁడును, నీమాయచేతఁ గలిగినదై నామ మూర్తేంద్రి యముల కనుగుణమైన చేష్టచేత స్వపరస్వరూపజ్ఞానమును గూర్చిన స్మృతిదూరలఁగా, దానివలన ననాత్మయగు దేహము నాత్మయనియుఁ బరతంత్రమును స్వతంత్రమనియు గ్రహించి చిత్తమును దడఁబడఁగా, నిన్నాశ్రయించి యున్నయాప్రత్యా గాత్మనే తెలియఁడు. ఇఁక నాయాత్మకుఁ బరమాత్మవగు నిన్నుఁ దెలియనే తెలియఁడని చెప్పవలయునా? పాపసమూ హములను గడిగిపుచ్చు గంగాదితీర్థముల కాస్పదమయిన నీ పదారవిందమును, మిక్కిలి పరిపక్వమైన భక్తియోగముగల వారి హృదయమందు సాక్షాత్కరించునట్టి దానిని మే మిప్పుడు

నాడఁ గంటిమి. భక్తిరస ముద్రేకించుటవలన వాసనలును, కోశమువలెఁ గ్రమ్మియున్న యజ్ఞానమును, దొలఁగిపోయినవారు నీగతిని బొందుదురు. కాఁబట్టి భక్తులమగు మ మ్మనుగ్రహింపుము' అనిరి. ఇట్లామునులు, దాశార్హుండగు కృష్ణునకుఁ జెప్పి యంత నతనిని ధృతరాష్ట్రుని, యుధిష్ఠిరునిని, ననుజ్ఞ యడిగి తమతమ యాశ్రమములకుఁబోవ మనస్సు గొన్నవారయిరి. దానినిజూచి మహాయశుండగు వసుదేవుఁడు వారి దగ్గఱకువచ్చి ప్రణమిల్లి వారిపాదములం బట్టికొని యవహితచిత్తుండై వారితో 'సర్వదేవతావాసులైన మీకు మ్రొక్కెదను. ఋషులారా! నా యీపలుకు వినందగును. అది యిదియె. వర్ణాశ్రమానుగుణమగు కర్మముచేత (భగవద్భక్తి పుట్టుటకు నడ్డయి ప్రాచీనపుణ్యపాపరూపములైన) కర్మము లెట్లు దొలంగునో నాకుఁ జెప్పవలయును' అని యడిగెను. అందులకు నారదుఁడు 'విప్రులారా! వసుదేవుఁడు తనకు శ్రేయస్సాధనమును దెలిసికొనఁగోరి మనలనడుగుచున్నాఁడనునది యంతగా విచిత్రముగాదు. ఇతఁడు కృష్ణుని నర్భకునిఁగాఁ దలఁచి మనల నిట్లడుగుచున్నాఁడు. ఎప్పుడును దాపున నేయుండుట మనుష్యులకు ననాదరణము చూపుటకుఁ గారణమగునుజుఁడీ. గంగానది యొద్దనుండువారు గంగను బాటింపక విడిచి శుద్ధికొఱకు మఱియొక పుణ్యజలమునకుఁ బోవునట్లున్నది. ఈకృష్ణుని జ్ఞానము మనబోఁటుల జ్ఞానములుంబోలెఁ గాలముచేతను, జగము నుత్పత్తి ప్రలయములచేతను, దనచేతను, మఱియొకటిచేతను, సత్త్వాదిగుణములచేతను, మ ఱెద్దానిచేతను, నశింపనేరదు చుఁడీ. అట్టి కృష్ణుఁడు క్లేశములచేతను బుణ్యపాపకర్మములచేతను వాని పరిపాకము లగు సుఖదుఃఖములచేతను,

సత్త్వాదిగుణముల పునఃపునః ప్రవాహములచేతను దనమహిమ కొట్టువడకుండు వాఁడు;అద్వితీయుఁడు.అట్టివాని,నజ్ఞుండగువాఁడు స్వకార్యములగు ప్రాణాదులచేతను (ప్రాకృతములగు నింద్రియములచేతను వాని వ్యాపారములచేతను) దనవలెనే మహిమ కప్పంబడియున్నవానిని గాఁదలచుచున్నాఁడు. సూర్యుని మబ్బులచేతను మంచుచేతను రాహువుచేతను గప్పఁబడిన వానినిగాఁ దలఁచునట్లున్నది' యనెను. అంత మునులు వసుదేవునిఁ బిలిచి సమస్తరాజులును కృష్ణుండును రాముండును వినుచుండఁగా ని ట్లనిరి. 'కర్మములచేతఁ గర్మములను బోకార్చుట చక్కఁగా నిదియె యని నిరూపింపఁబడి యున్నది. అది యెద్దియనఁగా - సమస్త యజ్ఞనిర్వాహకుండయిన విష్ణువును, శ్రద్ధచేత యజ్ఞములచే నారాధింపవలయు ననుటయే. విష్ణువు నారాధించుట యనెడి యీధర్మ మీలోకమందుఁ జిత్తమునకు శాంతిని గలిగించునది; మఱి నిరతిశయమగు మోక్షసుఖమును గూర్చునది. కాఁబట్టి సుగమమైన యుపాయమని మునులు శాస్త్రదృష్టిచేతఁ గనుఁగొన్నవా రయిరి. పరపీడాదులు చేయక పడసిన పరిశుద్ధంబగు ధనముచేతఁ బరమపురుషుని శ్రద్ధతో యజించుట (యారాధించుట) యనెడి యిదియె (భక్తియుత్పత్తి కడ్డులనెల్లఁ బోఁగొట్టి మోక్ష సుఖమనెడి) శ్రేయమును బొందించుటకుఁ త్రైవర్ణికులగు గృహస్థులకు మార్గము. బుధుఁడగువాఁడు,యజ్ఞములచేతను దానములచేతను * ధనేచ్ఛను, గృహోచితము

* ధనమును జక్కఁగా దానయజ్ఞాదులందు వెచ్చించుటచేత దానిని రక్షింపవలసిన దుఃఖము వీడుచున్నది. దారపుత్రాదు లనుభవించుచుండుట వలన నింతపఱకె చాలునని దానియందలి యుత్సుకత వీడుచున్నది. స్వర్గాదులును

లైన భోగములచేత దారపుత్రేచ్ఛను, దేహము మృతినొందఁగాఁ గాలముచేత స్వర్గాదిలోకేచ్ఛను దిగవిడువ వలయును. ధీరులగువారందఱును గ్రామములందు నీషణలను దిగవిడిచి తపోవనమునకుఁ బోయిరి. త్రైవర్ణికుఁడు దేవతలకును ఋషులకును బితరులకును ముగ్గురికిని మూఁడు ఋణము గలవాఁడగుచుఁ బుట్టుచున్నాఁడు. వాఁడు యజ్ఞముచేతను, అధ్యయనముచేతను బుత్రులచేతను నామూఁటిని గడవక చరించునేని నరకమునఁ బడును. మహామతీ ! నీ విపుడు ఋషులయుఁ బితరులయు ఋణములు రెంటినుండి విడివడి యున్నావు. ఇఁక యజ్ఞములుచేసి దేవతల ఋణమును దీర్చివుచ్చి, యేఋణమును లేక యంతి గృహసంగమును విడువుము. వసుదేవా ! నీవు జగంబుల కీశ్వరుండగు హరిని బరమంబగు భక్తిచే నున్నర్చించితి వనుట నిజము. కాఁబట్టియే యతఁడు నీకుఁ బుత్రుఁడై నాఁడు' అనిరి. ఇట్లు వారు చెప్పినదివిని మహామనస్కుండగు నావసు దేవుఁడాఋషులు తల నేలసోఁక మ్రొక్కి ప్రసన్నులం గావించి తనకు ఋత్విజులుగా వరించెను. ఆఋషులును నట్లు విధ్యుక్తంబుగఁ దమ్మాధార్మికుఁడు వరింపఁగా నాస్యమంతక క్షేత్రమున మంత్రతంత్ర ద్రవ్యాదులందేకొఱఁతయు లేకుండునట్లు యజ్ఞముల నతనిచేఁ జేయించిరి. వసుదేవునకాయజ్ఞదీక్ష జరుగుచుండఁగా వృష్ణులును దామర పూదండలం దాల్చి చక్కఁగా జలకమాడి మంచి వలువలుగట్టి చక్కఁగా నలంకృతులైన రాజులును వచ్చిరి. వారల మహిషులు ముదంబుపొదలఁ బదక

---

కాలవశములుగాన క్షీణించునవియె యని నిరూపించుటచేత వానియందలి తృష్ణయు మానుచున్నవని యిట యాశయము తెలియునది.

ములను మెడలందాల్చి మంచి వలువలను గట్టి కలప మలంది
కానుకద్రవ్యములు కేలంగొని యజ్ఞదీక్షాశాలకు వచ్చిరి.
అప్పుడు మృదంగములును బటహములును శంఖములును భేరు
లును ఆనకములు మొదలగునవియు మ్రోఁగెను. నటులును
నర్తక జనులును నాడిరి. సూతులును మాగధులును స్తుతులు
చేసిరి. చక్కని యెలుంగులుగల గంధర్వాంగనలు తమ భర్తల
తోడ సంగీతమును బాడిరి. ఋత్విజు లావసుదేవునికన్నులఁ
గాటుకయిడి మేనినిండ వెన్నపూసి యతని పత్నులు పదునెన
మండ్రతోడ, చుక్కలతోఁగూడిన చందురునింబోలె,నభిషిక్తుం
గావించిరి. అట్లు దీక్షితుండై యజినములు గట్టియున్న యావసు
దేవుఁ డపుడు పట్టువలువలు గట్టి కడియములను హారనూపుర
కుండలములను జక్కఁగా నలంకృతు లయియున్న తనపత్నుల
చేత నెంతయుఁ బ్రకాశించెను. ఆవసుదేవుని ఋత్విజులు క్రొత్త
పట్టుపుట్టములు గట్టి సదస్యులంగూడి, యింద్రుని యాగము
నందుంబోలె నెంతయు రాజిల్లిరి. అపుడు దేవేశ్వరులగు రాముఁ
డును కృష్ణుఁడును దనతన బంధువులను బుత్రులను భార్య
లను దమదమ విభవములను గూడి యెంతయు విరాజిల్లిరి.
అంత వసుదేవుఁడు జ్యోతిష్టోమ దర్శపూర్ణమాసాదు లయిన
ప్రాకృతములును, వానివలన వైకృతములైనవి యగు సౌర్య
సత్రాదులునగు నన్నింటిచేతను, అగ్నిహోత్రాదినామకము
లగు హోమములచేతను, ఘూత పురోడాశాది ద్రవ్యములను
సాంగకర్మములను గూర్చిన జ్ఞానమునకును దదనుష్ఠానముల
కును బ్రభుం డగు నీశ్వరుని, నిట్లు ప్రతియజ్ఞముచేతను
యజించిన వాఁడయ్యెను. అంత నావసుదేవుఁడు విహితకాల

మున యథోక్తములగు దక్షిణలను ననర్ఘములయిన గోవులను భూములను గన్యలను నలంకరించి చక్కఁగా నలంకృతులయిన ఋత్విజులకు నొసంగెను. ఆమహర్షులును విప్రులును, యజమానుఁడగు వసుదేవుని మున్నిడికొని పత్నీసంయాజలు అవభృథ్య లనెడు యాగములను యజించి పరశురామ హ్రదమందు నవభృథస్నానము చేసిరి. వసుదేవుఁడు స్నాతుఁడై యాభరణములను వస్త్రములను వందిజనుల కొసంగెను. అల్లి స్త్రీలును స్నానముచేసి చక్కఁగా నలంకృతలై యుండిరి. వారు సమస్త వర్ణములవారికిని గుక్కపర్యంత మన్నమిడి పూజించిరి. మఱి యతఁడు విదర్భకోసల కురురాజులును కాశిరాజును కేకయసృంజయులును మొదలుగాఁగల బంధువులకును వారిభార్యలకును ఋత్విజులకును నవ్వారిగా బహుమాన ద్రవ్యములొసంగి పూజించెను. సదస్యులును ఋత్విజులును దేవతా సమూహములును మనుష్యులును భూత పితృ చారణులును శ్రీనివాసుని కృష్ణుని యనుజ్ఞఁగొని యజ్ఞమును బొగడుచు వెడలిపోయిరి. ధృతరాష్ట్రుఁడును నతనిదమ్ముఁడు విదురుఁడును, భీష్ముఁడును, ద్రోణుఁడును, బృథయు, నకుల సహదేవులును, నారదుఁడును, భగవంతుఁడగు వ్యాసుండును, సుహృదులును, సంబంధులును, బాంధవులును, దమ బంధువులగు యదువులును నెయ్యము పొంగార మనంబులఁ గౌఁగిలించుకొని విరహమువలని దుఃఖముతోఁగూడి తమ దేశములకుఁ బోయిరి. అల్లి తక్కినజనులును బోయిరి. నందుఁడు తానును దక్కినగోపకులును, కృష్ణుఁడు రాముఁడు ఉగ్రసేనుఁడు మొదలగువారిచేతఁ బెనుపూజల నర్చితుండై బంధువులయందు మక్కువగలవాఁడు గాన, యచటనే వసించి

యుండెను. వసుదేవుఁడు యజ్ఞమును గూర్చిన తనమనోరథ మనెడి మహాసముద్రమును సుఖముగాఁ దాఁటి సుహృదులు బలసియుండ మనంబునఁ బ్రియంబు మల్లడిగొన నందునిఁ గేల నంటుచు 'అన్నా! మనుష్యులకు స్నేహ మని పేరుగల యొక పాశమును నీశ్వరుండు గావించియున్నాఁడు. దానిని నెట్టి శూరులకును బలిమిచేతఁ ద్రెంచుటకుఁగాని, యెట్టి యోగులకును జ్ఞానముచేతవీడుటకుఁగాని కడుఁ నరిది యనినాకుఁ దోఁచుచున్నది. ఒరులుచేసిన మే లిట్టిదియని తెలియనేరని మాబోఁటులకు, సత్తములగు మీ రెనలేని చెలిమిని నెఱపితిరిగాని యాది యింతవఱకుఁ మావలనఁ బ్రత్యుపకారము గాంచినదిగాదు అట్లది మాయెడ నిష్ఫలమే యైనను నిప్పటికిని మీరు నెఱపక విడిచినవారుగారు. కనుక నీశ్వరకృతమగు స్నేహపాశము దిగవిడువ నలవిగాకున్నది. 'మీయెడఁజూపిన చెలిమి విఫల' మెట్లందువా? అన్నా! తొల్లి కంసుఁడు బాధించుచున్నపుడు, మేము సమర్థుల మగుటం జేసి మీకుఁ గుశలమేమియుఁ జేసినవారము గాము. ఇపుడన్నన్ నైశ్వర్యమదంబున మీకుఁ గన్నులు గానకున్నందున మీరు తొల్లి చేసిన యుపకార మిదియని కనుఁగొన కున్నారము. మానదా! శ్రేయస్సును గోరుపురుషునకు రాజ్యంపు సిరి కలుగకుండుఁగాత. ఏలన మదాంధుఁడై కన్నుగానకుండు పురుషుఁడు సాధువులగు బంధువులను గానఁడు' అనెను. ఇట్లు నెయ్యము తియ్యముచే మనస్సు సలపలనై వసుదేవుఁ డానందుఁడుచేసిన చెలికారమును దలఁచుకొనుచుఁ గన్నులనీరు చిప్పిల్ల రోదనము చేసెను. నందుఁడును దన నెచ్చెలియగు వసుదేవునకును గోవింద రాములకును బ్రేమంబునఁ బ్రియంబు గావించుకొఱకు నేఁడు

తేపు ఎల్లిపోవచ్చు నని యదువులు వారించుచుండఁగా, నచట మూఁడు మాసములు వసించియుండెను. అంత వసుదేవుఁడు నుగ్రసేనుఁడును, కృష్ణుఁడును, ఉద్ధవుఁడును, బలుఁడును మొదలగువారు మిక్కిలి మేలయిన యాభరణములును బట్టువలువలును నానావిధములగు వెలలేనిపరిచ్ఛదములును మొదలుగా బహుమానవస్తువుల నొసంగి సకలకామితములను బూరించుచుండి పిదపఁబంపఁగా నందుఁడు తనగొల్లలతోను బంధువులతోను గూడి పయనమైపోయెను. నందుఁడును గోపికలును గోపకులును గోవిందచరణారవిందములు డెందంబునఁ దగిలినవి మరలఁ దివిచికొననేరక మధురకుం బోయిరి. బంధువులందఱును దరలిపోవఁగా, వృష్ణులు కృష్ణునే దేవతగాఁగొని వర్షాకాలము సమీపించుటను గాంచి మరల ద్వారకాపురమునకుఁ బోయిరి. వారట్లు పోఁగు యందలిజనులకా తీర్థయాత్రయందు వసుదేవుఁడు గావించిన యజ్ఞమహోత్సవమును, సుహృదులనెల్ల సందర్శించుటయు మొదలుగాఁగల విషయములను జెప్పిరి. ఇది యెనుబదినాలుగవయధ్యాయము.

---

### వసుదేవుఁడు శ్రీకృష్ణుని యాథాత్మ్యమును వర్ణించుట.

ఒకనాఁడు వసుదేవుఁడు తన పుత్త్రులిరువురును వచ్చి తన పాదముల కభివందనములుగావించియుండఁగా నా రామకృష్ణుల నెంతయు నభినందించి ప్రీతిగడలుకొన వారితో నిట్లనియె. అతఁడు మున్ను మునులు తనకొడుకుల ప్రభావమును సూచించిన మాటలనువిని వారివీర్యములం బెంతయు నమ్మిక గలిగి వారిని బిలిచి యిట్లనియె.—'కృష్ణా! కృష్ణా! మహాయోగీ!

సంకర్షణా! సనాతనా! మీరిరువురు నీజగమునకుఁ గారణభూతులగు సాక్షాత్ప్రకృతిపురుషు లనియును నారెంటికి విలక్షణులగు పరులనియు నే నెఱుంగుదును. ఎచ్చట, దేనిచేత, దేనినిబట్టి, దేనికి, దేనికొఱకు, నేదేది, యె, ట్లెప్పు డగునో యాయది యంతయుఁ *బ్రకృతి పురుషుల కీశ్వరుం డగు భగవంతుఁడవు నీవేకాని మఱొక్కటిగాదు. అధోక్షజా! ఆత్మస్వరూపా! నీచేత సృజింపఁబడినదై దేవ నరపశు వృక్షాదిరూపమున నానావిధమైయున్న యీజగత్తును నీకు శరీరభూతుఁ డయిన జీవాత్మచేత రక్షణమున కుపయుక్తముగాఁ జొచ్చి, ప్రాణమును జీవమును శరీరముగాఁ గలిగియు నాప్రాణజీవగతము లగు దోషములచే స్పృశింపఁబడకయె దీనిని దాల్తువు. విశ్వ శరీరముల సృష్టికి హేతువు లయిన ప్రాణములు భూతపంచకము పదునొకం డింద్రియములు మహదహంకారము లనెడి వీనికిఁ గార్యోపయుక్తములగు శక్తు లెవ్వియో యవి పరమాత్మ యగు నీవియె యగును. ఏలందువా! ఆ ప్రాణాదులు పరతంత్రములయినవి; మఱి యాయాదాని కాయాశక్తి మాత్రమే యుండుటంబట్టి యవి యొండొంటికి నసదృశములై యుండును గాన యట్టివాని కాశక్తులు సొంతములగునా? చేష్టలు చేయుచుండు దేహములచేష్టలు చేతనభూతులగు జీవపరమాత్మలవియె కాని యచేతనములవియగునా? ప్రాణాదుల కట్టివి యెట్లు గలుగును? చంద్రుని కాంతియు, నగ్నితేజమును, సూర్యుని ప్రభయు, నక్షత్రములయు మెఱుపులయుఁ బ్రకాశసత్తయు, పర్వతముల స్థైర్య

---

* ఇట, అధికరణము మొదలయిన కారకము లేడును జెప్పఁబడినవి. ఆయేడును నీవేయని యాశయము.

మును, భూమి వృత్తియగు గంధమును వాస్తవమునకు నీ
యగుదువు. జలములు లోకవృత్తిహేతువగుటయు, జీవనహే
వగుటయుఁ, దడుపుటయు, ఆజలములును, వానిరస వై
మాధుర్యమును సర్వమును నీవే-నీకు లోనయినవియె. వాఁ
వునకుఁగల (ఓజస్సును) ప్రవృత్తిశక్తియు, వేగమును,బలము
(ధారణశక్తియు) చేష్టయు గమనమును, నన్నియు నీశ్వరుఁ
వగు నీవేయగుదువు. దిశలకుంగల యావకాశమును దిక్కులు
నీవే. శబ్దమును దాని కాశ్రయమైన యాకాశమును నీ
శబ్దాభివ్యంజకమయిన యకారాది వర్ణమును. ఓంకారము
శబ్దవాచ్యములయిన యాకృతు లిరుదెఱం గగుటయు నీ
ఇంద్రియములకుఁ గల విషయ ప్రకాశకశక్తియు, అట్టిశక్తు
వానికి ననుగ్రహించు తదభిమానిదేవతలును నీవే. బుద్ధి
గల యధ్యవసాయమును, జీవునకు నబాధితమై సంస్కారజన
బగు జ్ఞానమును నీవే. ఆకాశాది భూతములకుఁ గారణంబగు భ
తాది యనంబడు తామసాహంకారమును, ఇంద్రియమ
కనుగ్రాహకమైన తైజసంబగు రాజసాహంకారమును, వివి
ద్రియముల కనుగ్రాహకమై తత్కారణంబై వైకారికంబ
సాత్త్వికాహంకారమును, ఆయాకర్మము లనుభవింపఁగా క
లిన కర్మములకు ఫలమునిచ్చు కర్మమును నీవే. మన
బంగారు మొదలగు ద్రవ్యములకు వికారములయిన కుండ
కుండలములు మొదలయిన వికారములు నశ్వరములయ్యు
వాని కాశ్రయములయి యున్నయాద్రవ్యములుమాత్ర మ
యవస్థలందును నశ్వరములుగాక యనువర్తించునట్లు నాన
భావములు నశ్వరములై వచ్చుచును బోవుచునుండియు, వ

కెల్ల నాశ్రయమై స్థిరమైయుండు భావమేదియో యది నీవయగు
దువు. సత్త్వము రజస్సు తమస్సు ననెడిగుణములును వానివృ
త్తులు నెవ్వియో యవి యన్నియుఁ బరబ్రహ్మం బగు నీయందు
యోగమాయచేత—అనఁగా నీసంకల్పరూప జ్ఞానముచేతఁ—
గల్పితములే యగును. కాఁబట్టి యిట్లు కల్పితములయిన భావ
ములగు మహదాదులు చిదచిత్తులకంటె వేఱగు నీయందుఁ
గలుగ నేరవు. అవి ప్రకృత్యాదులయందుఁ జిక్కియుండును. వాని
మూలముననే నీయందుండును. అవి నీయందు లేకయే యుండు
నపుడు నీ వావికారములలోపలఁ జొచ్చి యొప్పుచు నుండు
వని శాస్త్రములు వ్యవహరించుచున్నవి. సత్త్వాదిగుణ ప్రవాహ
రూపమగు నీసంసారమునందుఁ బడినవారు సర్వాంతరాత్ముండ
వగు నీదుసూక్ష్మంబగు యాథాత్మ్యమును దెలియనివారై
యజ్ఞానముచేతను దన్మూలకమగు పుణ్యాపుణ్యకర్మముల
చేతను సంచరించుచుందురు. ఈలోకమందు దుర్లభంబగు నిం
ద్రియపటుత్వము గలిగిన నరత్వమును బ్రాపించియు, ఈశ్వరా!
నీమాయచేతఁ దనకు శ్రేయస్సాధన మగు నా యాథాత్మ్య
జ్ఞానమందుఁ బరాకుగలిగిన పురుషునకు నాయువు, కట్టా! వ్యర్థ
ముగాఁ గడచి పోవుచున్నది, కాని నిలువదు. ఈ దేహమందును
దీనిని సంబంధించిన పుత్త్రదారాదులందును 'ఈదేహము నాది?
ఈపుత్త్రాదులు నావా' రని యీ స్నేహపాశములచేతఁ బశువు
మొదలుగాఁ గల యీ జగము నంతయు బద్ధము గావించు
చున్నావు. మీరిరువురు, మాకుఁ బుత్త్రులుగారు. మీరు సాక్షా
త్ప్రకృతి పురుషులరు. భూమికి భారముగానున్న క్షత్త్రియులను
రూపుమాపుటకై యవతరించినవారు. ఇట్లని నీవే యవతరించి

నపుడు చెప్పితివిగదా. ఆర్తబంధూ! కాఁబట్టి మఱియొక యుపాయమును జేపట్టక, నే నా పన్నులగు వారిసంసారభయమును దూలించు నీపదారవిందమును శరణుఁజొచ్చితిని. చచ్చునట్టి దేహమునం దాత్మయను భ్రమయును, బరుండవగు నీయందుఁ గన్నబిడ్డఁ డనుబుద్ధియుఁ, గలిగియున్నది గాన యిట్టివిషయాభిలాషమింతియుఁ చాలును. ఇఁక వలదు. విషయవైరాగ్యమును నాకొసఁగుము. 'నేను పరమేశ్వరుఁ డంటివే? ఇది యెట్ల'ని యడుగుదువా? మహాత్మా! నీవు పురిటింటియందు 'నేను గర్భవశమునఁ బుట్టుక లేనివాఁడయ్యును, నాచేసిన ధర్మమర్యాదలను రక్షించుకొఱకుఁ బ్రతియుగమును నవతరించుచున్నాను' అని చెప్పితివే! ఈచతుర్భుజుఁడగు దేవుఁడు వేఱొక్కఁడందువా? ఆకాశమంతటను వ్యాపించుచున్నను దనస్వభావమును విడువకుండునట్లు, నీవును నానాదేహములను దాల్చుచు విడుచుచుందువుగాని, నీస్వభావమును మాత్రము వదలకుందువని నేను భావించుచున్నాను. కాన ఉరుగాయా! సర్వగతుండవగు నీ విభూతులను మాయలను నెవ్వఁడెఱుఁగును' అనెను. సాత్వతసింహుఁడా భగవంతుఁడు తనతండ్రి చెప్పినవాక్యమును విని వినయవినమ్రుఁడై నవ్వుచు మెత్తనిమాటల నిట్లనియె—'తండ్రీ! మమ్మే బ్రహ్మముగాఁ బలికితిరి. సర్వమును బ్రహ్మాత్మకమనెడి యాతత్త్వసమూహమును మాకుఁ గలపుట్టకై మమ్ముద్దేశించి పలికితిరిగాని మఱేమికాదు. కాన మీరుచెప్పినమాటల విషయముపపన్నమె యగునని మేము తలంచుచున్నారము. యదుశ్రేష్ఠా! నేనును, మీరును, మాయన్న యితఁడును, ద్వారకాపురవాసులు నందఱును, వేయేల! చరాచరాత్మకమగు జగమంతయును

నిట్లె పరమాత్మాత్మకమనియుఁ దత్కారణకమనియుఁ దన్నిర్వా
హ్యమనియు నూహింపవలయును. ఏలనఁగా స్వయంప్రకాశ
స్వరూపుండును దేవాదులకు నన్యుండును నగుపరమాత్మ తా
నొక్కండయ్యును, దనచేత సృజింపఁబడిన గుణపరిణామాత్మక
ములగు మహదాదులచేత నవి సృజించినట్టిదేవమనుష్యాది
భూతములయందుఁ బెక్కుదెఱంగుల వ్యాపించియున్నవాఁ డని
ప్రమాణమువలనఁ దెలియుచున్నది. ఆకాశమును, వాయువు,
అగ్ని, జలములు, భూమియును, నవి కావించిన కార్యములందుఁ
జొచ్చియు నాయావ్యాప్యములకుఁ దగునట్లు వెలువడియు, కొం
చెముగను, బెద్దగను, ఒక్కటిగను, బెక్కులుగను నగుచున్నవి.
అట్లె యీపరమాత్మయు నొక్కయెడ బయలుపడియు, నొక్క
యెడ నల్పముగను, నొక్కయెడ విపులముగను, దనంతట నేక
ముగను, వ్యాప్యములు పెక్కింటినిబట్టి, పెక్కుదెఱఁగులుగను
నగుచున్నాఁడు' అనెను. ఇట్లు భగవంతుఁడు చెప్పినవాక్యమును
విని వసుదేవుఁ డబ్రహ్మాత్మకములు పెక్కులుగలవనెడి బుద్ధినశిం
పఁగా, మనంబునఁ బ్రీతినొంది మిన్నకుండెను. అంత సర్వదే
వతాత్మకుండగు భగవంతుఁ డవతరించిన పట్టుగాన సర్వదేవతా
ప్రాయయగు నాదేవకి తనపుత్త్రులు రామకృష్ణులు తమగురుండగు
సాందీపని పుత్త్రుని తెచ్చియిచ్చిరని మిక్కిలియు నబ్బురపడి కం
సుఁడు హింసించిన తనకొడుకులను దలంచుకొని యాయిరువురను
బిలిచి విన్నఁదనమునఁ గన్నుంగవల నీరుగ్రమ్ముచుండ జాలిపుట్ట
వారితో— 'రామా ! రామా ! అప్రమేయాత్మా ! కృష్ణా !
యోగీశ్వరేశ్వరా! మీరు విశ్వసృజులగు బ్రహ్మాదులకును నీశ్వరు
లనియు నాదిపురుషులనియు నే నెఱుంగుదును. కాలముచేత

సత్త్వగుణము తుదముట్ట నశించి శాస్త్రమర్యాద నుల్లంఘించి ప్రవర్తించుచు భూమికి భారమగుచున్న రాజులను దునుమటకై మీరిరువు రవతరించితిరి. విశ్వాత్మా! ఎవ్వని పదివేల పదివేలవపాలియుం దొకపాలిచేతఁ బ్రపంచమునకు నెల్ల నుత్పత్తి స్థితిలయము లగుచుండు నందురో యట్టివానిని నిన్ను శరణుఁ జొచ్చినారము. మీగురుఁడు సాందీపని చిరకాలమునకు మునుపు మృతుఁడయిన తనపుత్త్రునిఁ దెండని మిమ్ముఁ బురికొలుపఁగా, మీ రిరువురును యమసదనమునుండి నాతని పుత్త్రునిఁ దీసికొనివచ్చి గురుదక్షిణ యొసంగితి రఁట. మీ రిరువురు యోగీశ్వరేశ్వరులరు గదే. కాన యట్లె నాకోర్కెని సయిత మొనగూర్చుఁడు. అదేమియుఁ గాదు. కంసుఁడు చంపిన నా కన్నపుత్త్రులను మరలి రాఁ జూడఁగోరుచున్నాను' అనెను. ఇట్లు తల్లి పురికొలుపఁగా రామకృష్ణులు యోగమాయయం గైకొని సుతలమును జొచ్చిరి. సకలాత్మలకును దనకును దైవంబగు నాయిరువు రట్లు సుతలమును జొచ్చి వచ్చినారని తెలిసి దైత్యరాజగు బలి వారిని దర్శించు సొంపుపెంపు నెమ్మనంబున నిండుకొన, దిగ్గన లేచి సపరివారముగా వారికి నమస్కరించెను. పిదప వారికి వరాసనమును దెప్పించియిడఁగా ముదమున నమ్మహాత్ములిరువురు నందుఁ గూర్చుండిరి. అంత వారియడుగులను గడిగి యాజలమును దానును దనజనులును శిరంబునఁ దాల్చెను. ఆజలము బ్రహ్మమొదలుగా సకలమును బవిత్రము చేయునది గదా! అనంతర మతఁడు మిక్కిలి వెలపొడుగయిన వస్త్రాభరణములను అనులేపనములను బుష్కలముగా నొసంగి మాల్యములను ధూపదీపములను నర్చించి యమృతతుల్యము లగు

భక్త్యములను గుడువంబెట్టి తనగోత్రమును ధనమును దన్నును సమర్పించికొని యిట్లు పూజించినవాఁడయ్యె. ఆబలి యిట్లు ప్రేమరసార్ద్రంబగు బుద్ధిచేత భగవత్పాదాంబుజమును శిరంబునఁదాల్చి యానంద బాష్పములు గన్నులందురుల, మెయి గగురుపొడువ, కుత్తుక డగ్గుత్తికవడ నిట్లనియె—'అనంతుఁడును (శేషుఁడును) ఫణమండలి యొకభాగముచే విశ్వమును ధరించువాఁడు నగునీకు నమస్కారము. జగత్తునకు విధాతయు సాంఖ్యయోగములను బ్రవర్తింపఁ జేయువాఁడును, బ్రహ్మంబును బరమాత్ముండు నగు కృష్ణునకు నమస్కారము. మీయిరువుర దర్శనము కొన్నిభూతములకుఁ బడయ రానిదయ్యెఁ గొన్నింటికి నీకృపచేత సులభముగా నుండును. ఎట్లందురా? రజస్తమస్స్వభావులమగు మాకు యదృచ్ఛగా మీదర్శనము ప్రాప్తించిన దేకదా! దైత్యులును, దానవులును, గంధర్వులును, సిద్ధులును, విద్యాధరులును, యక్షరక్షః పిశాచులును, భూతములును, ప్రమథ నాయకులును మొదలుగాఁగల మేమును మఱి యిట్టివారయిన కంసాదులను శుద్ధసత్త్వమున కాశ్రయమై కేవలము శాస్త్రగమ్య మగు స్వరూపముగల నీయందు నిత్యమును మిక్కిలి బద్ధవైరులమైయున్న వారమయ్యును, బుండరీకాక్షా! యీ మేమందఱమును నీదు సాలోక్యమును సామీప్యమును సారూప్యమును సాయుజ్యమును బడిసినారము. ఏలనఁగా నీయందలి చిత్తవృత్తి యొకటియె, అది యేదియైనను, ఫలప్రాప్తికిఁ (ముక్తికి) గారణము సుమీ. కొందఱు నీయం దెడతెగని పగఁబూనియు, కొందఱు భక్తిచేతను, (గోపికాదులు) కొందఱు కామముచేతను నిన్నుఁబొందిరి. ఇట్లు వైరాదులు చూపిన

వారుంబోలె సత్త్వప్రధానులై నీకు సన్నిహితులై యుండు దేవాదులును నిన్నుఁ బడసినవారు గారు. యోగేశ్వరేశ్వరా! 'నీయోగమాయ యీస్వరూపముగలది,యిట్టిస్వభావము గలది' యని బహుతరముగా యోగీశ్వరులు సైతమెఱుఁగరు. ఇఁక మముబోంట్లు తెలియుట యెక్కడిది? ఇట్లు నీమాయకుఁగల స్వరూప స్వభావములు తెలియుటకును దరించుటకును గష్టములగుటం జేసి, నిష్కాములకు మిక్కిలియు వెదకందగియున్న నీ పదారవిందములందు బుద్ధిగలిగి, పాపయుక్తంబగు గృహమనెడి చీఁకటి నూతినుండి వెలువడి, వృక్షములక్రిందఁ దమంత రాలిపడియున్న పండ్లుమొదలగు వానిచేఁ బొట్టఁ బోషించికొనుచు, నేను శాంతుఁడనై యొంటిగాఁగాని సర్వసఖులగు మహాత్ములం గూడికాని చరించున ట్లనుగ్రహింపుము. నీకు నియామ్యములై యున్న సకల చరాచరములకు నీశుండవుగదే! నీవు మమ్ము, వలయు కైంకర్యమును దెలిపి శిక్షింపుము. ప్రభూ! మమ్ముం బాపరహితులను గావింపుము. పురుషుఁ డెవ్వఁడు శ్రద్ధతో నీశాసనమందు వర్తించునో వాఁడు కర్మబంధమునుండి విడివడుచున్నాఁడు' అనెను. భగవంతుఁడు బలితో 'తొల్లి స్వాయంభువమన్వంతరమందు మరీచికి నూర్ణయను భార్యయందుఁ బుత్త్రు లార్వురు కలిగియుండిరి. ఆదేవతలు, బ్రహ్మ తనకూఁతురగు సరస్వతితో రతిసల్పఁ బూనియుండుటను జూచి యుపహాసము చేసిరి. అట్లా ప్రజాపతిని బరిహసించుటం బట్టి యాదుష్టకర్మమువలన వా రాసురయోనిని బొంది యపుడే హిరణ్యకశిపునకుఁ బుట్టిరి. వారు యోగమాయచేత నక్కడనుండి తేఁబడి దేవకి కడుపునందుఁ బుట్టిరి. రాజా! వా రాకంసునిచే

హింసితులైరి. ఆదేవకి వారిని దన కన్నబిడ్డలుగాఁ దలఁచి దుః ఖించుచున్నది. ఆవీరలు నీయొద్దనున్నారు. మేము మాతల్లి శోకము నుడుపుటకై యిచటనుండి వీరిని గొనిపోవుచున్నారము. అంత వీరు పాపములనుండి విడివడి దుఃఖములును వీడి పుణ్యము లోకమును బొందుదురు. వారు స్మరుఁడు ఉద్గీథుఁడు, పరిష్వం గుఁడు, పతంగుఁడు, క్షుద్రభుక్కు, ఘృణి యని పేళ్లంబరఁగు దురు. ఈ యార్వురును, నా ప్రసాదముచేత మరల సద్గతిని బొందుదురు' అనిరి. అంత నాయిరువురును వారిని దోడ్కొని బలిచేతఁ బూజితులై మరల ద్వారవతికి వచ్చి తల్లికి నాపుత్రు లను నొసంగిరి. ఆదేవియు నా బాలకులనుజూచి పుత్త్రస్నేహము వలనఁ జన్నుంగవ చేఁపఁగా, వారిని బిగియఁ గౌఁగిలించికొని, యొడియందిడి, మాటిమాటికి శిరము మూర్కొనెను. ఎవ్వనిచేత నీసృష్టియంతయుఁ బ్రవర్తించుచున్నదో యట్టివిష్ణుని మాయచే మోహితయై యాదేవకి యాబిడ్డలను దాఁకుటవలన మీఁదు మిక్కిలి చేఁపుచున్న చన్నులను బ్రీతిగడలుకొనఁ గుడిపిన దయ్యె వారును నమృతమయంబగు నాయచన్నుఁ బాలను, గదాధరుండగు హరి త్రావి మిగిలినట్టి దానిని, ద్రావి నారాయ ణుని యంగముల సంస్పర్శమువలన స్వాత్మపరమాత్మ స్వరూప జ్ఞానమును మరలఁ బడసినవారయిరి వారు గోవిందునకును దేవకి కిని వసుదేవునకును బలరామునకును నమస్కరించి సమస్త భూతములును జూచుచుండఁగా నాకాశంబునఁ దమనెలవునకుఁ బోయిరి. దేవకీదేవి యట్లు మృతులయినవారు వచ్చుటయుఁ బోవుటయునుజూచి మిక్కిలియు నచ్చెరువడి, యదియంతయుఁ గృష్ణుండు గావించిన మాయయని తలంచెను. అనంత వీర్యుఁ

డును బరమాత్ముండునగు కృష్ణుఁడు గావించిన యిటువంటి వీర్య కర్మములు మిక్కిలి యద్భుతము లయినవి యనంతములుగా నున్నవి' యనెను. సూతుఁడు 'నిర్మలకీర్తియగు శ్రీకృష్ణుని యీచరిత్రమును జగముల పాపము లెల్లఁ దూలించి కృష్ణభక్తులకుఁ బరమ సుఖావహమగు కర్ణాభరణమై వెలుంగుదానిని, వ్యాసపుత్రులగు శుకులచే వర్ణితంబగుదానిని, నెవ్వఁడు వినునో లేక యొకరికి వినిపించునో వాఁడు భగవంతునియందు మనస్సు నిలిపి, కాలాది భయరహితం బగుటం జేసి క్షేమం బగు భగవంతుని దివ్యధామంబును బొందుచున్నాఁడు' అనెను. ఇది యెనుబదియేనవయధ్యాయము.

## సుభద్రాహరణ కథ.

పరీక్షిత్తు - 'బ్రాహ్మణోత్తమా ! రామకృష్ణుల చెలియలును నాకుఁ బితామహియునగు సుభద్రాదేవి నర్జునుఁ డెట్లు పెండ్లాడెనో యావిధమును వినఁగోరుచున్నాను' అనెను. శుకుఁడు— 'ప్రభుండగు నర్జునుఁడు తీర్థయాత్ర వెడలి భూమిని గ్రుమ్మరుచు నంతఁ బ్రభాసతీర్థమును జేరి యచటఁ దన మేనమామ కూఁతురయిన సుభద్రను దుర్యోధనునకుఁ దక్కిన వసుదేవాదు లీయ నొల్లకున్నను బలరాముఁడు బలవంతముగా వాని కీయ నున్నాఁడని వినెను. అంత నక్కాంతను బడయ నువ్విళ్లూరుచు, బలరాముని వంచించుటకుఁ ద్రిదండియగు నొక యతివేషము వేసికొని ద్వారకకుఁ బోయెను. అతఁ డచ్చటఁ దన ప్రయోజనమును సాధించుకొనుటకు వార్షికమాసములు నాలుగును వసించి పురజనులచేతను మహాత్ముండగు రామునిచేతను మాటిమాటికిఁ

బూజలందుచు నుండెను. బలుం డొకనాఁ డతనిని నతిథిగా నిమంత్రించికొని గృహమునకుఁ దోడ్కొనివచ్చి శ్రద్ధతో నన్నమును వడ్డించి కుడువంబెట్టెనఁట. అతఁడును నయ్యెడ వీరుల కెల్ల మనస్సు రంజిల్లఁజేయుచున్న యాగొప్ప కన్యారత్నమును బ్రీతిచేఁ గన్నుంగివ దద్దయు వికసిల్లఁగాంచి యామించుబోఁడి యందు విరాళిచేఁగలంగి మనస్సు నిలిపినవాఁడయ్యె. ఆచెలువయు నారీజనుల మనంబుల కెంతయు నింపుగూర్చుచున్న యా సొగసుకానిం జూచి కడఁగన్నుల నునుసిగ్గు నూల్కొన నవ్వుచు నతనియందు మనంబును జూడ్కులను నెలకొలిపి వలచినదయ్యె. అర్జునుఁడును నా కులుకులాఁడినే యెప్పుడును దలంచుకొనుచుఁ, గొంపోవుటకుఁ దెఱపిఁగోరుచు మనంబు మిక్కిలి బలీయ మగు మరులునఁ దిరుగుడువడుచు నున్నందున రామాదు లెంత సత్కరించినను సుఖము గానఁడయ్యె. అప్పు డొకగొప్ప దేవోత్సవము వచ్చెను. ఆసమయమున సుభద్ర, రథారూఢయై ప్రాకారదుర్గము వెలువడఁగానే మహారథుఁ డర్జునుఁ డంతకు మునుపే కృష్ణునియుఁ దలిదండ్రులగు దేవకీ వసుదేవులయు ననుమతినొంది యాసుందరీమణి నపహరించికొని పోయెను. అంత నతఁడు రథస్థుఁడై గాండీవముగొని నలుగడలఁ జుట్టు ముట్టుచున్న శూరులగు భటులను బాఱఁదోలుచుఁ బెఱవారగు యదువులు బిట్టు మొఱయిడఁగా మృగరాజు తనభాగము గొనిపోవునట్లు సుభద్రను గొనిపోయెను. అట్లు సుభద్ర నపహరించికొని పోవుటను విని బలరాముఁడు పర్వమందు మహార్ణవ ముంబోలె మిక్కిలియుఁ గలంగి క్రుద్ధుఁడయ్యెను; కాని కృష్ణుఁడును దక్కన సుహృదులును నతనియడుగులు పట్టుకొనఁగా



2290. అర్జునుఁడు సుభద్రను గొనిపోవుట.

మిల్లెను. అంత బలుఁడు ముదంబున వధూవరులకు నరణ
గా మిక్కిలి విలువగల యలంకారములతోఁ గూడియున్న
నుఁగులను రథములను నశ్వములనును మీఁటయిన దాసి
ను బంపెను. అపుడు బంధువు లగు యదువులును బాండవు
ు నానందమున నెమ్మొగంబు లుల్లసిలినవారయిరి. భక్తు
పురగొడఁ గృష్ణుఁడు చూపిన వాత్సల్యము, నొక్కటిని
ము.—కృష్ణునకు శ్రుతదేవుఁడను నొక బ్రాహ్మణోత్తముఁడు

### శ్రుతదేవ బహులాశ్వులను కృష్ణుఁ డనుగ్రహించుట.

క్తుఁడై యుండెను. అతఁడు భగవంతుఁ డగు కృష్ణునియం
న్యప్రయోజనంబగు నేకాంతభక్తి గలిగి దానిచేతనే పూర్ణ
నోరథుండగుటం జేసి శాంతినొంది యుండెను. అతఁడు విద్వాం
ఁడు గాన విషయలంపటుఁడు గాకుండెను. అతఁడు విదేహ
శమునందు మిథిలాపట్టణమున వసించియుండెను. అతఁడు
హస్థుఁడుగాని, తానేమియుఁ బ్రయత్నింపక తనంతటనే దైవ
మునవచ్చిన భోజనపదార్థముచేత నతిథిపూజనాదులగునిజక్రి
ఁలు నిర్వర్తించుకొనుచుండెను. అతఁడు తనదేహయాత్రకు
లయునంతియు యాహారమును బ్రతిదినమును దైవమువలన
దురుచూచుచుండునుగాని యంతకుమీఁద నొల్లఁడు. అంత
మాత్రము చేతనే తుష్టుఁడై వర్ణాశ్రమోచితము లగు పంచ
హాయజ్ఞాది క్రియలు విధ్యుక్తముగాఁ గావించుచుండెను.
శ్రుతదేవునివలెనే, యా విదేహరాష్ట్రమునకు రాజయిన బహు
శ్వుఁడును నుండెను. అతఁడు జనకవంశము వాఁడు.
హత్త్వాభిమానము లేనివాఁడు. ఈశ్రుతదేవ బహులాశ్వు
రువురును నచ్యుతునికిఁ బ్రియులై యుండిరి. భగవంతుఁడు

వారలకుఁ బ్రసన్నుండు కాఁగోరి దారుకుఁడు దెచ్చిన రథము నారోహించి మునులతోడంగూడి విదేహదేశమునకుఁ బయనమై పోయెను. ఆమునులు, నారదుఁడును, వామదేవుఁడును, అత్రియు, కృష్ణుఁడును, రాముఁడును, అసితుఁడును, అరుణుఁడును, నేనును (శుకుఁడును) బృహస్పతియు, కణ్వుఁడును, మైత్రేయుఁడును, చ్యవనుఁడును మొదలగువారగుదురు. దారియందచ్చటచ్చట శుక్రాంగారకాదిగ్రహములతోడం గూడిన సూర్యుండుదయించినట్లు మునులంగూడిన యచ్యుతుండు రాఁగాఁ బురజనులును జానపదులును జేతులందు నర్ఘ్యములుగొని యెదురు వచ్చి పూజించిరి. ఆనర్తము, ధన్వము, కురుక్షేత్రము, వంగము, మత్స్యము, పాంచాలము, కుంతి, మధువు, కేకయము, కోసలము, అర్ణము, మొదలగు దేశములందును, మఱియుఁ దక్షిణ దేశములందునుగల పురుషులును బడఁతులును మేలయిన నగవును నెయ్యము గలుగు చూడ్కులునుగల యాకృష్ణుని ముఖారవిందమునందలి లావణ్యరసమును గ్రోలిరి. ముల్లోకములకును గురుండయిన యాహరి,తన్ను దర్శించుటచేత నాజనుల కన్నులు గ్రమ్మిన యజ్ఞానంబను చిమ్మచీఁకటిని దుదముట్టఁ దూలించి వారికి శ్రేయంబగునట్లుగా నరగంటిచూడ్కుల ననుగ్రహించుచు, దిగంతములవఱకుఁ దెల్లనై పర్వి యశుభములనెల్లఁ బోకార్చు తనయశస్సును, దేవతలును మనుష్యులును, బాడుచుండఁగా వినుచు, మెల్లమెల్లన విదేహదేశమునకు వచ్చెను. అచ్యుతుఁడు వచ్చెనని వినఁగానే యందలిపురజనులును జానపదులును ముదఁబంది హస్తములందుఁ గానుకలుగొని యెదురువచ్చిరి. వార యుత్తమశ్లోకునిని దొల్లి వినియున్న యమ్మునులనును దర్శించి

ప్రీతిచేతఁ గన్నుఁగవలును నుల్లములును వికసిల్ల, నంజలులు గీలించి యందఱును నమస్కరించిరి. ఆజగద్గురుండు తమ్ము నను గ్రహించుటకై వచ్చెనని తలంచుచు, విదేహరాజగు బహులా శ్వుఁడును శ్రుతదేవుఁడును నా ప్రభుని పాదములంబడి మ్రొక్కిరి. అంత నామైథిలుఁడును శ్రుతదేవుఁడును నాకృష్ణునిని నాబ్రాహ్మ ణులనును, నిద్దఱు నొక్కటనే చేతులుమొగిచి యాతిథ్యము కొనుటకు నిమంత్రణముగావించిరి. భగవంతుఁ డా యిరువుర నిమంత్రణము సంగీకరించి యాయిరువురకును బ్రియముగావింప నెంచి యాయిద్దఱ గృహములనును, నొకరింటికిఁ బోవుట మఱి యొకరికిఁ దెలియకుండునట్లు ప్రవేశించెను. దుర్జనులగు వారలకు వినుటకయినను దవ్వుగానుండునట్టి యమ్మహాత్ములు తనగృహ మునకు రాఁగా మేలయిన యాసనములను దెప్పించి మహా యశుండు జనకుండు వారిని సుఖాసీనులంగావించి భక్తి పెచ్చు పెరుఁగి, మనంబున హర్షం బుప్పొంగ,కన్నుల నానందాశ్రువులు చిప్పిల్ల, వారి యడుగులను గడిగి, లోకపావనములయిన యా జలములను సకుటుంబముగా శిరంబునఁదాల్చి గంధము, మాల్య ములు, వస్త్రములు, భూషణములు, ధూపదీపములు, అర్ఘ్యము లు. గోవృషములును నొసంగి యా యాశ్వరాత్మకులను బూజిం చెను. వారందఱకును నన్నము లిడి తృప్తులంగావించి కృష్ణుని యడుగులను నొడి యందిడికొని యల్లల్లన పిసుకుచు ముదంబు పొదల తీయనిపలుకుల వారి నుల్లసిలం జేయుచు నిట్లనియె. 'విభూ ! నీవు సర్వభూతములకును నంతరాత్ముఁడవు, సాక్షివి, స్వయంప్రకాశుఁడవు. కావున నాయభిప్రాయము నెఱింగి నీ పదాంభోజములను స్మరించుచున్న మాకు దర్శనమొసంగితివి.

మఱియు నీ 'వేకాంతభక్తునికంటెను నాకు సఖుఁడయిన శేషుఁడును భార్యయగు లక్ష్మియు, బుత్త్రుఁడగు బ్రహ్మయును బ్రియులుగా'రని చెప్పియున్నావు. ఆమాటను దృఢము గావించుటకై నీవు మాకన్నులకు గోచరుండవయితివి. నీకు భక్తులే యత్యంత ప్రియు లని తెలిసినవాఁ డెవఁడేని నీపదారవిందము విడుచునా? విడువఁడు ఏలన నడుగవలసినదేదియు లేకుండు నిష్కించనులును, జితాంతఃకరణులగుటఁ జేసి శాంతులు,నగు మునులకు నీవు నిరతిశయ పురుషార్థభూతుండగు నిన్నె యిచ్చుకొందువు. కాఁబట్టి నిన్నెవఁడేని విడుచునా? ఈప్రకృతి మండలమందు సంచరించుచున్న జీవులకు సాంసారిక తాపత్రయమును నుపశమింపఁ జేయుటకై యదువంశమం దవతరించి ముల్లోకముల పాపములను హరించు నిజయశస్సును నొడఁగూర్చునట్టి భగవంతుఁడగు నీకు నమస్కారము. లోకసుఖకారకుండగుటం జేసి కృష్ణుండును, కృతజ్ఞతముండు గాన యకుంఠమేధస్కుండును, లోకక్షేమకరంబగుతపంబూనియున్న నారాయణ ఋషి రూపంబున నెలకొనియుండువాఁడును నగు భగవంతునకు నమస్కారము. భూమా! నీ వీ మునులతోడ మాయింటఁ గొన్నిదినములుండి నీపాదరజముచే మా యీ నిమికులమును బవిత్రము గావింపుమీ' అనెను. ఇట్లు రాజు ప్రార్థింపఁగా లోకపావనుండా భగవంతుఁడు మిథిలయందలి పురుషులకును స్త్రీలకును శుభంబుగావించుచు నందు వసించియుండెను. శ్రుతదేవుండును, నచ్యుతుండు తనగృహమునకు వేంచేయఁగా జనకునివలెనే నతనికిని మునులకును మ్రొక్కి హర్ష ముప్పొంగఁ బుట్టము విదుల్చుచు నృత్యము చేసెను. అంతఁ దృణమయములయిన పీఠము

లనును ఋసులను దెప్పించి వారి నాసీనులంజేసి స్వాగతంబడిగి, యభివందనముగావించి వారలయడుగులను భార్యయుఁ దానును గడిగెను. అట్లతఁడు హర్షము పెచ్చు పెరుఁగ సర్వమనోరథము లనుబడసి యాజలములచేఁ దన్నును దనగృహమువారిని దోఁచెను. అంత ఫలములు, గంధపుష్ప ధూపదీపాదు లగు కానుకలు, వట్టివేళ్లు, నిర్మలములై యమృతమువలెఁ జవులొలుకు జలములును, వాసనలు గుబాళించు కస్తూరి, తులసి, కుశలు, దామరలు, సత్త్వము వర్ధిల్లఁజేయు శుద్ధాన్నము మొదలుగా ననాయాసమున నొనఁగూడు నిట్టిపూజచేత వారి నారాధించెను. ఆశ్రుతదేవుఁడు తనలో—'నేనో యిల్లనెడి చీఁకటి నూఁతిలో బడినవాఁడను. ఇట్టి నాకుఁ గృష్ణునితోడను, కృష్ణునిమూర్తి నునికిపట్టులై సర్వతీర్థముల కాశ్రయములైన పాదరేణువులు గలిగియున్న యిట్టి బ్రాహ్మణోత్తములతోడను సంగమ మెట్లు గలిగెనో కదా!' యని వితర్కించెను. ఇట్లువారును సుఖముగాఁ గూర్చుండి యాతిథ్యమును బడసినపిదప శ్రుతదేవుఁడు నిజగృహమునకు దయచేసిన యా హరిని, భార్యయుఁ దాను నడుగులు పుడుకుచు నిట్లనియె.—'నీవు ప్రకృతిపురుష విలక్షణుండవు. కావున నుత్కృష్టుండవు. మఱి నీసంకల్పముచేత నీజగము నంతయు సృజించి యెప్పుడును వికృతిపడక యొక్కరూపుననే యుండు నీయాత్మ స్వరూపముచేత దీనిని బ్రవేశించితివి. పురుషుఁడు నిదురించినపుడు వానిని శరీరముగాఁగల పరమాత్ముఁడు తనకు శరీరభూతుఁడైన యాజీవుని మనోరథము చొప్పునఁ దన సంకల్పముచేతఁ బసుండియున్న దేహమునకు వేఱై నిదురించు జీవుని కర్మమునకుఁ దగినదై యిప్పటికి మాత్రముండునట్టి దేహా

మును జొచ్చి యాజీవుఁ డనుభవించు దేశాంతరగమన రాజ్యాభిషేకాదులు తనకుఁ దగులకయే యందుఁ బ్రకాశించుచున్నాఁడు గదా.*ఇట్లే జగత్తును నిర్మించియుండుఁ దన సంకల్పముచేతఁ బ్రవేశించి యందలి దోషముల తగులు లేకయే ప్రకాశించుచుండును. నీకథ లెప్పుడును వినుచుండువారును, జెప్పుచుండువారును, నిన్నుఁ జూచుచుండువారును, నీకభివందనములు గావించుచుండువారును, నిన్నుగుఱించి యొండొరులతో ముచ్చటలాడుచుండువారును, కావుననే పరిశుద్ధాంతఃకరణు లగువారునగు మనుజులకు హృదయమందె వెలుంగుదువు గాని కన్నులకు గోచరింపవు. కర్మములచే మనస్సులు దూలినట్టివారికి నీవు హృదయమందే యుండియు దూరమందే యున్నవాఁడవు. ఇట్లెవ్వరికిని గన్నుల కగపడనివాఁడవయ్యు నాకన్నుల కగపడితివి. దుర్లభంబగు నీ దర్శనము నాకు లభించినది. మనంబున, రజస్తమంబులును దత్ప్రయుక్తములగు కామక్రోధాదులు ననుగుణములు గలవారికి నీవు దగ్గఱనుండియు, దేహాత్మాభిమానాదులచే నీకలరూపును నొడఁగూర్పని నీమాయాది శక్తులచేత నీవు గ్రహింపరాకుందువు. కాన హృదయమందుండియు దూరస్థుఁడవయ్యెదవు. నీకలరూపు నెఱింగినవారికిఁ బ్రాప్యంబగు నాత్మవై, నీయందు మనం బర్పింపనివారికి నిజసంకల్పముచేత మృత్యువును గూర్చువాఁడవు; సమస్తలోకముల నుజ్జీవింపఁజేయుటకై యనుగ్రహాకారణమునఁ గర్మమూలముగాని దివ్యమంగళ విగ్ర

---

* ఇచట జగత్సర్గమునకు అందలి ప్రవేశమునకును, స్వాప్నసర్గమును అందలి అనుప్రవేశమును దృష్టాంతము. ఉభయత్ర జీవద్వారముగా అనుప్రవేశమును, వ్యాప్యగత దోషములు తగులకుండుటయు సమానములు.

హము దాల్చి నిజమాయచేత మోహితులై నిజయాథాత్మ్యము
మును దెలియనివారి కెఱుకను గప్పుచు ముక్తి నీయకుండు
వాఁడవు; ఇట్టి నీకునమస్కారము. ఇట్టినీవు నీభృత్యులగు మమ్ము
నను శాసింపుము. దేవా! నీ కేమియిష్టము గావింతుము? ముక్తి
నడుగక మత్కైంకర్యమునే యడుగనేల యందువా? మను
ష్యులకుఁ గలుగు తాపత్రయము నీవు కన్నుల కగపడునంత
వఱకే కాన, నీకైంకర్యమే కావలయును' అనెను. అతఁ డట్లు
చెప్పినది విని ప్రణతార్తి హరుండగు భగవంతుఁ డతని కేలు
తన కేల గీలుకొలిపి నవ్వుచు నతనితో 'బ్రాహ్మణోత్తమా! ఈ
మునులు నిన్ననుగ్రహించుకొఱకు నిటవచ్చినవారని యెఱుం
గుము. నన్ను హృదయమందుఁ గలిగి వీరు తమపాద రేణువుల
చేత లోకములను బావనముచేయుచు సంచరించు చుందురు.
భగవంతుని ప్రతిమలును, అయోధ్యా మథురాది పుణ్యక్షేత్ర
ములును, గంగాది తీర్థములును దీర్ఘకాలమునకే పావనము
చేయును. అవియట్లు సేయుటయు మద్భక్తుల కటాక్షము మహి
మచేతనే సుమీ. సమస్తప్రాణులలోపల నిందు శ్రేష్ఠులు మను
ష్యులు; వారలలోపల బ్రాహ్మణుఁడు జన్మమునుబట్టి యెక్కుడు.
బ్రాహ్మణులయందును, దపస్సుగలవాఁ డెక్కుఁడు. వానికంటెను,
వేదాంత విద్యగలవాఁ డెక్కుడు. వానికంటెను నిత్యసంతోష
ముతోఁ గూడినవాఁ డెక్కుడు. ఇఁక నాయుపాసనముతోఁ
గూడినవాఁ డెక్కుడని చెప్పనేల? వేయేల? ఈ రెండు భుజ
ములో నాలుగుభుజములో కల నారూపమునయితము నాకళ
తోఁగూడిన బ్రాహ్మణునికంటె నాకుఁ బ్రియముకాదు. ఏలనఁ
గా సర్వవేదమయుఁడు బ్రాహ్మణుఁడు; సర్వదేవమయుఁడను

నేను. వేదము నాకుఁ బ్రమాణముగాన వేద ప్రచురుం డగు విప్రునకంటెను దేవమయుం బగునాతనువు ప్రియముగాదు. దురహంకారముచేత దేహాత్మాభిమానులై కొంద ఱసూయపాలై నాభక్తు లిటువంటివారిని తెలియక యర్చాదులయందే పూజ్యములను బుద్ధిగలిగి మదాత్మకుండగు గురుండును నాకాత్మభూతుఁడైనజ్ఞానియు నగు విప్రుని నవజ్ఞ సేయుచున్నారు. చరాచరాత్మకమయిన యీ విశ్వమును, ఈవిశ్వమునకు హేతువులయిన మహదాది పదార్థములును సర్వమును, విప్రుఁడు మదాత్మకములని బుద్ధిని దలంచుచున్నాఁడు. నాభక్తు లిట్టివారగుట వలన, బ్రాహ్మణోత్తమా! ఈబ్రహ్మర్షులను మిక్కిలి యాదరము తోడ నర్చింపుము. ఇట్లు సేయుదువేని, నేనే నాయంతట నర్చితుండ నగుదును. నాభక్తుల నర్చింపక మిక్కిలి పుష్కలములైన యుపచారములచేత న న్నర్చించినను నే నర్చితుండను గాను' అనెను. ఇట్లు ప్రభుండగు భగవంతుఁ డాజ్ఞాపింపఁగా నాశ్రుతదేవుఁడు కృష్ణునిని నా బ్రాహ్మణోత్తములనును బరమాత్మబుద్ధితో నారాధించి సజ్జనులగతియగు ముక్తినిబొందెను. ఇట్లు భక్తులకు భక్తుఁడగు నాభగవంతుఁడు తనభక్తులగు శ్రుతదేవబహులాశ్వులకు సాధుజనమార్గంబుగా ననుష్ఠింపఁదగు ధర్మప్రకారమును నుపదేశించి యందుఁ గొన్నిదినము లుండి యంత మరలి ద్వారవతికిఁ బోయెను. ఇది యెనుబదియాఱవ యధ్యాయము.

## శ్రుతిగీతలు.

రాజు.—'బ్రాహ్మణోత్తమా! శ్రుతులు జాతి గుణ క్రియాదులను విశేషణములను నిమిత్తముగాఁ గొని యవిగల వస్తువులనే పేర్కొనుచున్నవి. కాని యట్టి విశేషణములనుగొని యవి లేని మఱియొక వస్తువులను బేర్కొనవు. బ్రహ్మము చేతనాచేతనములు రెంటికిని సజాతీయముగా నందున నిట్టి దట్టి దని నిర్దేశింప శక్యముగాదు. ఏలన నది చిత్తునకును నచిత్తునకును రెంటికిని విలక్షణమును వేఱు నయినది. కాన చిదచిత్తులకుఁ బేరుపెట్టుటకు నిమిత్తమయిన జాతియుఁ గ్రియయు దానికిఁ గలుగవు. మఱి యాయావస్తువులకుఁ బేరుగలుగుటకు నిమిత్తమయిన గుణములును దానికిఁ గలుగవు, బ్రహ్మమిట్టిదై యుండఁగా, చిదచిత్తులను గుఱించునట్టి శ్రుతులు, చిదచిత్తులజాతి గుణక్రియాదులు లేని యాబ్రహ్మమునందు * ముఖ్యవృత్తిచేత నెట్లు వర్తించు

* అభిధా (ముఖ్య) వృత్తి లక్షణావృత్తియని శబ్దవృత్తులు రెండు. ఒక శబ్దము తనకు సంకేతితమైన యర్థమునందు వర్తించుట (అగ్నిశబ్దము అగ్నియను అర్థమునందే వర్తించుట) అభిధ. 'బ్రాహ్మణుఁడు అగ్ని' అనుచో అగ్నిశబ్దము తనకు నియతమైన అర్థమునే వర్తింపక అగ్నివలెఁ బరిశుద్ధుఁ డనెడి అర్థమును లక్షించుచున్నదిగాన లక్షణ. ఒకశబ్దము ఒకవస్తువునకుఁగల జాతి గుణము క్రియ అను వీనినిమిత్తముగా దానికి పేరై వర్తించుచున్నది. కనుక దాని ప్రవృత్తికి ఈజాత్యాదులు నిమిత్తములగుచున్నవి. కనుక ఒక్కొక్క శబ్దమును ప్రవృత్తినిమిత్తములేక ఒకవస్తువునందు పేరై వర్తింపదు. శ్రుతులందలి శబ్దము లిట్టివేకాక తీఱదు. కనుక శ్రుతులందు చిదచిత్తులను గుఱించిన శబ్దములు చిదచిత్తుల జాత్యాదులను ప్రవృత్తినిమిత్తములు చేసికొని వానియందుఁ బ్రవర్తించుచున్నవి. బ్రహ్మమో చిదచిత్తుల జాతిగుణక్రియలు లేనిది. జాత్యాదులు ప్రవృత్తినిమిత్తములుగాన యివి బ్రహ్మమునకు లేనపుడు

చున్నవి?' అని యడిగెను. అందులకు శుకుఁడు.—'భగవం
తుఁడు జీవులకు నంతరాత్ముఁడై యుండి నామరూపములు నిర్వ
హించువాఁడగు కొఱకు బుద్ధిని నింద్రియములను మనస్సును
బ్రాణములు మొదలుగా మహాభూతములను సృజించి వానిని
దనకు శరీరముగాఁ జేసికొని తన్నయుఁడై శరీరిగావున వాని
పేళ్లచేఁ దాను ముఖ్యవృత్తిని జెప్పఁబడుచున్నాఁడు. అసత్ప్రా
యులగు జీవులకుఁ దన్నారాధించుటకు సాధనములుగా దేహాదు
లను గలిగించుకొఱకును, అట్లారాధించువారికి నిశ్శ్రేయసం బనెడి
యభ్యుదయము గలుగుకొఱకును, అట్టిముక్తికి సాధనం బగు
నధ్యాత్మజ్ఞానము నిష్పన్నమగుకొఱకును, జ్ఞానైకాకారములగు
నాత్మలయందు దేవమనుష్యాది భేదకల్పనము లేకుండుకొఱకును,
నిట్లు జగత్సృష్టిని జేసినవాఁడయ్యె. ఇట్లు సర్వశబ్దములును
బ్రహ్మమునందే ముఖ్యవృత్తిని వర్తించుచున్నవని బ్రహ్మమును
గూర్చిన యీవ్యుత్పత్తి మిక్కిలియు రహస్యమయినది; మఱి
యుపనిషదర్థ విచారముచేతఁ దెలియఁదగినది. ఇది పూర్వుల
లోపలఁ బూర్వులయిన వామదేవాదులచేత నిశ్చయింపఁబడినది.
ఇట్టి వ్యుత్పత్తిని బురుషుఁడెవఁడు శ్రద్ధతోఁ దాల్చునో వాఁడు

---

వానిశబ్దములు బ్రహ్మమునందు వర్తింపరాదు. అయినను శ్రుతులు చిదచిద్వాచక
ములైన శబ్దములను అందులకుఁ బ్రవృత్తినిమిత్తములగు జాత్యాదులులేని బ్రహ్మము
నందుఁ బ్రవర్తింపఁజేయుచున్నవి. అవి లక్షణావృత్తిచేత నట్లు ప్రవర్తింపఁ
జేయుచున్న వన్నచో 'సర్వేవేదా యత్పదమామనన్తి' 'వేదైశ్చసర్వైరహమే
వవేద్యః' ఇత్యాది శ్రుతులు ఆశబ్దములను ముఖ్యవృత్తిచేతనే యందుఁ బ్రవ
ర్తింపఁజేయుట ప్రతిపాదించుచున్నవి. కనుక శ్రుతు లట్లు చెప్పుట యెట్లు?
అని ప్రశ్నము.

కోరవలసిదేదియులేని యకించనుఁడై ముక్తిని బొందుచున్నాఁడు. ఈప్రశ్నవిషయమున నారాయణుని సంబంధించిన యొక గాథను నీకువర్ణించి చెప్పెదను. అది నారదునకును నారాయణ ఋషికిని జరిగిన యొకసంవాదము. భగవత్ప్రియుం డగు నారదుఁడు లోకములందుఁ గ్రుమ్మరుచుండి యొకప్పుడు పురాణ ఋషియగు నారాయణుని దర్శించుటకు బదర్యాశ్రమమునకుఁ బోయెను. ఆమహర్షి మనుష్యులకు నభ్యుదయముకొఱకును, మోక్షము కొఱకును, వర్ణోచిత ధర్మమును బ్రకృతి పురుషులకు విలక్షణుఁడనిఁగాఁ దన్నుఁగాంచెడి జ్ఞానమును రాగద్వేషాదులు లేమియును గలిగి కల్పపర్యంతము స్వాత్మోపాసనరూపం బగు తపము నీ భారతవర్షమం దూనియున్నవాఁడు. ఆనారాయణాశ్రమమందుఁ గలాపగ్రామ వాసులును బరమాత్మస్వరూపధ్యాననిష్ఠులు నగు ఋషులు బలసియున్న నారాయణుని నీవడిగిన దీనినే నారదుఁ డడిగెను. ఆఋషియుఁ దక్కిన ఋషులు వినుచుండఁగా నారదునకుఁ దొల్లి జనలోకనివాసు లగు తమ పూర్వులకును సనందాది బ్రాహ్మణులకును జరిగిన సంవాదమైన యీవిషయము నేచెప్పెను. శ్రీభగవంతుఁడు.—'నారదా! తొల్లి జనలోకమందుఁగల బ్రహ్మమానసపుత్రులును నూర్ధ్వరేతసులును జన్మించిన దాదిగా జితేంద్రియులునగు సనకాదులు బ్రహ్మసత్రము పరబ్రహ్మగుణానుభవాత్మక మైనదానిని జరిపిరి. నీవపుడు శ్వేతద్వీపమునకు నందలి యీశ్వరునిం గాంచుటకు బోయి యుంటివి. అప్పు డందు బ్రాహ్మణులకు వాదమొకటి జరిగెను. ఆవాదమందు శ్రుతులు లైకకంఠ్యమునొంది సుఖముగా నుండెను. అచ్చట నీవు నన్నడిగిన యీప్రశ్నమును నందులకుఁ

బరిహారములును గలిగినవి. అనఘా! వానినెల్ల నీకుఁ జెప్పెదను. వినుచుండుము.—అందుఁగల వారెల్ల శ్రుతమునందును దమము నందును శీలమునందును సమానులు. తనవారు పెఱవారు మధ్యస్థులను మువ్వురును వారికి సమానులు. ఇట్లందఱును బరస్పర సమానులయ్యును వారిలో నొకనిని (సనందనునిఁ) * బ్రవచనము సేయువానిని (చెప్పువానిని)గా నేర్పఱచి తక్కిన (సనకుఁడు మొదలగు) వారందఱును వినువారయియుండిరి. సనందుఁ డిట్లనియె.—భగవంతుఁడు తాను సృజించిన యీ చిదచిదాత్మకమగు జగత్తును దానులోఁగొని నామరూపవిభాగానర్హములు గావించి ప్రకృతి పురుష కాలములనెడు తనశక్తులు సూక్ష్మావస్థము లైన వానితోడ నిరవధిక స్వానందానుభవ రూపమున నిదుర యందుండఁగా, ప్రళయము తుదను (సృష్టికిఁ దొలుత) నతని యూర్పులయిన శ్రుతులు, మూర్తులు దాల్చి యాపురుషుని యసాధారణలక్షణములు నెత్తి చెప్పి యతనిని మేలుకొలుపు వానివలె స్తుతించినవి. భృత్యులగు వందిజనులు వేకువను వచ్చి శోభనములగు శ్లోకములచేఁ దమ సమ్రాట్టును బరాక్రమప్రకాశకములగు శ్లోకములచే స్తుతించునట్లు స్తుతించినవి.—శ్రుతులు—'సమస్తమును జయించిన ప్రకృతిచేతఁ గూడ జయింపఁబడని వాఁడా! నీ యందు లీనములై యున్న జీవులకు సంసారహేతువయిన ప్రకృతి సంబంధమును విడిపించుమీ! నీకు జయజయము. సాపరాధ జనులయందు దోషములున్నను, వారియందించించుకగల గుణములనే కైకొనుచుందువు గదే. కనుక జీవుల

---

* బ్రహ్మసత్రమునందు నందఱును జ్ఞానవంతులైయున్నను ఒక్కనిని జెప్పు వానిఁగా నేర్పఱచి తక్కినవారు వినుటయే బ్రహ్మసత్రమనఁ దగును.

సంసార మూలమగు ప్రకృతిని దొలంపుము. అందులకుఁదగిన జ్ఞానాదులు నాకు లేవందువా ? నీవు నీయంతట జ్ఞానశక్తిబలైశ్వర్యాదు లగు షడ్గుణములను గయికొని యున్నవాఁడవు! స్థావరజంగమములను శరీరములు గావింపఁబడఁబోవు ప్రకృతిగుణములకును, నట్టి శరీరము లాశ్రయింపఁబోవు *జీవులకును, గల శక్తులనెల్లఁ దమతమ కార్యోన్ముఖము లగునట్లు మేలుకొలుపువాఁడా ! ప్రకృతిపురుషులచే విశిష్టుఁడవై జగదాకారమునం బరిణమించుచున్న గనుక నిన్ను వేదములు - వేదములందు చిదచిద్వాచకము లగు శబ్దము - లభిధావృత్తిచేత ననువర్తించుచున్నవి. బ్రహ్మము సర్వము నుపసంహరించినను మిగిలియున్న సృష్టికాలమం దుత్పన్నమయినయీ జగత్తును బ్రహ్మమని వేదాంతములు తెలుపుచున్నవి. కార్యంబగు నీజగత్తునకు దేనివలన నుదయమును దేనియందు లయముగలుగునో, యాకారణంబగు బ్రహ్మము, కుంభమొదలగు వికారములొందినను నావికారములకంటె వేఱుగాకుండు మృత్తునుంబోలెఁ దన వికారమైన యీబ్రహ్మమునకంటె వేఱుగా నేరదు. ఇట్లు నీవు సర్వకారణుఁడవగుటంబట్టి ఋషులు నిన్నే ధ్యానించుచు నిన్నే స్తుతించుచు నీకొఱకే చేష్టించుచునుందురు. ఆకాశమునం దడుగులిడినవోఁ దలక్రిందుగాఁ బడవలసివచ్చును. పుడమిపయి నిడినచోఁ బడుట లేదు. కాన యది వ్యర్థమెట్లు మనుష్యులకుఁ గాఁగలవుగి? అట్లె, నిన్నుగుఱించిన మనోవాక్కాయ చేష్టితములు నీ కారాధనములై సాంసారికతాపనివారకము లగుచున్నవి.

---

* జీవులకు ప్రలయదశయందు చిచ్ఛక్తి సంకుచితమై మూఢమైయుండును గాన, దానిని వికసింపఁజేయుటయే వారిని మేలుకొలుపుటయని తెలియునది.

తక్కినవారిని గూర్చినవో యట్లుగాక పతనహేతువు లగుచున్నవి. కనుక ఋషులు నీయందే త్రికరణములు నిలుపుచున్నారు. జగజ్జన్మస్థితిలయములు మూఁటికిని నిర్వాహకుఁడా ! కాఁబట్టి వివేకు లగుసూరులు, చెప్పుచును వినుచునుండు వారందఱు పాపములను దూలించునట్టి నీకథామృత మహార్ణవమందు నోలలాడియె యాధ్యాత్మికాది తాపములను దిగవిడిచిరి. ఇఁక ధ్యానపరు లట్టితాపములు విడుచుట చెప్పనేల ? పరమా ! నిన్నుగుఱించిన జ్ఞానముచేత రాగాదిమనోవృత్తులును జరామరణాదికాల గుణములును దూలించినవారు నిత్యజ్ఞానానందాత్మకమగు నీస్వరూపమును సమాధిచేత సాక్షాత్కరింతురు. కాన వారు తాపములను విడుతురని చెప్పవలయునా ? నిన్నాశ్రయించుటకుఁ దగుజన్మముల నొందియు నిన్నువిడిచి ప్రాణేంద్రియములను దృప్తిసేయుటయం దాసక్తిగల శబ్దాదివిషయచపలు లగుదురేని, గాలి నింపినతోలుతిత్తులవలె వారూర్పులు విడుచువారేకాని మఱేమికాదు. వారి చేతన జన్మమే వ్యర్థము. నీవీక్షించుట యనెడి నీసంకల్పమువలన సత్తనుబడసి నీవు లోనఁ జొచ్చుటంజేసి మహదహంకారాదు లండమును సృజించినవయ్యె. అచేతనములకు * నీసాక్షాద్రూపమయిన యనుగ్రహము గలుగనందున వానికిఁ గారణత్వము గలుగనేరదు † (ఆనందవల్లియందు) అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞాన

---

* ఇట ఈక్షత్యధికరణమునందలి పూర్వపక్షమునకుఁ బరిహారము చెప్పఁబడినది.

† ఇట ఆనందాధికరణమునందలి పూర్వపక్షమునకుఁ బరిహారము ప్రతిపాదితము.

మయానందమయము లనెడి వానియందుఁ జరమంబును బురుషాకారముతో నన్వయించి యుండునదియునగు నానందమయమును నీవేకాని ప్రత్యగాత్మ గాదు. ఏలందువా ? చిదచిదాత్మకమగు ప్రపంచమే యాకారముగాఁగలిగియుండుట నీకుఁ బొసఁగునేకాని *బద్ధముక్తాది జీవులకుఁ బొసంగదు. మఱి యీ చిదచిదాత్మక జగత్తునకు విలక్షణుఁడై (అనఁగా దాని యంతరాత్మగాఁ జొచ్చియున్నవాఁడై) యుండుటయు నీవే. మఱి యీ యన్నమయాదులు నాలుగును సంహృతములై నను మిగిలియున్నదగుటంజేసి నిర్వికారంబగు నానందమయ రూపతత్త్వమును నీవే. వేదాంతవిహితములైన యుపాసనమార్గములలో సూక్ష్మమతులగు వారిలోఁ గొందఱరుణ వంశ్యులు (దహరవిద్యానిష్ఠులు)హృదయ పుండరీకాంతర్గతమగు దహరాకాశమురూపుననున్న నిన్నుపాసింతురు. వైశ్వానరవిద్యానిష్ఠు లగువారుదరమందు జఠరాగ్నిశరీరకుం డయిన నిన్నుపాసింతురు. కొందఱు సుషుమ్నానాడి మార్గమందున్న నిన్నుపాసింతురు. అనంతా ! ఆహృదయమునుండి పరమం బయిననీయుపాసనస్థానం బగు శిరస్సు (భ్రూమధ్యము) వఱకు, నామధ్యనాడి యూర్ధ్వముగా నాక్రమించి యుండును. ఆనాడీమార్గమును నుపాసకు లెల్ల వారును బొంది మరల నీప్రకృతిమండలమందు మృత్యుముఖంబగు సంసారమునందుఁ బడరు. సర్వోపాదానములై నీవు రచించినట్టివియు దేవమనుష్యాది భేదములచే విచిత్రములయినవియు

---

* ఇట ఈక్షితమై యనుగ్రహించుట జీవులకు సంభవింపదుగాన నీయందే యది పొసఁగునని సముదాయాభిప్రాయము. శరీరాత్మత్వము సర్వశరీరకుఁడగు నీయందె పొసఁగునని భావము.

సగు శరీరములుగల జీవులలోపల నీవంతరాత్మవై చొచ్చితివొ, యగ్నితనంతట నెక్కువతక్కువల వాసి లేకున్నను దాను జొచ్చిన తృణకాష్ఠాదులననుసరించి యట్టియెక్కుతక్కువలతోఁబొడకట్టు నట్లు,నీవును నీవురచించిన యోనులకుఁగల జ్ఞానమందలియెక్కువ తక్కువల వాసితోఁగూడి యాయోనుల ననుకరించుచున్నావు. కాని యీయోను లుపసంహృతములయినపుడు నీవుపసంహృతుఁ డవుకావు. ఏలన, నీస్వరూప మవిచ్ఛిన్నానందమైనది; కనుకఁ గార్యములందుఁ జొచ్చుటవలన వాని దోషములందుఁ దగులు నొందవు. అట్టి నీస్వరూపమును నిర్మలమతు లుపాసించి పొందుదురు. నీచేత రచితములై నీకు నివాసభూతములయిన యీ దేవమనుష్యాది దేహములయం దున్నవాఁడును, సకలమైన యాశ్చర్యశక్తుల ధరించిన నీదు సంకల్పమనెడి జ్ఞానముచేతఁ గల్పితుఁడైనవాఁడును, లోను వెలిని వ్యాపింపఁ జాలువాఁడును, సంకోచహేతు రహితుండును, బురుషాకారుండు నగు నీ విగ్రహమును వేదాంతములు ప్రతిపాదించుచున్నవి. నీదు పురుషాకార విగ్రహ మిట్టిదనియు మనుష్యజన్మ మిది నిన్నారాధించుటకుపయుక్తమైనదనియు విచారముచేసి నిశ్చయించి భూతలమునఁ గొందఱువివేకులు ప్రాణేంద్రియములను జయించి వేదములకుఁ బ్రతిపాదనవిషయం బగునదియు సేవించువారికి సంసారమును దూలించునదియు నగు నీయంఘ్రిని మిక్కిలియు దృఢవిశ్వాసముతో నుపాసించుచున్నారు. నీకలరూపు కష్టపడియుఁ దెలిసికొన నలవి గాకుండుటవలన దానిని బ్రకాశింపఁజేయుకొఱకు రామకృష్ణాది దేహము లొందిన నీదుచరిత్ర మనెడునమృత మహాసముద్రమందు నోలలాడి యధ్యాత్మికాది తాపములను

వీడినవాఁడు, ఈశ్వరా ! నీచరణారవిందములను బొందిన రాయంచ లగుభాగవతులకులమును గూడి యాసంగమువలన గృహదేహా ద్యనురాగములు వీడినవారై యపవర్గమును సయితము కాంక్షింపరు. పక్షికోటివలె నున్న యీనరశరీరము నిన్నారాధించుట ననువర్తించునేని యాత్మాదులతో సాటి యగును. అయినను నసత్తులగు శబ్దాదివిషయములను సేవించుటంజేసి యిది తుదను స్థావరత్వమును గలిగించునట్టిదిగాన, యాత్మఘాతుకులైనవారు కూలంకషానందమయుండును గావునఁ బ్రియుండును హితుండునగు పరమాత్మయగు నీయం దక్కటా! నిరతిశయగుణం బగు నిట్టిదేహమునొందియు రమింపరు! పాపము వారు పూర్వకర్మశేషసమూహములు పయిపయిని దేహములను గలిగించుచుండుటవలన మహాభయంబగు సంసారమందు భ్రమించుచుందురు. కాన వారు కుత్సితదేహాభాజులై కేవలము శోచనీయులుగా నున్నారు. ప్రాణములను నింద్రియములను మనస్సును నడంచిపుచ్చి దృఢంబగు నుపాసనయోగమును సలుపునట్టి మునులు తమహృదయమం దే నీస్వరూపము నుపాసింతురో దానినే నీశత్రువులును బ్రీతిలేకయే స్మరించి నిన్నుఁ బొందిరి. అట్లే గోపికలును సర్పరాజ దేహముంబోలిన నీదు భుజదండములం దాసక్తిగలిగి దానినే పొందిరి. వేయేల! వేదాభిమాని దేవతలమగు మేమును, నీపదారవిందమే యమృతముగాఁగలవార మందఱమును, నీయందు సమానకక్ష్యులమై మునిప్రభృతులవలె నిన్నే పొందుచున్నారము. ఇటీవల నుత్పత్తినాశములను బొందిన పురుషుఁ డీలోకమునం దెవఁడు సృష్టికిఁ బూర్వము సూక్ష్మచిదచిత్తులతోఁగూడి కారణముగా నెలకొని

సగు శరీరములుగల జీవులలోపల నీవంతరాత్మవై చొచ్చియు, యగ్నితనంతట నెక్కువతక్కువల వాసి లేకున్నను దాను జొచ్చిన తృణకాష్ఠాదులననుసరించి యట్టియెక్కుతక్కువలతోఁ బొడకట్టు నట్లు,నీవును నీవురచించిన యోనులకుఁగల జ్ఞానమందలియెక్కువ తక్కువల వాసితోఁగూడి యాయోనుల ననుకరించుచున్నావు. కాని యీయోను లుపసంహృతములయినపుడు నీవుపసంహృతుఁ డవుకావు. ఏలన, నీస్వరూప మవిచ్ఛిన్నానందమైనది; కనుకఁ గార్యములందుఁ జొచ్చుటవలన వాని దోషములందుఁ దగులు నొందవు. అట్టి నీస్వరూపమును నిర్మలమతు లుపాసించి పొందు దురు. నీచేత రచితములై నీకు నివాసభూతములయిన యీ దేవమనుష్యాది దేహములయం దున్నవాఁడును, సకలమైన యాశ్చర్యశక్తుల ధరించిన నీదు సంకల్పమనెడి జ్ఞానముచేతఁ గల్పితుఁడైనవాఁడును, లోను వెలిని వ్యాపింపఁ జాలువాఁడును, సంకోచహేతు రహితుండును, బురుషాకారుండు నగు నీ విగ్ర హమును వేదాంతములు ప్రతిపాదించుచున్నవి. నీదు పురుషా కారం విగ్రహ మిట్టిదనియు మనుష్యజన్మ మిది నిన్నారాధించుట కుపయుక్తమైనదనియు విచారముచేసి నిశ్చయించి భూతలమునఁ గొందఱువివేకులు ప్రాణేంద్రియములను జయించి వేదములకుఁ బ్రతిపాదనవిషయం బగునదియు సేవించువారికి సంసారమును దూలించునదియు నగు నీయంఘ్రిని మిక్కిలియు దృఢవిశ్వా సముతో నుపాసించుచున్నారు. నీకలరూపు కష్టపడియుఁ దెలిసి కొన నలవి గాకుండుటవలన దానిని బ్రకాశింపఁజేయుకొఱకు రామకృష్ణాదిదేహము లొందిన నీదుచరిత్ర మనెడునమృత మహాసముద్రమందు నోలలాడి యధ్యాత్మికాది తాపములను

వీడినవాఁడు, ఈశ్వరా ! నీచరణారవిందములను బొందిన రా యంచ లగుభాగవతులకులమును గూడి యాసంగమువలన గృహదేహా ద్యనురాగములు వీడినవారై యపవర్గమును సయి తము కాంక్షింపరు. పక్షిగూఁటివలె నున్న యీనరశరీరము నిన్నారాధించుట ననువర్తించునేని యాత్మాదులతోఁ సాటి యగును.అయినను నసత్తులగు శబ్దాదివిషయములను సేవించుటం జేసి యిది తుదను స్థావరత్వమును గలిగించునట్టిదిగాన, యాత్మ ఘాతుకులైనవారు కూలంకషానందమయుండును గావునఁ బ్రియుండును హితుండునగు పరమాత్మయగు నీయం దక్కటా! నిరతిశయగుణం బగు నిట్టి దేహమునొందియు రమింపరు!పాపము వారు పూర్వకర్మశేషసమూహములు పయిపయిని దేహ ములను గలిగించుచుండుటవలన మహాభయంబగు సంసార మందు భ్రమించుచుందురు. కాన వారు కుత్సితదేహభాజులై కేవలము శోచనీయులుగా నున్నారు. ప్రాణములను నింద్రియ ములను మనస్సును నడంచిపుచ్చి దృఢంబగు నుపాసనయోగ మును సలుపునట్టి మునులు తమహృదయమం దే నీస్వరూపము నుపాసింతురో దానినే నీశత్రువులును బ్రీతిలేకయే స్మరించి నిన్నుఁ బొందిరి. అట్లే గోపికలును సర్పరాజు దేహముంబోలిన నీదు భుజదండములం దాసక్తిగలిగి దానినే పొందిరి. వేయేల! వేదాభిమాని దేవతలమగు మేమును, నీపదారవిందమే యమృత ముగాఁగలవార మందఱమును, నీయందు సమానకక్ష్యులమై ముని ప్రభృతులవలె నిన్నే పొందుచున్నారము.ఇటీవల నుత్పత్తి నాశములను బొందిన పురుషుఁడీలోకమునం దెవఁడు సృష్టికిఁ బూర్వము సూక్ష్మచిదచిత్తులతోఁగూడి కారణముగా నెలకొని

యున్న నిన్నెఱుంగును? శాస్త్రముచేతఁగాక యెవ్వఁడు నెఱుంగఁడుగదే ! ఏలనఁగా నీవలననుండి బ్రహ్మపుట్టెను. అతని పిదప నివృత్తినిష్ఠు లగు సనకాదులును బ్రవృత్తినిష్ఠు లగు మరీచ్యాదులుననెడి యుభయ దేవగణములును బుట్టిరి. ఇఁక వారికిఁ బిదప మనుష్యులుపుట్టిరని చెప్పవలయునా? కాన యట్టివారికిఁ దొంటి నీ స్వరూపమెట్లు తెలియును? నీవు శాస్త్రమును సపకర్షించికొని హృదయమందుఁ బెట్టికొని పరుండినపుడు, సృష్టికిఁ బూర్వకాలమున, సత్కార్యావస్థమగు చిత్తును, నసత్కార్యావస్థమగు నచిద్వస్తువును మిశ్రరూపంబగు కాలప్రవృత్తియు నీసృష్టికి విషయము గాకుండెను. * అనఁగా నప్పు డొక్కటియు లేకుండెను. సత్కార్యవాదులై యసత్తగు ద్రవ్యమునకు నుత్పత్తియు (సత్తయ) సద్ద్రవ్యమునకుఁ బిదప మృతియును దార్కికులు తలంతురు. ఆత్మయందు స్థూలుఁడు కృశుఁడు మనుష్యుఁడు మృగము మొదలగు భేదములును, మఱికొందఱు చార్వాకులు తలంతురు. వాణిజ్యఫలతుల్యమగు స్వర్గాదిక ఫలమును సత్యమని కొందఱు (మీమాంసకులు) తలంతురు; ఇట్లు తార్కికాదులు కేవలము తలంచుటయే కాక యుక్త్యాభాసములచేత నుపదేశింతురు. సత్త్వాదిగుణమయప్రచురుఁడు జీవుఁడేకాని వానికి వేఱగు నీశ్వరుఁడు గాఁడని కొందఱు (నిరీశ్వరసాంఖ్యులు) తలఁతురు. మతభేదము లిట్లున్నవి. ఇవియన్ని నీకలరూపును దెలియమిచేతఁ గలుగునవేకాని మఱేమిగాదు. ఆప్రకృతి పురుషులకంటె విలక్షణుండును జ్ఞానస్వరూపుండును నగు నీవుకలరూపునఁ దెలియఁగా

* 'ఏకో హ వై నారాయణ ఆసీత్ న బ్రహ్మా నేశానో నేమే! ద్యావాపృథివీ' అను శ్రుత్యర్థమిట అనుసంహితము.

నాయజ్ఞానమును దన్మూలమగు వాదభేదములును, గలుగనేకలు
గవు. మనుష్యులవఱకునున్న సకలదేహులకును గల త్రిగుణాత్మ
కమగు మనస్సు కార్యకరంబువలెఁ దోఁచుచున్నను నీయందుఁ
గార్యకరము కాకున్నది; చిదచిదాత్మకమగు జగత్తుచే విశిష్టుఁడై
దానికాత్మయగు నిన్నుఁ దెలుపకున్నది. నిన్నుపాసించు యోగ
ముచేఁ బరిశుద్ధాంతఃకరణములు గలవారీసమస్త జగత్తును
(సచ్ఛబ్దవాచ్యంబును, సూక్ష్మచిదచిద్విశిష్టంబును గారణంబు
నగు బ్రహ్మమే కార్యంబగు జగద్రూపంబున నెలకొని యు
న్నది. కాన యది యతనికంటె వేఱుగాదని యిట్లుపాసించి)
పరబ్రహ్మమునకు విశేషణ మగుటంజేసి యుపాస్యకోటిలోఁ
జేరిన దగుటవలన జగత్తునయిత ముపాదేయమే యని కనుఁ
గొనుచున్నారు. బ్రహ్మాత్మక మగుటంజేసి తద్వికృతియైన జగత్తు
హేయము గానేరదు. బంగారు వికారములయిన కటక మకు
టాదులును బ్రకృతియగు నాబంగారు మయము లేకాని దానికి
వేఱుగానందున వానిని దిగవిడువరు గదా! అట్లె తాను గావిం
చిన జగత్తునందుఁ బరమాత్మయును బ్రవేశించి యున్నాఁడు.
కాఁబట్టి యీజగత్తును, నుపాస్య పరమాత్మ శబ్దవాచ్యముగా
నిశ్చితమై యున్నది. సమస్తజంతువులకును ధారకుండ వని
నిన్నెవ రఖిలాంతరాత్మునిఁగా నుపాసింతురో వారే మృత్యువు
తలపయిని సరకుసేయక యడుగిడితొ్రక్కి దానినుండి విడివడు
దురు. బ్రహ్మ సర్వాత్మకమని యుపాసింపనివారిని శాస్త్రమనెడి
చక్కని యుపదేశముచేతఁ, బశువును ముకుఁద్రాటంబట్టి
యడఁచి పుచ్చునట్లు సన్మార్గమునకుఁ దెచ్చుచున్నావు. అనఁగా
వారు శాస్త్రమూలమున నీ వట్టివాఁడవని క్రమముగా నుపా

సించి ముక్తినొందుదురు. నీయందుఁ బెడమొగము లేక సౌహృదము గలిగియుండు నీదుభక్తులు శాస్త్రాధికారరహితులయ్యును నాయజ్ఞులను బవిత్రులను గావింతురు గదా. అనఁగా భాగవతసేవచేత నట్టివారును ముక్తినొందుదురు. శాస్త్రాధికారము లేకున్నను సజ్జనసేవయు నొల్లకుండు నట్టివారికి నధోగతియె కలుగును. నీవు సంకల్పమాత్రముననే సకలజగత్తును నిర్మించువాఁడవు. మఱి కర్మవశ్యుండవు గానందున స్వతంత్రుండవు. నిమిత్తోపాదానకారణ సంప్రదానాది కరణాదులయిన సమస్తకారకములకును, దదీయశక్తులకును నిర్వాహకుఁడవు. ప్రకృతిపరతంత్రులగు వాయువు సూర్యుఁ డగ్ని యింద్రుఁడు మొదలయిన దేవతలును బ్రజాపతులును మఱి యెవ్వరెవ్వ రేయే యధికారముల నుందురో వారందఱును నీవలన భీతులై నీకుఁ దమతమ యధికారముల ననువర్తించుట యనెడి పూజను, భారతాదివర్షములం దుండు ప్రజలు సార్వభౌమునకు బలియిడునట్లు, సమర్పింతురు. నీవొసంగెడి భోగముల ననుభవింతురు. స్థావరజంగమ సంస్థానములగు సమస్త ప్రాణులును, బ్రకృతివలన దుఃఖనిమిత్తమగు శరీరములతోఁ గూడియున్నవియే కాన యెవ్వరికిని బ్రకృతిసంబంధము ద్రోసిపుచ్చరాకున్నది. కొంద ఱెప్పుడేని ప్రకృతి సంబంధము వీడుదురేని, నీకటాక్షముచేతనే వారి కావిముక్తి గాని మఱియొకటిచేతఁగాదు. నీవు హేయములనుండి యెంతయు విముక్తుఁడవు గదే. నీవు పరమ కారుణికుఁడవు? దోషములకించుకయుఁ బట్టుగాకుండుటవలన నీ కెందును నీడుంజోడు గలుగదు. ఇట్టి నీదుకరుణకు విషయమైనవాఁడును విషయముగాని వాఁడును లేఁడు. అప్పుడు

'నేను వైషమ్యముగల దోషినిగదా' యందువేని యాకాశము వలె నీవు వ్యాప్యగత దోషముల కించుకయుఁ బట్టుగావు; కనుక, నీకీడుంజోడు నెందును లేకుండును. ధ్రువా! అసంఖ్యేయులును నిత్యులునగు జీవులు సర్వగతు లగుదు రేని, యప్పుడు పరమాత్మ చేతఁగాని జీవునిచేతఁగాని నియమము జరుగుట పొసఁగదు. ఏలన నందఱు సములై యుందురుగదా. మఱియు * నుత్క్రాంతి గత్యాగత్యాదులందు శ్రుతులు చెప్పునట్టి నియమమును బొసఁగదు. మఱి యొకవిధమున (అనఁగా నణుత్వమున) నీనియమాదులు పొసఁగుచున్నవి. జగ మెవ్వనిమయమై పుట్టునో యాబ్రహ్మము, లోపలనుండియె నియమించు చున్నాఁడను. నిది చక్కఁగాఁ దెలియనివారికిఁ గల మతము దుష్టమగుటచేఁ బ్రామాణికుల కది యనభిమతమే యగును. ప్రకృతియుఁ బురుషుఁడును నజులగుటంజేసి వారికి నుత్పత్తిగలుగదు. అయినను గలిగియున్న జలముల యవయవములే వాయు ప్రేరితములై యొండొంటిం గలియఁగా జలమునందు బుద్బుదము లుత్పత్తి

* ఉత్క్రాంతి- 'తేనప్రద్యోతేనైష ఆత్మానిష్క్రామతి చక్షుషోవా మూర్ధ్నోవా అన్యేభ్యోవా శరీరదేశేభ్యః' అని ఆత్మ, కన్నులు మొదలగువానినుండి వెలువడుననియు గతి 'యేవైకే చాస్మల్లోకాత్ప్రయన్తి చన్ద్రమసమేవ తేసర్వే గచ్ఛన్తి' అనియు, ఆగతి 'తస్మాల్లోకాత్పునరేత్యస్మైలోకాయ కర్మణే' యనియుఁ జెప్పఁబడుచున్నది. జీవుఁడు సర్వగతుఁడయినచో కన్నులు మొదలగు వానినుండి ఉత్క్రమించుటయు ఒకచోటినుండి మఱియొకచోటికిఁ బోవుటయు ఒకచోటనుండి మఱియొకచోటికి వచ్చుటయుఁ బొసఁగవు. ఈ యుత్క్రాంతి మొదలగునవి జీవుఁడు సర్వగతుఁడు గాక అణుస్వరూపుఁడయిననే పొసఁగునుగాన యదియె యిట యనుసంధించు చున్నాఁడని తేఁ యునది.

నొందునట్లు, గలిగియున్నట్టి ప్రకృతిపురుషుల పరస్పరసంయోగముచేతఁ బ్రాణులు వివిధనామ రూపములతోఁ గూడి యాధారభూతుండగు నీయందుఁ గలుగుచున్నవి—అనఁగా ప్రకృతిపురుషులకు నుత్పత్తిలేకున్నను బరస్పరసంయోగము వలన దేవమనుష్యాది శరీర విశిష్టరూపమున నుత్పత్తి గలుగుట పొసఁగుచున్నది. కాఁబట్టి యీ ప్రాణులు ప్రలయదశయందు దా నామరూపములను దిగవిడిచి,నదులు సముద్రమునందునుబుష్పరసములు తేనెయందును లీనమగునట్లు, నీయందు విభాగానర్హములై లయించుచున్నవి. ఈమనుష్యులందు నీప్రకృతిచేత దేహాత్మాభిమానాది రూపమగు భ్రమము, పిఱుంద సంసారమును గలిగించునదై యున్నదిగాన యిదియె సంసారమునకు హేతువని నిశ్చయించి సుధీజనులు నీయందు మిక్కిలియుఁ దమభక్తినుంతురు. నిన్ననువర్తించి భజించువారికి సంసారభయమెట్లు గలుగును ? కలుగనే కలుగదు. ఎవ్వరికి నీవు శరణముగావ్రో వారియందే నీ బొమముడి రూపమగు మూఁడునేముల—అనఁగా శీతోష్ణవర్షాదుల-మయమై సంవత్సర రూపమగు కాలము సంసారభయమును గలిగించుచున్నది. మిక్కిలియుఁ జంచలమై యింద్రియములను బ్రాణములను జయించినట్టివారికిని నడంపరానిదై యున్న మనంబనెడి యశ్వము నెవ్వరు నియమించుటకై గురువుచరణమును విడిచి వే ఱుపాయములంబడి కష్టపడుచుఁ బూనుదురో వారు బహువ్యసన పరంపరలచేఁ గుంది, కర్ణధారుఁడు లేనివణిజులు సముద్రమునందుంబోలె సంసారసాగరమందుఁ జిక్కి దుఃఖమునకే పాలుపడుదురు. సర్వవిధసుఖమయుం డగు ప్రియతముఁడు నీవుండఁగా మను

ష్యులలో నిట్టి నిన్నెవ్వఁడు భజించునో యట్టి పురుషునికి సొంత జనులతోఁగాని సుతులతోఁగాని దేహముతోఁగాని భార్యలతోఁగాని, ధన గృహ భూవాహనములతోఁ గాని, ప్రాణములతోఁగాని,పనియేమి?వానివలన వానికేమియు సుఖముగలుగదు' అనియిట్లు నిరతిశయ పురుషార్థభూతము నీస్వరూపమని యెఱుంగనివారై కావుననే సుఖముకొఱకు మిథునములై వర్తించుచుండువారు, తమ ప్రకృతిసంబంధముచేతఁ గప్పఁబడి తమ జ్ఞానైశ్వర్యాది స్వరూపము దూలియుందురు. అట్టివారి నీలోకమందు నర్థకామములం దేది సుఖపెట్టును? ఏదియు సుఖపెట్టదు. ఎవరు నిత్యసుఖ స్వరూపుం డైన పరమాత్మవగు నీయం దొకమాటయినను మనస్సునుంతురో వారు స్వాత్మ పరమాత్మ స్వరూపములఁ గనుఁగొన్నవారు; కావుననే దేహాత్మాభిమానాదులనెడు మదములు వారికిఁ గలుగవు; నీదుపదాంబుజము వారి హృదయములందు వెలుఁగుచుండును. వారి పాదజలములు పాపములనెల్లఁ దూలించును, కనుక నట్టివారు పురుషులందు సారంబయిన జ్ఞానవైరాగ్యాదులను హరించునట్టి గృహములలో దాంపత్యముతోఁ జరింపరు. అట్లుసేయక భూమియందుఁగల గంగాది పుణ్యతీర్థములను దీర్థీకరించుటకును బుణ్యక్షేత్రములను నిరతిశయ పుణ్యావహములం గావించుటకును వాని నుపాసింతురు. 'పరమార్థభూతమగు (సత్తగు) పరబ్రహ్మము వలననుండి పుట్టిన యీజగత్తు పరమార్థమే (సత్తే) యగును' అన్నచో నిది యుక్తముగాదు. ఎట్లన మృత్తు సువర్ణము మొదలగువానివలె నేది దేనివలనఁబుట్టెనో యది దానిస్వరూపమే యగుటగలదు;కాని చేతనుఁ డగు పురుషునివలననుండి కేశ దంత

నఖ లోమము లచేతనములుగాఁ బుట్టుటయు, అచేతనమగు గోమయమునుండి తేళ్లుమొదలగు చేతనములు పుట్టుటయుఁ జూడఁగాఁ, గార్యమునకుఁ గలలక్షణములే కారణమందుండుట యంతటను నియతముగాదు. మఱియుఁ బరమార్థమగు స్వప్నమువలన నుండి యపరమార్థము లగు గజతురగాదులును, అట్లె పరమార్థమగు శుక్తి శకలమునుండి యపరమార్థమగు రజతమును బుట్టుచున్నవి. అట్లు పుట్టియు నివి వ్యర్థములే యగుచున్నవి. కనుకఁ గారణము సత్తయినట్లె కార్యమును సత్తుగావలయుననెడి యిది యుక్తిచేతఁ గొట్టువడిన దగుచున్నది. (మఱి మృద్ద్రవ్యమునందు మృత్తుమాత్ర మనువర్తించుచుఁ దక్కినది వ్యావర్తించుచున్నది. రజ్జుసర్పాదులం దనువర్తించుచున్న యధిష్ఠానములగు రజ్జువు మొదలగునవి మాత్రమే సత్యములుగను వ్యావర్తించు సర్పభూదళన జలధారాదు లసత్యములుగను జూపట్టుచున్నవి. అట్లె మృద్ద్రవ్యమునందు ననువర్తించు నధిష్ఠానమగు మృద్ద్రవ్యముమాత్రమే సత్యము; వ్యావర్తించు ఘటశరావాదు లసత్యములు. అట్లె సర్వమున కధిష్ఠానమయిన నిర్విశేష సన్మాత్రబ్రహ్మమునకంటె నన్యమై యహంకారాది వ్యవహారమున కాస్పదమైన సమస్తజగత్తును మిథ్య. సన్మాత్రంబగు బ్రహ్మమే సత్యము' అను) తర్కముచేత హతమగుచున్నది. కాన కార్యంబగు జగత్తు మిథ్యయె కావలయునన్నచో 'కార్యము సత్త'నెడి యీయర్థ మెచ్చట వ్యభిచరించుచున్నది (తప్పిపోవుచున్నది)? ఎచ్చటను లేదు. (కేశ పురుషాదులందును, నచేతనంబగు పురుషదేహమునుండియే యచేతనములగు కేశాదులు పుట్టుచున్నవి. ఇచట కార్యము సత్తగుట

తప్పిపోవదు.) మఱియు కార్యమెచ్చటఁగల్ల ? ఎచ్చటను గల్ల గాదు. (స్వప్నమువలెనే స్వప్నమునందలి పదార్థములును నీశ్వర సృష్టములగుటచే నవి * మిథ్యలుగావు. పంచీకరణమునుబట్టి శుక్తియందును రజతమున్నది. కాన, కార్యము కల్లగా నేరదు. ఇట్లు కార్యమందు వ్యభిచరించుట తప్పిపోవనట్లె కార్యకారణ ములను రెండవస్థలయందును వ్యభిచరించుట గలుగదు. (మృత్సు వర్ణాదులు కారణావస్థయందువలెనే కార్యావస్థయందును జూపట్టుచున్నవి. ఇందుఁ గార్యము వ్యర్థముగాదు. ఇట్లె)సత్తగు బ్రహ్మము జగత్తనెడి కార్యావస్థయందును సత్తగుటయే కాక యట్లు జగత్తగుటయు వ్యర్థముగాదు; (మృత్తునకు ఘటశరా వాదులగు) నవస్థాభేదములు 'ఘటములో జలముదెమ్ము' మొద లయిన వాక్యముల) వ్యవహారమునకు నిష్టము లగుచున్నవి. (కాఁబట్టి సత్తునకు నవస్థాంతరము గలుగుట సఫలమేకాని వ్యర్థముగాదు. కార్యము సత్తగుట తర్కహతము కాకపోయి నను 'నేహనానా' యిత్యాదిశ్రుతులు కార్యము మిథ్యయని చెప్పుచున్నవే యన్నచో) 'నేహనానా' యిత్యాదిశ్రుతి రూప మగు నీవాక్కు అనాదికర్మవాసననే మఱియంతయుఁ దూలి యున్నవారిని దమకుం గలవెక్కువృత్తులచేత * నంధపరం

---

* 'మనోరథాన్ సృజతి' అనుశ్రుతి యీశ్వరుఁడు ఆయాజీవుల కర్మములకనుగుణముగా స్వప్నమందలి యాయాపదార్థములను సృజించుచున్నాఁడనుటచే నవి మిథ్యలుగావు. పంచీకరణమనఁగా నొక్కవస్తువునందొక్క భూతాంశము ప్రధానముగాను దక్కిన భూతాంశము లప్రధానములు గాను నుండును గనుక నొక్కొక్కటియు మఱియొక్కదానియం దేదోయొక కొలఁదిని ఉండకపోవనుటయె.

* ఇట వృత్తులనఁగా శబ్దముల యర్థవ్యాపారములు. 'నేహనానా' అనఁగా

పరగాఁ గార్యము మిథ్యయని భ్రమింపఁజేయుచున్న దింతేకాని మఱేమిగాదు. (ఈవిశ్వము సృష్టికిఁ బూర్వము లేకుండెను. ప్రలయమునకుఁ బిదపను గలుగఁబోవదు. కావున నా రెంటికి నడుమను గేవలుండ వగునీయందు మిథ్యారూపముననే యిది వెలుంగుచుండునని నిశ్చయింపఁబడినది. కాఁబట్టి శ్రుతిచేత ద్రవ్యమాత్రములగు మృత్తు నినుమున నెడి నివి ఘటకుండలాది భేదప్రకారములతో సాటిగా నిరూపింపఁబడుచున్నవి. అనఁగా కార్యములయినవెల్ల నామధేయమాత్రములే; కారణమగు మృత్తుమొదలగు నవియే సత్యము. అట్లె యాకాశాదులు నామధేయ మాత్రములు. కారణంబగు బ్రహ్మముమాత్రమే సత్యమని నిరూపింపఁ బడుచున్నది) అనవచ్చును. కానియిది కుత్సితదర్శనులగు వారికి వ్యర్థముగాఁ గలుగు మనోరాజ్యవిజృంభణమే కాని మఱియొకటిగాదు. కనుకఁ గుదృష్టుల కభిమతమగు కార్యమిథ్యాత్వము సత్య (ప్రామాణిక)మని * మృదాదిశ్రుతి

---

బ్రహ్మముతప్పఁ దక్కినది పెక్కు (అనఁగా కార్యమగు జగత్తు) లేదని యర్థముగాదు. అబ్రహ్మాత్మకము లయినవి పెక్కులేవు. స్వతంత్రములయినవి పెక్కులేవు, బ్రహ్మస్వరూపమందు దేవమనుష్యాది భేదములు పెక్కులులేవు. అని యిట్టియర్థవృత్తులు పెక్కులుగలిగియున్నది. ఆశ్రుతి యిట్టి తన పెక్కువృత్తులచేత కర్మజడులను భ్రమింపఁ జేయుచున్నదిగాన వారు దీనిని దెలియక బ్రహ్మతిప్పఁ దక్కినవన్ని (అనఁగా జగత్తులేదని) తలఁచుచున్నారని యర్థము. అంధపరంపరయనఁగా ఒకయంధునిచేత మఱియొకయంధుఁడుగా దారితప్పినట్లు భ్రమించిన యొకకర్మజడునిచే వరుసను గర్మజడులెల్ల భ్రమించుటయని భావము.

* ఈజగత్తు సృష్టికిఁ బూర్వము లేదనుటకు 'సదేవసోమ్యే దమగ్రఆసీత్' ఆత్మావా ఇదమేక ఏవాగ్రఆసీత్' అని శ్రుతి. ప్రలయానంతరమును లేదను

యర్థమును దెలియనివారు తెలియుదురు. ఆజీవుఁడు నీమాయ చేత మోహితుఁడగుటంబట్టి ప్రకృతిపరిణామాత్మకములగు దేవ మనుష్యాది మూర్తులను దాల్చుచున్నాఁడు. దానివలన శబ్దాది విషయములను సేవించుచు స్థూలత్వము కృశత్వము మొదలైన దేహధర్మములను గొనుచు దేహాత్మాభిమాని యగుచున్నాఁడు. పిదప మరణమును బొందుచున్నాఁడు. ఇట్లు జన్మమరణాది రూపమగు సంసారమును బొందుటవలన జ్ఞానైశ్వర్యాదులు వీడినవాఁ డగుచున్నాఁడు. నీవో, పాము కుబుసమునుంబోలె నా ప్రకృతిని ద్యజింతువు; దానికి లోకువయైసంబంధించియుండవు. కావున నే నిత్యమును జ్ఞానైశ్వర్యాదులను గయికొనియే యుందువు. అయినను 'జీవునివలె నాకును నైశ్వర్యాదులు పరిచ్ఛిన్నములుగావా ? యందువా' నీ వపరిచ్ఛిన్నములగు నైశ్వర్యాదులు గలిగి, యపహత్మపాప్మత్వము మొదలయిన యెనిమిది కల్యాణ గుణము లెప్పుడును వెలయుచు నపరిచ్ఛిన్నమై స్వయంప్రకాశ స్వరూపమైన మహాస్సున నెలకొని పూజింపఁబడుచుందువు. మనఃప్రణిధానశీలు రగుమునులయ్యును, దమవ్హృదయము లందుఁ గామమూలములగు వాసనలను బెకలింప రేని, యట్టి యసత్పురుషుల హృదయమందున్న వాఁడవయ్యు, మెడయం

---

టకు 'నాసదాసీన్నో సదాసీత్తదానీమ్' అని శ్రుతి. మృద్ఘటాద్యాదులతో నుపమించుటకు 'యథాసౌమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయంవిజ్ఞాతం స్యాద్వాచా రమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం యథా సౌమ్యైకేన లోహమణినా విజ్ఞాతేన సర్వం లోహమయం విజ్ఞాతంస్యాత్। యథా సౌమ్యైకేన నఖనికృన్తనేన సర్వం కార్ష్ణాయసమ్' ఇత్యాదులు శ్రుతులు.

దున్న మణిని దలంచుకొనని యెడ నదిలేనిదే యగునట్లు నీవు వారికిఁ దెలియనట్టివాఁడవే యగుదువు. భగవంతా! కేవల ప్రాణేంద్రియ తర్పణపరులయిన యాయోగులకు నిహమందును బరమందును మృత్యువు దొలఁగనందున దుఃఖమే యగుచున్నది. ఇహమందు భోగము లెంత పుష్కలముగా నున్నను మరణభయం బగుదుఃఖము గలిగియేయున్నది; పరమందు నీపదప్రాప్తి గలుగక నీవు యమరూపుఁడవై ధర్మోల్లంఘులను దండించుటవలనను దుఃఖమే కలుగుచున్నది. నీయాథాత్మ్యము దెలిసినజ్ఞాని సంసారమందు ఫలముగలిగించుటకై పొడకట్టుపుణ్యపాపకర్మములచేఁ గలుగు సుఖదుఃఖ ఫలములతోడి కూడికలనుగాని, అపుడు దేహధారు లాడు స్తుతినిందాదివాక్యములనుగాని యనుసంధింపఁడు. ఏలనఁగా వానికి దేహాంతమున నపవర్గమునకు సాధనభూతుఁడవు. అట్టివారిహామందో నీవారగు మనుజులతోఁగూడఁ ననంత కల్యాణ గుణయుక్తుండగు నీదు కథామృత పరంపర ప్రతియుగమందు ననువర్తించుచుండుటం జేసి ప్రత్యహము చెవులార దానిని విని మనంబులఁదాల్చి నీకథామృత పానమున మత్తులై యుందురు; కావుననే యాసుఖదుఃఖాదుల నెఱుంగకుందురు. స్వర్గాది లోకపతులయిన మహేంద్రబ్రహ్మాదులు సైతము నీస్వరూపస్వభావముల తుది నెఱుంగరు. ఇఁక మనుజులు తెలియు టెక్కడిది? వేయేల! నీవును దాని నెఱుఁగవు? ఏలనఁగా నది యనంతమయినది. నీయందొక్కొక్క రోమకూపమునందు సప్తావరణములతోఁ గూడిన బ్రహ్మాండ సమూహములు, ఆకాశమందుఁ దుమ్ములును బఱ్ఱులునుంబోలె సంచరించుచున్నవి. నీవిట్టియపార మహిముండవుగాన శ్రుతులు

శబ్దవృత్తిచేతను నీవు ప్రకృతి పురుషులకు సజాతీయుఁడవు గావని నిరసించి వానికంటె విలక్షణుఁడైనవానినిగా బోధించుచున్నవి. ఇంతమాత్రము చేతనే (యనఁగా చేతనాచేతనములకు సజాతీయుఁడగుట నిరసించి వానికంటె విలక్షణుఁడను మాత్రమును బోధించుటచేతనే) యవి కృతార్థములగుచున్నవి. అంతకంటె నవి సాకల్యముగా నీస్వరూపస్వభావాదులను బోధింప శక్తములుగా నేరవు' అని స్తుతించెను.

భగవంతుఁడు — ఇట్లు శ్రుతులు చెప్పినరీతి సనందనుఁడు చెప్పినయాత్మానుశాసనంబగు నుత్తరమును విని బ్రహ్మపుత్త్రులగు మరీచిమొదలగు సిద్ధులు పరమాత్మని యాథాత్మ్యమును నిశ్చయించుకొని సనందను నర్చించిరి. శుకుఁడు—ఇట్లు గురుండగు బదర్యాశ్రమవాసి, శ్రీనారాయణుం డుపదేశించిన దానిని శ్రద్ధతోడ గ్రహించి యందేమనస్సు నిలిపి సంశయము లెల్లఁ దొలఁగుటంజేసి నిండుమనంబుతో దానిని విన్నది విన్నట్లుగాఁదాల్చి జితేంద్రియవ్రతుఁ డగునారదుం డా నారాయణునితో—'సర్వభూతముల కపవర్గము గలుగుకొఱకుఁ గమనీయములగు విద్యల నుపదేశించి సుఖముగావించు నాభగవంతునకు, సర్వలోక సుఖకరునకు, నిర్మలకీర్తికి, నమస్కరించెదను' అనెను.ఇట్లమ్ముని చెప్పి యయ్యాదిఋషిని నతనిశిష్యులగు తక్కిన నిర్మలాత్ములను వీడుకొని, యంత మాతండ్రియగు కృష్ణద్వైపాయనుల యాశ్రమమునకు జక్కవచ్చెను. భగవంతుఁడు వ్యాసుం డతనినిబూజించి యాసనంబిడఁగాఁ గూర్చుండి నారాయణముఖారవిందమునుండి దొరిఁగిన యాశ్రుతిస్తుతిని నుపదేశించెను. (మాతండ్రియు నాకుపదేశించెను.) రాజా! నన్ను నీవడి

గిన ప్రశ్నమునందు శ్రుతివచనముల నీకుత్తరముగా వర్ణించి చెప్పితిని. ఈవర్ణనముచేత ననిర్దేశ్యమును నిర్గుణంబునయ్యును బ్రహ్మమునందు శ్రుతు లభిధావృత్తిని బ్రవర్తించుచున్నవని మనస్సునకు నిస్సంశయముగాఁ దెలియును. ఎవ్వఁ డీ జగత్తునకుఁ గల యుత్పత్తి స్థితి ప్రలయముల నిమిత్త * మీక్షించుచున్నాఁడో, ఎవ్వఁడు కారణావస్థయందలి ప్రకృతి పురుషులకు లోనఁ జొచ్చి నియమించువాఁడో, ఎవ్వఁడు మహత్తు మొదలుకొని పృథివివఱకుఁ గలయీ సమష్టితత్త్వసమూహమును సృజించి చతుర్ముఖుండను జీవుని శరీరముగాఁ జేసికొని యందుఁ బ్రవేశించి దేవమనుష్యాదిశరీరములను నిర్మించి పాలించెడినో, కర్మవశ్యుఁడగు జీవుఁ డెవ్వనిని బొంది గూఁట నిదురించు పిట్ట, గూఁటిని వదలి పై కెగసిపోవునట్లు తాను మగ్నుఁడై యుండిన ప్రకృతి సంబంధమునువదలి గుణాష్టక మొంది ముక్తుఁడగునో, సంసారులకు మోక్షమునొసంగి పుట్టుకయను దుఃఖమును దూలించుచు నెవ్వరికిని భయముగూర్పక యభయం బొసంగుచు నాశ్రితార్తి హారుండై యొప్పునట్టి యాభగవంతుని నిత్యమును ధ్యానించుచున్నాను' అనెను. ఇది యెనుబదియేడవయధ్యాయము.

## త్రిమూర్తులగుణములు.

రాజు—'దేవతలయందును, నసురులయందును, మనుష్యుల యందును, నమంగళుఁడయ్యు శివుని నెవరు పూజింతురో వారు

* ఇట 'తదైక్షత బహుస్యామ్' అను శ్రుతిని అనుసంధించునది. జగత్సృష్ట్యాదులకొఱకు దాని నీక్షించుచున్నాఁడని తెలియునది.

తఱచుగా ధనసంపన్నులై భోగము లనుభవించుచుందురు. లక్ష్మీపతియగు హరిని నెవరు భజింతురో వా రట్లు సంపన్నులు గారు. ఆప్రభువులు శివకేశవు లిరువురస్వభావములును బరస్పర విరుద్ధములు; వారిని భజించువారికిఁ గలుగుగతులో వారి కనుగుణముగాక విరుద్ధములుగా నున్నవి. ఈవిషయమై నాకు సందేహము మిక్కిలిగా నున్నది. ఇది తెలిసికొనఁగోరుచున్నాను' అని యడిగెను. శుకులు—'శివుఁ డుమాదేవితోఁగూడి సదా మూఁడహంకారములచేఁ బ్రచురమయిన మూర్తిగలిగి, తమోగుణముచేఁ గప్పంబడియుండును. అతనియందుఁ గల యహంకారములు వైకారికము తైజసము తామస మని మూఁడు విధములు. ఆ మూఁడహంకారములనుండి పదునొకం డింద్రియములు పంచభూతములు నని పదియాఱు వికారములు పుట్టినవి. ఈ యహంకారములకును వీని వికారములకును నధిదైవతములగు వానిలో నేదేని యొకదానిని భజించుపురుషుఁ డా యాయధిదైవతమునకు నొసంగఁ గూడిన సమస్తములయిన యైశ్వర్య విశేషములనును బొందుచున్నాఁడు. * హరియో సత్త్వాది ప్రాకృతగుణములకు లోనయిన వాఁడుగాఁడు. అతఁడు

* ఇట భావమేమనఁగా, బ్రహ్మరుద్రాదులు రజస్తమఃప్రచురస్వభావులును, గుణవశ్యులును, షాడ్గుణ్య పూర్తులు కానివారును, జీవులును, సర్వజ్ఞులు కానివారునగుదురు. కాన వీరికి మోక్షప్రదానమందు సామర్థ్యము లేదు ; కాని తమతమ శక్తికిఁ దగినట్లు అర్థకామములనుమాత్ర మియ్యనేర్తురు. భగవంతుఁడు చతుర్విధ పురుషార్థములగు ధర్మార్థకామ మోక్షములు నాలుగు నిచ్చునట్టిశక్తి యుండియును నతఁడు సర్వజ్ఞుఁడును బరమకారుణికుండునుగాన 'నేను నాభక్తులకు ధర్మార్థకామముల ఫలముల నొసంగితినేని,

సమగ్ర జ్ఞానైశ్వర్యాది షాడ్గుణ్య పూర్ణుఁడు, ప్రకృతికి విలక్షణుఁడు, సర్వజ్ఞుఁడు, కావుననే గుణదోషముల కుపద్రష్ట. రుద్రాదులే యిందులకు వేఱయిన స్వభావములుగలవారు. కాఁబట్టి యట్టివారిని భజించునట్టి వాఁడును బ్రాకృత గుణరహితుఁడై ముక్తుఁ డగుచున్నాఁడు. రాజసూయాదియజ్ఞములు పరిసమాప్తములయినపిదప మీతాత యగుధర్మరాజు భగవంతుని వలన ధర్మములను వినుచుండి యీయచ్యుతుని నిదియే యడిగెను. నిరతిశయపురుషార్థ మగు మోక్షము నొసంగుటకై యదువుకులమం దవతరించియున్న ప్రభుం డాభగవంతుఁడు ప్రీతుఁడై వినఁగోరుచున్న యాధర్మరాజును జూచి 'నే నెవ్వని ననుగ్రహింతునో వాని ధనమును మెల్లగా హరించుకొందును. వాఁ డట్లు ధనహీనుఁడై దుఃఖములంబడి నవయుచుండుటవలన వానిజనులు వానిని దిగవిడుతురు. అపుడు వాఁడు ధనము లేమినిబట్టి తనపూనిక లెల్ల వమ్ముకాఁగా నిర్విణ్ణుఁ డగుచున్నాఁడు. అంతె విషయసుఖములు మనకు దుర్లభము లని వానియందలి యాశను దిగవిడిచి నాభక్తులతోడి చెలిమి చేయుచున్నాఁడు. అపుడు వానిని నేననుగ్రహించుచున్నాను. వానికిఁ బ్రకృతిపురుషులకంటె విలక్షణమై సర్వాంతఃప్రవేశయోగ్యంబుగాన సూక్ష్మంబై జ్ఞానస్వరూపమాత్రమై త్రివిధపరిచ్ఛేదరహితమై యున్న బ్రహ్మమును జూపుచున్నాను. ఇట్లు నేను దుఃఖావహుఁడ నగుటం జేసి

---

అది తీఱిన తుదను మరలమరల దానినే యిమ్మని, నన్ను యాచించుచు నిత్యదరిద్రులై యుందురుకాన వీని ననుగ్రహించెదను' అని యాలోచించి తఱచుగాఁ దనభక్తులకు ముక్తినే యిచ్చుచున్నాఁడు. నిర్బంధ మేదేని వచ్చినపుడు మాత్రము అర్థకామముల నిచ్చును.

నన్నారాధించుట మిక్కిలియుఁ గష్టమని యెఱింగి, యప్పటికి సుఖప్రదులును బిదప దుఃఖప్రదులును దమంతట దుఃఖితులు నగు తక్కిన రుద్రాదులను గేవల సుఖప్రదులేయని తెలిసి భజించుచుందురు. అట్లు భజించినపిదప, ఆభక్తులు, * శీఘ్రముగా సంతోషపడునట్టి యారుద్రాదులవలన రాజ్యమును బడసి సంపత్తిచే దారితప్పినడచుచు, గర్వించి పరాకుపడి తమకు వరముల నొసంగిన దేవతలనే మఱచిపోవుదురు; మఱియవజ్ఞయు సేయుదురు' అనెను. శుకుఁడు—బ్రహ్మ విష్ణువు శివుఁడు మొదలగువారు కోపప్రసాదములు రెంటికిని సమర్థులే. కాని శివుఁడును బ్రహ్మయు నపుడే శాపమును బ్రసాదమును జేయుచుందురు. అచ్యుతుఁ డట్లు గాఁడు. అతఁ డనుగ్రహైకస్వభావుఁడు. ఒక్కెడ నిగ్రహము చూపినను దుదకది వరముతో సాటియే యగును. ఈవిషయమై పురాతనమైన యొక యితిహాసమును వృకాసురునకు శివుఁడు వరమొసంగి సంకటమునొందిన దానిని గూర్చి యుదాహరించెదరు. శకునియను వాని పుత్త్రుఁడు వృకుం డనునసుర యొకఁ డుండెను. వాఁడు దారియందు నారదునిఁజూచి దుర్మతిగాన ముగ్గురు దేవులయందు శీఘ్రముగా సంతోషము నొందువాఁ డెవ్వఁ డని యడిగెను. ఆనారదుఁడు వానితో 'శివునిభజింపుము. అతఁడు శీఘ్రముగా సంతుష్టి నొందువాఁడు. అతఁ డల్పగుణదోషములకే సంతోషించుచును గోపించుచు నుండువాఁడు. రావణుఁడును బాణుఁడును వందిజనులవలెఁ దన్నుఁ బొగడఁగా వారి కతులమయిన యైశ్వ

* దీనిచే భగవంతుఁడు తాను తటాలునఁగాక చిరకాలమునకే సంతోషపడుచున్నాఁడని తెలియునది.

ర్యమునిచ్చి (యొకనివలనఁ గైలాసము గ్రక్కదల్చుట, మఱి యొకనివలనఁ బురమునకుఁ గావలిగాచుట యను నీ)పెనుసంకటములందుఁ జిక్కికొనెను' అనెను. ఇట్లాయసుర నారదునిచేతఁ బురికొల్పఁబడి కేదారక్షేత్రమున నగ్ని ముఖమందున్న హరిని శివునిఁ దన మేనిమాంసమున హోమము చేయుచుండెను. కాని యప్పటికిని దేవుఁడాహారుఁడు ప్రత్యక్షము గానందున విసుఁగునొంది యేడవనాఁడు స్వధితినిగొని యాశివుని తీర్థములచే వెండ్రుకలు దోఁగియున్న తన శిరసును ద్రుంచుటకుఁ బూనెను. అపుడు మహాకారుణికుఁడయిన యాధూర్జటి యరణినుండి యగ్నియుంబోలె నాయగ్నినుండి పైకిఁబొడమి, తన రెండుహస్తముల చేత వాని రెండుచేతులును బట్టికొని వాని నట్లు చేయకుండ వారించెను. ఆ దేవుని స్పర్శనమువలన వానియాకృతి వ్రణములు పోయి పూర్ణమయ్యెను. ఈశ్వరుండు వానినిజూచి 'ఓరీ! చాలుఁ జాలు; వలసిన వరము వేఁడుము. నీ కోరినచొప్పున వరమొసంగెదను. నన్ను శరణుఁజొచ్చిన జనులు తోయము లంత మాత్ర మర్పించినను నేను బ్రీతినొందుదునే! కాన యట్టు లర్పణములు సేయక వ్యర్థముగా నేల నీయీదేహము నిట్లు పీడించెదవు' అనెను. ఆమహాపాపుఁ డాదేవునివలన 'దేవా! నే నెవ్వరెవ్వరితలపయిని నా చే యిడుదునో వారు చత్తురుగాక' యని భూతభయంకర మయినయీవరము నడిగెను. అదివిని భగవంతుఁడు శివుఁడు క్రుద్ధుఁడై మనంబున దుఃఖించి బలవంతముగా వల్లెయని యంగీకరించి సర్పమునకు బాలుంబోలె వాని కా వరమొసంగెను. వాఁ డావరమును బరీక్షించుకొఱకు శంభుని శిరముపయిని దనచేయి పెట్టుటకుఁ గడంగెను. ఆశివుఁడు

తాను జేసిన యపరాధమునకు భయపడెను. ఆయసుర తన్ను వెంబడింపఁగా నతఁడు దిగులుగొని గడగడ వడఁకుచు దివికిని భువికిని గల పొలిమేరలవఱకును, దిక్కుల తుదలవఱకును గ్రిందుగను మీఁదుగను బరుగెత్తెను. బ్రహ్మాది దేవతలు నందులకుఁ బ్రతిక్రియ దెలియక మిన్నకుండిరి. అంత రుద్రుఁడు మిక్కిలియుఁ బ్రకాశమానంబై ప్రకృతి కార్యరహితంబై యున్న వైకుంఠమునకుఁ బోయెను.అందు నారాయణుఁడు భూతద్రోహమును దిగవిడిచి సర్వభూతదయా పరులును శాంతులు నగు ప్రపన్నులకుఁ బరమప్రాప్యంబై యుండును. అందులకుఁ బోయినవారు మరలిరారు.పాపములనెల్లఁబోఁగొట్టు నా భగవంతుఁడు నారాయణుఁ డా యసురను వానివలన సంకటముసఁ జిక్కియున్న యా శివునినిగాంచి యోగమాయచేత నొకవటుండై, మొలనూలు నజినమును దండమును బాలాశ దండమును బద్మాక్షమాలికయుఁ దాల్చి తేజస్సుచేత నగ్నివలె జ్వలించుచు దవ్వుననుండియె యెదురు సనుదెంచి పవిత్రపాణితో మిక్కిలి వినయము గలవానివలె వాని కభివందనము గావించెను.' భగవంతుఁడు—'శకునిపుత్రా! నీవు మిక్కిలి బడలి యున్నావు. ఇదినిజము. చాలదూరమునుండి వచ్చితివా? కొంత సేపు సేదదీర్చుకొనుము. పురుషుని కీదేహము సమస్తకామితములను బిదుకునది చుమీ. ప్రభూ! నీవు పూనిన కార్య మేదియో నా చెవులకు వినఁదగునేని చెప్పుము. తాను జేయఁ దలఁచినపని యాప్తులగు పురుషులతోడఁ గూడి యాలోచించి పురుషుఁడు

---

* ఈవైకుంఠము ముక్తప్రాప్యమగు పరమాకాశము గాదు. అండములోఁ గల యొకానొక విష్ణులోకము' అని తెలియునది - వీరరాఘవులు.

చేయును గాన చెప్పుము’ అనెను. ఇట్లు భగవంతుఁ డమృత ములు గురియు పలుకులనడుగఁగా వాఁడు బడలికదీఱి యింతకుఁ బూర్వ మాదిగాఁ దానుగావించిన యాసంగతిని జెప్పెను. భగ వంతుఁడు—‘అట్లైని యాశివునిమాట మేమెంతమాత్రము నమ్మము. ఏలనఁగా దక్షునిశాపమువలన నతఁడు పిశాచత్వము నొంది ప్రేతపిశాచములకు రాజుగా నున్నాఁడు. పిశాచము మాట నమ్ముదురా! దానవేంద్రా! నీవు జగద్గురుండని తలంచెడి యాశివుని మాటయందు మీకు నమ్మికగలదేని, యింతేల నీతల పయిని వేగచేయిడికొని యావిషయము తెలిసికొనవచ్చునే! దానవసింహమా! శంభునిమాట యెట్లో యసత్యమగునేని, మరల నట్లె మఱియొకని నబద్ధమాడి వంచింపకుండునట్లు వానిని రూపుమాపుము’ అనెను. ఇట్లు భగవంతుఁడు చిఱునవ్వుచే పిక్కిలియు సొగసు గులుకుచున్న వింత పలుకులాడఁగా వాఁడు బుద్ధిచెడి కుమతిగాన మఱచి తనతలపయిని జేయిడికొనెను. అపుడకు వాఁడు వజ్రముచేతఁ గొట్టువడిన వానివలె క్షణములోఁ దలపగిలి కూలెను. అంత నాకాశమున జయజయ ధ్వనులును, నమోస్తుమయనుచప్పట్లును, బాగుబాగను కైవారములును జెలంగెను. దేవతలును ఋషులును నాపాపాత్ముఁడు వృకుఁడు హతుఁడు కాఁగానే పువ్వులవానలు గురిసిరి. శివుఁడును సంకటమునుండి విడివడెను. అట్లు విడివడ్డ శివునింజూచి పురుషోత్తముఁడా భగ వంతుఁడు ‘ఓదేవా! మహాదేవా! ఈపాపుఁడు తనపాపము చేతనే హతుఁడయినాఁడు. ఔరా! పెద్దలగు వారియెడఁ బాప మాచేసిన ప్రాణి యెయ్యది క్షేమమునొందినది? ఇఁక జగద్గురుండగు విశ్వేశ్వరునియందు దోషము గావించిన వాని విషయము

చెప్పవలయునా?' అనెను. ఇట్లు పరుండును నవ్యాకృత మహా శక్తి సముద్రుండును సాక్షాత్పరమాత్ముండు నగుహరి గిరీశుని విడిచిపుచ్చిన కథ చెప్పువాఁడును, వినువాఁడును, సాంసారిక దుఃఖమునుండియు శత్రువులనుండియు విడివడుచున్నాఁడు' ఇది యెనుబదియెనిమిదవయధ్యాయము.

---

## త్రిమూర్తులయందు విష్ణుని యాధిక్యము.

శుకుఁడు—రాజా! సరస్వతీనదితీరమున ఋషులు సత్ర యాగము గావించిరి. వారిలో ముగ్గురు మూర్తులయం దధికుఁ డెవ్వండని యొక వితర్కము పుట్టెను? వారు దానిని దెలియఁ గోరి బ్రహ్మపుత్రుఁడగు భృగుని దాని నెఱింగిరమ్మని పంపిరి. అమ్ముని మొదట బ్రహ్మసభకుఁ బోయెను. అతఁడు బ్రహ్మసత్త్వ మును బరీక్షించుటకై యతనిని స్తోత్రము చేయఁడయ్యె. అంత నాభగవంతుఁడు బ్రహ్మ యందులకుఁ దన తేజంబున జ్వలించుచు నెంతయుఁ గోపించెను. అయిన నద్దేవుఁడు తనపుత్రునియెడలఁ దన కుప్పతిల్లిన కోపమును, నగ్నిని దానినిబుట్టించిన జలముచేతఁ జల్లార్చునట్లు, వివేకమయంబగు తనమతిచేత నుపశమింపఁజేసి కొనెను. అంతభృగుఁడు కైలాసమునకుఁ బోవఁగా మహేశ్వరుఁ డామునినిజూచి దిగ్గనలేచి తనతోఁబుట్టువుంబోలెఁ గౌఁగిలించు కొనఁ గడంగెను. అందులకు భృగుఁడు 'నీవు దారితప్పి నడచు వాఁడ' వనిచెప్పి యందుల కిచ్చగింపఁడయ్యె. అందుల కాదేవుఁడు కుపితుఁడై వేఁడికన్నువెలుంగ శూలమెత్తికొని యతనిని జంప నుంకించెను. కాని, పార్వతీదేవి యతని పాదములంబడి తిన్ననిమాటల నతని నూఱడిలం జేసెను. అంత నతఁడు వైకుం

తమునకుఁ బోయెను. అట జనార్దనుఁడు లక్ష్మిని వక్షంబున నిడికొని పరుండియుండెను. భృగుఁ డావక్షమును గాలందన్నెను. అంత సజ్జనులకుఁ బ్రాప్యుం డయిన యాభగవంతుఁడు లక్ష్మియుం దానును లేచి తల్పమునుండి దిగ్గన డిగి శిరసు నేలసోఁక మునికి నమస్కరించెను. అంత నమ్మునితో 'బ్రాహ్మణోత్తమా ! నీకు స్వాగతము. ఈయాసనము పయిని గొంతసేపు కూర్చుండుఁడు. దేవరవారు వేంచేసినది తెలియక పోయెను. ప్రభూ ! ఆతప్పును క్షమింపుఁడు. మహాత్మా ! నీపాదతీర్థము తీర్థములనుగూడఁ దీర్థీకరించునది గదే. కాన యాతీర్థముచేత నాయందున్న లోకములను లోకపాలురను నన్నును, బావనులం జేయుము. మహాత్మా! ఇప్పుడే నేను, లక్ష్మికి నెప్పటికిని బట్టయితిని. నీ పాదములచేఁ దాఁపువడి నాపాపములెల్ల హతము లయినవిగాన లక్ష్మి నావక్షమందిఁక నెప్పుడును వసించియుండఁగలదు' అనెను. ఇట్లు భగవంతుఁడు వైకుంఠుఁడు చెప్పఁగా నతని గంభీరమంద్ర వచనములకు నెంతయు నానందమునొంది యామాటలచేఁ దనివిఁ జెంది భక్తి యుద్రేకముచేతఁ గన్నుల నానందాశ్రువులు గాఱ నూరకుండెను. మరల నతఁడు బ్రహ్మవాదు లగుమునులు సత్రమునకువచ్చి తానుగన్నట్టి వృత్తాంతమంతయును వారికి వర్ణించి చెప్పెను. దానిని విని మునులంత నెంతయు విస్మితులై సంశయములనెల్ల వీడి శాంతియును నభయము గలిగియున్నందున విష్ణువే యధికుండని నిశ్చయించికొనిరి. ఎవ్వనివలన ధర్మమును జ్ఞానమును వైరాగ్యమును శాంతియు, నెనిమిది విధములగు నణిమా ద్యైశ్వర్యములును గలుగునో, ఎవ్వనియందు కీర్తించినవారి పాపములనెల్లఁ దూలించునట్టి యశస్సును గలదో,



2328. త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువు నధికుఁడని
భృగువు చెప్పట.

భూతదండము మాని శాంతులై సమచిత్తులై యాచింపనులైన సాధువుల కెవఁడు పరమంబగు గతియో, సత్త్వమెవ్వని ప్రియంబగుమూర్తియో, ఎవ్వనికి బ్రాహ్మణు లిష్టదేవతలో, నిపుణబుద్ధులగువా రెవ్వని మఱియేద్దియుఁ గోరక కొలుచుచుందురో, యట్టి భగవంతుఁడు తనమాయంజేసి సత్త్వాదిగుణములను గయికొనఁగా నతని మూఁడువిధములయిన యాకారములే రాక్షసులును నసురులును సురలు నగుదురు. శుద్ధసత్త్వ మయంబగు నతని శరీరమే యాత్మశుద్ధి సాధనము. ఇట్లని సరస్వతీనదీతీరవాసు లగు బ్రాహ్మణులు మనుష్యులసంశయములను బోఁగొట్టుటకై నిర్ణయము సేసి యంత నాపరమపురుషుని పదాంభోజములను సేవించుటచేతఁ దద్గతిని బొందినవారయిరి.

సూతుఁడు—ఇట్లు వ్యాసముని కుమారుండగు శుకుని ముఖారవిందపు వాసనతోఁ గూడినదై భవభయముల నెల్ల హరించునట్టిదైన పరమపురుషుని కథామృతము, నెంతయుఁ గొనియాడందగినదానిని, గర్ణపుటములచే మాటికిఁ గ్రావి పాంథుఁడగువాఁడు మార్గమందుఁ ద్రిమ్మరిన బడలికనంతయు చున్నాఁడు.

శుకుఁడు—ఒకనాఁడు ద్వారవతియందు నొకవిప్రునిపత్నికిఁ గుమారుఁడు పుట్టెను; పుట్టఁగానే పుడమిపయిని బడినతోడనే మృతినొందెనఁట. ఆబ్రాహ్మణుఁడు మృతుఁడయిన యాపుత్రునెత్తికొని రాజద్వారమునందు నిడి మనంబున విన్ననై యాతురతతోడ నిట్లని విలపించెను. 'బ్రాహ్మణద్వేషులును శఠబుద్ధులును, లుబ్ధులు నజితాత్ములునగు క్షత్రియాభాసుల కర్మదోషము వలన నాబిడ్డఁడు పంచత్వమును బొందినాఁడు. హింసావిహారుం

డును దుశ్శీలుండును నజితేంద్రియుండు నగురాజును గొలుచు ప్రజలు దరిద్రులై నిత్యదుఃఖితులై కీడ్పడుదురు’ అని పిలపించి పోయెను. అట్లె రెండవపుత్త్రుఁడును బుట్టిచావఁగా వానిని, నట్లె మూఁడవవానిని, రాజుద్వారమందు విడిచి యా తొంటి గాథనే పాడిపోయెను. అట్లే యొకప్పు డా బ్రాహ్మణుఁడు తన తొమ్మిదవ బాలుఁడును మృతుఁడై నపు డా ద్వారమునకు వచ్చి యాగాథనే కృష్ణునికడఁ బాడఁగా విని, యర్జునుఁడు ‘బ్రాహ్మణోత్తమా! నీవు వాసముచేయుచున్న యీపట్టణమున విలుకాఁడు బ్రహ్మణ్యుఁ డగువాఁడు లేనేలేఁడుఁ గాని, రాజన్యబంధు వగువాఁడేని లేఁడా! ఈయున్న రాజన్యులో* బ్రాహ్మణులుచుమీ! సత్త్రయాగముచేయుచు సుఖముండువారు. రాజులెవ్వరు జీవించియుండఁగా బ్రాహ్మణులును వారి ధనదారపుత్త్రులును సంకటము నొందుచుందురో, యట్టివారు రాజన్యులవేషము వేసికొని పొట్టఁ బ్రోచికొనుచుండు నటులవలె జీవించువారే కాని వేఱుగాదు. వారు జీవచ్ఛవప్రాయులు. దీనులగు మీ యిరువురకు నిఁకఁ బుట్టఁగల పుత్త్రుని నే నిచట నేయుండి రక్షింతును. నేను నా ప్రతిన దీర్పక పోయితినేని, యపు డగ్నినుఱికి కల్మషమును బోఁగొట్టుకొనఁగలవాఁడను’ అనెను. అందులకా బ్రాహ్మణుఁడు ‘బలరాముఁడు, కృష్ణుఁడు, విలుకాండ్రయందు మేటియగు ప్రద్యుమ్నుఁడును, దన్నెదురంగలరథికుఁడులేని యనిరుద్ధుఁడును, నాబిడ్డలనుగాచుటకు శక్తులుగాకున్నారు. జగదీశ్వరులగు వారికే చేయుటకుఁ గష్టముగానున్న కర్మమును నీవు తెలివిమాలిచేయ

---

* సత్రయాగమందు బ్రాహ్మణులు గూడునట్లుగూడి ధనాదులు గలిగి సుఖముగా నుండువారే కాని పౌరుషము గలవారు గారని భావము.

నుంకించుట యెట్లు ? నీవు చేయుదువని మేమునమ్మము' అనెను. అర్జునుఁడు 'బ్రాహ్మణా ! నేను బలరాముఁడను గృష్ణుఁడనుగాను; ప్రద్యుమ్నుఁడను గాను. నాపే రర్జునుఁడు. నాకు ధనువు గాండీవము. బ్రాహ్మణా ! నావీర్యము ముక్కంటినిగూడ మెచ్చించునట్టిది. ఇట్టిదానిని నీ వవమానింపవలదు. నేను మృత్యువుతోఁ బోరాడి గెలిచి నీకన్నబిడ్డను దెచ్చియిచ్చెదను' అనెను. ఇట్లర్జునుఁడు నమ్మికపుట్టఁ జెప్పఁగా, బ్రాహ్మణుఁడు ప్రీతుండై తన గృహమునకుఁ బోయి యా యర్జునుని వీర్యమును దెలియఁగోరి యుండెను. అంత భార్యకు నీళ్లాడుసమయము సమీపింపఁగా నా బ్రాహ్మణోత్తముఁ డర్జునునియొద్దకుఁ బరుగునవచ్చి 'బిడ్డని మృత్యువునుండి కావుకావు' మని వేఁడెను. అర్జునుఁడును జలములనాచమించి మహేశ్వరునికి మ్రొక్కి దివ్యములైనయస్త్రములను గయికొని గాండీవమును గొని యెక్కు పెట్టెను. పిదప నావింటియందు నానావిధములయిన యస్త్రములు దొడిగి పురిటింటిని జుట్టును నరికట్టెను. దానికిఁ గ్రిందుగను మీఁదుగను నడ్డముగను నర్జునుఁడు బాణములతోఁ గూఁడుకట్టెను. అంత బ్రాహ్మణుని పత్నికిఁ గుమారుఁడు పుట్టి యావురని యేడ్చుచునే మృతినొందెను. ఊరకె మృతినొందుటె కాదు; అపుడే దేహముతోఁ గూడ నాకాశమున మఱుఁగయ్యెను. బొంది సైతము కానఁబడదయ్యె. అపుడు బ్రాహ్మణుఁడు కృష్ణుని సమ్ముఖమం దర్జునుని మిక్కిలియునిందించుచు పేడిపందయొక్కఁడేవ్రో వదరినబంటుపంతములకు నమ్మినట్టి నామూఢత్వమును జూడుఁడు. ప్రద్యుమ్నుఁడును, అనిరుద్ధుఁడును, రాముఁడును, గేశవుఁడును దేనిని రక్షింప శక్తులుగారైరో యట్టిదానిని

రక్షించుటకు వేఱెవ్వఁడు సమర్థుఁడగును? దబ్బఱలాడిన యర్జును డిస్సీ! పాడై పోవుఁగాక. తన్నుఁదాను బొగడుకొన్నవాని విల్లు నిస్సీ! పనికిమాలినది. దైవముచేత లోకాంతరముఁ బొందింపఁ బడినదానిని మూఢత్వమువలనఁ దెచ్చుటకుఁ దలఁచినాఁడే! వాఁ డెంత దుర్మతిగావలయును' అనెను. ఇట్లా బ్రాహ్మణుఁడు తిట్టుచుండఁగా నర్జునుఁడు సర్వలోకములను సంచరించు యోగవిద్యను బూని భగవంతుఁడగు యముఁడున్నసంయమనీపురమునకు వేగపోయెను. అందు బ్రాహ్మణుని సంతానమును గానక యంత నింద్రపట్టణమునకుఁ బోయెను. అట్లె యగ్ని, నైఋతి, యముఁడు, వాయువు, వరుణుఁడు నను వీరల పట్టణములకును బోయి పిదప రసాతలమునకును నాకపృష్ఠమునకుఁ జని మఱియు నితరములయిన లోకములకును గేలనాయుధముతోఁ జని చూచెను. బ్రాహ్మణుని బిడ్డఁడు దొరకఁడయ్యె. అంత నతఁ డగ్ని బ్రవేశింప నుండఁగాఁ గృష్ణుఁడు వలదని చెప్పి వారించి 'నీకు బ్రాహ్మణుని బిడ్డనిఁ జూపెదను. నీకు నీవ వజ్ఞఁ గావించుకొనవలదు. ఇట్లు చేసికొనకుందువేని నీ నిర్మల కీర్తిని మనుష్యులు స్థిరముగా నెలకొలుపుదురు' అనెను. ఇట్లు చెప్పి మహేశ్వరుండయిన యా భగవంతుఁడు దివ్యంబగు తన రథము నారోహించి పడమటిదిక్కును జొచ్చి పోయెను. అతండు సప్తద్వీపములను, సప్తసముద్రములను, నాద్వీపములందుఁ గల యేడేసి పర్వతములనును, జక్రవాక పర్వతమును గడచి మిక్కిలియుఁ జెంజీకటిని బ్రవేశించెను. అచ్చట శైబ్య సుగ్రీవ మేఘపుష్ప పలాహకములనెడి యశ్వము లాచీఁకటిని గతులు దప్పినవయ్యెను. వానినిజూచి భగవంతుఁడు కృష్ణుడు మహా యోగే

శ్వరేశ్వరుండు గావున వేయి సూర్యులవలెఁ దేజరిల్లుచున్న తన చక్రమును సుదర్శనమును ముందఱఁబోవం బనిచెను. మిక్కిలి యు భయంకరమై చొరరానిదై యీశ్వరునిచేతఁ గావింపఁబడిన దగు నా పెనుఁజీకటిని సుదర్శనచక్రము మిక్కుటమైన తన కాంతిచేత విదారించుచు దశరథరాముఁడు నారి నుండి విడిచినబాణము శత్రుసేనాసమూహమును జొచ్చునట్లు మనోవేగముగా నాచీఁకటియందుఁ జొచ్చెను. చక్రము వెంటం బడిపోవుచు నామూలమున, నాచీఁకటికి దూరమున వర్తించుచున్న యా సుదర్శనము నర్జునుఁడు గాంచెను. అది తుదలేని జ్యోతిం బొందుచు నుండుటవలన నర్జునుఁడు చూపులకు వ్రేఁగయినందున రెండుకన్నులను మూసికొనెను. అంత నతఁ డాచీఁకటి కవ్వలనున్న జలములను బ్రవేశించెను. అది ప్రచండం బగు వాయువుచేత, బెద్దపెద్ద యలలు పైకిఁ జెలరేఁగుచుండ, మిక్కిలి భయంకరముగా నుండెను. అందొక భవనము మిక్కిలి యద్భుతముగాఁ గనఁబడెను. అది కాంతులీనువానియందెల్లఁ గన్నాకై తలతలమని ప్రకాశించుచున్న వేలకొలఁది మణిస్తంభములచేఁ దేజరిల్లు చుండెను. అందు మహాభయంకరుండును నద్భుతుండు నగు నాదిశేషుఁ డుండెను. అతఁడు వేయిపడగలందలి మణులకాంతులు వెల్లిగొన రెండువేలఁ గన్నులచే దీప్రించుచుఁ దెల్లని పటికపుఁ బర్వతమువలెఁ జూపట్టుచు నల్లనికుత్తుకయు నాలుకలును గలిగి మిక్కిలి ప్రకాశించుచుండెను. ఆయనంతుని మేనియందు మహానుభావుండును విభుండు నగు పురుషోత్తమోత్తముండు విష్ణుదేవుండు సుఖాసీనుఁడై చూపట్టెను. అద్దేవుఁడు దట్టంపుమబ్బువలె వెలుంగుచు, మంచి పసిమివన్నె

వలువగట్టి, ప్రసన్నంబగు ముఖముతో, సొగసయి వెడలుప
యిన కన్నుంగవ చెన్నుఁ జూపుచుండెను. అతని కిరీటమునం
దును గుండలములందును దాపిన మహా మణిసమూహముల
ప్రభలు మొగంబున వ్రాలుముంగురులతోఁ జిందులు ద్రొక్కు
చుండెను. మఱియు నతఁడు నిడుదలై వట్రువలగు నెనిమిది
భుజములును మేలయిన కౌస్తుభరత్నమును శ్రీవత్సం బనుమ
చ్చయుఁ గలిగి వనమాలచేఁ బొలుపారుచుండెను. సునందనందా
దులయిన పార్షదులును మూర్తులుదాల్చియున్న చక్రము మొ
దలగు నిజాయుధములును బుష్టి శ్రీకీర్తి ప్రకృతి మొదలగు
శక్తులును, బ్రహ్మాదులకు నీశ్వరుండయిన యద్దేవునిఁ గొలుచు
చుండెను. కృష్ణుండు హేయరహితుఁడై తనకంటె వేఱుగాని
యాపరమాత్మునకు వందనము గావించెను. అర్జునుఁడు భక్తి
పూర్వకమగు భయముతో నట్లె వందనముచేసెను. అట్లు
చేమోడ్చియున్న యా యిరువురనుజూచి భూముండును బరమే
ష్ఠులకును బ్రభుండు నగు నాదేవుఁడు నవ్వుచు, గంభీరంబగు
వచనంబునఁ, 'మీయిరువురను జూడంగోరి నే నా బ్రాహ్మణుని
బిడ్డల నిట దెచ్చితిని. మీరిద్దఱును భూమియందు ధర్మమును
రక్షించుకొఱకు * నాకళచే నవతరించినవారలు. భూమికి భార
ముగానున్న యసురులను హతులంగావించి మరలఁ ద్వరితముగా
నాకడకు రండు. మీరు తొల్లి నరనారాయణులను ఋషులరై
శ్రేష్ఠులుగాన పూర్ణకాములై యుండియు జగద్రక్షణముకొఱకు
లోకసంగ్రహమను ధర్మము నాచరించితి' రనెను. భగవంతుఁ

* ఇట కళచే నవతరించినవాఁడు అర్జునుఁడే. కృష్ణుఁడు భగవంతుని పూర్ణావతారము. అర్జునునిబట్టి కృష్ణుని నట్లు చెప్పెనని తెలియునది.

డాపరమేష్ఠి యిట్లానతియ్యఁగా కృష్ణార్జును లిరువురును వల్లె యని యాయాజ్ఞ గయికొని యా భగవంతునకు మ్రొక్కి బ్రాహ్మణునిపుత్రులను దోడ్కొని మిక్కిలి హర్షమునఁ దమ గృహమునకుఁ బోయినచో ప్పననే మరలివచ్చి యాబాలురను, దమతమ తొంటిరూపములను గడవక యట్లె యున్నవారిని, బ్రాహ్మణున కొసంగిరి. విష్ణుని సంబంధించిన యాస్థానమును గాంచి యర్జునుఁడంత మనుష్యులకుఁ గలపౌరుష మేదేదిగలదో యదియంతయును శ్రీకృష్ణకృపాలబ్ధమే యగునని మనంబున నిశ్చయించుకొనెను. అఖిలేశ్వరుఁ డా భగవంతుఁ డతిదైవమానుషములయిన యిటువంటి చరిత్రములను జూపుచు గ్రామ్యములగు భోగముల ననుభవించుచుండెను. మఱియు భూరిదక్షిణలతో యజ్ఞములను బెక్కు యజించెను. మఱియు నా భగవంతుఁడు, ఇంద్రుఁడు వర్షాకాలము నతిక్రమింపక వర్షించునట్లు, తానును బరత్వమునూఁది బ్రాహ్మణాదులగు ప్రజలకెల్ల సమస్తములయిన కామితములను గురియుచుండెను. కృష్ణుండు మిక్కిలి యధార్మికులగు నృపులను గొందఱను తానే చంపియుఁ, గొందఱను నర్జునాదులచేఁ జంపించియు ధర్మరాజాదులచేత ఋజుమార్గంబున వర్ణాశ్రమధర్మములను బ్రవర్తింపఁ జేసినవాఁడయ్యె. ఇది యెనుబదితొమ్మిదవయధ్యాయము.

---

## మహిషీ గీతలు.

ద్వారకాపురము సమస్తసంపదలచే సొంపువెంపారుచుండెను. అందు యదుపుంగవులు నెరసియుందురు; మఱి యెల ప్రాయంపు జిగి దళుకొత్తుచు సొబగయిన వేషములతో మెఱపుఁ

దీఁగలవలె మిటారించుచున్న పూవుంబోఁడు లందు హర్మ్యము లందుఁ బంతులాట లాడుచుఁ గ్రీడించుచుందురు. అందుఁగల మదపుటేనుఁగులు మదజలములు దొరిఁగి మార్గములెల్ల నెవుడును త్రాంపిగొని యుండును. మఱి యలంకృతిగల భటులును నశ్వములును బంగారుచేఁ దలతలమని మెఱయుచుండు రథములును రాణించుచుండును. అందుద్యానములును నుపవనములును బెక్కులుగలవు. వానియందుఁ బుష్పించియున్న చెట్ల సమూహములందుఁ దుమ్మెదలు మూఁగి జుంజుమ్మని రవళులు సేయఁగా నది నలుగడలఁ జప్పుడుకొనుచుండును. శ్రియఃపతి యాకృష్ణుం డిట్టిద్వారకాపురియందు వాసముసేయుచుఁ బదియాఱువేల పత్నులకుఁ దానొక్కండు చెలువుఁడై యందఱికన్నిరూపులు విచిత్రముగఁ దాల్చి పెనుసంపదలు పొంపిరివోవుచున్న వారిగృహములందు రమించుచుండెను. మఱియుఁ జక్కఁగా వికసిల్లిన కలువలు, నెత్తిగలువలు, తెల్లగలువలు, తామరలు మొదలగువాని పుష్పాళ్లచే వాసనగొన్నవై, నీటిపిట్టలు గుంపులుగొని కొలకొలగూయుచుండ, నచ్ఛంపుజలములతోఁ గూడియున్న మడుఁగులందుఁజొచ్చి విభవం బెంతయు మీఱ విహరించెను. చెలువలు బిగియఁ గౌఁగిలించుకొన్నపుడు వారి గుబ్బలచన్నుల కుంకుమ మతని మేనంతయు నంటి యెంతయు నీటు నూపుచుండును. అపుడు గంధర్వులు పాడుచుండఁగా, సూతులును, వందులును,మాగధులును మృదంగములను, బణవములను, ఆనకములను, వీణెయలనుగొని వాయించుచుండఁగా, నా చెలువలు, నవ్వుచుఁ గృష్ణునిపై జల్లులాడుచుచుండిరి. కృష్ణుఁడును వారిపై జల్లులాడుచు యక్షకాంతలతోడం గూడిన

యక్షరాజువలె వెలుంగుచుండెను. ఆ పూవుంబోఁడులు పుట్ట
ములు తడిసియుండుటవలనఁ దొడలును, గుచములును, దెలియు
చుండ, విప్పయిన కొప్పులనుండు పూవులు జలజలరాలఁ, గాం
తుఁడగు కృష్ణునిపై జల్లులాడుచు నతఁడు తమ్ము నీట జల్లులాడ
కుండునట్లుగా దగ్గటి కౌఁగిలించికొని దానిచే మరులు మిక్కి
లియుఁ జెలరేఁగి నెమ్మొగంబుల నిద్దంపుఁ దెలినవ్వులు మొల
పింపఁగా నెంతయు మురువుగులుకుచుండిరి. కృష్ణుండును
వారి గబ్బిగుబ్బలయందలి కుంకుమ పూఁతలును బూదండలును
మెయినిండ నలమికొనఁ, గ్రీడయందలి తమకముచే ముంగురుల
గుంపు లల్లలాడుచుండఁ, జెలువలను నీటఁ దోఁచుచు వారు
తన్నుఁ దోఁచుచుండఁగా నాఁడుగజములు బలసియున్న మగ
యేనుఁగు మిన్నయుంబోలె రాజిల్లెను. అంతఁ గృష్ణుఁడును
నతనికాంతలును నటులకును నర్తకులకును గీతవాద్యములచే
బ్రతుకువారలకును గ్రీడార్థములగు నలంకారములనును వస్త్ర
ములనును, నొసంగెను. కృష్ణుఁడిట్లు క్రీడించుచుండఁగా నతని
నడలు, పలుకులు, చూపులు, నవ్వులు,సరసములు, పరియాచక
ములు, కౌఁగిలింతలు మొదలగునవి యా పూవుంబోఁడుల
బుద్ధులనెల్లఁ గొల్లగొనినవయ్యె. ఇట్లాసుందరులు ముకుందుని
యందె బుద్ధుల నూలుకొలిపి యతనిని జింతించుచు నేమియుఁ
బలుకక యంత వేఁదుఱుగొన్నవారివలె జడనుపడి యరవిం
దాక్షునింగూర్చి యిట్లు పాడిరి. ఆవాక్యములను జెప్పుచున్నాను.
ఆలించి వినుము.

మహిషులు—(వారిలో నొక్కతి) కురరీ! ఈజగమునందు
రాత్రి యీశ్వరుండగు కృష్ణుఁడు బాహ్యావిషయముల జ్ఞానమును

వీడి పరుండి నిదురించుచున్నాఁడు; నీవు నిదురవీడి విలపించు
చున్నావు; కాని నిదురింపవు. వానికిట్లు నిద్రాభంగము చేయుట
తగునా? అయిన నీయందును దప్పేమి? తామరఱేకులవంటి
కన్నుంగవగల యీ వెన్నుఁడు నవ్వు గులుకుమేలి వాలుంజూడ్కి
లీలమెయి నిగిడింపఁగా నెచ్చెలీ! మావలెనే నీకును మనస్సు
బిట్టుగానాటి కలంగినదా యేమి? (మఱియొక్కతి) చక్రవాకీ!
రాత్రి నీమగనిఁగానక కన్నులుమూసికొనుచున్నావా? కట్టా!
జాలిపుట్ట నేడ్చుచున్నావేమి? నీవెత యింతే కాదు. మావలెనే
నీవును గృష్ణుని దాస్యమునొంది యతనియడుగు లంటిన పూ
దండను గ్రొమ్ముడిం దాల్పఁగోరెదవా? (వేఱొక్కతి) సముద్ర
మా! నీ వొక్కప్పుడును నిదురవోక మేలుకొనియుండి సదా
బిట్టుగాఁ జప్పుడు సేయుచున్నావే! మాకుఁ గలిగిన యీ
గడపరాని యవస్థయే నీకునుఁ బట్టెనా? ముకుందుని తోడి
సంభోగమున మా కుచకుంకుమము మొదలగు గుఱుతులన్నియుఁ
వాఁడు దొంగిలినట్లు, లక్ష్మీ కౌస్తుభము మొదలగు నీదులాంఛ
నములెల్ల వానిచేతఁ గోలుపోయినట్లు చూపట్టుచున్నావే. కా
వుననే మాయవస్థయే నీకును మూఁడినదాయని యడుగు
చున్నాను. * చంద్రుఁడా! నిన్ను బలవంతమయిన క్షయరోగము
పట్టియున్నది. కావుననే క్షీణించుచు నీవెలుంగులచేఁ జీకటిని
మాపకున్నావా యేమి? మావలెనే నీవును ముకుందుఁడు
పలికిన మంతనపుఁ బలుకులను మిక్కిలియుఁ దలంచుకొని యతని
యందే మనస్సుదగిలి వాకట్టువడి యున్నట్లు మాకుఁ జూపట్టు

* ఒక్కొక్క వాక్యమును ఒక్కొక్కతి యడిగినట్లుగా మీఁద నెల్ల గ్ర
హింపవలయునని తెలియునది.

చున్నావు. మలయానిలా! గోవిందుని కడగంటిచూడ్కులచే మిక్కిలియుఁగలంగినలంగియున్న మాహృదయములందు మరులు మఱిమఱి పురికొలుపుచున్నావే! నీకు మేమేమి యపకారము చేసితిమి? ఏమియుఁజేయ నపుడిట్లు మమ్ముఁబీడించుట తగునా? యనిరి. (కృష్ణుని వెదకుచున్న యొకచెలువనుజూచి పువ్వులు గోయుచున్నదిగాఁ దలఁచి మఱియొక్కతె దానితో) * 'ముద్దరాలా! ఏమో యాలోచించున్నావా? ఇదిగో ముందఱ విరియఁబాఱుచున్న కుందమున్నది. కైకొనుము.' 'ఈ (మువర్ణము

* ఇందులకు

'ముగ్ధేధ్యాయసి కిం గృహాణ పురతః కున్దం వికాసోన్ముఖం
కిం కున్దేన మ మామునా సుమనసః కీదృగ్విధా స్త్వత్ప్రియాః।
పున్నాగం మృగయే సఖి శ్రుతిశిరోభూషా విశేషాయితం
గావో౽ప్యుజ్ఝితసూన మాసత ఏదామోదప్రకర్షోన్ముఖాః'

అని మూలము. ఇందుత్తర ప్రత్యుత్తరములెట్లన. (ముగ్ధేధ్యాయసికిమ్)-ముద్దరాలా, ఆలోచించున్నావేమి? గృహాణ... న్ముఖమ్=ముందఱ విరియఁబాఱుచున్న కుందమును. అనఁగా మల్లెపూవును, చేకొనుము' అనెను. మొదటిది-'కింకున్దేన మమ అమునా' అమునా=ఈ, కున్దేన = మల్లెతో, మమకిం=నాకేమి' యని యర్థము. అమునా కున్దేన='ము'వర్ణములేని కుందముతో నాకేమిపని - అనఁగా మువర్ణముగల కుందముతో - ముకుందునితో నాకు పనియని భావము. రెండవది—'సుమనసః... ప్రియాః' ఎటువంటిపువ్వులు నీకు ప్రియములు, (మొదటిది)—'పున్నాగం... షాయితం' శ్రుతిశిరోభూషావిశేషాయితం=చెవికిని తలకును ఒక సొమ్ముఅగు, పున్నాగం=పొన్నపూవును, మృగయే=వెదకుచున్నానని యర్థము. శ్రుతిశిరః = వేదశిరస్సులగు ఉపనిషత్తులకు సొమ్ము అగుచున్న, పున్నాగం=పురుషశ్రేష్ఠుని, వెదకుచున్నానని భావము. 'ఉజ్ఝితసూనమ్' రాలిన పువ్వును - రాలినపొన్నపువ్వుననుట. తత్ ఆమోద

లేని) కుందముతో నాకుఁబనేమి ? అయితే నీ కెట్టిపువ్వులు ప్రి
యము ?' 'చెలీ! శ్రుతిశిరస్సులకు భూషా విశేషముగా నుండు
పున్నాగమును వెదకుచున్నాను. దానినుండి యుజ్ఝితమైన సూన
మునఁగల యామోదంపుఁ బెంపునకు నున్ముఖములై గోవులు
నాపున్నాగమునే వెదకుచున్నవి. ఇఁక నేను వెదకుట చెప్ప
నేల ?' యనెను. మేఘమా ! శ్రీమంతా ! నీవు యదూత్తముఁ
డగు కృష్ణునికి నెండసోఁకు దగులకుండుట మొదలగువాని
వలనఁ బ్రియుండవుగాఁ జూపట్టుచున్నావు. కాఁబట్టి నీవును మా
వలెనే శ్రీవత్సాంకునియందలి ప్రేమకుఁ గట్టువడి నిశ్చలముగా
వానినే ధ్యానించుచున్నావా ? ఏలన మావలె మిక్కిలియుఁ
దమకముతో జలార్ద్రహృదయుఁడవై వానిని దలఁచితలఁచి
మాటిమాటికి బాష్పధారలను విడుచుచున్నావు. వాని ప్రసం
గమే దుఃఖముగదా! కాన యిదియుక్తమే. కోకిలమా! ప్రియం
వదుఁడగు శ్రీకృష్ణుని పదములవంటి శబ్దములను బలుకుచున్నావు.
రమణీయకంఠా ! మృతులను బ్రతికించునట్టి కోమలములయిన

---

ప్రకర్ష ఉన్ముఖాః=దానివాసనయొక్క అతిశయముచేత ఉన్ముఖములై, గావో
ఽపి=పశువులును, ఆసత=ఉన్నవి. ఆపువ్వు వాసనకే పశువులును చొక్కి
ఆచెట్టును వెదకుచుండఁగా నేను వెదకుటను జెప్పనేలయని యర్థము. గావః=
వేదాంతవాక్యములును, ఉజ్ఝితసూనం=విడువఁబడిన జన్మముగలవానిని=జన్మ
రహితుని - అజుని ననుట, పున్నాగం = పురుషోత్తముని, తద్...న్ముఖాః=
అతని కల్యాణగుణగణముల అతిశయమందు, ఉన్ముఖాః = ప్రతిపాదించుటకు,
ఉన్ముఖములై - ఉన్ముఖములగుట మాత్రమేకాని ఆగుణము లనంతము లగుటచే
పూర్ణముగా ప్రతిపాదింపవనుట, ఆసత=కేవలము వెదకుచు నున్నవి యని
భావము.

యీమాటలచేత నాకుఁజెప్పుము. నీకేమి ప్రియము నేనుఁ జేయుదునని? శుకరాజమా! యదుదేవుండగు శ్రీకృష్ణుని సత్కథలను పాడుము. మేము నీకుఁ బాలఁ నభిషేకముగావించెదము. నీవు విరహాగ్నితప్తములయిన మాహృదయములను లక్ష్మీకాంతుని కథామృతముచే మిక్కిలియుఁ దడుపుమా! పర్వతమా! నీవు గొప్పబుద్ధిగలవాఁడవు, కనుక నేమియుఁ గదలవు; పలుకవు. ఏదో గొప్పవిషయము నాలోచించుచున్నావు. మేము వసుదేవ నందనుని యడుగులను స్తనములందుఁ దాల్పఁగోరునట్లు నీవును స్తనములవంటి నీశిఖరములచే వానిని దాల్పంగోరుచున్నావా? ఓ సింధుపత్నులగు నదులారా! మాయదుపతియగు కృష్ణుని ప్రణయంపుఁ జూడ్కిని బడయక వానిచేత హృదయములు గోలుపడి మిక్కిలి చిక్కిస్రుక్కియున్నారము. అట్లె మీరు నిపుడు వేసవిని మడుఁగు లెండి తామరలసొంపు వోయి, భర్తయగు సముద్రుని ప్రణయంపుఁ జూడ్కిని బడయక కట్టా! చిక్కియున్నారుగదే! హంసమా! ఇట కూర్చుండుము, పాలుత్రావుము. కృష్ణుని ముచ్చటలను చెప్పుము. నీవు కృష్ణుని దూతయని యెఱుఁగుదుము. అజితుఁ డగుకృష్ణుఁడు సుఖమున్నాఁడేకదా? వాని నెయ్యము చంచలమైనది. కనుక వాఁడు తొల్లి యాడిన మంతనములను దలంచుకొనునా? 'తలంచుకొనియె నన్నుఁ బంపినాఁ' డందువా? ఆహా! అట్లేని వాని నిటఁ బిలుచుకొనిరమ్ము. పోవుచున్నావు సరేకాని యెవ్వతి మమ్మును వంచించి తానొక్కతియె వానితో రమించుచున్నదో యాలక్ష్మిని విడిచి వానినిమాత్రము పిలుచుకొనిరమ్ము! 'ఆబిడ యెప్పుడు వానియందే యుండునట్టిదే! దానిని దొలఁగఁబుచ్చఁ

దరమా' యందువా ? ఆఁడువారమగు మాయందఱిలో నది మాత్రమే యొకనిష్ఠగలదియా? మేము గామా?' యనిరి.

ఇట్లామాధవుని పడఁతులు యోగీశ్వరేశ్వరుం డగుకృష్ణుని యందు నిటువంటిభక్తిని గావించుచు, నంత వైష్ణవియగు గతిని (ముక్తిని) బొందిరి. పెక్కుగానములచేతఁ బలువిధములఁ బొడంబడుచుండు నా హరి తనముచ్చట విన్నంత మాత్రముననే పడఁతుల మనముల బలవంతముగాఁ బట్టి యాకర్షించు ననఁగా, నిఁకఁ గన్నారఁ జూచుచుండు మగువల మనంబుల హరించుటను జెప్పనేల ? ఎవ్వరు భర్తయను బుద్ధిని జగద్గురుండగు నాభగవంతునికి, నడుగులు పిసుకుట మొదలగు పనులచేఁ బ్రేమంబునఁ బరిచర్యసేసిరో వారల తపమేమని వర్ణింపవచ్చును ? ఇట్లు సత్పురుషులకుఁ బ్రాప్యుండగు నప్పరమపురుషుఁడు వేదోక్తమగు కర్మమును జక్కఁగా ననుష్ఠించుచు ధర్మార్థకామములకు స్థానము గృహమేయని మాటికిఁ జూపినవాఁడయ్యె. ఇట్లు గృహస్థుల యుత్కృష్టధర్మమూ నూఁదిన యాకృష్ణునకుఁ బదాఱువేల నూటయెనమండ్రు దేవులుండిరి. అన్నులతలమిన్న లగు నాచిన్నారులలో మునుపు చెప్పఁబడిన రుక్మిణి మొదలగు నెనమండ్రును బుత్రవతులుగానే యుండిరి. ఈశ్వరుండు కృష్ణుఁ డప్రతిహత సంకల్పుఁడుగానఁ దన కెందఱు భార్యలో యందఱయందు నొక్కొక్కతికిని బదేసిపుత్త్రులను గాంచినవాఁ డయ్యె. ఉద్దామవీర్యులయిన యాపుత్త్రులలోఁ బదునెనమండ్రు మహారథులు నుదారయశస్కులునై యుండిరి. వారి నామములను జెప్పెదను వినుము. వారెవ్వరనః—ప్రద్యుమ్నుఁడు, అనిరుద్ధుఁడు, దీప్తిమంతుఁడు, భానుఁడు, సాం

డు, మధుఁడు, బృహద్భానుఁడు, చిత్రభానుఁడు, వృకుఁడు,
ణుఁడు, పుష్కరుఁడు, దేవబాహుఁడు, శ్రుతదేవుఁడు, సునం
ఁడు, చిత్రబాహుఁడు, విరూపుఁడు, కలి, న్యగ్రోధుఁడు, అగు
ు. త్రివక్రయను పేరుగల కుబ్జయందు నుపశ్లోకుండను
త్రుఁడు పుట్టెను; అతఁడు నారదునకుఁ జక్కశిష్యుఁడు.
ఁడు కృష్ణునకు ననువ్రతుఁడై చిత్తము నవిచ్ఛిన్నముగా
వత్సమాధియందు నెలకొలిపెను. అతఁడే పంచరాత్రమనం
, సాత్వత తంత్రమును జెప్పెను. దాని నెఱింగినవాఁడు
క్తినొందుచున్నాఁడు. ఆతంత్రమునందు, స్త్రీలకును శూద్రు
ు దాసులకును, వైష్ణవంబగు తాపపుండ్రాది సంస్కారము
్పఁబడియున్నది. మధురిపుం డగుకృష్ణునకుఁ బుట్టిన యీ
క్రు లందఱిలోపల రుక్మిణియందుఁ బుట్టిన ప్రథమపుత్త్రుఁడు
ద్యుమ్నుఁడు తండ్రివలెనే రూప పరాక్రమములు గలిగి
ండెను. అమ్మహారథుఁడు రుక్మికూఁతును బెండ్లియాడెను.
ఁఱియం దతనికి ననిరుద్ధుఁ డనుకొడుకు పదివేల యేనుఁ
బలిమితోఁ బుట్టెను. ఆరుక్మిదౌహిత్రుఁ డనిరుద్ధుఁ డతని
త్రిని బెండ్లాడెను. అతని కా మగువయందు వజ్రుఁడను
ు పుట్టెను. వాఁడే ముసలమువలని యదుకులనాశమునందుఁ
మిగులునట్లు కృష్ణుఁడు గావించెను. అతనికిఁ బ్రతిబాహుఁ
, బ్రతిబాహునకు సుబాహుండును, సుబాహునకు ధర్మ
ండును, ధర్మసేనునకును శ్రుతసేనుండును బుట్టెను. ఈకుల
మునఁ బుట్టినవా రెవరును నిర్ధనులును వెక్కుబిడ్డలుగనని
ును, అల్పాయుష్యులును, అల్పవీర్యులును, అబ్రహ్మణ్యు
లేరయిరి. యదువంశమునఁ బుట్టి పరాక్రమ కృత్యములం

ప్రఖ్యాతులైన పురుషులను లెక్కించుటకుఁ బదివేలకోలఁది సంవత్సరము లయినను శక్యముగాదు. యదుకుమారుల కాచార్యులయిన వారుమాత్రము మూఁడుకోట్ల యెనమన్నూఱు మంది యని మాకు వినికి. యదువులం దొక సహదేవునికి మాత్రము పదివేలలక్షల పుత్రులనఁగా మహాత్ములగు యాదవులను లెక్కపెట్టుటకు నెవ్వఁడు పూనును. దేవాసుర యుద్ధమునందు హతులయిన దైత్యులు మిక్కిలి భయంకరులగువారు మనుష్యులందుఁబుట్టి ప్రజలను మిక్కుటముగా బాధింపఁదొడంగిరి. వారి నిగ్రహించుకొఱకు హరి యానతియ్యఁగా దేవతలు యదుకులమందవతరించిరి. వారేవృష్ణులు, అంధకులు మొదలుగా నూటయొక్కండు కులములయిరి. వారల కందఱకును భగవంతుఁడగు హరి ప్రభువుగా నుండుటకు శ్రీకృష్ణరూపముగ నవతరించెన. అతని ననువర్తించి యాదవులెల్లవారును, వృద్ధినొందుచుండిరి. వారు కృష్ణుఁడు శయనించునపుడును, కూర్చుండునపుడును, దిరుగునపుడును, మాటాడునపుడును, క్రీడించునపుడును, జలకమాడునపుడును, కుడుచునపుడును, నింకను వేఱుక్రియలు గావించునపుడును, నాప్రభునియందు మనస్సులు దగిలియుండిరి కాని యతనిని దమ యంతరాత్మయని యెఱుంగరయిరి. రాజా! ఇంతకు స్వర్గనది గంగయె యన్నిట నెక్కుడయిన తీర్థముగానుండెను. ఇప్పుడు యదువులందుఁ బుట్టిన శ్రీకృష్ణకీర్తిరూపంబయిన తీర్థ మతనిపాద శౌచంబగు నాగంగాతీర్థమును దక్కువ గావించినదయ్యె, అతనియశస్సె యన్నితీర్థములకుఁ దలమిన్న. అట్లే ద్వేషించినవారును బ్రేమించినవారును నతని సాధర్మ్యమును బొందిరి. ఎవ్వతి కటాక్షలేశము నిగుడుటకై

బ్రహ్మాదు లెంతయుఁ బాటువడుదురో యట్టి లక్ష్మీదేవి యతనికిసన
న్యార్హ శేషభూతయై యుండునది. ఆభగవంతుఁడు తన్ను విన్నను
బలికినను నర్థముదెలియక శోకించిన ట్లుచ్చరించినను నమంగళ
ములనెల్లఁ దూలించును. మఱి కృష్ణుఁ డాయాదవృష్ణివంశములందు
ధర్మములనెల్లఁ బ్రవర్తింపఁజేసెను. అట్టికృష్ణుఁడు, కాలాభిమాని
యగు సుదర్శనచక్ర మాయుధముగాఁ గలవాఁడు, భూభార
మును హరించుట యొకచిత్రముగాదు. సమస్తజనులకును
నారకుఁడై దేవకియందుఁ గర్భవశుఁడై పుట్టకపోయినను బుట్టిన
వాఁడను మాటమాత్రమొంది, యదుశ్రేష్ఠులసమూహములనెడు
భుజములచే నధర్మమును దూలించుచు, వానివాని యధికార
ములను బాటింపక బృందావనమందలి తరుగుల్మాదులగు స్థావర
ములను జంగమములగు పశుపక్ష్యాదులకును నేదేనొకసంబం
ధముచేతఁ బ్రాప్తి ప్రతిబంధకమగు పాపమును బోకార్చుచు,
కలి చిఱునవ్వు దొలఁకుచుండు నెమ్మొగముచే వ్రేపల్లె
యందు గొల్లపూవుంబోఁడులకును మరులు పెచ్చుపెరుఁగఁ
జేయుచుండు శ్రీకృష్ణుఁడు సర్వోత్కృష్టుండై వర్తిల్లుఁగాక.
ఇట్లు తననిగమమందుఁ జెప్పఁబడిన ధర్మములను రక్షింపఁగోరి
లార్థము దేహమును గైకొన్న యదూత్తముండా పరమపురు
షుఁడు ధర్మరక్షణమున కనురూపముగాఁ గావించిన యిటు
వంటి మానుషచేష్టారూపములగు విడంబనములను, వినువారికిని
కీర్తించువారికిని భక్తియోగము పుట్టుటకు నడ్డులయినపాపకర్మ
ములనెల్ల రాచిపుచ్చునట్టి యాచేష్టితములను, నాభగవంతుని
పాదారవిందముల భక్తినిగావించు పురుషుఁడు వినుచున్నాఁడు.
పురుషుఁడు ప్రతిసంధ్యమును ముకుందుని సిరిదొలఁకు ముచ్చట

లను వినుచును గీర్తించుచును జింతించుచు నుండుటవలన
నతనివలని యనువృత్తి మిక్కిలి వర్ధిల్లుచున్నది. అట్టి యనువృత్తి
చేతఁ గృతాంతుఁ డెవ్వరికిఁ గడవరాకుండునో యట్టి జనులకును
దుఃఖమును బోకార్చునట్టి యాభగవంతుని స్థానమును బొందు
చున్నాఁడు. ఆస్థానమో కేవలమైనదిగాదు. అట్టిస్థానమును
బడయఁగోరి రాజులు సైతము గ్రామములను దిగవిడిచి యత
వులకుఁ దపము సేయఁ బోవుదురు' అనెను. ఇది తొంబదియవ
యధ్యాయము.

శ్రీమహాభాగవతము దశమస్కంధము

సమాప్తము.

శ్రీకృష్ణార్పణమస్తు.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD ( A. P. )

Cl. No. 294.5924 Acc. No. 29263
P845

DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29263

Call No. 294.5924 P84S

Author

Title

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean